
'సంపద పంపిణీ సక్రమంగా జరిగితే అట్టడుగు వర్గాలకు చేరుతుంది. అప్పుడే వారి కొనుగోలు శక్తి పెరుగుతుంది'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 18+20 వెల: ₹ 5.00

సంపుటి: 10 సంచిక: 325

గురువారం 15-2-2018

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

పంజాబ్ నేషనల్ బ్యాంక్‌లో భారీ కుంభకోణం!



- రూ. 11,300 కోట్ల మోసపూరిత లావాదేవీలు
- ముంబై బ్రాంచిలో గుర్తింపు
- పది మంది ఉద్యోగుల సస్పెన్షన్
- సీబీఐకి ఫిర్యాదు

- బిజినెస్‌లో

సాగు సంక్షోభంపై సదస్సు



19, 20న ఢిల్లీలో ఏర్పాటుకు మోదీ పిలుపు

- సమస్యల పరిష్కారం, రైతుల ఆదాయం రెట్టింపు చేయడంపై చర్చ
- హాజరుకానున్న మోదీ, నీతి ఆయోగ్ అధికారులు

5 లో

మీ వాహనాలపై పన్ను వేస్తాం



భారత్‌కు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ హెచ్చరిక

- హార్లీ–డేవిడ్‌సన్ బైక్‌ల దిగుమతి సుంకంపై మండిపాటు
- 'రెసిప్రోకల్ ట్యాక్స్'పై కఠినంగా ఉండాలని నిర్ణయం
- అదే అసలైన స్వేచ్ఛా వాణిజ్యమని ప్రకటన
- తన వేతనంలో నాలుగోవంతు రవాణాశాఖకు విరాళం

ఫ్యామిలీలో...

బోర్డర్.. బోర్డర్

ఉదయాన్నే తయారై.. చీర సవరించుకుని సజావుగా నల్ల కోటు వేసుకుని అద్దం ముందు నిలబడింది. అబ్బ! అచ్చం న్యాయం నిలబడినట్లే ఉంది! కానీ అద్దంలో.. తన చుట్టూ ఒక కంచె కనబడింది! మగవాళ్లు నల్ల కోటు వేసుకుని బోర్డర్ దగ్గర కంచెలా నిలబడి ఉన్నారు! తను ఆ బోర్డర్‌ను దాటగలదా? 'ఆర్డర్..ఆర్డర్.. అడ్డు తొలగండి' అనే జడ్జిగారి ఆదేశాన్ని ఎప్పటికైనా తను వినగలదా? లేక.. మహిళా అడ్వకేట్లు సమన్యాయానికి బోర్డర్‌లోనే ఉండిపోతారా?

సాక్షి వెబ్‌సైట్‌లో...

మనోసంకల్పం, శ్రమించే గుణం, సమస్యను సవాలుగా స్వీకరించే తత్వం ఆమెను విజయపథాన నడిపించింది. సాధారణ మధ్య తరగతి కుటుంబంలో పుట్టి... క్రికెట్ చరిత్రలో ప్రపంచంలోనే మరెవరూ అందుకోలేనంత స్థాయికి చేరుకున్న జులన్ గోస్వామి సక్సెస్ స్టోరీ www.sakshi.comలో చూడండి.

వైఎస్ జగన్ సంధించిన హోదా బాణానికి..

'దేశం' బేజార్..!

అవును బేజారే..

ఐదు కోట్ల మంది ఆంధ్ర ప్రజల హక్కు - ప్రత్యేక హోదాను ఎందుకు తాకట్టు పెట్టారో..

తేల్చాల్సిన సమయం వచ్చిందన్న బేజారు.

రాష్ట్ర ముఖ్యమంత్రి ఓటుకు కోట్లు కేసులో బోనెక్కకుండా తప్పించుకునేందుకు ఈ రాష్ట్ర ప్రజలు చెల్లించుకున్న మూల్యం ఎంతో తేలవలసిన పరిస్థితి ఏర్పడిందన్న కలవరం.

పార్టీ నేతలతో తెలుగుదేశం అధినేత సమావేశం జరుగుతున్నంతసేపూ షరామామూలుగా టీవీ స్క్రీన్‌ల మీద 'లీకు హెచ్చరిక' ఫ్లాష్‌లు మెరుస్తూనే ఉన్నాయి.

లేస్తే మనిషిని కాదన్న స్థాయిలో మళ్లీ లీకుల యుద్ధం నడిచింది. సీఎం అయితే లేచి బయటకురాలేదు. మంత్రుల బృందం మాత్రం మీడియా ముందు తమకు అలవాటైన రీతిలో ప్రతిపక్షనేతపై శాపనార్థాలు పెట్టారు.

ప్రత్యేక హోదా గురించి మాత్రం.... ఆ ఒక్కటి అడక్కండి.

- వైఎస్సార్‌సీపీ రాజీనామాల నిర్ణయంతో సీఎం చంద్రబాబులో ఉలికిపాటు
- సమన్వయ కమిటీలో తీవ్ర అంతర్మథనం
- రాజీనామాలకు సిద్ధమంటూ మీడియాకు లీకులు
- హోదా ప్రస్తావన లేకుండా విలేకరుల సమావేశాలు
- ఎదురుదాడితో బయటపడేందుకు టీడీపీ ఎత్తుగడ
- జగన్‌పై దుర్భాషలకే మంత్రులు పరిమితం
- కేంద్రంపై ఒత్తిడి దేనికో క్లారిటీ నిల్
- హోదాపై ఇప్పటికీ నోరు విప్పని చంద్రబాబు



సాక్షి, ప్రత్యేక ప్రతినిధి

ఆంధ్రప్రదేశ్‌కి ప్రత్యేక హోదా ఇవ్వాల్సిందేనంటూ ప్రతిపక్షనేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్పష్టమైన కార్యాచరణ ప్రకటించడం, కేంద్రానికి అల్టిమేటమ్ ఇవ్వడంతో అధికార తెలుగుదేశం పార్టీలో కలకలం మొదలయ్యింది. పార్టీ సమన్వయ కమిటీ అత్యవసరంగా సమావేశమై సుదీర్ఘ సమాలోచనలు జరిపింది. ఈ పరిస్థితి నుంచి ఎలా బైట పడాలో 'దారి' తోచక రోజంతా రకరకాల ఎత్తులు వేశారు. రాజీనామాలకు టీడీపీ కూడా సిద్ధమంటూ అనుకూల మీడియాలో లీకు కథనాలు ప్రసారం చేశారు. ప్రత్యేక హోదాకు ప్రత్యామ్నాయం లేదని, హోదా కోసం తాము ఊపిరున్నంత వరకు పోరాడతామని జగన్‌మోహన్‌రెడ్డి చెబుతుండగా 'అనుభవజ్ఞుడి' నాయకత్వంలోని అధికార పార్టీ సుదీర్ఘంగా జరిపిన సమన్వయ కమిటీ భేటీలో తాము ఏం చేయాలో తేల్చుకోలేక దిక్కుతోచని స్థితిలో పడిపోయింది. ఊపిరి ఉన్నంతవరకు హోదా కోసం పోరాడుతూనే ఉంటామని, అదే తమ ప్రధాన అజెండా అని జగన్ కుండబద్దలు కొట్టడంతో అధికారపార్టీకి ఎటూ పాలుపోని పరిస్థితి నెలకొంది. 'ఇప్పుడు మనమేం చేయాలి? ప్రజలకు

మిగతా 2వ పేజీలో ▶



బులిరామయ్య కన్నుమూత

కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న కేంద్ర మాజీ మంత్రి

3 లో

టీడీపీ ఎమ్మెల్యే చింతమనేనికి రెండేళ్ల జైలుశిక్ష

2011లో నాటి మంత్రి వట్టి వసంత్‌కుమార్‌పై దాడి కేసులో కోర్టు తీర్పు

రూ.2500లు జరిమానా కూడా విధింపు

జరిమానా చెల్లించకపోతే అదనంగా మరో నెల జైలుశిక్ష



దెందులూరులో నిర్వహించిన రచ్చబండ కార్యక్రమంలో మంత్రి వట్టి వసంతకుమార్‌పై దాడిచేస్తున్న ఎమ్మెల్యే చింతమనేని(ఫైల్)

సాక్షి ప్రతినిధి, ఏలూరు, భీమడోలు

ప్రభుత్వ అధికారులపై దాడులకు, వివాదాలకు మారుపేరైన రాష్ట్ర ప్రభుత్వ విప్, దెందులూరు టీడీపీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌కు కోర్టు బుధవారం రెండేళ్ల జైలుశిక్ష విధించింది. 2011లో అప్పటి మంత్రి వట్టి వసంతకుమార్‌పై దౌర్జన్యం చేసిన కేసులో మూడు సెక్షన్ల కింద అభియోగాలు రుజువైనందున భీమడోలు జూనియర్ సివిల్ కోర్టు జడ్జి కె.దీప దైవకృప రెండేళ్ల జైలుశిక్ష, రూ.2500లు జరిమానా విధిస్తూ బుధవారం తీర్పునిచ్చారు. జరిమానా చెల్లించని పక్షంలో అదనంగా మరో నెల రోజులపాటు సాధారణ జైలుశిక్ష విధించారు. అనంతరం తీర్పును తాత్కాలికంగా సస్పెండ్ చేస్తూ చింతమనేని ప్రభాకర్‌కు బెయిల్ మంజూరు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. 2011 నవంబర్ 26న మంత్రి వసంతకుమార్, ఏలూరు ఎంపీ కావూరి సాంబశివరావు దెందులూరులో నిర్వహించిన రచ్చబండకు హాజరయ్యారు. ఈ క్రమంలో స్థానిక ఎమ్మెల్యే చింతమనేనికి, మంత్రి వట్టికి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. చింతమనేని దురుసుగా ప్రవర్తించడంతోపాటు దుర్భాషలాడుతూ వట్టి వసంతకుమార్‌పై చెయ్యి చేసుకున్నారు. అడ్డుకున్న గన్‌మెన్‌ను పక్కకు నెట్టేశారు. దీంతో గన్‌మెన్ ఎం.సుబ్బారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ప్రభుత్వోద్యోగి విధులకు ఆటంకం కలిగించినందుకు, బెదిరించి.. భయపెట్టినందుకు, అకారణంగా గొడవ చేసినందుకు చింతమనేనితోపాటు మరో 14 మందిపై దెందులూరు పోలీసులు కేసు

మిగతా 2వ పేజీలో ▶

మార్కుల జాబితా లీకైనా ఆందోళన వద్దు

ఏపీపీఎస్సీ చైర్మన్ ప్రొఫెసర్ ఉదయ్‌భాస్కర్ స్పష్టీకరణ



- రాత పరీక్షలు, ఇంటర్వ్యూల మార్కులకు సంబంధం లేదు
- 2011 గ్రూప్–1 మెయిన్స్ మార్కుల జాబితాల లీకుపై అంతర్గత విచారణ
- దోషులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటాం

16 లో

ఇదండీ సంగతి



కంగ్రాట్స్ సార్! ఎప్పుడో మిమ్మల్నికూడా పొగిడేస్తాడు!!

సర్కారీ ప్రచారం

ఏపీ కంటెంట్ కార్పొరేషన్ ఏర్పాటు

ప్రజల సొమ్ముతో ప్రభుత్వ పెద్దలకు రాజకీయ లబ్ధి!

ప్రత్యేకంగా ప్రభుత్వ రేడియో, టీవీ

ఫైబర్ నెట్ లిమిటెడ్‌కు అనుబంధంగా ప్రైవేట్ కంపెనీ

పేరుకే ప్రైవేట్... నిధులన్నీ సర్కారు ఖజానా నుంచే..

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ప్రభుత్వ పెద్దలకు ప్రచార యావ నానాటికీ పెరిగిపోతోంది. జనం సొమ్ముతో ఇప్పటికే టీవీ చానళ్లు, పత్రికల ద్వారా పెద్ద ఎత్తున ప్రకటనలు ఇస్తూ, అద్భుతాలు జరిగిపోతున్నట్లు ప్రచారం సాగిస్తున్నా అంతగా ప్రయోజనం కనిపించడం లేదని భావిస్తున్నారు. ప్రచారం, సర్వేల కోసం ప్రత్యేకంగా కార్పొరేషన్‌ను ఏర్పాటు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం తాజాగా నిర్ణయం తీసుకుంది. పేరుకు మాత్రం ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీగా పేర్కొన్నప్పటికీ కొత్తగా ఏర్పాటు చేసిన

మిగతా 2వ పేజీలో ▶



శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కృష్ణారెడ్డిపాలెంలో శనగపంట కూలీలతో మాట్లాడుతున్న ప్రతిపక్ష నేత వైఎస్ జగన్



దుర్మార్గపు సర్కారుపై పోరాడదాం

ప్రజలకు పిలుపునిచ్చిన ప్రతిపక్ష నేత వైఎస్ జగన్

- ఒక్క హామీ కూడా నెరవేర్చకుండా చంద్రబాబు మోసం
- రైతులు, డ్వాక్రా అక్కచెల్లెమ్మలను నిండా ముంచారు..
- ఇలాంటి నాయకుడు అవసరమా? ఆలోచించండి..
- చెడిపోయిన రాజకీయ వ్యవస్థను మార్చడానికి మీ అందరి ఆశీస్సులు కావాలి
- మనందరి ప్రభుత్వం రాగానే అన్ని వర్గాల వారిని ఆదుకుంటామని వైఎస్ జగన్ స్పష్టీకరణ

6 లో

ప్రకాశం జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం

- కొమరోలు మండలం నల్లగుంట్ల వద్ద లారీ బోల్తా
- కర్ణాటకకు చెందిన నలుగురు మృతి..
- సుమారు 10 మందికి గాయాలు.. భద్రాచలం వెళ్తుండగా ఘటన



బోల్తాపడిన లారీ.. ఘటనాస్థలిలో చెల్లాచెదురుగా పడి ఉన్న మృతదేహాలు

సాక్షి, ఒంగోలు: ప్రకాశం జిల్లాలో బుధవారం అర్ధరాత్రి ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. కొమరోలు మండలం నల్లగుంట్ల వద్ద ఓ లారీ అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో నలుగురు అక్కడికక్కడే మరణించగా.. 10 మందికి గాయాలయ్యాయి. వివరాలు.. కర్ణాటకలోని చికమంగుళూరు జిల్లా సరిలి మండలానికి చెందిన 45 మంది భద్రాచలం సీతారామచంద్రస్వామిని దర్శించుకునేందుకు బుధవారం లారీలో బయల్దేరారు. అర్ధరాత్రి కొమరోలు మండలం తంబళ్లపల్లి క్రాస్ వద్దకు వచ్చేసరికి లారీ అదుపుతప్పి బోల్తాపడింది. దీంతో తీవ్ర గాయాలపాలైన నారాయణమ్మ, ఆదిమ్మ, మారెప్ప, వెంకటనర్సప్ప ఘటనాస్థలిలోనే మృతిచెందారు. గాయాలపాలైన సుమారు 10 మందిని వెంటనే గిద్దలూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న మార్కాపురం డీఎస్పీ, గిద్దలూరు సీఐ, ఎస్ఐలు ఘటనాస్థలికి చేరుకున్నారు.

నేటి నుంచి బడ్జెట్‌పై కసరత్తు

సాక్షి, అమరావతి: 2018–19 బడ్జెట్‌పై రాష్ట్ర ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు గురువారం నుంచి కసరత్తు ప్రారంభించనున్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి కేటాయింపులు, నిధుల వ్యయం, ప్రతిపాదనలపై పలు శాఖల మంత్రులు, ఉన్నతాధికారులతో ఆయన మూడ్రోజులపాటు సమావేశం నిర్వహించనున్నారు. గురువారం ఆర్థిక నిపుణులతోపాటు వ్యవసాయం, మార్కెటింగ్, పౌర సరఫరాలు, పట్టణాభివృద్ధి, రవాణా, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మహిళా శిశు సంక్షేమం, కార్మిక శాఖల మంత్రులు, అధికారులతో సమావేశమవుతారు. శుక్రవారం నీటిపారుదల, గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్, గ్రామీణ గృహ నిర్మాణం, ప్రజా సంబంధాలు, రోడ్లు–భవనాలు, రెవెన్యూ, పర్యాటక శాఖ, మైనింగ్, మానవ వనరుల అభివృద్ధి, వైద్య శాఖల మంత్రులతో యనమల సమావేశమవనున్నారు. సోమవారం హోం, అటవీ, విద్యుత్, దేవాదాయ, ఎక్సైజ్, పరిశ్రమలు, క్రీడల అభివృద్ధి శాఖలతో సమావేశం నిర్వహిస్తారు.

సర్కారీ ప్రచారం

▶ మొదటి పేజీ తరువాయి

'ఏపీ కంటెంట్ కార్పొరేషన్' రాష్ట్ర ప్రభుత్వ ఫైబర్ నెట్ లిమిటెడ్‌కు అనుబంధంగా ఉంటుంది. అంటే ప్రైవేట్ లిమిటెడ్‌కంపెనీ అయినప్పటికీ ఇందుకయ్యే ఖర్చును ప్రభుత్వ ఖజానా నుంచే చెల్లిస్తారు.

ఖజానాపై ఆర్థిక భారమే..

ప్రచారం కోసం ఏర్పాటు చేసే కంపెనీల వల్ల ఖజానాపై అదనపు భారం తప్పదని ఆర్థిక శాఖ పరోక్షంగా స్పష్టం చేసింది. తొలుత రూ.1.51 కోట్ల నిధులతో కంటెంట్ కార్పొరేషన్ ఏర్పాటు చేస్తున్నప్పటికీ దీర్ఘకాలంలో ఈ కంపెనీ మనుగడ, ఆర్థిక భారాన్ని కూడా దృష్టిలో ఉంచుకోవాలని ఆర్థిక శాఖ పేర్కొంది. అయినా సరే రాష్ట్ర ప్రభుత్వ పెద్దలు లెక్కచేయలేదు. ప్రజల సొమ్ముతో రాజకీయ లబ్ధి పొందడమే లక్ష్యంగా ప్రభుత్వ పెద్దలు ఈ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసినట్లు అధికార వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. కంటెంట్ కార్పొరేషన్‌లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా రేడియో, టీవీ చానల్‌ను ఏర్పాటు చేయనుంది. ఇందుకోసం ప్రైవేట్ రేడియోలను భాగస్వామిగా చేర్చుకుంటారు. ఆదిత్య మ్యూజిక్‌ను భాగస్వామిగా చేర్చుకోవాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా స్థానిక న్యూస్ చానళ్లతోపాటు హేండిగో, స్పైస్ డిజిటల్ కంపెనీలను భాగస్వామిగా చేసుకుంటారు. వైయాపీపీ టీవీ, ఎస్‌యాఎన్ ఎన్ఎక్స్‌టీ కంపెనీలను వీడియో కంటెంట్‌లో భాగస్వామిగా చేసుకోవాలని నిర్ణయించారు. ప్రభుత్వ పథకాల సమాచారాన్ని కంటెంట్ కార్పొరేషన్ ద్వారా ఆడియో, వీడియోల రూపంలో ప్రజలకు చేరవేయాలని సర్కారు యోచిస్తోంది. ఇందుకు అవసరమైన సమాచారాన్ని(కంటెంట్) స్థానిక భాషలో వివిధ మార్గాల ద్వారా సేకరిస్తారు. ప్రభుత్వ పథకాల అమలు తీరు, పరిపాలనపై ప్రజాభిప్రాయాన్ని సేకరిస్తారు. ప్రధానంగా వచ్చే ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ప్రచారం ద్వారా రాజకీయంగా లబ్ధి పొందడానికే రాష్ట్ర ప్రభుత్వం ఈ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసిందని ఉన్నతస్థాయి వర్గాలు స్పష్టం చేస్తున్నాయి.

ఉన్నవి చాలవా!

పరిష్కార వేదిక అంటూ 1100 కాల్ సెంటర్‌ను ప్రభుత్వం ఇప్పటికే అందుబాటులోకి తీసుకొచ్చింది. అలాగే రియల్‌టైమ్ గుడ్ గవర్నెన్స్‌ను ఏర్పాటు చేసింది, అంతేకాకుండా ప్రచారం కోసం ప్రత్యేకంగా రూ.25 కోట్ల వ్యయంతో కన్సల్టెన్సీని తెరపైకి తెచ్చింది. అవన్నీ సరిపోవంటూ తాజాగా కంటెంట్ కార్పొరేషన్‌ను జనంపై రుద్దుతోంది. పన్నుల రూపంలో ప్రజలు చెల్లించిన డబ్బును స్వప్రయోజనాల కోసం వాడుకోవాలని ప్రభుత్వ పెద్దలు భావిస్తుండడం దారుణమని ఓ ఉన్నతాధికారి వ్యాఖ్యానించారు.

ప్రభుత్వ ఉత్తర్వులు జారీ

ఆంధ్రప్రదేశ్ ఫైబర్‌నెట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ చైర్మన్‌గా ఏపీ కంటెంట్ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేస్తూ ఇంధన, మౌలిక వసతుల కల్పన శాఖ ముఖ్యకార్యదర్శి అజయ్ జైన్ బుధవారం జీవో జారీ చేశారు. ఈ కార్పొరేషన్ ప్రభుత్వ పథకాల సమాచారాన్ని సేకరించి, వీలైనంత మందికి చేరవేయడమే లక్ష్యంగా పని చేస్తుందని పేర్కొన్నారు. రాజకీయాలతోపాటు విద్య, సైన్స్‌అండ్‌టెక్నాలజీ రంగాల్లో అధ్యయనం చేస్తుందని వెల్లడించారు.

సీఎంను కలిసిన మాజీ క్రికెటర్ వీవీఎస్ లక్ష్మణ్



సాక్షి, అమరావతి: భారత మాజీ క్రికెటర్ వీవీఎస్ లక్ష్మణ్ బుధవారం సచివాలయంలో సీఎం చంద్రబాబును మర్యాదపూర్వకంగా కలిశారు. యువ క్రీడాకారులకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అండగా ఉంటుందనే ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు.

జగన్ హోదా బాణానికి.. 'దేశం' బేజార్!

▶ మొదటి పేజీ తరువాయి

ఏం సమాధానం చెప్పాలి? హోదా ఆకాంక్ష అధికమవుతున్న నేపథ్యంలో అందరినీ ఎలా సమాధానపరచాలి' అంటూ అధినేత తర్జన భర్జన పడుతున్నారని బుధవారం చంద్రబాబును కలిసిన తరువాత ఆ పార్టీ సీనియర్ నేత ఒకరు తన అనుచరుల వద్ద వ్యాఖ్యానించడం చూస్తే ఆ పార్టీ ఎంత గందరగోళంలో ఉందో అర్థమవుతోంది. రోజంతా రకరకాల లీకులు వదిలిన తెలుగుదేశం నాయకులు, మంత్రులు చివరకు ప్రతిపక్షనేతపై దుర్భాషలాడడడానికి పరిమితమయ్యారు. ప్రత్యేక హోదా గురించి ఒక్క ముక్క కూడా మాట్లాడకపోవడాన్ని బట్టి అధికారపార్టీ చిత్తశుద్ధి బట్టబయలయ్యిందని విశ్లేషకులంటున్నారు.

అనుకూల మీడియాలో లీకులు..

'పదవులు ముఖ్యం కాదు. పదవులు లెక్క కాదు.. రాష్ట్రప్రయోజనాలే మాకు మిన్న.. అందుకోసం అవసరమైతే మంత్రుల చేత రాజీనామాలు చేయిస్తాం' అంటూ చానళ్లలో వరుసగా లీకు కథనాలు.. చంద్రబాబు అన్నట్లుగా ఈ కథనాలను అనుకూల మీడియాలో ప్రసారం చేశారు. కానీ చంద్రబాబు ఎక్కడా మాట్లాడలేదు. 14 రోజులుగా ఆయన మౌనం పాటిస్తూ వస్తున్నారు. సమన్వయ కమిటీ భేటీ జరుగుతున్నంత సేపు ఈ లీకులే హల్‌చల్ చేశాయి. బడ్జెట్ ప్రవేశ పెట్టిన తరువాత చంద్రబాబు ఎప్పటికప్పుడు తన అనుకూల మీడియాకు లీకులిస్తూ వాటి ద్వారానే వ్యవహారాలు నడిపిస్తున్నారు. రాష్ట్రానికి సరిగా నిధులు ఇవ్వనందున కేంద్రంపై ఒత్తిడి తెస్తామని, అవసరమైతే ఎంతవరకైనా పోరాడతామని, కఠిన నిర్ణయమైనా తీసుకుంటామంటూ మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తున్నారని పరిశీలకులు అంటున్నారు.

ఎదురుదాడి చేయడమే వ్యూహం..

వైఎస్సార్‌సీపీపై ఎదురుదాడి చేయడం ద్వారా ఈ పరిస్థితి నుంచి గట్టెక్కుదామని మంత్రులు, టీడీపీ నాయకులకు ముఖ్యమంత్రి చంద్రబాబు సూచించినట్లు తెలిసింది. బుధవారం వెలగపూడి సచివాలయంలో పలువురు మంత్రులు, టీడీపీ నాయకులతో ఆయన సమావేశమైన సందర్భంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎంపీల రాజీనామాలపైనే ప్రధానంగా చర్చ జరిగినట్లు తెలిసింది. దీని ప్రభావం ప్రజల్లో ఎలా ఉంటుంది, పార్టీ పరంగా ఏంచేయాలనే దానిపై చంద్రబాబు మాట్లాడుతూ ప్రత్యేక హోదా అంశాన్ని ఎత్తకుండా ప్రతిపక్ష పార్టీపై ఎదురుదాడి చేయాలని మంత్రులకు చెప్పినట్లు సమాచారం. బీజేపీతో పొత్తు కోసం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రయత్నాలు చేస్తోందని, అదే సమయంలో రాజకీయ ప్రయోజనాల కోసమే రాజీనామాల పేరుతో నాటకాలాడుతున్నారని చెప్పాలని సూచించినట్లు తెలిసింది. రాజీనామాల ప్రకటన వల్ల ప్రజల్లో వారికి సానుకూలత ఏర్పడే పరిస్థితి ఉంటుందని, ఎదురుదాడి ద్వారా దాన్ని పక్కదారి పట్టించాలని చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. మళ్లీ పార్లమెంటు సమావేశాలు ప్రారంభమయ్యే వరకూ బీజేపీ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీపై ఒకేసారి ఎదురుదాడి చేయడమే మన వ్యూహమని చెప్పారు. ప్రత్యేక హోదా గురించి మాట్లాడాల్సివస్తే కేంద్ర ప్రభుత్వం దాన్ని మించిన ప్రయోజనాలతో ప్యాకేజీ ఇస్తామని చెప్పడం వల్లే అందుకు ఒప్పుకున్నామని చెప్పాలని సూచించారు. పవన్‌కళ్యాణ్ ఏర్పాటు చేసిన నిజ నిర్ధారణ కమిటీపై తొందరపడి విమర్శలు చేయొద్దని సూచించినట్లు తెలిసింది.

ప్రతిపక్ష నేతపై బురదజల్లడానికే పరిమితం..

సమన్వయ కమిటీ సమావేశం తర్వాత మంత్రులు మాట్లాడుతుండడంతో ప్రత్యేక హోదా గురించి అధికార పార్టీ ఏమన్నా చెబుతారని అంతా అనుకున్నారు. కానీ ప్రత్యేక హోదా గురించి ఒక్క ముక్క కూడా మాట్లాడలేదు. పైగా ప్రత్యేక హోదా గురించి నిరంతరాయంగా పోరాడుతున్న ప్రతిపక్షనేతపై బురదజల్లడానికి, దుర్భాషలాడడానికి పరిమితమయ్యారు. ఆత్మరక్షణలో పడిపోవడంతో దిక్కు తోచక ఎదురుదాడి చేసి గట్టెక్కాలనుకున్నట్లు కనిపిస్తోందని పరిశీలకులంటున్నారు. జగన్ ప్రయోగించిన రాజీనామా అస్త్రం ప్రజల్లోకి బాగా చొచ్చుకుని వెళ్లిందని, అన్ని రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, విభిన్న వర్గాలు మరీ ముఖ్యంగా యువత, నిరుద్యోగులు, విద్యార్థుల్లో మంచి సానుకూలత కనిపిస్తోందని పార్టీ ముఖ్య శ్రేణులతో పాటు నిఘా వర్గాలు కూడా చెబుతుండడంతో చంద్రబాబులో ఆందోళన తీవ్రమైందని ఆ పార్టీ నేతలే చెపుతున్నారు. అందుకే వైఎస్ జగన్‌పై వ్యక్తిగత విమర్శల తీవ్రతను పెంచాల్సిందిగా అధినేత ఆదేశించారని వారు పేర్కొంటున్నారు.

హోదాపై వైఖరేమిటి?

సమన్వయ కమిటీ భేటీ తర్వాత రాష్ట్ర మంత్రులు విలేకరుల సమావేశాలలో మాట్లాడారు. ప్రత్యేక హోదాపై అధికార పార్టీ వైఖరేమిటనేది ఎక్కడా ఒక్క ముక్క కూడా మాట్లాడలేదు. కేంద్రం మీద వత్తిడి తెస్తామన్నారు. దేని కోసం వత్తిడి తెస్తారో చెప్పలేదు. ప్రత్యేక హోదా కోసం పోరాటం చేస్తామా లేక నియోజకవర్గాల పునర్విభజన కోసమా లేక పోలవరం కాంట్రాక్టుల కోసమా అదీ కాకపోతే రాజధాని నిధుల కోసమా అనే స్పష్టత వారికేలేదు. సమన్వయ కమిటీ భేటీలో గానీ, అనుకూల మీడియాకు ఇచ్చిన లీకుల్లో గానీ, మంత్రులు జరిపిన విలేకరుల సమావేశాల్లో గానీ ప్రత్యేక హోదా ప్రస్తావనే లేదు.

అంబానీతో భేటీపై సర్వత్రా ఆసక్తి..

ప్రత్యేక హోదా గురించి రాష్ట్రమంతా అట్టుడుకుతున్నా నోరుమెదపని సీఎం చంద్రబాబు నాయుడు మంగళవారం నాడు రిలయన్స్ అధినేత ముకేష్ అంబానీతో ప్రత్యేకంగా సమావేశం కావడం ప్రాధాన్యత సంతరించుకుంది. సెలవు రోజు సచివాలయంలోనూ, సీఎం నివాసంలోనూ వీరిరువురూ ఎక్కువ సేపు ఏకాంత చర్చలు జరపడంపై ఆసక్తి నెలకొంది. ఆ మరునాడే టీడీపీ సమన్వయ కమిటీ భేటీ జరగడం గమనార్హం. సమన్వయ కమిటీ భేటీ తర్వాత మాట్లాడిన మంత్రులు ప్రత్యేక హోదా గురించి గానీ, రాష్ట్రానికి సంబంధించిన ఏ ఇతర సమస్యల గురించి గానీ ప్రస్తావించలేదు. ముఖ్యమంత్రి అసలు మాట్లాడనేలేదు. మరి దేని గురించి ఈ సమన్వయ భేటీ జరిగి ఉంటుందనే ఆసక్తి సర్వత్రా నెలకొంది.

భూ సేకరణ పరిహారం ఇంతేనా?

- ఏపీ సమర్పించిన వివరాలపై హైకోర్టు ధర్మాసనం సందేహం
- కేవలం రూ.62 కోట్లే చెల్లించాల్సి ఉందన్న రాష్ట్ర ప్రభుత్వం
- జిల్లాల నుంచి ఈపీలు, వివరాలు తెప్పించాలని రిజిస్ట్రార్ జనరల్‌కు ఆదేశం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో భూ సేకరణకు సంబంధించి పరిహారం చెల్లింపు విషయంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సమర్పించిన గణాంకాలపై హైకోర్టు సందేహాలు వ్యక్తం చేసింది. తెలంగాణ ప్రభుత్వం రూ.457.78 కోట్లు చెల్లించాల్సి ఉండగా, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కేవలం రూ.62.88 కోట్లు మాత్రమే చెల్లించాల్సి ఉందని చెప్పడంపై అనుమానం వ్యక్తం చేసింది. భారీ ప్రాజెక్టులు చేపడుతున్నప్పుడు అంతేస్థాయిలో భూ సేకరణ ఉంటుందని, అటువంటప్పుడు పరిహారం కూడా అదే స్థాయిలో చెల్లించాల్సి ఉంటుందని పేర్కొంది. ప్రభుత్వం చెబుతున్న మొత్తాలను, ఆయా కోర్టుల్లో ఉన్న పిటిషన్‌లతో పోల్చి చూడాల్సిన అవసరం ఉందని తెలిపింది. ఈ నేపథ్యంలో ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని కింది కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న ఎగ్జిక్యూషన్ పిటిషన్లు, చెల్లించాల్సిన మొత్తాల వివరాలను అందచేయాలని రిజిస్ట్రార్ జనరల్ (ఆర్‌జీ) సీహెచ్ మానవేంద్రనాథ్ రాయ్‌ను ఆదేశించింది. మార్చి నెలాఖరుకల్లా ఈ వివరాలను తెప్పించాలని ఆదేశిస్తూ తదుపరి విచారణను ఏప్రిల్ మొదటి వారానికి వాయిదా వేసింది. ఈ మేరకు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి (ఏసీజే) జస్టిస్ రమేశ్ రంగనాథన్, న్యాయమూర్తి జస్టిస్ కొంగర విజయలక్ష్మిలతో కూడిన ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది.

ప్రిన్సిపల్ జడ్జి లేఖ 'పిల్'గా విచారణకు స్వీకరణ

భూ సేకరణ పరిహారంపై తమ ఉత్తర్వులను జిల్లా కలెక్టర్ అమలు చేయడం లేదని, దీంతో బాధితులు దాఖలు చేస్తున్న ఎగ్జిక్యూషన్ పిటిషన్లు (ఈపీ)లు ఏళ్ల తరబడి పేరుకుపోతున్నాయంటూ తెలంగాణలోని మహబూబ్‌నగర్ జిల్లా ప్రిన్సిపల్ జడ్జి జి.వెంకటకృష్ణయ్య ఉమ్మడి హైకోర్టుకు లేఖ రాశారు. దీన్ని ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్)గా పరిగణిస్తూ విచారణకు స్వీకరించిన ఏసీజే నేతృత్వంలోని ధర్మాసనం బుధవారం మరోసారి విచారణ జరిపింది. వివిధ ప్రాజెక్టులు, పరిశ్రమల కోసం తీసుకున్న భూములకు చెల్లించాల్సిన రూ.457.78 కోట్ల పరిహారాన్ని తమకు హామీ ఇచ్చిన విధంగా ఆరు వాయిదాల్లో బాధితులకు చెల్లించి తీరాల్సిందేనని తెలంగాణ ప్రభుత్వానికి ఈ సందర్భంగా హైకోర్టు స్పష్టం చేసింది. 1.4.2018 నుంచి 31.12.2018 లోపు ఈ పరిహారం మొత్తాన్ని చెల్లించాలని, లేదంటే తీవ్ర పరిణామాలను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని హెచ్చరించింది.

మూడు నెలల్లోగా పూర్తిగా చెల్లిస్తామన్న ఏపీ

తెలంగాణలో 1,669 ఈపీలు పెండింగ్‌లో ఉన్నాయని, రూ.457.78 కోట్లు వాయిదాల పద్ధతిలో చెల్లిస్తామని తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి తన అఫిడవిట్‌లో పేర్కొన్నారు. మరోవైపు ఆంధ్రప్రదేశ్‌లో ఈనెల 5వ తేదీ నాటికి 13 జిల్లాల్లో 915 ఈపీలు పెండింగ్‌లో ఉన్నాయని, ఇంకా రూ.62.88 కోట్లను చెల్లించాల్సి ఉందని ఆంధ్రప్రదేశ్ రెవిన్యూశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ తెలిపారు. మొత్తం రూ.84.36 కోట్లు చెల్లించాల్సి ఉండగా ఇప్పటికే రూ.21.55 కోట్లను డిపాజిట్ చేశామని, ఇంకా రూ.62.88 కోట్లను చెల్లించాల్సి ఉందని చెప్పారు. మూడు నెలల్లో పూర్తిగా చెల్లించి ఈపీలను మూసివేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.



	పెండింగ్‌లో ఉన్న ఈపీలు..	చెల్లించాల్సిన మొత్తం (లక్షల్లో)
శ్రీకాకుళం	09	83.84
విజయనగరం	04	2.40
విశాఖపట్నం	26	226.46
తూ. గో	190	952.91
ప. గో	31	378.15
కృష్ణా	18	381.28
గుంటూరు	63	402.06
ప్రకాశం	26	83.71
నెల్లూరు	83	755.33
వైఎస్సార్	16	774.96
చిత్తూరు	32	808.80
అనంతపురం	45	272.72
కర్నూలు	372	1159.72
మొత్తం	915	6,288.34

తెలుగు పౌరుషాన్ని చాటేందుకే రాజీనామాలు

- వైఎస్సార్‌సీపీ నేతలు సుబ్బారెడ్డి, బొత్స
- రాష్ట్ర ప్రయోజనాల కోసమే ఈ నిర్ణయం
- హోదా సాధనే వైఎస్సార్‌సీపీ ఊపిరి
- నాలుగేళ్లుగా జగన్ అవిశ్రాంత పోరాటం
- పార్లమెంటులో టీడీపీవన్నీ నాటకాలే



మీడియాతో మాట్లాడుతున్న ఎంపీ వైవీ సుబ్బారెడ్డి. చిత్రంలో వైఎస్సార్‌సీపీ నేత బొత్స సత్యనారాయణ

సాక్షి, హైదరాబాద్: తెలుగువారి పౌరుషాన్ని చాటేందుకే పార్లమెంట్ సభ్యత్వానికి రాజీనామా చేయడానికి తమ పార్టీ ఎంపీలు సిద్ధపడ్డారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రయోజనాలు కాపాడేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్టు వెల్లడించారు. తమ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు పార్లమెంట్ సాక్షిగా ఏప్రిల్ 6న ఎంపీ స్థానాలకు రాజీనామా సమర్పిస్తామని చెప్పారు. హైదరాబాద్ లోటస్‌పాండ్‌లోని పార్టీ కేంద్ర కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ ఎంపీ వైవీ సుబ్బారెడ్డి, సీనియర్ నేత బొత్స సత్యనారాయణ బుధవారం మీడియాతో మాట్లాడారు. టీడీపీ నేతలు ఇకనైనా డ్రామాలు కట్టిపెట్టి, స్వప్రయోజనాలు విడిచిపెట్టి ప్రత్యేక హోదా కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. విభజన సందర్భంగా కేంద్రం ఇచ్చిన డిమాండ్ల సాధన కోసం తమ పార్టీ చేసే ఆందోళనను ఈ సందర్భంగా గుర్తుచేశారు.

టీడీపీకి చెంప పెట్టు: వైవీ సుబ్బారెడ్డి

నాటకాలతో ప్రజలను మోసం చేస్తున్న టీడీపీకి తమ రాజీనామాలు చెంపపెట్టని వైవీ సుబ్బారెడ్డి వ్యాఖ్యానించారు. కేంద్రంపై ఒత్తిడి తెచ్చేందుకు తమ పార్టీ పలు ఆందోళనలకు సిద్ధమైందని, దీనికి ప్రజలు మద్దతివ్వాలని కోరారు. మార్చి 1న కలెక్టరేట్ల ముట్టడి, 5న జంతర్ మంతర్ వద్ద ధర్నా చేస్తామన్నారు. అప్పటి నుంచి ఏప్రిల్ 6 వరకు పార్లమెంట్‌లో రాష్ట్ర ప్రయోజనాల కోసం ఉద్యమిస్తామని చెప్పారు. అప్పటికీ కేంద్రం స్పందించకపోతే పార్లమెంట్ సాక్షిగా ఎంపీ పదవులకు రాజీనామా చేసి వస్తామని తెలిపారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం తాము రాజీనామాలు చేస్తుంటే.. పార్లమెంట్‌లో టీడీపీ డ్రామాలు ఆడుతూ ప్రజలను మభ్యపెడుతోందని విమర్శించారు. రాష్ట్రానికి హోదా రావడం టీడీపీకి ఇష్టమో, లేదో చెప్పాలని నిలదీశారు. ప్రత్యేక హోదా, రైల్వే జోన్, పోలవరం, స్టీల్ ప్యాక్టరీ కోసం తమ పార్టీ మాత్రమే ఆందోళనలు చేస్తోందని గుర్తుచేశారు. హోదా కోసం గత నాలుగేళ్లుగా తమ నేత జగన్ పోరాడుతున్నారని, ఎన్డీఏలో భాగస్వామిగా ఉన్న టీడీపీ ఏం చేసిందని ప్రశ్నించారు. హోదా ఇవ్వకపోతే ఆఖరి అస్త్రంగా ఎంపీ పదవులకు రాజీనామా చేస్తామని గతంలోనే ప్రకటించినట్టు తెలిపారు. తాము తీసుకున్న రాజీనామాల నిర్ణయంతో చంద్రబాబు మైండ్ బ్లాక్ అయ్యిందన్నారు. 15 నెలల పదవీ కాలం ఉన్నా తాము రాజీనామా చేస్తున్నామని, ఎన్నికలు వచ్చినా ప్రజల మద్దతు లభిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఎన్నికలంటే చంద్రబాబుకు భయమని, అందుకే ఫిరాయింపు ఎమ్మెల్యేలతో ఇప్పటికీ రాజీనామా చేయించలేదని విమర్శించారు. తెలుగు ప్రజల ఆత్మగౌరవాన్ని తెలుగు రాష్ట్రాల్లోనే పోగొట్టేలా వ్యవహరించాడని ఎద్దేవా చేశారు.

అజ్ఞాతమెందుకు బాబూ?: బొత్స

కేంద్ర బడ్జెట్‌పై చంద్రబాబు తన వైఖరిని వెల్లడించాలని బొత్స సత్యనారాయణ డిమాండ్ చేశారు. గత 14 రోజులుగా ఆయన అజ్ఞాతంలో ఉండటానికి కారణాలేమిటని నిలదీశారు. మిత్రపక్షమైన బీజేపీని చూసి చంద్రబాబు వణికి పోతున్నారని తెలిపారు. బడ్జెట్‌లో రాష్ట్రానికి అన్యాయం జరిగితే అడిగే బాధ్యత సీఎంకు లేదా? అని ప్రశ్నించారు. ప్రజా ప్రయోజనాల విషయంలో తమ నేత జగన్ స్పష్టమైన విధానంతో ఉన్నారని తెలిపారు. విభజన చట్టంలోని హామీల సాధన కోసం రాజీలేని పోరాటాలు చేస్తామని చెప్పారని, ఆ మేరకు పలు సందర్భాల్లో ప్రధాని, రాష్ట్రపతితో పాటు వివిధ పార్టీల నాయకులతో కలిసిన విషయాన్ని గుర్తుచేశారు. ఢిల్లీలో ధర్నా చేశామని, గుంటూరులో తమ నేత జగన్ ఆమరణ నిరాహార దీక్ష చేశారని, విశాఖలో భారీ బహిరంగ సభ ఏర్పాటు చేశామని, యువభేరిలు చేపట్టామని వివరించారు. తమ పార్టీ ఎంపీలు ఎందుకు రాజీనామాలు చేయడం లేదని చంద్రబాబే ప్రశ్నించారని, ఇప్పుడు ముందుకొస్తే హేళన చేస్తున్నారని దుయ్యబట్టారు. రాష్ట్రానికి అన్యాయం జరుగుతోందని తాము నాలుగేళ్లుగా ఉద్యమిస్తుంటే, చంద్రబాబు మాత్రం రాష్ట్రానికి బీజేపీ చేస్తున్న మేలు మరే రాష్ట్రానికి లేదని చెప్పారని గుర్తుచేశారు. ఎన్డీఏ మిత్రపక్షమైన టీడీపీ పార్లమెంట్‌లో డ్రామాలాడిందన్నారు. స్వలాభం, బలహీనతల కోసం రాష్ట్ర ప్రయోజనాలను తాకట్టు పెట్టారని మండిపడ్డారు. అవినీతిపై కేంద్రం విచారణ చేపడతుందని, ఓటుకు నోటు కేసులో ఎక్కడ దర్యాప్తు చేస్తారోనని చంద్రబాబు భయపడుతున్నారని విమర్శించారు. ఇప్పటికైనా తమ నేత చేస్తున్న పోరాటానికి మద్దతునివ్వాలని టీడీపీని బొత్స కోరారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం తమ పార్టీ చేపట్టే ఉద్యమానికి సహకరించాలని రాష్ట్ర ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

కేసుల్లో ఇరుక్కుని రాష్ట్రాన్ని నాశనం చేస్తున్నారు

సీఎంపై రామచంద్రయ్య మండిపాటు



కడప వైఎస్సార్ సర్కిల్: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఓటుకు కోట్లు కేసులో ఇరుక్కొని రాష్ట్రాన్ని సర్వనాశనం చేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ నాయకుడు సి.రామచంద్రయ్య విమర్శించారు. వైఎస్సార్ జిల్లా కడపలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రత్యేక హోదా కోసం ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మార్చి 5 నుంచి ఏప్రిల్ 6 వరకు పోరాటాలు చేసి అప్పటికీ కేంద్ర ప్రభుత్వం దిగిరాకుంటే తన ఎంపీల చేత రాజీనామా చేయిస్తామని చెప్పడం గర్వించదగ్గ విషయమన్నారు. విభజన హామీల కోసం పోరాడాల్సిన సీఎం చంద్రబాబు ప్రత్యేక హోదా అవసరం లేదని ప్యాకేజీ చాలని చెప్పడం సిగ్గుచేటన్నారు. జనసేన అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్ జేపీసీ ఏర్పాటు చేయడం వల్ల రాష్ట్రానికి ఉపయోగంలేదని అభిప్రాయపడ్డారు. చంద్రబాబు అన్ని రాజకీయ పార్టీలకు కలుపుకొని జేపీసీని ఏర్పాటు చేసి ఢిల్లీలో పోరాటం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు నజీర్ అహ్మద్, పీసీసీ అధికార ప్రతినిధి నీలిశ్రీనివాసరావు, కాంగ్రెస్ నాయకులు విజయ్ భాస్కర్, నాగరాజు పాల్గొన్నారు.



తిరుమల శ్రీవారి ఆలయం వద్ద మణిందర్‌సింగ్ బిట్టా తదితరులు

పాక్ ఉగ్రవాదాన్ని ఆర్మీ సమర్థంగా ఎదుర్కొంటోంది

జాతీయ ఉగ్రవాద వ్యతిరేక దళం అధ్యక్షుడు బిట్టా

సాక్షి, తిరుమల: పాకిస్తాన్ ప్రేరేపిత ఉగ్రవాదాన్ని భారత ఆర్మీ సమర్థవంతంగా ఎదుర్కొంటోందని జాతీయ ఉగ్రవాద వ్యతిరేక దళం అధ్యక్షుడు మణిందర్‌సింగ్ బిట్టా అన్నారు. బుధవారం ఆయన తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం బిట్టా మీడియాతో మాట్లాడారు. దేశ ప్రజలు సుఖశాంతులతో ఉండాలని శ్రీవారిని ప్రార్థించినట్టు తెలిపారు. కాగా, కాశ్మీర్‌లో చెలరేగుతున్న ఉగ్రవాదానికి ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం తుపాకీతో సమాధానం చెబుతోందని ఆయన కితాబిచ్చారు.

'టెట్' అస్తవ్యస్తం

- అధికారుల అడ్డగోలు నిర్ణయాలతో అభాసుపాలు
- 4.5 లక్షల మంది అభ్యర్థుల్లో ఆందోళన
- సెంటర్లు లేని చిరునామాలతో హాల్‌టికెట్లు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్)–2017 అధికారుల అడ్డగోలు నిర్ణయాలతో అభాసుపాలవుతోంది. వారి ఏకపక్ష నిర్ణయాలు టెట్‌కు శాపంగా పరిణమించాయి. ఇప్పటికే రెండుసార్లు షెడ్యూల్‌లో మార్పు చేసినా ఇంకా అభ్యర్థులకు తిప్పలు తప్పడం లేదు. ఈ నెల 21 నుంచి మార్చి 3 వరకు జరగనున్న టెట్ హాల్ టికెట్ల జారీ గందరగోళంగా మారిన సంగతి తెలిసిందే. టెట్‌కు దాదాపు 4.5 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారు. వారిలో 15 వేల మందికి వందల కిలోమీటర్ల దూరంలోని చెన్నై, బెంగళూరు, హైదరాబాద్‌లో పరీక్ష కేంద్రాలను కేటాయించారు. వీరిలో మహిళలు, వికలాంగులు సైతం ఉన్నారు. రాష్ట్రంలోనూ పరీక్ష కేంద్రాల కేటాయింపులో ఓ విధానమంటూ లేకుండాపోయింది. శ్రీకాకుళంలోని మహిళా అభ్యర్థులు గుంటూరులో పరీక్ష రాయాలట! అనంతపురం జిల్లాకు చెందిన వారికి నెల్లూరు, గుంటూరులో కేటాయించారు. టెట్ హాల్‌టికెట్లలోనూ ఎన్నో సిత్రాలు చోటుచేసుకుంటున్నాయి. హాల్ టికెట్‌లోని చిరునామాకు వెళ్తే అక్కడ పరీక్షా కేంద్రమే లేదని చెబుతున్నారు. దీనిపై పాఠశాల విద్యా శాఖ కార్యాలయానికి, టెట్ వెబ్‌సైట్‌లోని నంబర్లకు ఫోన్ చేసినా అవి పనిచేయడం లేదు. మరోవైపు పేపర్–2 నుంచి పేపర్–3కి కన్వర్ట్ అయిన వందలాది మంది హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ కావడం లేదని ఆందోళన చెందుతున్నారు.

కమీషన్లు మింగేశారు

టెట్ నిర్వహణ కాంట్రాక్టు పొందిన సంస్థకు ఎలాంటి అర్హతలు లేవని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కమీషన్ల కోసమే అధికారులు ఆ సంస్థకు బాధ్యతలు అప్పగించారని అంటున్నారు. 322 కేంద్రాల్లో టెట్ ఆన్‌లైన్ పరీక్ష నిర్వహించాలంటూ కాంట్రాక్టు సంస్థతో అధికారులు ఒప్పందం కుదుర్చుకున్నారు. ఇప్పుడు ఆ సంస్థకు రాష్ట్రంలో 177 కేంద్రాలు మాత్రమే ఉన్నాయంటూ చేతులెత్తేస్తున్నారు. టెట్ నిర్వహణ కోసం 4.50 లక్షల మంది అభ్యర్థుల నుంచి పాఠశాల విద్యా శాఖ రూ.22.5 కోట్లు వసూలు చేసింది. ఒక్కో పేపర్‌కు రూ.500 చొప్పున పరీక్ష ఫీజు నిర్ణయించారు. అయినా సమర్థంగా పరీక్ష నిర్వహించలేకపోతుండడం గమనార్హం.

వాయిదా వేస్తారా?

టెట్ హాల్‌టికెట్ల జారీ ప్రక్రియ గందరగోళంగా మారడంతో పాఠశాల విద్యా శాఖ అధికారులపై మంత్రి గంటా ఆగ్రహం వ్యక్తం చేశారు. టెట్ నిర్వహణపై గురువారం సమీక్ష నిర్వహించాలని నిర్ణయించారు. గందరగోళ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో టెట్ వాయిదా వేయాలా? లేక ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి షెడ్యూల్ ప్రకారమే నిర్వహించాలా? అనేదానిపై తర్జనభర్జన పడుతున్నారు. ప్రత్యామ్నాయంగా ఏపీ ఆన్‌లైన్ కేంద్రాలు కూడా తీసుకొని విద్యార్థులందరికీ మళ్లీ హాల్‌టికెట్లు జారీ చేసి, పరీక్ష నిర్వహించాలని భావిస్తున్నారు.

టీడీపీ ఎమ్మెల్యే చింతమనేనికి

రెండేళ్ల జైలుశిక్ష

▶ మొదటి పేజీ తరువాయి

నమోదు చేశారు. దీనిపై పబ్లిక్ ప్రాసిక్యూటర్ రవిప్రసాద్ ప్రభుత్వం తరపున వాదించారు. చింతమనేని తరపున ఈడ్పుగంటి శ్రీనివాసరావు వాదనలు వినిపించారు. వాదోపవాదాలు విన్న జడ్జి సాక్ష్యాధారాలు బలంగా ఉండటంతో చింతమనేనికి జైలుశిక్ష ఖరారు చేశారు. 353 సెక్షన్ కింద ఆరు నెలల జైలు, రూ.1000 జరిమానా, 506 (2) సెక్షన్ కింద రెండేళ్ల జైలు, రూ.1000 జరిమానా, 7(1) సెక్షన్ కింద ఆరు నెలల జైలు, రూ.500లు జరిమానా విధించారు. ఈ మూడు శిక్షలు ఒకేసారి అమలు చేయాలని ఆదేశించడంతో జైలుశిక్ష రెండేళ్లకు తగ్గింది. కాగా, చింతమనేని బెయిల్‌కు దరఖాస్తు చేసుకోవడంతో బెయిల్ మంజూరు చేశారు.



తీర్పు నేపథ్యంలో భీమడోలు కోర్టు వద్ద టీడీపీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్

ఈ కేసు రాజకీయ కుట్ర: ఎమ్మెల్యే చింతమనేని

న్యాయస్థానం తీర్పును గౌరవిస్తానని, చట్టం తన పని తాను చేసుకుపోతుందని ఎమ్మెల్యే చింతమనేని అన్నారు. రాజకీయంగా తన ఎదుగుదలను చూసి ఓర్వలేకే తనపై తప్పుడు కేసులు పెట్టారన్నారు.

● తిరుమల శ్రీవారి ప్రత్యేక ప్రవేశ దర్శనం రూ.300 టిక్కెట్లకు సంబంధించిన ఏప్రిల్ కోటాను గురువారం ఉదయం 11.00 గంటలకు టీటీడీ విడుదల చేయనుంది. తిరుమలకు వచ్చి ఇబ్బందులు పడకుండా ముందే శ్రీవారి దర్శన టికెట్లను రిజర్వు చేసుకోవాలని టీటీడీ పీఆర్వో తలారి రవి కోరారు.



హోదా కోసం పోరాటం

- వామపక్ష పార్టీల నిర్ణయం
- 18న విజయవాడలో రౌండ్ టేబుల్ భేటీ
- రైల్వే జోన్ కోసం 24న విశాఖలో బహిరంగ సభ


సీపీఐ రాష్ట్ర కార్యాలయంలో సమావేశమైన సీపీఎం, సీపీఐ రాష్ట్ర కార్యదర్శులు పి.మధు, కె.రామకృష్ణ తదితరులు

సాక్షి, అమరావతి: రాష్ట్ర విభజన చట్టం హామీల అమలుతోపాటు ప్రత్యేక హోదా కోసం దశలవారీగా పోరాటానికి వామపక్షాలు పిలుపునిచ్చాయి. పార్టీ, ప్రజా సంఘాలను ఏకం చేసేందుకు రాష్ట్రవ్యాప్తంగా సదస్సులు, సమావేశాలు, ర్యాలీలు నిర్వహించాలని తీర్మానించాయి. ఈమేరకు పది వామపక్ష పార్టీలు బుధవారం విజయవాడలోని సీపీఐ రాష్ట్ర కార్యాలయంలో సమావేశమై భవిష్యత్ కార్యాచరణ ఖరారు చేశాయి. సీపీఎం (ఎంఎల్) నాయకుడు గుర్రం విజయ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశానికి కె.రామకృష్ణ, ముప్పాళ్ల నాగేశ్వరరావు, జల్లి విల్సన్ (సీపీఐ), పి.మధు, వై.వెంకటేశ్వరరావు (సీపీఎం), పోలారి (న్యూడెమోక్రసీ), డి.హరినాథ్ (లిబరేషన్), ఎం.వెంకటరెడ్డి (ఎంసీపీఐయూ), పీవీ సుందరరామరాజు (ఫార్వర్డ్‌బ్లాక్), అమరనాథ్, సుధీర్ (ఎస్‌యూసీఐ) హాజరయ్యారు. అనంతరం రామకృష్ణ, మధు మీడియాతో మాట్లాడుతూ హోదాపై రాజకీయ పార్టీలు ఇప్పటికైనా దోబూచులాటలు ఆపి ఏపీ ప్రయోజనాల కోసం కలసి రావాలని సూచించారు. బీజేపీ, టీడీపీ రాష్ట్రానికి ద్రోహం చేస్తున్నాయని ధ్వజమెత్తారు. మార్చి 5 నుంచి ప్రారంభమయ్యే పార్లమెంట్ సమావేశాల్లో అధికార, ప్రతిపక్ష పార్టీల ఎంపీలంతా కేంద్రం మెడలు వంచేందుకు ఉమ్మడిగా పోరాడాలని కోరారు. ప్రతిపక్ష వైఎస్సార్‌సీపీతో కలిసి ధర్నా చేసే అంశంపై చర్చించాల్సి ఉందని చెప్పారు. గుంటూరు జిల్లా గొట్టిపా డులో దళితులపై దాడులకు నిరసనగా ఈనెల 23న ఛలో గుంటూరు నిర్వహిస్తున్నట్టు రామకృష్ణ, మధు తెలిపారు.

లెఫ్ట్ పార్టీ భేటీలో నిర్ణయాలివీ..

- ప్రత్యేక హోదా సాధనకు విశాఖ ఉక్కు–ఆంధ్రుల ఉక్కు తరహాలో పోరాటం.
- విభజన చట్టంలోని అంశాలు, హోదాపై 18న రౌండ్ టేబుల్ భేటీ.
- విశాఖకు రైల్వే జోన్ అంశంపై 24న విశాఖలో బహిరంగ సభ. మార్చి 2, 3, 4వ తేదీలలో అన్ని మండల కేంద్రాల ఎదుట ధర్నాలు, నిరసన ప్రదర్శనలు.
- ప్రత్యేక హోదాపై మార్చి 2న గుంటూరులో నిపుణులతో సదస్సు నిర్వహణ.
- మార్చి 6న పార్లమెంట్ ఎదుట వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో ధర్నా.

జూనియర్ వైద్యుల స్టైఫండ్ పెంపు

- సమ్మె నిర్ణయంతో దిగొచ్చిన సర్కారు
- రెండున్నరేళ్లుగా సర్కారుతో పోరాడిన జూడాలు

సాక్షి, అమరావతి: రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ వైద్య కళాశాలల్లో ఉన్న జూనియర్ వైద్యులకు స్టైఫండ్ పెంచుతూ ప్రభుత్వం నిర్ణయించింది. మూడున్నరేళ్లుగా పదుల సంఖ్యలో వినతిపత్రాలు ఇచ్చి కాళ్లరిగేలా అధికారుల చుట్టూ తిరిగారు. ఉన్న స్టైఫండ్ ఇవ్వకపోవడం, కొత్తగా పెంచకపోవడంతో ఈనెల 14 నుంచి సమ్మెలోకి దిగుతామని హెచ్చరించడంతో సర్కారు దిగొచ్చింది. ఎంబీబీఎస్, బీడీఎస్, పీజీ వైద్యులతో పాటు సూపర్ స్పెషాలిటీ వైద్యులు కూడా సమ్మెలో పాల్గొంటామని స్పష్టం చేశారు. దీంతో విధిలేని పరిస్థితుల్లో మెడికల్, డెంటల్ కోర్సులు చేస్తున్న జూనియర్ వైద్యులకు స్టైఫండ్ పెంచుతూ బుధవారం వైద్య ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి పూనం మాలకొండయ్య ఉత్తర్వులు జారీచేశారు. పెంచిన స్టైఫండ్ 2016 జనవరి 1 నుంచి అమల్లోకి వస్తుందన్నారు.











ఏఎన్‌యూ దూర విద్య పరీక్ష ఫలితాలు విడుదల

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం దూర విద్యా కేంద్రం గతేడాది డిసెంబర్‌లో నిర్వహించిన ఎంసీఏ కోర్సు పరీక్షా ఫలితాలు బుధవారం విడుదలయ్యాయి. ఈ ఫలితాలను www.anucde.info వెబ్‌సైట్ ద్వారా పొందవచ్చని ఆ పరీక్షల విభాగం డిప్యూటీ రిజిస్ట్రార్ జి.జాన్సన్ తెలిపారు. అభ్యర్థులు రీవాల్యుయేషన్‌కు ఈనెల 27వ తేదీలోగా ఒక్కో పేపర్‌కు రూ.1,960 చొప్పున చెల్లించాలని సూచించారు.

కేంద్ర మాజీ మంత్రి బోళ్ల బులిరామయ్య కన్నుమూత


బులిరామయ్య పార్థివదేహానికి నివాళులర్పిస్తున్న సీఎం

తణుకు: కేంద్ర మాజీ మంత్రి, ఆంధ్రా షుగర్స్ సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ బోళ్ల బులి రామయ్య (91) మృతి చెందారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన.. పశ్చిమ గోదావరి జిల్లా తణుకు మండలం వెంకట్రాయపురంలోని స్వగృహంలో బుధవారం ఉదయం తుదిశ్వాస విడిచారు. ఆయనకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. 1953లో ఆంధ్రా షుగర్స్ సంస్థలో చేరిన ఆయన.. సంస్థ అభివృద్ధి, విస్తరణలో ముళ్లపూడి హరిశ్చంద్ర ప్రసాద్ సారథ్యానికి సాంకేతిక మేధస్సును సమకూర్చిన ప్రతిభాశాలిగా ప్రసిద్ధిగాంచారు. 1926 జూలై 9న తూర్పుగోదావరి జిల్లా తాటిపాకలో జన్మించిన బోళ్ల.. ఆంధ్రా యూనివర్శిటీ నుంచి షుగర్ టెక్నాలజీలో బీఎస్సీ ఆనర్స్, కెమికల్ టెక్నాలజీలో ఎంఎస్సీ పట్టా సాధించారు. అనంతరం అమెరికాలో ఎంఎస్సీ కెమికల్ ఇంజనీరింగ్ పూర్తి చేశారు. 1984, 91, 96, 99లో ఏలూరు నుంచి టీడీపీ తరఫున ఎంపీగా ఎన్నికయ్యారు. 1996– 98 మధ్య కేంద్ర వాణిజ్య సహాయ మంత్రిగా పనిచేశారు.

సీఎం చంద్రబాబు నివాళి: బులిరామయ్య మృతికి సీఎం చంద్రబాబు ప్రగాఢ సంతాపం తెలిపారు. అమరావతి నుంచి ప్రత్యేక హెలికాప్టర్‌లో తణుకు చేరుకుని బోళ్ల భౌతికకాయాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. టీడీపీ అభివృద్ధికి ఎంతో కృషి చేసిన బోళ్ల మృతి తీరని లోటన్నారు. మంత్రులు కామినేని, మాణిక్యాలరావు, కె.ఎస్.జవహర్, ఎంపీ గంగరాజు, ఎమ్మెల్సీ కరణం బలరాం, మాజీ ఎంపీ కావూరి, ఎమ్మెల్యేలు బులిరామయ్య భౌతికకాయానికి నివాళులు అర్పించారు.

కాకినాడ, తిరుపతికి ప్రత్యేక రైళ్లు

సాక్షి, హైదరాబాద్: రద్దీ దృష్ట్యా హైదరాబాద్–కాకినాడ, హైదరాబాద్–తిరుపతి మధ్య ప్రత్యేక రైళ్లు నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్వో ఎం.ఉమాశంకర్ కుమార్ తెలిపారు. హైదరాబాద్–కాకినాడ (07075/07076) ప్రత్యేక రైలు ఈ నెల 16న సాయంత్రం 6.50కి నాంపల్లి నుంచి బయలుదేరి మరుసటి రోజు ఉదయం 5.30కు కాకినాడ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో ఈ నెల 18న సాయంత్రం 6.10కి కాకినాడ నుంచి బయలుదేరి మరుసటి రోజు ఉదయం 6.50కి నాంపల్లి చేరుకుంటుంది. హైదరాబాద్–తిరుపతి (02734/02733) ప్రత్యేక రైలు ఈ నెల 16న సాయంత్రం 6.50కి నాంపల్లి నుంచి బయలుదేరి మరుసటి రోజు ఉదయం 8.50కి తిరుపతి చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో 18న సాయంత్రం 5.00కి తిరుపతి నుంచి బయలుదేరి మరుసటి రోజు ఉదయం 5 గంటలకు నాంపల్లి చేరుకుంటుంది.

23న భారత్ దర్శన్ యాత్ర ప్రత్యేక రైలు

రైల్వేస్టేషన్ (విజయవాడ పశ్చిమ): యాత్రికుల కోసం ఈ నెల 23వ తేదీన భారత్ దర్శన్ యాత్రా ప్రత్యేక రైలు నడపనున్నట్టు ఐఆర్‌సీటీసీ ప్రాంతీయ అధికారి మధుసూదనరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ప్రత్యేక రైలులో అజంతా, ఎల్లోరా గుహలు, ఔరంగాబాద్, షిర్డిసాయి నగర్, త్రయింబకేశ్, నాసిక్ ప్రదేశాలు సందర్శించవచ్చన్నారు. వివరాలకు 9701360675 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.



సాక్షి
గురువారం, ఫిబ్రవరి, 15

ఎన్నారై భర్తలపై కొరడా

విదేశాల్లో ఉద్యోగం.. లక్షల్లో జీతం... అక్కడ సొంత ఇల్లు, సొంత కారు–ఇలాంటి ఆకర్షణీయమైన కబుర్లు చెప్పి పెళ్లాడి, తీరా వెళ్లాక భార్యను శారీరకంగా, మానసికంగా కష్టపెడుతున్న ప్రవాస భారతీయ (ఎన్నారై) యువకుల భరతం పట్టేందుకు భారతీయ శిక్షాస్మృతి(సీఆర్‌పీసీ)లో అవసరమైన నిబంధనలు చేర్చాలని కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం హర్షించదగింది. పెళ్లి చేసుకుని దేశంగాని దేశానికి కొత్తగా వెళ్లిన యువతులు అనుభవిస్తున్న కష్టాల గురించి దశాబ్దాలుగా మీడియాలో కథనాలు వెలువడుతున్నాయి. అంతక్రితం కలిగిన కుటుంబాలకే ఇలాంటి సమస్యలుండేవి. కానీ 90వ దశకం తర్వాత విదేశాల్లో లక్షలమందికి సాఫ్ట్‌వేర్ రంగ నిపుణులుగా ఉద్యోగావకాశాలు లభించడం పర్యవసానంగా మధ్య తరగతి ప్రజానీకాన్ని కూడా ఆ సమస్యలు తాకాయి. విదేశీ సంబంధమని మోజు పడి పెళ్లి చేసి పంపితే అక్కడ బాధల్లో కూరుకుపోతున్న కుమార్తెల విషయంలో ఏం చేయాలో తోచక వేలాదిమంది తల్లిదండ్రులు కుమిలిపోతున్నారు. యువతుల్ని చిత్రహింసలపాలు చేయడం అర్థాంతరంగా వెళ్లగొట్టడం రివాజైంది. మరికొందరు ఘనులు పెళ్లాడి ముచ్చట్లన్నీ తీర్చుకుని, కట్న కానుకలతో విదేశాలకు పోయి అక్కడినుంచి విడాకుల నోటీసులు పంపుతున్నారు. ఎన్నారైలకు ప్రాతినిధ్య ఓటింగ్ హక్కు కల్పించడానికి చాన్నాళ్లనుంచి మన ప్రభుత్వాలు కసరత్తు చేస్తున్నాయి. కానీ ఇలాంటి మహిళల ఇబ్బందులపై ఈ స్థాయిలో దృష్టి పెట్టడం లేదన్న విమర్శలున్నాయి. తాజా నిర్ణయంతో ఆ లోటు సరిదిద్దినట్టవుతుంది. మన విదేశాంగశాఖ వెల్లడించిన గణాంకాలు విస్మయం కలిగిస్తాయి. 2015 జనవరి మొదలుకొని నిరుడు నవంబర్ వరకూ ఆ శాఖకు 3,328 ఫిర్యాదులందాయి. వాటి ఆధారంగా ప్రతి 8 గంటలకూ ఒక ఫిర్యాదు వస్తున్నదని ఆ శాఖ వివరించింది. అంటే రోజుకు మూడు ఫిర్యాదులందుతున్నాయన్న మాట. అయితే బాధిత మహిళల అసలు సంఖ్య ఇంతకు ఎన్నో రెట్లు ఎక్కువుంటుంది. అన్ని దారులూ మూసుకుపోయాకే ఏ యువతి అయినా ఫిర్యాదు చేయడానికి ముందుకొస్తుంది. నిందితుల్లో 60 శాతం మంది యువకులని ఆ గణాంకాలు చెబుతున్నాయి.

వివిధ రంగాల్లో ఎంతగా పురోగతి సాధించామనుకుంటున్నా మన దేశంలో మహిళలపై వేర్వేరు రూపాల్లో వివక్ష, అసమానతలు కొనసాగుతూనే ఉన్నాయి. విదేశాలకు పోయే యువకులు తమతోపాటు ఈ కశ్మలాన్నంతటినీ మోసుకుపోతున్నారు. కుటుంబాల్లో యధావిధిగా తమ ఆధిపత్య ధోరణులను ప్రదర్శిస్తున్నారు. ఇక్కడిలాగే మన సంప్రదాయాలు, కట్టుబాట్లు ఆ దేశాల్లో సైతం మన మహిళలకు అవరోధంగా మారుతున్నాయి. వీటిని ధిక్కరించి ఫిర్యాదు చేద్దామనుకున్నా ఎక్కడికెళ్లాలో, ఎలా వెళ్లాలో, ఎవరితో మాట్లాడాలో, ఏం మాట్లాడాలో తెలియని అయోమయ స్థితి. కొత్తగా కాపురానికెళ్లినవారికి ఇవన్నీ పెను అవరోధాలవుతున్నాయి. వీటిని అధిగమించి ఫిర్యాదు చేసినా అక్కడి పోలీస్ అధికారులకు సమస్యేమిటో అవగాహన కావడం కష్టమవుతోంది. భర్తతో సమానంగా ఉద్యోగం చేసే మహిళ పరిస్థితి ఎంతో కొంత మెరుగు. ఆమె స్వతంత్రంగా జీవనం సాగిస్తూ సమస్యలపై పోరాడగలదు. కానీ హెచ్ 4 వీసాపై అమెరికాలో ఉంటున్న ఆడపిల్లలది దుర్భర స్థితి. వారు తప్పనిసరిగా భర్త సంపాదనపైనే ఆధారపడాలి. ఇక్కడ పెళ్లాడటం, అక్కడికెళ్లాక ఆ దేశాల్లోని విడాకుల చట్టం ప్రకారం వదుల్చుకోవడం ఈమధ్యకాలంలో బాగా పెరిగింది. అక్కడేం చేసినా అడిగే దిక్కుండదు... అత్తింటివారికి తెలియకుండా భారత్ వచ్చి దర్జాగా తిరిగి వెళ్లొచ్చునన్న భరోసా ఎన్నారై యువకుల్లో ఉంటున్నది. సీఆర్‌పీసీలో మార్పులు తీసుకురావాలన్న తాజా నిర్ణయం వల్ల ఇకపై ఇది అసాధ్యమవుతుంది.

ప్రతిపాదిత నిబంధనల ప్రకారం భార్యలను విడిచిపెట్టిన కేసుల్లో న్యాయస్థానాలు జారీ చేసే సమన్లను వరసగా మూడుసార్లు బేఖాతరు చేసినట్టయితే అలాంటివారిని 'పరారీలో ఉన్న వ్యక్తులు'గా పరిగణించి వారి ఆస్తుల్ని, వారి తల్లిదండ్రుల ఆస్తుల్ని స్వాధీనం చేసుకునేందుకు న్యాయస్థానాలు ఆదేశాలివ్వొచ్చు. దీంతోపాటు విదేశాంగ శాఖ వెబ్‌సైట్‌లో పెట్టే సమన్లకు చట్టబద్ధత కల్పించడానికి అనువుగా సీఆర్‌పీసీ నిబంధనలను సవరించాలని కేంద్ర హోం శాఖను విదేశాంగ శాఖ కోరింది. ఇది కూడా ఆహ్వానించదగ్గ మార్పు. సమన్లు తీసుకోవడానికి నిరాకరించినవారి ఇంటి తలుపుపైనో, గోడపైనో ఆ సమన్లను అతికిస్తే చట్టం దృష్టిలో ఆ సమన్లు వారికి అందినట్టే. ఇప్పుడు వెబ్‌సైట్‌లో ఉంచే నోటీసులకు కూడా ఇదే సూత్రం వర్తింపజేయడం మంచి ఆలోచన. అలా మూడుసార్లు వెబ్‌సైట్‌లో పెట్టాక నిందితుల ఆస్తుల స్వాధీనం ప్రక్రియ మొదలవుతుంది.

చూడటానికిది మొత్తంగా 'ఎన్నారై వధువుల' సమస్యేగానీ ఇందులో ఒక్కొక్కరిది ఒక్కో వ్యథ. కేవలం భార్య ద్వారా సంక్రమించే ఆస్తిపై కన్నేసి కొందరు, ఇంట్లో ఉండే వృద్ధ తల్లిదండ్రుల అవసరాలు చూసుకోవడానికి ఇంకొందరు, జీతం ఇవ్వనవసరం లేని పనిమనిషిగా భావించి మరికొందరు యువతుల్ని పెళ్లి చేసుకుంటున్నారు. పంజాబ్ నుంచి అయ్యే పెళ్లిళ్లలో 80 శాతం ఈ బాపతేనని గణాంకాలు చెబుతున్నాయి. ఆ తర్వాత స్థానాల్లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, గుజరాత్ రాష్ట్రాలున్నాయి. పెళ్లిళ్ల రిజిస్ట్రేషన్ తప్పనిసరి చేయడం, గృహహింసకు పాల్పడేవారిని, భార్యల్ని విడిచిపెట్టేవారిని అప్పగించేందుకు విదేశాలతో నేరస్తుల అప్పగింత ఒప్పందాలు కుదుర్చుకోవడం, ఇలాంటి ఫిర్యాదులను స్వీకరించడానికి జాతీయ స్థాయి యంత్రాంగాన్ని ఏర్పాటుచేయడం, అందుకొక ప్రత్యేక వెబ్‌సైట్ పెట్టడం వంటి చర్యలు కూడా చాలా అవసరం. సంబంధం కుదుర్చుకోవడానికి ముందు అవతలి వ్యక్తి ఇచ్చిన సమాచారంలోని నిజానిజాలేమిటో నిర్ధారించుకోవడం అవసరమన్న చైతన్యం అమ్మాయిల తల్లిదండ్రుల్లో కలగజేయడం అన్నిటికన్నా ముఖ్యం. ఇవన్నీ సాకారమైనప్పుడే పెళ్లి చేసి పంపిన మన ఆడపిల్లలు విదేశాల్లో క్షేమంగా, హుందాగా, గౌరవప్రదంగా బతకగలుగుతారు.



"మహిళలపై హింస, వివక్షలను అత్యంత అవమానకరమైన మానవ హక్కుల ఉల్లంఘనగా గుర్తించకుంటే వాటిపై ఏ చర్యలూ తీసుకోలేం."

– నికోల్ కిడ్‌మన్
ఆస్ట్రేలియన్ నటి, గాయని

గ్రహం అనుగ్రహం

శ్రీ హేవిళంబి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు మాఘ మాసం, తిథి అమావాస్య రా.2.02 వరకు, తదుపరి ఫాల్గుణ శు.పాడ్యమి నక్షత్రం శ్రవణం ఉ.7.28 వరకు, తదుపరి ధనిష్ఠ, వర్జ్యం ప.11.44 నుంచి 1.26 వరకు, దుర్ముహూర్తం ఉ.10.18 నుంచి 11.04 వరకు, తదుపరి ప.2.53 నుంచి 3.40 వరకు, అమృతఘడియలు రా.9.58 నుంచి 11.40 వరకు.

సూర్యోదయం : 6.31
సూర్యాస్తమయం : 5.57
రాహుకాలం : ప 1.30 నుంచి 3.00 వరకు
యమగండం : ఉ.6.00 నుంచి 7.30 వరకు

నమాజ్ వేళలు

ఫజర్	5.30	మగ్రీబ్	6.18
జొహర్	12.30	ఇషా	7.31
అసర్	4.41		

వాణిజ్య బంధంతో ముందడుగు!



కెన్నెత్ ఐ. జస్టర్

ఆవిష్కరణలు ఒక దేశ ఆర్థిక వ్యవస్థపై చూపే కీలకమైన, సానుకూల ప్రభావం ఎలాంటిదో హైదరాబాద్‌లో ఈ మధ్యే జరిగిన ప్రపంచ పారిశ్రామికవేత్తల సదస్సులో మనం చూశాం. భారత్ మార్కెట్‌ను అమెరికా వ్యాపార, వాణిజ్యం కోసం విస్తరించడం వల్ల మన రెండు ఆర్థిక వ్యవస్థలను కాపాడగలిగే అధునాతన సాంకేతికతలను అందిపుచ్చుకోవచ్చు. అమెరికన్ సంస్థల వద్ద ఉన్న వినూత్న సాంకేతికతలు భారత్ అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న 100 స్మార్ట్ నగరాల ప్రాజెక్టుకు ఎంతగానో ఉపయోగపడతాయి.

అమెరికా– భారత్ మధ్య భాగస్వామ్యం అన్ని అంతర్జాతీయ వ్యవహారాల మాదిరిగానే పరిణామాత్మకమైంది. ఈ వ్యూహాత్మక భాగస్వామ్యం మన దేశాలను పటిష్టం చేయడంతో పాటు ఇండో–పసిఫిక్ ప్రాంతంపై ప్రయోజనకరమైన ప్రభావం చూపుతుంది. గత పదిహేడు సంవత్సరాల కాలంలో మన దేశాల మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యానికి బలమైన పునాది వేశాం. ఇది ఈ 21వ శతాబ్దంలో మాత్రమే కాదు, తదనంతర కాలంపై కూడా సానుకూల ప్రభావం చూపుతుంది. ఈ బలమైన పునాదిపై మరింత నిర్మాణం చేయాల్సి ఉంది. మనకు ఎదురవుతున్న సవాళ్లను అధిగమించి ఈ ప్రాంత సుస్థిర నిర్మాణం కోసం కృషి చేయాలి.

అమెరికా – భారత్ మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత పటిష్టంగా మలచాల్సిన అవసరం ఉంది. మనందరి ప్రయోజనం కోసం స్వేచ్ఛాయుతమైన, సురక్షితమైన ప్రాంతంగా ఇండో–పసిఫిక్ ప్రాంతం ఉండాలనే అమెరికా దీర్ఘకాలిక నిబద్ధత వలన ఈ ప్రాంతంలో సుస్థిరత ఏర్పడి, గణనీయ స్థాయిలో వాణిజ్య ఎదుగుదలకు దోహదపడుతుంది.

మనందరి భవిష్యత్తు ఇండో–పసిఫిక్ ప్రాంత అభివృద్ధితో విడదీయలేని విధంగా ముడిపడి ఉన్నందువల్ల ఈ ప్రాంత స్థిరత్వానికి అమెరికా కట్టుబడి ఉంది. అంతర్జాతీయంగా అందరికీ వర్తించే నియమాలకు మనందరం కట్టుబడుతున్నాము. ఒక దృఢమైన నమ్మకంతో భాగస్వాములుగా ఎదుగుతున్నాం. అమెరికా విదేశాంగమంత్రి టిల్లెర్ సన్ మాటల్లో చెప్పాలంటే, అవ్యవస్థత, సంఘర్షణ, దోపిడీ ఆర్థిక విధానాల స్థానంలో ఇండో–పసిఫిక్ ప్రాంతాన్ని ఒక శాంతియుతమైన, సుస్థిరమైన, సంపద్వంతమైన ప్రాంతంగా ఎదిగించేందుకు, ఒక ప్రాంతీయ నిర్మాణ చట్రంపై భావసారూప్యం కలిగిన దేశాలన్నీ కృషి చేయడంలో భాగంగా ఈ ప్రాంత వాణిజ్యంలో భారత్ నాయకత్వాన్ని మేము మనస్ఫూర్తిగా స్వాగతిస్తున్నాం.

రక్షణ రంగంలో పూర్తి సహకారం

రక్షణ, ఉగ్రవాద నిరోధంపై మన దేశాల మధ్య సహకారం అతి ముఖ్యమైనది. అమెరికా రక్షణ సంస్థలు ఇప్పటికే ఇండియాలో పెట్టుబడులు పెట్టి అత్యంత కీలకమైన రక్షణ వ్యవస్థల కోసం విడిభాగాలు తయారు చేస్తున్నాయి. దేశీయంగా రక్షణ సామర్థ్యాలు పెంచుకునేందుకు భారత్ చేస్తున్న ప్రయత్నాలకు మేము మద్దతునిస్తాం. ప్రధాన రక్షణ భాగస్వాములుగా, ఇండో–పసిఫిక్ ప్రాంతంలో ప్రస్తుత క్లిష్ట పరిస్థితుల్లో మన రెండు దేశాల సేనల సామర్థ్యాన్ని పరస్పర సహకారంతో వినియోగించుకోవడాన్ని మరింతగా విస్తరింపచేసేందుకు కృషి చేస్తాం.

మన రక్షణ రంగ భాగస్వామ్యం లాగానే మన దేశాల మధ్య ఉన్న



వాణిజ్య భాగస్వామ్యంపై కూడా దృష్టి పెట్టాలి. చైనాలో పెట్టుబడులు పెట్టేందుకు, వ్యాపారం చేసేందుకు ఉన్న అడ్డంకుల గురించి అనేక అమెరికన్ సంస్థలు విచారం వ్యక్తం చేస్తున్నాయి. కొన్ని సంస్థలు ఇప్పటికే తమ కార్యకలాపాలు తగ్గించుకుంటే, మరికొన్ని సంస్థలు ప్రత్యామ్నాయ మార్కెట్లపై దృష్టి పెట్టాయి. ఇండియా ఈ వ్యూహాత్మక అవకాశాన్ని ఉపయోగించుకొని, ఇండో–పసిఫిక్ ప్రాంతంలో అమెరికన్ సంస్థల పెట్టుబడులు, వాణిజ్యానికి ప్రత్యామ్నాయ కేంద్రంగా ఎదగాలి.

స్వేచ్ఛ, న్యాయమైన వాణిజ్యం అనేవి ప్రధాని మోదీ ఆకాంక్షిస్తున్న భారత్ దీర్ఘకాలిక వృద్ధికి ఉపయోగపడుతాయి. మోదీ ప్రకటించిన 'మేక్ ఇన్ ఇండియా', అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రతి పాదించిన 'అమెరికా ఫస్ట్' అనేవి పరస్పరం విరుద్ధమైనవి కావు. పైగా, రెండు దేశాలు ఇతర మార్కెట్లలో పెట్టుబడులు పెట్టడం వలన మన వ్యాపార సంబంధాలు పెరగడంతో పాటు అభివృద్ధి చెందుతున్న సాంకేతికతల్లో సహకారం, ఉద్యోగాల కల్పనలో పరస్పరం సహకరించుకోవచ్చు.

ప్రధాని నరేంద్ర మోదీ మొదలుపెట్టిన ఆర్థిక సంస్కరణ ప్రక్రియల వలన భారత్ ఒక సమర్థవంతమైన, పారదర్శక మార్కెట్‌గా అవతరిస్తోంది. ఈ సంస్కరణలు, వాణిజ్య సరళీకరణ వల్ల భారతీయ వస్తువులు ప్రపంచ విపణిలో మరింత విస్తృతంగా దొరుకుతాయి. ఇది మరిన్ని ఉద్యోగాల కల్పనకు దారి తీస్తుంది.

స్మార్ట్ నగరాలకు సాంకేతిక సొబగులు

మన రెండు దేశాల మధ్య ద్వైపాక్షిక వాణిజ్య భాగస్వామ్యం వల్ల, భారత్ ఒక ప్రాంతీయ కేంద్రంగా అవతరించడం వల్ల ఎన్నో లాభాలున్నాయి. ఆవిష్కరణలు ఒక దేశ ఆర్థిక వ్యవస్థపై చూపే కీలకమైన, సానుకూల ప్రభావం ఎలాంటిదో హైదరాబాద్‌లో ఈ మధ్యే జరిగిన ప్రపంచ పారిశ్రామికవేత్తల సదస్సులో మనం చూశాం. వ్యవస్థాపకత, ఆవిష్కరణ రంగాల్లో అమెరికా అగ్రగామిగా ఉంటోంది. టెక్నాలజీ రంగంలో అమెరికా ఇప్పటికే భారత్‌తో విస్తృతమైన సంబంధాలు ఏర్పరచుకుంది.

భారత్ మార్కెట్‌ను అమెరికా వ్యాపార, వాణిజ్యం కోసం విస్తరించడం వల్ల మన రెండు ఆర్థిక వ్యవస్థలను కాపాడగలిగే అధునాతన సాంకేతికతలను– ప్రత్యేకించి ఆధునిక తయారీ, సైబర్ భద్రతా రంగాల్లో అందిపుచ్చుకోవచ్చు. పెరిగిన అమెరికా వాణిజ్యం, పెట్టుబడుల వల్ల మరిన్ని పెట్టుబడులు, మేధో జ్ఞాన రంగాల్లో భాగస్వామ్యం పెరుగుతుంది. సాంకేతికతలో వస్తున్న వేగవంతమైన మార్పులను అందిపుచ్చుకోవడానికి దేశాల మధ్య ప్రతిబంధకాలు లేని వ్యాపార, డేటా ప్రవాహం ఉండాలి.

అమెరికాలో తయారయ్యే వస్తువులను భారత్‌లో మరింతగా అందుబాటులోకి తీసుకురావడం, అమెరికన్ సంస్థల ఉనికి దేశంలో మరింత విస్తరించడం వల్ల ప్రైవేట్ రంగంలో పెట్టుబడులు గణనీయంగా పెరుగుతాయి. వీటి వల్ల మౌలిక వసతులు, కనెక్టివిటీ కూడా మెరుగవుతాయి. ఉదాహరణకి అమెరికన్ సంస్థల వద్ద ఉన్న వినూత్న సాంకేతికతలు భారత్ అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న 100 స్మార్ట్ నగరాల ప్రాజెక్టుకు ఎంతగానో ఉపయోగపడతాయి.

ముడి చమురు నుంచి ఇంధన భద్రతదాకా..

ఇంధన రంగంలో కూడా మన దేశాలు సహకరించుకోవచ్చు. భారత్–అమెరికా ఒక సమగ్రమైన భాగస్వామ్యాన్ని ఏర్పరచుకోగలవు. బొగ్గు, ముడి చమురు, సహజ వాయువు, అణు విద్యుత్ వంటి అన్ని రకాల ఇంధన సంబంధిత రంగాల్లో సహకరించుకోవచ్చు. అంతేకాకుండా శిలాజ ఇంధనాలు, స్మార్ట్ గ్రిడ్లు, ఇంధన నిల్వలు, పునరుత్పాదక వనరులు వంటి వాటికి సంబంధించి టెక్నాలజీ విషయంలో కూడా సహకరించుకోవచ్చు.

గత సంవత్సరం అమెరికా తొలి ముడి చమురును భారత్‌కి ఎగుమతి చేసింది. దేశీయ ఇంధన వనరులను అభివృద్ధి చేసుకుని, ఇంధన భద్రతను పెంపొందించుకోవడానికి భారత్ చేస్తున్న ప్రయత్నాలకు అవసరమైన మద్దతు సేవలు, మౌలిక వసతులు, సాంకేతిక జ్ఞానాన్ని అందించడంలో కూడా అమెరికా తన సహాయం తప్పకుండా అందించగలదు.

భారత్– అమెరికా వ్యాపార సంబంధాలు మరింత బలపడడం వల్ల ఇండియా పట్ల, ఇండో–పసిఫిక్ ప్రాంతం పట్ల అమెరికా మరింత దీర్ఘకాలిక నిబద్ధతను కలిగి ఉంటుంది. దీని వల్ల మన రక్షణ, ఉగ్రవాద నిరోధక భాగస్వామ్యం మరింత బలపడుతుంది. మన విధానాల్లో ఏమైనా తేడాలుంటే చక్కదిద్దుకునే అవకాశం కూడా ఉంటుంది.

నిరంతరం మారుతూ ఉండే ఈ కల్లోల ప్రపంచంలో భారత్–అమెరికా దేశాల భాగస్వామ్యం స్థిరమైనది. స్వాతంత్ర్యం, సార్వభౌమత్వం మన రెండు దేశాలకు ఎంతో విలువైనవి. పరస్పర భాగస్వామ్యంతో మనం ముందుకెళితే అది ప్రపంచంపై అనుకూల ప్రభావం కూడా చూపుతుంది. మన ప్రజానీకం భద్రత, శ్రేయస్సు గురించిన ఆకాంక్షలు కూడా నెరవేరతాయి.

వ్యాసకర్త భారత్‌లో అమెరికా రాయబారి

ఆకాంక్షల జెండా అస్మా

అస్మా పాకిస్తాన్‌లోనే కాదు ప్రపంచంలోని అనేక దేశాల్లో జరుగుతున్న మానవ హక్కుల ఉల్లంఘనపై ఎన్నో నివేదికలను రూపొందించారు. ఐక్యరాజ్యసమితి ప్రత్యేక ప్రతినిధిగా ఆమె ఇరాన్, భారతదేశం లాంటి చోట్ల జరుగుతున్న మత అసహనాన్ని నిగ్గదీశారు.



మల్లెపల్లి లక్ష్మయ్య

"అనుభవాల నుంచి మనమెప్పుడూ సరైన పాఠాలు నేర్చుకోం. సమస్యల మూలాలను తెలుసుకోం. మనం మతాలని రాజకీయం చేయాలని చూస్తే, అది సృష్టించే మంటల్లో పడి మాడి మసైపోతాం!" మహా మేధావి, పాకిస్తాన్ మానవ హక్కుల నాయకురాలు అస్మా జహంగీర్ ప్రపంచానికి చేసిన హెచ్చరిక ఇది. అస్మా జహంగీర్ పాకిస్తాన్‌లో పుట్టి పెరిగారు. ప్రపంచంలో మృగ్యమవుతున్న మానవహక్కుల కోసం ప్రాణాలను తృణప్రాయంగా భావించి, జీవితాంతం అలుపెరుగని పోరాటం చేసిన గొప్ప యోధురాలు. మానవహక్కులే ఉచ్ఛ్వాస నిశ్వాసలుగా బతి కిన అస్మా ఇటీవల లాహోర్‌లో గుండెపోటుతో మరణించారు.

అస్మా జహంగీర్ పేరు వినగానే హక్కుల పతాక రెపరెపలు స్ఫురణలోకి వస్తాయి. అస్మా చేసిన కృషిని గుర్తించి ఎన్నో అవార్డులు ఆమె తలుపు తట్టాయి. రామన్ మెగసెసె అవార్డు, నోబెల్ బహుమతికి ప్రత్యామ్నాయమైన 'లైవ్లీ హుడ్ అవార్డు' కూడా దక్కాయి. అవార్డుల కన్నా మిన్నగా అస్మా దృఢ దీక్ష కారణంగా పాక్ ప్రజల ప్రజాస్వామ్య ఆకాంక్షల జెండా గగనతలంపై రెపరెపలాడడమే కాదు, ప్రపంచ హక్కుల కరదీపికైంది.

అస్మా జహంగీర్ పూర్తిపేరు అస్మా జిలానీ జహంగీర్. 1952, జనవరి 27న లాహోర్‌లో జన్మించారు. తండ్రి మాలిక్ గులాం జిలానీ ప్రభుత్వోద్యోగిగా పనిచేసి, పదవీ విరమణానంతరం రాజకీయాల్లోకి వచ్చారు. పార్లమెంటు సభ్యునిగా కొనసాగిన జిలానీ 1972లో జుల్ఫికర్ విధించిన మిలిటరీ పాలనను వ్యతిరేకించారు. అందుకు గులాం జిలానీని నాటి ప్రభుత్వం నిర్బంధించి కారాగారానికి పంపించింది. మానవహక్కుల పట్ల అస్మాలో కనిపించే అలాంటి దృఢ సంకల్పానికి తండ్రి జిలానీ చూపిన మార్గమే స్ఫూర్తిగా నిలిచింది. ఆమె మొదటి పోరాటం తండ్రి నిర్బంధాన్ని సవాల్ చేయడంతోనే ఆరంభమైంది.

అస్మా లాహోర్‌లోని కిన్నెర్డ్ కళాశాల నుంచి డిగ్రీనీ, పంజాబ్ విశ్వవిద్యాలయం నుంచి 1978లో ఎల్ఎల్‌బి పట్టానూ పొందారు. న్యాయవాద వృత్తిని ప్రారంభించిన ఒక సంవత్సరానికే 1983లో ప్రజాస్వామ్య ఉద్యమంలో క్రియాశీలకమైన కార్యకర్తగా అవతరించి, కీలక పాత్రను నిర్వహించారు. అప్పటి జియా ఉల్ హక్ ప్రభుత్వం ఆమెను అరెస్టు చేసి, కారాగారానికి పంపించింది. తరువాత అస్మా 1986లో జెనీవాలోని అంతర్జాతీయ బాలల రక్షణ విభాగానికి వైస్ చైర్‌పర్సన్‌గా నియమితులయ్యారు. 1988లో మళ్లీ స్వదేశానికి తిరిగి వచ్చారు. జెనీవాలో ఉన్న సమయంలోనే 1987లో పాకిస్తాన్ ప్రభుత్వం మానవహక్కుల కమిషన్‌ను ఏర్పాటు చేసింది. అప్పటి నుంచి అస్మా తన హక్కుల పోరాటానికి విరామం ఇవ్వలేదు.

ఆమె పోరాటం అనేక అంశాలపై కొనసాగింది. ముఖ్యంగా ముస్లిం మహిళల సమస్యలు, రాజకీయ హక్కులు, మైనారిటీ మతాలపై వివక్ష, వేధింపులు, హత్యాకాండలపై నిరంతరం జహంగీర్ గళం విప్పారు. 2007 నవంబర్‌లో ఎమర్జెన్సీ విధించిన వెంటనే అస్మా జహంగీర్‌ను గృహ నిర్బంధంలో ఉంచారు. 2012 సంవత్సరంలో ఆమెను హత్య చేయడానికి పాకిస్తాన్ ఇంటెలిజెన్స్ వర్గాలు చేస్తున్న కుట్రలు బయటకు పొక్కడంతో ప్రపంచమంతా అస్మాకు అండగా నిలిచింది. అయినా ఆమె ఎప్పుడూ చావుకు భయపడలేదు. అక్కడే కాదు ఎక్కడైనా హక్కులను గురించి మాట్లాడ్డమంటే ప్రాణాలకు తెగించడమనే అర్థం.

పాకిస్తాన్‌లో దైవదూషణ తీవ్రమైన నేరం. దానికి శిక్ష మరణ దండన. ఇటువంటి కేసుల్లో న్యాయవాదులెవ్వరూ నిందితులకు మద్దతుగా నిలబడరు. కానీ అస్మా మాత్రం అటువంటి కేసులలో పోరాడి విజయం సాధించడం ప్రపంచాన్ని అబ్బురపరిచింది. 1993లో ఒక మసీదు గోడలపై దైవాన్ని దూషిస్తూ రాసారనే నేరారోపణతో సలామత్ మసయ, అతని తల్లిదండ్రుల మీద కేసు నమోదు చేశారు. క్రింది కోర్టు వారికి మరణశిక్ష విధించింది. ఆ కేసులో అస్మా జహంగీర్ లాహోర్ హైకోర్టులో వారి తరపున వాదించి 1993 ఫిబ్రవరి, 23వ తేదీన శిక్షను రద్దు చేయించడం



కొత్త కోణం

ఆమె సాహసానికి మచ్చుతునక.

ఒక దేశద్రోహం కేసు విషయంలో కూడా ఆమె చూపిన చొరవ విశేషమైనది. పాకిస్తాన్‌కు వ్యతిరేకంగా వ్యాఖ్యలు చేశారని ఆరోపిస్తూ ఎం.క్యూ.ఎం పార్టీ నాయకులు అల్తాఫ్ హుస్సేన్ మీద దేశద్రోహం కేసు నమోదు చేశారు. ఎలక్ట్రానిక్ మీడియాతో సహ అన్ని పత్రికలు, చానళ్లు అల్తాఫ్‌ను బహిష్కరించాయి. న్యాయవాదులెవ్వరూ కూడా ఆ కేసులో వాదించడానికి ముందుకు రాలేదు. కానీ అస్మా ఒక్కరే, ఒక్కరంటే ఒక్కరే నిలబడి భావప్రకటనా స్వేచ్ఛాపతాకాన్ని ఎగురవేసారు. అందుకుగాను ఆమె ఇంటిని సైతం పూర్తిగా ధ్వంసం చేశారు. ఆమెపై భౌతిక దాడికి ఒడిగట్టారు. కానీ ఆమె హక్కుల పోరాటాన్ని కొనసాగించారే తప్ప వెనకడుగువేయ లేదు.

పాకిస్తాన్‌లో 1978లో జియా ఉల్ హక్ మిలిటరీ పాలనలో అనేక కొత్త చట్టాలు వచ్చాయి. హుదూద్ పేరుతో ఉన్న ఈ చట్టంలో ఖురాన్ నుంచి తీసుకున్న అనేక అంశాలపై ఆధారపడి శిక్షలు నిర్ణయించినట్టు పేర్కొన్నారు. ఇందులో ముస్లిం మహిళల విషయంలో అనుసరించిన వైఖరిని అస్మా జహంగీర్ సహించలేకపోయారు. ఒక అమ్మాయి వివాహం చేసుకోవడానికి తండ్రితో సహా ఎవరైనా పురుష సంరక్షకుల అనుమతి కావాలి. ఒకవేళ యువతులెవరైనా దీనిని ఉల్లంఘిస్తే చట్ట ప్రకారమే కాదు, కుటుంబ సభ్యులే ఆ యువతులను చంపేసే సంప్రదాయం ఉన్నది. వీటిని భారతదేశంలో జరుగుతోన్న పరువు హత్యలతో పోల్చవచ్చు. దీని మీద అస్మా జరిపిన పోరాటం గొప్ప ఫలితాలను సాధించింది. ఉన్నత న్యాయస్థానం నుంచి న్యాయమైన తీర్పును పొందింది. అంతేకాకుండా పరువు పేరుతో యువతులను హతమార్చిన వాళ్లు ఇస్లామిక్ సంప్రదాయం పేరుతో శిక్షల నుంచి తప్పించుకునేవారు. కానీ అస్మా జహంగీర్ న్యాయస్థానాల్లో జరిపిన పోరాటం అనేక మంది నేరస్తులకు శిక్షలు విధించేటట్టు చేసింది. ఇందుకుగాను ప్రభుత్వం కొత్త చట్టాలను రూపొందించవలసిన అవసరం కూడా ఏర్పడింది.


అస్మా జహంగీర్ పాకిస్తాన్‌లోనే కాదు ప్రపంచంలోని అనేక దేశాల్లో జరుగుతున్న మానవ హక్కుల ఉల్లంఘనపై ఎన్నో నివేదికలను రూపొందించారు. ఐక్యరాజ్యసమితి ప్రత్యేక ప్రతినిధిగా ఆమె ఇరాన్, భారతదేశం లాంటి చోట్ల జరుగుతున్న మత అసహనాన్ని నిగ్గదీశారు. మెజారిటీ మతాలు మైనారిటీలపై జరుపుతున్న వివక్ష, అణిచివేత, హింసలను ఆమె ఎలుగెత్తి చాటారు.

ఐక్యరాజ్యసమితికి చెందిన మానవహక్కుల విభాగం తరపున భారతదేశంలో మానవ హక్కుల నిర్లక్ష్యంపై కూడా అస్మా జహంగీర్ ఒక నివేదికను విడుదల చేశారు. 2009 జనవరి, 26న అది విడుదలయింది. భారతదేశంలో మానవ హక్కులు, పౌరహక్కులు, రాజకీయ, ఆర్థిక, సాంస్కృతిక హక్కులతో పాటు, డెవలప్‌మెంట్ రైట్స్ పైన కూడా 2008వ సంవత్సరం మార్చి 3 నుంచి 20 వరకు పర్యటించి ఎన్నో అంశాలను సేకరించారు. భారతదేశంలో మైనారిటీల హక్కులకు భంగం కలిగిస్తున్న అనేకానేక అంశాల పట్ల అస్మా జహంగీర్ ఆందోళన వెలిబుచ్చారు. 2006లో రూపొందించిన నూతన చట్టం ఇంకా ఆమోదం పొందక పోవడం పట్ల ఆమె అసంతృప్తిని వ్యక్తం చేశారు. ఆమె జీవితమంతా హక్కుల సాధన కోసమే వెచ్చించారు. నిజానికి అస్మా జీవితం, పోరాటం వేర్వేరు కావు. ఆమె జీవితమే పోరాటంగా బతికారు. భవిష్యత్ హక్కుల ఉద్యమాలకు వేగుచుక్కగా నిలిచారు.

వ్యాసకర్త సామాజిక విశ్లేషకులు । 97055 66213

ఆనందానికి ఆవలి గట్టు

ఆనందం ఒక దృక్పథం. అది సంస్కృతి, సంస్కారమూ, స్వభావమూ కలిసి ప్రసాదించే వారసత్వం. చదువుకుంటే వచ్చేది కాదు. స్వచ్ఛమైన, పరిశుభ్రమైన, పవిత్రమైన నేలలో కన్ను విప్పే పుష్పం.




గొల్లపూడి మారుతీరావు

మా ఇంట్లో ఓ వంట మనిషి పని చేస్తోంది. 50 సంవత్సరాలు. లోగడ ప్రముఖ సంగీత దర్శకులు కేవీ మహదేవన్ ఇంట్లో పని చేసేది. ఆమె భర్తకి అనారోగ్యం. పని చెయ్యలేడు. ఇద్దరు ఆడపిల్లలు. మా ఇంటి దగ్గర్నుంచి లోకల్ ట్రైన్‌లో నాలుగు స్టేషన్లు ప్రయాణం చేసి, పార్కు స్టేషన్ నుంచి 14 స్టేషన్లు దాటి ఇల్లు చేరుతుంది. ఇది గత 14 సంవత్సరాలుగా ఆమె దైనందిన జీవితం. ఎప్పుడైనా అడుగుతాను 'ఇంత శ్రమ ఇబ్బంది కాదా?' అని. ఆమె సమాధానం 'అనుకుంటే ఎలాగ సార్! ఇల్లు గడవాలి. పిల్లల్ని పెంచాలి'. ఆమె జీవితం ఆనందంగానే ఉంది. కారణం. ఆమె తన జీవిత లక్ష్యాన్ని తన పరిస్థితులకు కుదించుకుంది.

25 ఏళ్ల అమ్మాయి. పుట్టు గుడ్డి. పేరు వినూ. చిన్నప్పటినుంచీ జీవితంలో ఏనాటికయినా సివిల్ సర్వీసు చెయ్యాలని కలలుగన్నది. ఇప్పుడు భారతదేశంలో మొట్టమొదటి అంధురాలిగా ఐ.ఎఫ్.ఎస్. ఆఫీసరుగా సెలెక్టయింది. గుడ్డి, మూగ, చెముడు ఉన్న ఒక మహాద్భుతం– హెలెన్ కెల్లర్‌ని ఆమె ఉదహరించింది. 'జీవితంలో నేను అన్నీ చేయలేకపోవచ్చు. కానీ కొన్నయినా చెయ్యగలను'.

వీరందరూ జీవితాన్ని మెడబట్టుకు లొంగదీసి విజయాన్ని పరమావధిగా చేసుకుని ఆనందంగా ఉన్న జీవులు. వీరి జీవన రహస్యం స్వధర్మాన్ని గర్వంగా, చిత్తశుద్ధితో నిర్వహించడం. ఈ దేశంలో చాలామందికి 'స్వధర్మం' అంటే బూతు మాట. ఇందులో మతం ఉందా? దేవుడు ఉన్నాడా? బీజేపీ ఉందా? ఆర్.ఎస్.ఎస్. ఉందా? 'స్వధర్మం' అంటే నీ విధిని నీ ఆశయం మేరకి, శ్రద్ధగా నిర్వహించడం. అదీ– అదే– అంతే– ఆనందానికి దగ్గర తోవ.

జీవన కాలమ్



అమెరికాలో యేల్ విశ్వవిద్యాలయంలో ఆనందంగా జీవించడానికి కొత్త కోర్సుని ప్రారంభించారు. దాదాపు అన్ని డిపార్టుమెంటుల విద్యార్థులూ అటువేపు దూకారు. ప్రస్తుతం 1,182 మంది మేధావులయిన విద్యార్థులు ఇందులో ఉన్నారు. ఈ కోర్సు ఏం నేర్పుతుంది?మనిషి సంతోషంగా ఉండటం ఎలాగో నేర్పుతుంది. మనకి నవ్వొస్తుంది– 'ఇది ఒకరు నేర్పాల్సిన విషయమా?' అని. హైందవ జీవన విధానంలోనే ఈ 'అర' ఉంది.

మన ఖర్మ. మనం మనకి అక్కరలేని వేలంటైన్ డేలను దిగుమతి చేసుకుంటున్నాం. జనవరి 1న బారుల్లో తాగి తందనాలాడడాన్ని గొప్ప వినోదంగా నెత్తిన వేసుకుంటున్నాం. తల్లిదండ్రుల్ని అనాథ శరణాలయాలకి అప్పగించి మరిచిపోవడాన్ని అలవాటు చేసుకుంటున్నాం. మనం ఉగాదులు మరిచిపోయాం. సంక్రాంతి సంబరాలంటే చాలామందికి తెలీదు. మా తరంలో ఏ కుర్రాడూ ఆత్మహత్య చేసుకున్న ఉదంతం వినలేదు. గురువుని సాక్షాత్తూ దేవుడన్నాం. ఇప్పుడు ఓ కుర్రాడు తనని అదిలించిన కారణానికి టీచర్నే కాల్చి చంపాడు. ఆత్మహత్యలు చేసుకునే అమ్మాయిలూ, చదువుకొని అటకెక్కించి రాజకీయాలలో రొమ్ము విరుచుకునే ప్రబుద్ధులూ. ఇవి విదేశీయుల దరిద్రాలు. మనం కనీవినీ ఎరుగని అరాచకాలు. మనలో ఇప్పటికీ సత్య నాదెళ్లలూ, పుట్టుగుడ్డి వినూలు ఉన్నారు. సరైన దృక్పథాన్ని ఏర్పరచుకుంటే మనకి యేల్ విశ్వవిద్యాలయం కోర్సులు అక్కరలేదు.

ప్రపంచంలో ఏ సంస్కృతీ 'సర్వేజనా స్సుఖినోభవంతు' అనలేదు. ఓ మామూలు నేలబారు మనిషి ఆ మాట అని ఏం సాధిస్తాడు? బాబూ! అతను జనులందరినీ ఉద్ధరించలేకపోవచ్చు. కానీ అందరూ సుఖంగా ఉండాలన్న పాజిటివ్ ఆలోచన మొదట అతన్ని సుఖంగా ఉంచుతుంది. ఈ ఆశంస సమాజానికి కానక్కరలేదు. అది తన సంకల్పాన్ని ఆరోగ్యకరమైన స్థాయిలో ఉంచే Subjective తావీజు.


భగవద్గీతని మనం తప్ప చాలా దేశాలు క్షుణ్ణంగా అధ్యయనం చేస్తున్నాయి. అది దేవుడి పుస్తకం కాదు. ఆ రోజుల్లో దేవుడి రేపరు చుట్టి మన 'జీవన విధానాన్ని' సూచించే వాచకం. ఇందులో సూచించినవన్నీ చేయగలవాడు మహాత్ముడు. ఏ ఒక్కటయినా చేయగలిగినవాడు నిత్య సంతోషి. ఏమిటా పనులు?

అందరిపట్లా స్నేహ భావన, మిత్రత్వం, కరుణ, దేనిమీదా మమకారం లేకపోవడం, అహంకారాన్ని విడిచిపెట్టడం, సుఖాన్నీ, దుఃఖాన్నీ ఒకేలాగ చూడటం, ఓర్పు, సంతుష్టి కలవాడు (ఉదా: మా వంట మనిషి), దృఢ నిశ్చయం కలవాడు (వినూ అనే పుట్టు గుడ్డి)– ఇది నమూనా జాబితా (భగ. 12 అ.శ్లో. 13–14). ఇందులో మతమూ, శ్రీకృష్ణుడూ, హిందుత్వం లేదు.

యేల్ విశ్వవిద్యాలయం కోర్సు వారి దురదృష్టం. కనీసం వారు పోగొట్టుకున్నదేమిటో సంపాదించుకోవాలని తంటాలు పడుతున్నారు. వాళ్లు వదులుకోలేక ఇబ్బంది పడుతున్న వికారాల్ని దిగుమతి చేసుకుని మన విలువైన ఆస్తుల్ని చంపుకుంటున్నాం.

ఆనందం ఒక దృక్పథం. Happiness is an attitude ఒక మానసిక స్థితి. అది బయటినుంచి రాదు. సంస్కృతి, సంస్కారమూ, స్వభావమూ కలిసి ప్రసాదించే వారసత్వం. అది చదువుకుంటే వచ్చేది కాదు. స్వచ్ఛమైన, పరిశుభ్రమైన, పవిత్రమైన నేలలో కన్ను విప్పే పుష్పం. అదీ ఆనందం.

సాగు సంక్షోభంపై జాతీయ సదస్సు



ఈ నెల 19, 20న ఢిల్లీలో..
- సమస్యల పరిష్కారం, రైతుల ఆదాయం రెట్టింపు చేయడంపై చర్చ
- హాజరుకానున్న ప్రధాని మోదీ, నీతి ఆయోగ్ అధికారులు

న్యూఢిల్లీ: వ్యవసాయ సంక్షోభంపై చర్చించేందుకు ఈ నెల 19, 20 తేదీల్లో రెండు రోజుల జాతీయ సదస్సు నిర్వహించాలని ప్రధాని నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. సాగు రంగం ఎదుర్కొంటున్న సమస్యలకు స్వల్పకాలిక, దీర్ఘకాలిక పరిష్కారాలపై చర్చించడంతో పాటు 2022 నాటికి రైతుల ఆదాయం రెట్టింపు చేసేందుకు ఉన్న మార్గాలు ప్రముఖంగా ప్రస్తావనకు వచ్చే అవకాశాలున్నాయి. 'ది నేషనల్ కాన్ఫరెన్స్ 2022' పేరిట ఈ సదస్సు కేంద్ర వ్యవసాయ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఢిల్లీలోని పుసా కాంప్లెక్స్‌లో జరుగుతుంది. ప్రధాని మోదీ ఫిబ్రవరి 20వ తేదీన సదస్సులో పాల్గొంటారని వ్యవసాయ కార్యదర్శి ఎస్కే పట్నాయక్ చెప్పారు. కేంద్ర వ్యవసాయ మంత్రి రాధామోహన్ సింగ్, నీతి ఆయోగ్ సీనియర్ అధికారులు, వ్యవసాయ ఉత్పత్తుల ధరలు నిర్ణయించే సీఏసీపీ ప్రతినిధులు, పలు వ్యవసాయ వర్సిటీల పరిశోధకులు, రైతులు, రైతు సంఘాల ప్రతినిధులు కూడా హాజరవుతారు.

ప్రధాని సమక్షంలోనే సిఫార్సులు..

సమావేశం తొలిరోజున వ్యవసాయ రంగ నిపుణులు, అధికారులు.. రైతులు, వ్యవసాయం, అనుబంధ రంగాలు ఎదుర్కొంటున్న సమస్యలపై మేధో మథనం జరుపుతారు. రెండోరోజు వారు ప్రధాని మోదీ సమక్షంలో తమ సిఫార్సులను వెల్లడిస్తారు. ఇటీవల బడ్జెట్‌లో కనీస మద్దతు ధరలను.. ఉత్పత్తి వ్యయానికి 1.5 రెట్లకు పైగా నిర్ధారించిన సంగతి తెలిసిందే. వ్యవసాయం, అనుబంధ రంగాల వృద్ధి రేటు ఈ ఏడాది 4.9 శాతం నుంచి 2.1 శాతానికి పడిపోతుందని గణాంకాలు వెలువడిన నేపథ్యంలో కేంద్రం దిద్దుబాటు చర్యలకు దిగింది. రాజస్తాన్, మధ్యప్రదేశ్ ప్రభుత్వాలు ఇప్పటికే రైతులకు రుణమాఫీ, ప్రోత్సాహకాలు వంటివి ప్రకటించాయి.

మోస్ట్ వాంటెడ్ ఐఎం ఉగ్రవాది ఆరిజ్‌ఖాన్ అరెస్ట్



ఢిల్లీలో ఆరిజ్‌ను మీడియాకు చూపిస్తున్న పోలీసులు

న్యూఢిల్లీ: దేశరాజధానిలో 2008లో వరుస బాంబుపేలుళ్ల కేసులో కీలక సూత్రధారి, ఇండియన్ ముజాహిదీన్(ఐఎం)కు చెందిన మోస్ట్ వాంటెడ్ ఉగ్రవాది ఆరిజ్‌ఖాన్ అలియాస్ జునైద్(32)ను ఢిల్లీ స్పెషల్ సెల్ పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. బాంబు పేలుళ్ల తర్వాత ఢిల్లీలోని బాట్లా హౌస్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో తప్పించుకున్న ఆరిజ్‌ఖాన్.. పదేళ్ల తర్వాత ఇండో–నేపాల్ సరిహద్దులో పోలీసులకు చిక్కాడు. ఢిల్లీ పేలుళ్ల సహా 165 మంది ప్రజల మృతికి ఆరిజ్ కారకుడని స్పెషల్ సెల్ డీసీపీ ప్రమోద్ సింగ్ మీడియా సమావేశంలో తెలిపారు. ఇంజనీర్ అయిన ఆరిజ్.. బాంబులు తయారుచేయడం, దాడికి ప్రణాళికలు రచించడం, వాటిని అమలు పర్చడంలో సిద్ధహస్తుడని వెల్లడించారు. పాఠశాలలో ఉన్నప్పుడే ఆరిజ్ ఉగ్రవాద కార్యకలాపాలకు ఆకర్షితుడయ్యారన్నారు. ఐఎం, సిమీ నేతలు అరెస్ట్ కావడంతో భారత్‌లో ఈ సంస్థల కార్యకలాపాలను పునరుద్ధరించడానికి నిందితుడు యత్నించాడన్నారు. నేపాల్‌లోని ఓ పాఠశాలలో ఆరిజ్ టీచర్‌గా చేసేవాడన్నారు. 2007లో యూపీ పేలుళ్లు, 2008లో జైపూర్, అహ్మదాబాద్ పేలుళ్ల కేసుల్లో కూడా ఆరిజ్ నిందితుడిగా ఉన్నాడు. ఆరిజ్ ఆచూకీ తెలిపినవారికి ఎన్ఐఏ రూ.10లక్షలు, ఢిల్లీ పోలీసులు రూ.5 లక్షల రివార్డుల్ని గతంలోనే ప్రకటించారు.

మీ వాహనాలపై పన్ను వేస్తాం

భారత్‌కు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ హెచ్చరిక
- హార్లీ–డేవిడ్‌సన్ బైక్‌ల దిగుమతి సుంకంపై మండిపాటు
- 'రెసిప్రోకల్ ట్యాక్స్'పై కఠినంగా వ్యవహరించాలని నిర్ణయం
- అదే అసలైన స్వేచ్ఛా వాణిజ్యమని ప్రకటన
- తన వేతనంలో నాలుగో వంతు రవాణా శాఖకు విరాళం





వాషింగ్టన్: హార్లీ–డేవిడ్‌సన్ బైక్‌లపై దిగుమతి సుంకం విషయంలో భారత్ తీరుపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్రంగా మండిపడ్డారు. అమెరికాకు దిగుమతి చేసుకుంటున్న వేల కొద్దీ భారత మోటర్ సైకిళ్లపైనా దిగుమతి సుంకాన్ని భారీగా పెంచేందుకు కూడా వెనకాడబోమని హెచ్చరించారు. స్టీల్ పరిశ్రమపై కాంగ్రెస్ సభ్యుల బృందంతో సమావేశం సందర్భంగా ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. ఇటీవల కాలంలో హార్లీ డేవిడ్‌సన్ బైకులపై దిగుమతి సుంకాన్ని భారత్ 75 నుంచి 50 శాతానికి తగ్గించింది. అయితే ఇది ఏమాత్రం సరిపోదని.. భారత్ నుంచి వస్తున్న మోటర్ సైకిళ్లపై అమెరికా పన్ను వసూలు చేయటం లేదన్న విషయాన్ని మరిచిపోవద్దన్నారు. ఇదే విధానాన్ని భారత్ కొనసాగించాలన్నారు. 'చాలా దేశాల్లో మన వస్తువులు తయారవుతున్నాయి. అందుకోసం వారికి భారీగానే చెల్లింపులు చేస్తున్నాం. అలాంటిది.. మన దగ్గర తయారైన హార్లీ డేవిడ్‌సన్ మోటర్ సైకిల్ వారి వద్దకెళ్లినా భారీగా పన్నులు చెల్లించాల్సి వస్తోంది' అని ట్రంప్ పేర్కొన్నారు.

'రెసిప్రోకల్ ట్యాక్స్'కు డిమాండ్

ఇటీవల మోదీతో జరిగిన సంభాషణను పరోక్షంగా గుర్తుచేస్తూ.. 'ఇండియా నుంచి ఓ గ్రేట్ జెంటిల్‌మన్ ఫోన్ చేసి మోటర్ సైకిళ్లపై గతంలో ఉన్న 100 శాతం పన్నును మొదట 75 శాతానికి ప్రస్తుతం 50 శాతానికి తగ్గించామని చెప్పారు' అని తెలిపారు. భారత్ నుంచి వస్తున్న మోటర్ సైకిళ్లపై తాము ఏమాత్రం పన్ను వసూలు చేయటం లేదని చెబుతూ.. అమెరికాతో 'రెసిప్రోకల్ ట్యాక్స్' (పరస్పర సమానమైన పన్ను) విధానాన్ని అమలుచేయని దేశాలతో కఠినంగా వ్యవహరించాలన్నారు. 'ఇలాంటి కేసుల్లో మనం రెసిప్రోకల్ ట్యాక్స్‌ను అమలుచేయాల్సిందే. నేను భారత్‌ను తప్పుబట్టడం లేదు. ఆయా దేశాలు ఈ ట్యాక్స్ నుంచి తప్పించుకోవాలని చూస్తున్నాయనిపిస్తోంది' అని ట్రంప్ పేర్కొన్నారు. రెసిప్రోకల్ ట్యాక్స్‌ను అమలు చేయాలని ట్రంప్ మొదటినుంచీ వాదిస్తున్నారు. కాగా, తన వేతనంలోని నాలుగో వంతును (2017లో తీసుకున్న వేతనంలో) రవాణాశాఖ మౌలికవసతులను మెరుగుపరుచుకునేందుకు విరాళంగా ఇస్తున్నట్లు ట్రంప్ ప్రకటించారు. దీనికి సంబంధించి లక్ష డాలర్ల చెక్కును అందజేశారు. ఏడాదికి ట్రంప్ వేతనం 4 లక్షల డాలర్లు (రూ.2.56కోట్లు).

ఆ పోర్న్‌స్టార్‌కు 1.3లక్షల డాలర్లు ఇచ్చా!

ట్రంప్‌తో శారీరక సంబంధం ఉన్నట్లు ప్రకటించిన పోర్న్‌స్టార్ స్టెఫానీ క్లిఫోర్డ్‌కు 1.3 లక్షల డాలర్ల (రూ. 83.5లక్షలు) చెల్లించినట్లు ట్రంప్ వ్యక్తిగత న్యాయవాది మైకెల్ కోహెన్ న్యూయార్క్ టైమ్స్‌కు వెల్లడించారు. తన సొంత డబ్బును క్లిఫోర్డ్‌కు ఇచ్చానని.. ఇంతవరకు ట్రంప్‌గానీ, ఆయన ప్రచార విభాగం గానీ.. ఈ డబ్బును తిరిగి ఇవ్వలేదన్నారు. పోర్న్‌స్టార్ మాట్లాడకుండా ఉండేందుకు నవంబర్ 2016 ఎన్నికలకు ముందు ఈ మొత్తాన్ని ట్రాన్స్‌ఫర్ చేసినట్లు పేర్కొన్నారు.

చిక్కుల్లో నెతన్యాహూ



జెరూసలేం: ఇజ్రాయెల్ ప్రధాని బెంజిమెన్ నెతన్యాహూ చిక్కుల్లోపడ్డారు. అవినీతి, నమ్మకద్రోహానికి సంబంధించి నెతన్యాహూకు వ్యతిరేకంగా ఆధారాలు లభ్యమయ్యాయని పోలీసులు చెప్పారు. 14 నెలల దర్యాప్తు తర్వాత నెతన్యాహూకు వ్యతిరేకంగా ఆధారాలు లభించాయని, వీటి ఆధారంగా నిందితుల జాబితాలో ఆయన పేరు చేర్చాలని ప్రాసిక్యూషన్‌కు సిఫార్సు చేశారు. 2009 నుంచి నెతన్యాహూ ఇజ్రాయెల్ ప్రధానిగా కొనసాగుతున్నారు. అంతకుముందు 1996 నుంచి 1999 వరకూ ఆయన ఆ పదవిలో ఉన్నారు. అయితే గత పదేళ్లలో బహుమతుల రూపంలో 3 లక్షల అమెరికన్ డాలర్లను నెతన్యాహూ పారిశ్రామికవేత్తల నుంచి స్వీకరించినట్టు పోలీసులు ఆరోపిస్తున్నారు. ప్రముఖ పబ్లిషర్ ఆర్నన్ మోజెస్‌కు లబ్ధి చేకూరేలా కేస్ 1000, కేస్ 2000కు సంబంధించి ఖరీదైన బహుమతులు అందుకున్నారనే ఆరోపణలపై నెతన్యాహూ ప్రాసిక్యూషన్‌ను ఎదుర్కోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రధానిని నిందితుడిగా చేర్చాలని సిఫార్సు చేస్తూ పోలీసులు ఆధారాలను అటార్నీ జనరల్‌కు సమర్పిస్తే, ఆయన దీనిపై తుది నిర్ణయం తీసుకుంటారు. నెతన్యాహూపై అభియోగాలు మోపాలని ఇజ్రాయెల్ పోలీసులు సిఫార్సు చేసిన జాబితాలో పారిశ్రామికవేత్త రతన్ టాటా పేరు ఉందని స్థానిక మీడియా పేర్కొంది.

సయీద్ ఆస్తులపై పాక్ కొరడా

ఇస్లామాబాద్: ముంబై దాడుల సూత్రధారి హఫీజ్ సయీద్‌తో సంబంధమున్న ఆసుపత్రులు, మదరసాపై పాకిస్తాన్ కొరడా ఝుళిపించింది. దేశంలోని నిషేధిత ఉగ్ర సంస్థలపై చర్యలు తీసుకోవాలని అంతర్జాతీయంగా ఒత్తిళ్లు పెరగడంతో పాక్ దిగి వచ్చింది. ఉగ్ర సంస్థలకు వ్యతిరేకంగా చేపట్టిన చర్యల పురోగతిని సమీక్షించేందుకు ఉన్నత స్థాయి ఐరాస ఆంక్షల కమిటీ గత నెలలోనే ఆ దేశంలో పర్యటించిన సంగతి తెలిసిందే. పంజాబ్ ప్రభుత్వ ఆదేశాల మేరకు..సయీద్ సంస్థలు జమాత్ ఉద్ దవా, ఫలా–ఇ–ఇన్సానియత్ ఫౌండేషన్ నేతృత్వంలోని ఒక మదరసా, 4 ఆసుపత్రులను రావల్పిండి అధికారులు తమ అధీనంలోకి తీసుకున్నట్లు మీడియా తెలిపింది. సయీద్ మదర్సాల్లో విద్యాభ్యాసం చేస్తున్న విద్యార్థులు, బోధనా సిబ్బంది, ఆసుపత్రుల్లో పనిచేస్తున్న వైద్యుల వివరాలను తనిఖీ చేయాలని కూడా పంజాబ్ ప్రభుత్వం ఆదేశించినట్లు ఓ అధికారి తెలిపారు.

అధ్యక్షుడి అండతో అక్రమాలు

దక్షిణాఫ్రికాలో గుప్తా కుటుంబ సభ్యుడి అరెస్టు



అధ్యక్షుడు జాకబ్ జుమా   అజయ్, అతుల్, రాజేష్ (ఫైల్)

జొహన్నెస్‌బర్గ్: దక్షిణాఫ్రికాలోని ప్రముఖ వాణిజ్య సంస్థలకు అధిపతులైన గుప్తాల కుటుంబంలోని ఓ కీలక వ్యక్తిని పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. దక్షిణాఫ్రికా అధ్యక్షుడు జాకబ్ జుమాతో సన్నిహిత సంబంధాలున్న గుప్తాల ఇళ్లపై పోలీసు దాడులు జరిగాయి. దక్షిణాఫ్రికాలోని ఫ్రీస్టేట్ ప్రావిన్సులో ఉన్న వ్రెడె అనే పట్టణంలో పాల ఉత్పత్తి కేంద్రం నుంచి పేదలకు చెందాల్సిన కోట్ల రూపాయల డబ్బును అధ్యక్షుడి అండతో గుప్తా సోదరులు అక్రమ పద్ధతుల్లో కాజేశారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ కేసు విషయమై జొహన్నెస్‌బర్గ్ శివారు ప్రాంతమైన శాక్సన్‌వల్డ్‌లో ఉన్న వారి ఇంట్లో పోలీసులు సోదాలు నిర్వహించి ముగ్గురిని అరెస్టు చేయగా వారిలో ఒకరు గుప్తా కుటుంబంలోని వ్యక్తి ఉన్నారు. జాకబ్ జుమాను పదవి నుంచి దిగిపొమ్మని ఆఫ్రికా నేషనల్ కాంగ్రెస్ (ఏఎన్‌సీ) పార్టీ కోరడానికి కూడా గుప్తాలతో ఉన్న సంబంధాలే కారణమని తెలుస్తోంది.

జాకబ్ జుమాపై అవిశ్వాసం!

అధ్యక్ష పదవి నుంచి తప్పుకోవడానికి జాకబ్ జుమాకు ఏఎన్‌సీ బుధవారం సాయంత్రం (నిన్న) వరకు గడువిచ్చింది. ఆయన రాజీనామా చేయకపోతే పార్లమెంటులో గురువారం అవిశ్వాస తీర్మానం ప్రవేశపెడతామంది. రాజీనామా చేయాల్సిందిగా ఇప్పటికే జుమాను ఏఎన్‌సీ కోరగా ఆయన అందుకు నిరాకరిస్తున్నారు. ఏఎన్‌సీ నిర్ణయాన్ని తానెప్పుడూ ధిక్కరించలేదనీ, కానీ తనను ఎందుకు తొలగించాలనుకుంటున్నారో, తాను చేసిన తప్పేంటో ఎవరూ చెప్పడం లేదని జుమా అన్నారు.

ఎవరీ గుప్తాలు?

జాకబ్ జుమాను తమ గుప్పెట్లో పెట్టుకుని రాజ్యాంగాధికారాలు చెలాయించిన గుప్తా సోదరుల ప్రయాణం ఉత్తరప్రదేశ్ నుంచి మొదలైంది. యూపీలోని సహారాన్‌పూర్‌కు చెందిన శాండ్‌స్టోన్ వ్యాపారి శివ్‌కుమార్ గుప్తాకు అజయ్, అతుల్, రాజేష్ 'టోనీ' గుప్తా అనే ముగ్గురు కొడుకులున్నారు. వీరు 1993లో జొహన్నెస్‌బర్గ్‌లో అడుగుబెట్టి వాణిజ్య సామ్రాజ్యం నిర్మించారు. కంప్యూటర్లు, వాటి విడిభాగాల వ్యాపారంతో ప్రారంభించి మీడియా, యురేనియం, బొగ్గు గనులు, రియల్ ఎస్టేట్, లోహాలు, ప్రభుత్వ కాంట్రాక్టుల వరకూ విస్తరించారు. 2009లో దేశాధ్యక్షుడైన జుమాకు అత్యంత సన్నిహితులుగా మారిన గుప్తాలు పాలకపక్షమైన ఏఎన్‌సీపైనా ఆధిపత్యం కొనసాగించారు.

ఊరి పేరుతో తొలి కంపెనీ..

గుప్తా సోదరులు తాము పుట్టి పెరిగిన సహారాన్‌పూర్ పేరు మీదుగా జొహన్నెస్‌బర్గ్‌లో మొదటగా 'సహారా కంప్యూటర్స్'ను స్థాపించారు. ఇతర వ్యాపారాలకు విస్తరించాక 20 ఏళ్లలో అపర కుబేరులయ్యారు. 2013లో వారి సమీప బంధువు అనిల్ గుప్తా కూతురు పెళ్లికి చేసిన భారీ ఖర్చుతో వారి పేర్లు మార్మోగిపోయాయి. ఈ పెళ్లికి ఇండియా నుంచి 217 మంది అతిథులతో వచ్చిన విమానాన్ని వైమానికదళ స్థావరంలో దిగడానికి అనుమతించడంతో గుప్తాలు జుమాతో ఉన్న బంధాన్ని ఎలా వాడారో తేలింది.

● దామోదరం సంజీవయ్యకు ఘన నివాళి



దళిత నేత, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య జయంతి సందర్భంగా బుధవారం పాదయాత్ర ప్రారంభానికి ముందు ఆయన చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ప్రతిపక్ష నేత వైఎస్ జగన్



పాదయాత్రలో సోమశిల ఉత్తర కాలువను పరిశీలిస్తున్న జగన్



కృష్ణారెడ్డిపాళెంలో తమ పొలంలో సేంద్రియ ఎరువులతో పండించిన అరటి గెలను జగన్‌కు అందజేస్తున్న చెల్లెమ్మ జాహ్నవి



తెల్లపాడు క్రాస్ వద్ద అక్కచెల్లెమ్మలను ఆప్యాయంగా పలకరిస్తున్న జగన్



కుడుములదిన్నెపాడు వద్ద గ్రామస్తులకు అభివాదం చేస్తున్న జగన్

దుర్మార్గపు సర్కారుపై కలసికట్టుగా పోరాడదాం

ప్రజలకు పిలుపునిచ్చిన ప్రతిపక్ష నేత వైఎస్ జగన్

ప్రజా సంకల్ప యాత్ర నుంచి
సాక్షి ప్రత్యేక ప్రతినిధి

రాష్ట్ర ప్రజలను అన్ని విధాలా మోసం చేసిన చంద్రబాబు ప్రభుత్వ దుర్మార్గపు పాలనకు చరమగీతం పాడేందుకు అందరం కలసికట్టుగా పోరాడదామని ప్రతిపక్ష నేత, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపునిచ్చారు. అధికారం కోసం ఎన్నికలకు ముందు ఎన్నో హామీలు ఇచ్చిన చంద్రబాబు.. ముఖ్యమంత్రి అయ్యాక ఒక్క హామీ నెరవేర్చకుండా అన్ని వర్గాల ప్రజలను దారుణంగా వంచించారని మండిపడ్డారు. ప్రజా సంకల్ప యాత్రలో భాగంగా 87వ రోజు బుధవారం శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా ఉదయగిరి నియోజకవర్గంలో ఆయన తన పాదయాత్రను కొనసాగించారు. కలిగిరి శివారు నుంచి ప్రారంభమైన పాదయాత్ర.. కృష్ణారెడ్డిపాలెం, కుడుముల దిన్నెపాడు, చిన్న అన్నలూరు, తూర్పు జంగాలపల్లి గ్రామాల మీదుగా సాగింది. నరసారెడ్డి పాలెం, చిన్న అన్నలూరు గ్రామాల్లో ఆయన మహిళలు, రైతులను ఉద్దేశించి మాట్లాడారు. చంద్రబాబు ముఖ్యమంత్రి కుర్చీలోకి వచ్చాక రైతులు, పొదుపు సంఘాల అక్కచెల్లెమ్మలకు సున్నా వడ్డీకి రుణాలు లభించడం లేదన్నారు. బ్యాంకులకు ప్రభుత్వం వడ్డీ డబ్బులు చెల్లించక పోవడం వల్లే ఈ దుస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల ఆశీస్సులు, దేవుడి దయ వల్ల మనందరి ప్రభుత్వం అధికారంలోకి వస్తే రైతులు, పొదుపు సంఘాల అక్కచెల్లెమ్మలకు వడ్డీ లేని రుణాలు ఇప్పిస్తామన్నారు. బ్యాంకుల నుంచి తీసుకునే రుణాలకు వడ్డీ డబ్బులను ప్రభుత్వమే ఎప్పటికప్పుడు సకాలంలో చెల్లిస్తుందని హామీ ఇచ్చారు. 'ఈ పెద్దమనిషి రైతుల వ్యవసాయ రుణాలన్నీ బేషరతుగా మాఫీ చేస్తామన్నారు. ఇప్పుడు రుణమాఫీ సొమ్మంటూ ఆయన ఇస్తున్నది వడ్డీలకు కూడా సరిపోవడం లేదు. పొదుపు సంఘాల అక్కచెల్లెమ్మల రుణాలు ఒక్క రూపాయి కూడా మాఫీ కాలేదు. రేప్పొద్దున ఎన్నికల్లో గెలవడం కోసం చంద్రబాబు మరిన్ని అబద్ధాలు చెబుతాడు. చంద్రబాబు మాటలను మీరు నమ్ముతారా? (నమ్మం, నమ్మం అని జనం నుంచి ప్రతిస్పందన) ఈ చెడిపోయిన రాజకీయ వ్యవస్థను మార్చడం నా ఒక్కడి వల్ల కాదు. మీ అందరి సహాయ సహకారాలు, ఆశీస్సులు కావాలి' అని జగన్ కోరారు. మనందరి ప్రభుత్వం రాగానే అమలు చేయబోయే నవరత్నాల గురించి అందరికీ విస్తృతంగా తెలియజెప్పాలన్నారు.

మీరొస్తున్నారని నీరిచ్చారు..

సోమశిల ఉత్తర కాల్వకు నాలుగేళ్లగా నీళ్లు ఇవ్వని చంద్రబాబు ప్రభుత్వం.. మీ పాదయాత్ర నేపథ్యంలో కాల్వకు నామమాత్రంగానైనా నీళ్లు వదిలిందని ఈ ప్రాంత రైతులు జగన్‌తో వ్యాఖ్యానించారు. పాదయాత్ర మార్గం మధ్యలో వారు కాల్వను చూపుతూ.. 'ఈ ఏడాది ఖరీఫ్, రబీల్లో కూడా నీరు ఇవ్వలేదు. ప్రజా సంకల్ప యాత్ర ఈ రహదారిలో సాగుతుందని తెలుసుకుని రెండు అడుగల మేర నీళ్లు వదిలారు. వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఈ కాల్వలను తవ్వించారు. మీ పాదయాత్ర ఈ ప్రాంతం నుంచి ముందుకు దాటాక నీటి విడుదల కొనసాగుతుందో.. లేదో' అని రైతులు అనుమానం వ్యక్తం చేశారు. పూర్తి స్థాయిలో నీరు విడుదల చేస్తే ఈ ప్రాంతంలో సాగునీటి సమస్యతో పాటు, గ్రామాల్లో ఫ్లోరైడ్ సమస్యకు ముగింపు పలకవచ్చన్నారు.

ఫీజుల పథకం బాగుంటే నా కొడుకు బతికేవాడు..

ఆర్థిక ఇబ్బందుల కారణంగా బీటెక్ చదువుతున్న తమ కుమారుడి కాలేజీ ఫీజు చెల్లించకపోవడం వల్ల.. ఆ బాధ బయటకు చెప్పలేక ఆత్మహత్య చేసుకున్నాడని కుడుముల దిన్నెపాడు గ్రామానికి చెందిన వరమ్మ, గోపాలం దంపతులు జగన్ వద్ద గోడు వెళ్లబోసుకున్నారు. రెండేళ్ల క్రితం వారి కుమారుడు అంకమ్మరావు ఆత్మహత్యకు దారితీసిన పరిస్థితిని వారు జననేతకు వివరించారు. దివంగత ముఖ్యమంత్రి ప్రవేశపెట్టిన ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం సమగ్రంగా అమలై ఉండుంటే తమ కుమారుడు బతికి ఉండేవాడని వారు వ్యాఖ్యానించారు. కిడ్నీ వ్యాధిగ్రస్తులకు పింఛన్లు ఇస్తున్నామని ప్రభుత్వం చెబుతోందని, తాను డయాలసిస్ చేయించుకుంటూ తీవ్ర ఇక్కట్లు పడుతున్నా తనకు పింఛను మంజూరు చేయలేదని కృష్ణారెడ్డి పాలెం గ్రామానికి చెందిన మస్తాన్ జగన్ ఎదుట వాపోయాడు. పాదయాత్రలో దారిపొడవునా మహిళలు తమ గ్రామాల్లో ఫ్లోరైడ్ నీటితో ఎదుర్కొంటున్న ఇబ్బందులను జననేతకు విన్నవించారు.



కష్టాలు చెప్పుకుంటున్న అవ్వకు ధైర్యం చెబుతున్న జగన్

మనందరి ప్రభుత్వం రాగానే ఇలా చేస్తాం..

- వైద్యం ఖర్చు రూ.వెయ్యి దాటితే ఆరోగ్యశ్రీ కిందకు తీసుకొస్తాం. బెంగళూరు, హైదరాబాద్, చెన్నై ఎక్కడైనా సరే చికిత్స పొందేలా ఆరోగ్యశ్రీ పథకాన్ని మరింత మెరుగ్గా నిర్వహిస్తాం. పేదవాడికి ఆపరేషన్ చేయించిన తర్వాత డాక్టర్ సూచన మేరకు.. విశ్రాంతి తీసుకునే సమయంలో డబ్బులు ఇస్తాం. తలసీమియా, కిడ్నీ వంటి దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న పేద వారికి రూ.10 వేలు పింఛన్ ఇస్తాం. ఏ పేదవాడైనా వైద్యం కోసం అప్పుల పాలయ్యే పరిస్థితి రాకుండా చూస్తాం.
- పేద విద్యార్థుల ఉన్నత చదువు కోసం ఎన్ని లక్షలు ఖర్చు అయినా భరిస్తాం. హాస్టల్ చార్జీల కింద రూ.20 వేలు ఇస్తాం.
- చిట్టి పిల్లలను బడికి పంపే తల్లులకు ఏటా రూ.15 వేలు ఇస్తాం.
- అవ్వాతాతల పింఛన్ రూ.2 వేలు చేస్తాం. పింఛన్ వయసును 65 ఏళ్ల నుంచి 60 ఏళ్లకు తగ్గిస్తాం.
- ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ మహిళలకు 45 ఏళ్లకే పింఛన్
- రైతులకు ఏటా మే నెలలో పెట్టుబడి కోసం రూ.12,500 ఇస్తాం.
- చేనేతలను అన్ని విధాలా ఆదుకుంటాం.
- ప్రతి పేదకూ ఇల్లు కట్టిస్తాం. ఆ ఇంటిని అక్కచెల్లెమ్మల పేరుతో రిజిస్టర్ చేయించి ఇస్తాం. అవసరమైనప్పుడు బ్యాంకులో ఆ ఇంటిపై రుణం ఇచ్చేలా చర్యలు తీసుకుంటాం.
- ఎన్నికల నాటికి పొదుపు సంఘాల పేరిట బ్యాంకుల్లో ఉన్న అప్పు మొత్తాన్ని నాలుగు ధపాలుగా నేరుగా అక్కచెల్లెమ్మల చేతికే అందజేస్తాం. నవరత్నాలతో పేదలందరినీ ఆదుకుంటాం.

ప్రజాసంకల్ప యాత్ర 87వ రోజు

ఇప్పటి వరకూ నడిచిన దూరం **1,181.7** కిలో మీటర్లు

87వ రోజు నడిచిన దూరం **13.2** కిలో మీటర్లు

ప్రారంభం: ఉ. 8.00 గంటలకు కలిగిరి శివారు

ముగింపు: సా. 5 గంటలకు కొండాపురం మండలం జంగాలపల్లి

ముఖ్యాంశాలు: కలిగిరి శివారు, కృష్ణారెడ్డి పాళెం, కుడుముల దిన్నెపాడు, తాళ్లపాడు క్రాస్, చిన్న అన్నలూరు, కొండాపురం మండలం మావిడాల పాళెం, జంగాలపల్లి గ్రామాల్లో ప్రజలతో మమేకం

నేటి పాదయాత్ర షెడ్యూల్

ప్రారంభం: ఉ. 8 గంటలకు జంగాలపల్లి

ముఖ్యాంశాలు
- ఆదిమూర్తిపురం, తూర్పు యర్రబల్లి క్రాస్, తూర్పుపాళెం క్రాస్‌లలో ప్రజలతో మమేకం
- కొండాపురంలో పార్టీ పతాకావిష్కరణ
- రేనమాలలో మహిళలతో ముఖాముఖి



జగన్‌తో కరచాలనం చేసేందుకు పోటీ పడుతున్న అక్కచెల్లెమ్మలు



బీటెక్ చదివేందుకు ఫీజు కట్టలేక తమ కుమారుడు ఆత్మహత్య చేసుకున్నాడని కుడుములదిన్నె శివారులో జగన్ ఎదుట కన్నీటి పర్యంతమవుతున్న దంపతులు వరమ్మ, గోపాల్



తెల్లపాడు క్రాస్ వద్ద అనారోగ్యంతో బాధపడుతున్న తాతకు ధైర్యం చెబుతున్న జననేత



జంగాలపల్లిలో హస్తకళలను పరిశీలిస్తున్న ప్రతిపక్ష నేత




చిన్నఅన్నలూరు వద్ద ఓ చెల్లెమ్మ చేతి గాయాన్ని పరిశీలిస్తున్న జగన్

87వ రోజు

14–02–2018, బుధవారం
జంగాలపల్లి,
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా

ప్రజా సంకల్పం పాదయాత్ర డైరీ



అందుకే నవరత్నాల్లో విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యతనిచ్చా..

నీతి, నిజాయితీ, నిబద్ధతలతో రాజకీయ జీవితాన్ని నడిపిన దళిత నేత, మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్యగారి జయంతి సందర్భంగా.. ఆయనకు నివాళులర్పించి, ఈ రోజు పాదయాత్ర మొదలెట్టాను. ఈ ప్రాంతానికి సాగునీరు, తాగునీరు అందించేందుకు నాన్నగారు మొదలుపెట్టి, దాదాపు పూర్తిచేసిన ఉత్తర కాలువను దాటి కృష్ణారెడ్డిపాళెంలోకి ప్రవేశించాను. కాళ్లు, చేతులు వంకర్లు పోయి, నడుం వంగిపోయిన ఒక వృద్ధురాలిని మోసుకుంటూ ఒకాయన నా దగ్గరికొచ్చాడు. ఆమెకు పళ్లు కూడా విరిగిపోయినట్లున్నాయి. ఏంటయ్యా.. అని అడిగాను. 'ఇదంతా మా ప్రాంతాన్ని పట్టిపీడిస్తున్న ఫ్లోరైడ్ తెచ్చిపెట్టిన కష్టం సార్.. ఈమె నా భార్య. ఈమెకే కాదు, ఈమె కడుపుతో ఉన్నప్పుడు లోపల బిడ్డపై కూడా దాని ప్రభావం పడింది. ఆ బిడ్డా ఇప్పుడు వికలాంగుడే' అంటూ బాధగా చెప్పాడు. ఆమె పేరు అంకమ్మట. వయసు 35 సంవత్సరాలని చెప్పగానే ఆశ్చర్యపోయాను. ఇంత చిన్న వయసుకే ముసలితనాన్నిచ్చింది ఫ్లోరైడ్ దుష్ప్రభావమేనని అవగతమైంది. ఫ్లోరైడ్ దెబ్బకు తన రెండు కిడ్నీలూ పాడైపోయాయని ఆ గ్రామానికే చెందిన మస్తానన్న చెప్పాడు. ఆ ఊళ్లోనే పది మందికి పైగా కిడ్నీ బాధితులున్నారట. ఆ చుట్టుపక్కల గ్రామాల్లో సైతం ఫ్లోరైడ్ వల్ల కిడ్నీలు పాడైనవాళ్లు, వికలాంగులు, చిన్న వయసులోనే వృద్ధాప్యఛాయలు కమ్ముకున్నవారు ఎందరో ఉన్నారట. ఒక్కసారిగా మనసెంతో బరువెక్కింది. వీరేం తప్పు చేశారు? ఎందుకు వీళ్లకీ శిక్ష? ముమ్మాటికీ ఈ పాపం ఫ్లోరైడ్‌ది కాదు.. తీర్చగలిగే అవకాశం ఉండీ, నిర్లక్ష్యం వహిస్తూ.. మొద్దు నిద్ర నటిస్తున్న నేటి దుర్మార్గపు పాలకులది. పక్కనే ఉత్తర కాలువ పోతున్నా తాగునీరు అందించని ఈ తోలుమందం ప్రభుత్వానిది.

ఆ ఊరు దాటి ముందుకెళ్లగానే కుడుములదిన్నెపాడు వద్ద రోడ్డు పక్కనే ఓ చలివేంద్రం కనిపించింది. ఆ పక్కనే ఉన్న దంపతులిద్దరూ కన్నీళ్లు పెట్టుకుంటూ నా వద్దకొచ్చారు. ఏడాది కిందట ఆత్మహత్య చేసుకున్న వారి పెద్ద కుమారుడు అంకమ్మరావు జ్ఞాపకార్థం ఆ చలివేంద్రం పెట్టారట. 'అంత పెద్ద కష్టం ఎందుకొచ్చింది తల్లీ' అని అడగ్గానే.. 'కూలీ నాలీ చేసుకుంటూ జీవితాన్ని నెట్టే బతుకులయ్యా మావి. మాలా మా బిడ్డలు కష్టపడకూడదని వారిని బాగా చదివించాలనుకున్నాం. మా పెద్దోడు ఇంజినీరింగ్‌లో సీటు తెచ్చుకున్నాడు. కానీ ఫీజు రూ.70 వేలట. ఫీజు రీయింబర్స్‌మెంట్ కింద రూ.35 వేలే వచ్చాయి. అమ్మా.. మిగతా డబ్బు కట్టగలరా? అని అడిగేవాడు. మీకు చాలా కష్టమైపోతోందమ్మా.. అంటూ కుమిలిపోయేవాడు. నిరుడు వినాయక చవితి రోజు మా కష్టం గురించి మరింత ఎక్కువగా ఆలోచించాడేమో. నాన్నా.. నన్ను చదివించడానికి మీరు పడుతున్న కష్టాన్ని చూడలేకపోతున్నా.. పేదవాళ్లుగా పుట్టడమే మనం చేసుకున్న పాపమేమో.. అని ఉత్తరం రాసి, ఉరేసుకుని చనిపోయాడు' అంటూ ఆ దంపతులు గుండె చిక్కబట్టుకుని కడుపుకోతను చెప్పుకొన్నారు. చాలా బాధేసింది. ఆ పేదింట చదువుల సౌరభాలు వెదజల్లి, పేదరికాన్ని పారదోలాల్సిన ఆ విద్యా కుసుమం మధ్యలోనే రాలిపోవడం నా మనసును కలచివేసింది. పేదవాళ్లు పెద్ద చదువులు చదువుకోవాలనుకోవడమే శాపమైతే.. మరి ఆ పాపం ఎవరిది? వారికి ఆ ఆశపెట్టి మోసపుచ్చిన పాలకులది కాదా? పేదరికం అన్నది చదువుకు ఏ మాత్రం అడ్డుకాకూడదని నాన్నగారు ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం ప్రవేశపెట్టి.. ఫీజులను సంపూర్ణంగా, సకాలంలో చెల్లించేవారు. కానీ, నేటి ప్రభుత్వం అరకొర ఫీజులు చెల్లిస్తూ.. ఆ కాస్త కూడా నెలల తరబడి పెండింగ్ పెడుతూ, లబ్ధిదారులైన విద్యార్థుల సంఖ్యను తగ్గిస్తూ, ఆ పథకాన్ని నీరుగార్చి.. గాలిలో దీపంలా తయారు చేసింది. పేద బిడ్డల జీవితాల్లో చీకటి తెరలు కమ్ముకునేలా చేస్తోంది. అంకమ్మరావులాంటి పేద విద్యార్థుల ఉసురు తీస్తోంది. ఏ పేదవాడికీ ఈ పరిస్థితి రాకూడదు. అందుకే నవరత్నాల్లో అటు వైద్యానికి, ఇటు విద్యకు అధిక ప్రాధాన్యత ఇచ్చాను.

ముఖ్యమంత్రిగారికి నాదో ప్రశ్న.. మీరు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత చేసిన తొలి ఐదు సంతకాలలో ఒకటి.. ప్రతి గ్రామానికీ రక్షిత మంచినీటి సరఫరా. నాలుగేళ్లయిపోయాయి. ఆ పథకం ఏమైంది? మినరల్ వాటర్ సంగతి దేవుడెరుగు.. కనీసం తాగడానికి సర్ఫేస్ వాటరైనా ఇచ్చుంటే.. ఫ్లోరైడ్ పీడిత ప్రాంతాలకైనా కొంత మేర ఉపశమనం కలిగేది కదా? మీ తొలి సంతకానికే దిక్కులేకపోతే.. మీరిచ్చిన వందలాది హామీల మాటేంటి?

వైఎస్. జగన్.

ప్రజా సంకల్ప యాత్ర — మరిన్ని చిత్రాలు టాబ్లాయిడ్‌లో

గనులేమీ అక్షయ పాత్ర కాదు!

దుర్వినియోగం చేస్తే వైపరీత్యాలు, ఆపదలు తప్పవు ● అంతర్జాతీయ మైనింగ్ సదస్సులో గవర్నర్ నరసింహన్

సాక్షి, హైదరాబాద్: గనులేమీ అక్షయ పాత్రలు కావని.. దుర్వినియోగం చేస్తే వైపరీత్యాలు, ఆపదలు తప్పవని గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్ అన్నారు. గనుల తవ్వకాల కోసం ధ్వంసం చేసిన అడవులను తప్పనిసరిగా పునరుద్ధరించాలని, లేదంటే కఠినంగా శిక్షించే చట్టాలు తీసుకురావాలన్నారు. మైనింగ్ ఇంజినీర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా, ఫిక్కీ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో బుధవారం హైదరాబాద్‌లో ప్రారంభమైన 4 రోజుల అంతర్జాతీయ మైనింగ్ సదస్సు, ప్రదర్శన ప్రారంభోత్సవ కార్యక్రమంలో నరసింహన్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. గనులు, ఖనిజాలు సంపద సృష్టించి ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేస్తాయని.. కానీ ఎంత సంపద ఉన్నా ఆరోగాన్ని కొనలేమన్న విషయం గుర్తెరగాలని మైనింగ్ వ్యాపారస్తులకు సూచించారు. గని కార్మికులు యంత్రాలు కాదని.. వారి రక్షణ, ఆరోగ్యం ప్రధాన అంశంగా ఉండాలన్నారు. గనుల ప్రభావిత ప్రాంత ప్రజల సంక్షేమం కోసం కేంద్రం తీసుకొచ్చిన డిస్ట్రిక్ట్ మినరల్ ఫౌండేషన్ (డీఎంఎఫ్) ప్రాజెక్టును పారదర్శకంగా అమలు చేస్తే లక్ష్యాలు నెరవేరుతాయని చెప్పారు. గనుల కారణంగా నిర్వాసితులైన ప్రజలకు తప్పనిసరిగా పునరావాసం కల్పించాలని చెప్పారు. గనుల ద్వారా లెక్కలేనంత సంపద పొందుతూ నిర్వాసితులకు మాత్రం రాళ్లు కొట్టే ఉపాధి కల్పించడం దారుణ విషయమన్నారు. కేంద్ర మంత్రి నరేంద్ర సింగ్ తోమర్ తదితరులు మాట్లాడారు.

'నీట్'తోనే ఆయుష్ సీట్ల భర్తీ


2018–19 నుంచి కచ్చితంగా అమలు

సాక్షి, హైదరాబాద్: వైద్య విద్య డిగ్రీ కోర్సుల సీట్లను ఇకపై జాతీయ అర్హత ప్రవేశ పరీక్ష (నీట్) ఆధారంగానే భర్తీ చేయనున్నారు. దేశవ్యాప్తంగా ఇప్పటివరకు ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సుల సీట్లనే తప్పనిసరిగా నీట్ ర్యాంకుల ఆధారంగా భర్తీ చేస్తున్నారు. తాజాగా ఆయుర్వేద, హోమియోపతి, యునానీ, న్యాచురోపతి–యోగిక్, పబ్లిక్ హెల్త్ డిగ్రీ కోర్సుల సీట్లను కూడా నీట్ ర్యాంకుల ప్రాతిపదికన మాత్రమే భర్తీ చేయాలని కేంద్ర ఆయుష్ మంత్రిత్వ శాఖ నిర్ణయించింది. 2018–19 విద్యా సంవత్సరం నుంచి కచ్చితంగా అమలు చేయాలని అన్ని రాష్ట్రాలను ఆదేశించింది. వైద్య విద్యకు సంబంధించి అన్ని కోర్సులకు ఈసారి ఉమ్మడిగా కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు.

సాక్షి ఫ్యామిలీ
నేను శక్తి సాక్షి
విజయవాడ
గురువారం, 15-2-2018



> లైంగిక వివక్షకు తిరుగులేని సమాధానం.. మన ప్రతిభను మనం కనబరచడం.
>
> - ఓప్రా విన్‌ఫ్రే, టీవీ వ్యాఖ్యాత



బోర్డర్ బోర్డర్

ఉదయాన్నే తయారైై.. చీర సవరించుకుని
సజావుగా నల్ల కోటు వేసుకుని
అద్దం ముందు నిలబడింది.
అబ్బ! అచ్చం న్యాయం నిలబడినట్లే ఉంది!
కానీ అద్దంలో.. తన చుట్టూ కంచె కనబడింది!
తను ఆ బోర్డర్‌ను దాటగలదా?
'ఆర్డర్..ఆర్డర్.. అడ్డు తొలగండి' అనే
జడ్జిగారి ఆదేశాన్ని ఎప్పటికైనా తను వినగలదా?
లేక.. మహిళా అడ్వకేట్‌లు సమన్యాయానికి
బోర్డర్‌లోనే ఉండిపోతారా?

ప్రతీకాత్మక చిత్రం

నన్ను చిల్లర లాయరన్నారు. బీదాబిక్కీ కేసులు తప్ప ఈమెకెవరిస్తారు కేసులన్నారు. అసలు ఈ ప్రొఫెషన్ నుంచే తరిమికొట్టాలనుకున్నారు. ఎక్కడైతే అవమానాలు ఎదుర్కొన్నానో అక్కడే తలెత్తుకొని నిలబడ్డాను. నాకు పొలిటికల్ సపోర్ట్‌లేదు. నా తాత ముత్తాతలెవరూ న్యాయమూర్తులు కారు. న్యాయవాదులూ కారు. నాకు నేనుగా ఈ వృత్తిలోకి అడుగుపెట్టాను.

హైకోర్టులో ప్రాక్టీసు మొదలుపెట్టాక కానీ నాకర్థం కాలేదు. న్యాయవాద వృత్తిలో ఆడవాళ్లు కొనసాగడమంటే మగ లాయర్లకి అసిస్టెంట్స్‌గానే కొనసాగాలి తప్ప స్వతంత్రంగా ఎదగనివ్వరని.

ఎన్నేళ్లయినా ఆడవాళ్లు అక్కడ జూనియర్స్‌గానే ఉంటారు తప్ప వారికన్నా మేం అద్భుతంగా కేసులు వాదించగలమనీ, మాకు టాలెంట్ ఉందనీ వారు గుర్తించరు. కాదు గుర్తించనట్టు నటిస్తారు. అసలు మా సీనియర్స్ మాదాకా కేసులు రానివ్వరు.

నోట్స్ నాది.. వాదన వేరొకరిది!

అలాంటి మేల్ డామినేటెడ్ వ్యవస్థలో నాకు నేనుగా ఎదిగేందుకు ఎంత కష్టపడ్డానో చెప్పలేను! ఈ ప్రొఫెషన్‌లోకి వచ్చిన కొత్త లోనే మా బాస్ అప్పజెప్పిన కేసుని ఇంటికి తెచ్చుకునేదాన్ని. ఇంట్లో పని ముగించుకుని అంతా నిద్రపోయాక రాత్రంతా మేల్కొని ఉండి, కేసు వివరాలు చదివి ప్రతి విషయాన్ని నోట్స్ రాసుకుని అరటిపండు ఒలిచి ఇచ్చినంత సులభంగా కేసుని విడమర్చి నా సీనియర్ ముందు పెట్టేదాన్ని. దాన్ని నా సీనియర్ వాదించాల్సిందిపోయి నా నోట్స్‌ని నాలాంటి మరో మగ జూనియర్‌కిచ్చి.. 'కేసు చాలా విపులంగా రాసి వుంది నోట్స్‌లో, నువ్వు వాదించు' అని ఇచ్చేవాడు! కేసుగురించి ఒక్కముక్క తెలియకపోయినా నా నోట్సు తీసుకుని ఒక పురుష న్యాయవాది వాదించగలిగినప్పుడు కేసుని అమూలాగ్రం చదివిన నేను వాదించలేనా?

నాన్ కో-పరేషన్ చేశాను

నిజానికి మా గురువుగారికి (ప్రముఖ క్రిమినల్ లాయర్ ఆయన) నేను బాగా వాదించగలనని తెలియడానికే చాలా కాలం పట్టింది. నాకు వాదించే అవకాశం మా సీనియర్స్ రానిస్తేగదా నేనేం చేస్తానో తెలిసేది? అలాంటి ఒక రోజు రానే వచ్చింది. మా సీనియర్స్ నా వరకు కేసులు రాకుండా కట్టుదిట్టం చేశారు. అంతే. నేను నాన్-కోపరేషన్ చేశాను. హాయిగా కూర్చొని సుప్రీంకోర్టు కేసులను స్టడీ చేసేదాన్ని. ఆఫీసుకొచ్చే కేసులు చదవడం మానేశాను. అది మా బాస్ గుర్తించారు. ఒక రోజు సడన్‌గా మా గురువుగారు నన్ను పిలిచారు. ఓ కేసు నా ముందు పెట్టి ''చదివావా ఇది?'' అని అడిగారు. చదవలేదని చెప్పకుండా, చదువుతానని చెప్పాను. అది ఒక మర్డర్ కేసు. ఆయన ఒకేసారి రెండు కేసులు వాదించాల్సి వచ్చింది. ఒక కేసు నన్ను వాదించమని అడిగారు. ఆయనకు నామీద నమ్మకమే కానీ మిగిలిన వాళ్లు కల్పించిన అపోహలు కూడా ఉంటాయి కదా. ఆనందంగా ఒప్పుకున్నాను. కేసు గెలుస్తామని ఆయన ఊహించలేదు కానీ, శిక్ష తగ్గించొచ్చని భావించారు. అయితే నేను కేసు గెలవడంతో ఆయన చాలా ఆనందించారు. గెలుపు మగాళ్లకు మాత్రమే సాధ్యం కాదని, అప్పుడే నిరూపించాను.

> స్వాతంత్ర్య సంగ్రామంలో ముందు నిలిచిన మహిళలెందరో న్యాయవాదులేనని చదివి, న్యాయవాదిగా ఉంటే ఎవరికీ లొంగి ఉండాల్సిన అవసరం ఉండదనీ న్యాయవాద వృత్తిలోనికి అడుగుపెట్టాను. నిజం చెప్పాలంటే సెల్ఫ్ రెస్పెక్ట్ కోసమే ఈ వృత్తిని ఎంచుకున్నాను. కానీ నాది రాంగ్ ఇంప్రెషన్ అని త్వరలోనే అర్థం అయ్యింది!

మొదటి కేసులో 'చచ్చి'గెలిచాను

నేను టేకప్ చేసి, వాదించిన మొదటి కేసు నాకింకా గుర్తుంది. అది డబుల్ మర్డర్ కేసు. ఆ కేసులో నిందితుడి తండ్రి మా తాతగారి దగ్గర పనిచేశాడు. అతను నా దగ్గరికొచ్చి కేసు వాదించమని అడిగాడు. ''ఎవరో ఒకరు వాదిస్తార్లే. నీకెందుకు. వదిలెయ్'' అన్నారు మావాళ్లు. మన ఊరికి సంబంధించిన వాళ్లని మర్డర్ చేసిన వ్యక్తిని సపోర్ట్ చేస్తూ వాదిస్తే మన పరువే పోతుందన్నారు. ''అయినా క్రిమినల్ విషయాల్లోకి నువ్వెందుకు?'' అంటూ అంతా ముక్కున వేలేసుకున్నారు. నాన్న కూడా.. ''ఈ కేసు ఎందుకులేమ్మా'' అని వారించారు. అయినా నేనూర్కోలేదు. ''గయోపాఖ్యానం పురాణ కాలక్షేపానికా? లేక జీవితానికి అన్వయించుకోవడానికా నాన్నా?'' అని ప్రశ్నించాను. కేసు ఒప్పుకున్నాను. శాయశక్తులూ ఒడ్డాను. అలా నా మొదటి కేసు గెలిచాను. ఆ తరువాత నాకర్థం అయ్యింది. అక్కడెవ్వరూ మనకు సపోర్ట్ చేయరు. మనల్ని మనమే గెలిపించుకోవాలి. నిరూపించుకోవాలి. అణిగిమణిగి ఉంటే ఫరవాలేదు. కానీ వారికి పోటీగా ఎదిగితే మాత్రం కొత్త ఆశల చిగుళ్లను నిర్దాక్షిణ్యంగా కత్తిరించేస్తారు.

క్యారెక్టర్‌పై ముద్ర వేస్తారు

ఇక్కడ వివక్షనుంచి దూరంగా వెళ్లేందుకు ఓ నాలుగేళ్లు అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్‌గా వెళ్లిపోయాను. నాలుగేళ్లకి మళ్లీ తిరిగొచ్చాను. ఆ తర్వాత లీగల్ ఎయిడ్ పానల్ మెంబర్‌ని అయ్యాను. ఇక్కడ పేదవాళ్ల పక్షాన, డబ్బులు లేని వారి పక్షాన వాదించినప్పుడు.. చిల్లర కేసులు అని హేళన. కూలినాలోళ్ల కేసులు వాదిస్తానని ఎద్దేవా చేయడం. వాళ్లు తప్ప నాదగ్గరికెవ్వరూ రారట. 2009లో మా సీనియర్స్‌తో ఈక్వల్‌గా ఫైలింగ్స్ వచ్చాయి. అంతే ఇండిపెండెంట్ అయిపోయాను.

క్రిమినల్ విభాగంలో ఓ మహిళ అత్యధిక కేసులు వాదిస్తే ఏమౌతుంది? వాళ్ల (పురుష లాయర్ల)కి ఒళ్లు మండుతుంది. అంతగా వినకపోతే బ్యాడ్ క్యారెక్టర్‌గా ముద్రవేస్తారు. ఈమె డబ్బుకోసం ఇదంతా చేస్తోందని క్యారెక్టర్ అసాసినేషన్ చేస్తారు. నాకు కేసులు ఇవ్వండి అని నేనెప్పుడూ దేబిరించలేదు. నాకు నేనుగా ఎదిగాక క్లైంట్సే నా దగ్గరికొచ్చి వాదించమని అడిగారు. ఫలానా గాయత్రీగారైతే బాగా వాదించగలరని వారిలో నమ్మకం కల్పించగలిగాను.

> న్యాయవాదులుగా స్త్రీలు ఉండడమంటే రిప్రజెంటేషన్స్ ఇచ్చేందుకో, పాస్‌ఓవర్ (కేసుకి సీనియర్ లాయర్ అటెండ్ అవలేని పరిస్థితుల్లో వాయిదావేయమని కోరడం)లు అడగడానికో తప్ప కేసులు వాదించడానికి పనికిరారు అన్నంతగా ఉంటుంది వివక్ష. అలా ఎప్పటికోగానీ నాకు కేసు వాదించే అవకాశాన్ని ఇవ్వలేదు.

అసమాన సమాజంలో ఆత్మగౌరవం కోసం ఆమె ఆరాటపడ్డారు. రాజ్యాంగ నిర్మాతలు మొదలు స్వాతంత్ర్య సంగ్రామంలో పేరుగాంచిన నేతలెందరో న్యాయవాద వృత్తిని నెరిపిన వారేనని భావించి సెల్ఫ్ రెస్పెక్ట్ కోసం న్యాయవాద వృత్తిని చేపట్టారు. కానీ అక్కడా అసమానతల అడ్డుగోడలు ఆమెను ముందుకు సాగనివ్వలేదు. అయినా ఆత్మస్థైర్యంతో నిలబడ్డారు. అన్ని అడ్డంకులనూ దాటుకుని పురుషన్యాయాన్ని సవాల్ చేస్తూ ఓ క్రిమినల్ లాయర్‌గా గుర్తింపు తెచ్చుకున్నారు. తనదైన స్థానాన్ని సంపాదించుకున్నారు. ప్రస్తుతం హైకోర్టులో ప్రముఖ క్రిమినల్ లాయర్‌గా పనిచేస్తోన్న గాయత్రీ రెడ్డి గుంటూరు జిల్లా ఫిరంగిపురంలో చదువుకొని అసమానతల అడ్డుగోడలను తొలగించుకొని అంచెలంచెలుగా ఎదిగివచ్చిన క్రమాన్ని సాక్షితో పంచుకున్నారు.




గాయత్రీరెడ్డి, క్రిమినల్ లాయర్, హైకోర్టు

నోరెత్తడానికి లేదు!

స్త్రీలలో ఎంతో ఆంబిషన్ ఉంటే తప్ప పురుషాధిపత్య వృత్తుల్లోకి రారు. ఇప్పటికి ఏ పోస్టులైనా ముందుగా వరించేది మగవాళ్లనే. స్త్రీలు అసలు అక్కడ లెక్కలోకేరారు. అడ్వకేట్ కమ్యూనిటీలో మహిళలు నోరెత్తడానికి లేదు. భయంకరమైన ఇన్‌జస్టీస్. సమన్యాయాన్ని అందించాల్సిన చోట అసమానత్వం. న్యాయాన్ని పంచాల్సిన చోట అన్యాయం. ఇది ఎవ్వరూ రాసి ఉంచరు. మాట్లాడరు. కానీ అలా అణచివేత జరిగిపోతూ ఉంటుంది అంతే.

నూరేళ్ల జ్ఞాపకం

యువరాణికి గౌరవ వందనం



● సోఫియా అలెగ్జాండ్రాపై అనితా ఆనంద్ రాసిన పుస్తకం

రాణులంటే చుట్టూ సేవలందించే మందీ మార్బలం, సకల హంగులు అమరే జీవనంగా మన కళ్ల ముందొక దృశ్యం నిలుస్తుంది. కానీ, ప్రజల గురించి ఆలోచించి, ముఖ్యంగా మహిళా హక్కుల కోసం పోరాటం చేసి, సాధించిన అతి కొద్దిమందిలో రాణులలో సోఫియా అలెగ్జాండ్రా దులీప్‌సింగ్ ఒకరు.

లండన్‌లోని ప్రముఖ రాయల్ మెయిల్ తపాలాశాఖ 'రిప్రజెంటేషన్ ఆఫ్ ది పీపుల్ యాక్ట్ –1918' శత వసంతాలను పురస్కరించుకొని ఆనాడు ఈ చట్టం కోసం ఉద్యమించిన 8 మంది ప్రముఖులను ఎంపిక చేసి, వారి గౌరవార్థం స్టాంప్‌లను విడుదల చేసింది. అందులో ఆసియా తరపున ఎంపికైన ఒకే ఒక్క ఉద్యమ మహిళ మన భారతీయ యువరాణి సోఫియా!



● బ్రిటన్ తపాలా బిళ్లపై సోఫియా అలెగ్జాండ్రా

యువరాణి సోఫియా తండ్రి మహారాజా దులీప్‌సింగ్. ఆయన పంజాబ్ పాలకుడు. సోఫియా ఆగస్టు 1876 ఆగస్టు 8న పంజాబ్‌లోనే జన్మించారు. గవర్నర్ జనరల్ డల్హౌసీ రాజకీయ వ్యూహాలు పన్ని ఈ రాజ్యాన్ని బ్రిటిష్ ప్రభుత్వంలో కలుపుకున్న తర్వాత దులీప్‌సింగ్ ఇంగ్లండ్ నుంచి బహిష్కృతుడయ్యాడు. తల్లి బాంబా ముల్లర్ కూతురు సోఫియాను తీసుకొని ఇంగ్లండ్‌లోని రాణి విక్టోరియా హాంప్టన్ కోర్ట్ ప్యాలెస్ చేరారు. తల్లితో కలిసి సోఫియా అక్కడే నివసించేవారు. విక్టోరియా రాణి సోఫియాను దత్త పుత్రికగా భావించేవారు. 19వ శతాబ్ది చివర్లో, 20వ శతాబ్ది ప్రారంభంలో బ్రిటన్‌లో ప్రజా ఎన్నికలలో మహిళలకు ఓటు హక్కు తప్పనిసరిగా ఉండితీరాలనే అంశం తలెత్తింది. అది ఉదమ్యంగా రూపుదిద్దుకుంది. ఈ ఉద్యమానికి సోఫియా ప్రాతినిధ్యం వహించారు. అలాగే 'ఉమెన్స్ టాక్స్ రెసిస్టెన్స్ లీగ్'లోనూ సోఫియా ప్రముఖ పాత్ర పోషించారు. మహిళల సామాజిక, రాజకీయ సంఘాలతో సహా ఇతర మహిళా బృందాలలోనూ ఆమె నాయకత్వాన్ని అందించారు. ఇంగ్లండ్‌లోనే 1948 ఆగస్టు 22న సోఫియా మరణించారు. బి.బి.సి. జర్నలిస్ట్ అనితా ఆనంద్ నివేదిక ప్రకారం సోఫియాను దాదాపు 70 ఏళ్ల పాటు ఈ దేశం మర్చిపోయింది. 'ఆసియా మహిళ' అంటూ సోఫియా గురించి ఆనంద్ రాసిన పుస్తకంలో రాణిగా, పోరాటయోధురాలిగా, విప్లవకారిణిగా ఆమెను కీర్తించారు.

– ఎన్.ఆర్.

స్క్రీన్ షాట్

ప్రశంసల జల్లు

గుర్తు తెలియని వ్యక్తి నుంచి వాట్సాప్‌లో వచ్చిన అనుచితమైన మెసేజ్‌కు కన్నడ నటి దీప్తి కాప్సే స్పందించిన తీరుకు ఆమెపై ఇప్పుడు సోషల్ మీడియాలో ప్రశంసల జల్లు కురుస్తోంది. మంగళవారం రాత్రి 7:56 గంటల సమయంలో దీప్తి వాట్సాప్‌కు ఆమె కాంటాక్ట్స్‌లో లేని నంబరు నుంచి మెసేజ్ వచ్చింది. 'బెంగళూరులో ఎవరైనా సెక్స్‌వర్కర్ ఉంటే చూసిపెట్టు. డబ్బులకైనా సరే, ఉచితంగానైనా సరే..' అని ఆ మెసేజ్ సారాంశం! రాత్రి 11 గంటల సమయంలో ఆ మెసేజ్ చూసిన నటి దీప్తి షాక్ అయ్యారు. వెంటనే తేరుకుని చాలా ఘాటుగా రిప్లయ్ ఇచ్చారు. (రిప్లయ్‌ని ఎడిట్ చేశాం). ఆ సమాధానంతో భయపడిన ఆగంతకుడు.. పొరపాటున మెసేజ్ వచ్చిందనీ, క్షమించాలని వేడుకున్నాడు. ఈ సంభాషణను స్క్రీన్ షాట్ తీసి దీప్తి ఫేస్‌బుక్‌లో పోస్ట్ చేశారు. దానిని చూసిన దీప్తి అభిమానులు అతడిపై చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరుతున్నారు. దీప్తి కన్నడలో హని హని ఇబ్బని, జ్వాలంతం, మాల్గుడి డేస్, కిరీట, ఉపేంద్రమత్తె హుట్టిబా సినిమాల్లో హీరోయిన్‌గా నటించారు.



● కన్నడ నటి దీప్తి కాప్సే

బొమ్మనహళ్లి : (బెంగళూరు)

చెట్టు నీడ

లోకానికి ఇవ్వగలిగే పాఠం

ఒక యువకుడు వాళ్ల నాన్నను ఒక రెస్టారెంటుకు తీసుకెళ్లాడు. నాన్న బాగా వృద్ధుడయ్యాడు. బలహీనంగా ఉన్నాడు. భోంచేస్తుంటే చేతులు వణుకుతున్నాయి. అందుకే తింటున్నప్పుడు మెతుకులు తన చొక్కా మీదా, టేబుల్ మీదా వేసుకున్నాడు. వడ్డించుకుంటుండగా పులుసు కింద పడింది. అది చూస్తున్న పక్కనున్నవాళ్లు ఇబ్బందిగా ఫీలయ్యారు. ఇలాంటివాడిని బయటికి తీసుకురాలేకపోతేనేమని కూడా కొందరు మనసులో అనుకున్నారు.

తండ్రీ కొడుకూ తినడం పూర్తయ్యింది. నెమ్మదిగా తండ్రి చేతిని కడిగించాడు కొడుకు. మూతి తుడిచాడు. మీద పడిన మెతుకులను తీసేశాడు. నెమ్మదిగా లేవదీసి, భుజం మీద చేయి వేయించుకుని నడిపించుకుంటూ వెళ్లి, ముందున్న సోఫాలో కూర్చోబెట్టాడు. కౌంటర్‌లో బిల్లు చెల్లించి, మళ్లీ వాళ్ల నాన్నను సమీపిస్తున్నప్పుడు, ఆ రెస్టారెంటులో కూర్చుని భోజనం చేస్తున్నవారిలో ఒక పెద్దాయన పిలిచాడు. 'నాయనా, నువ్వు మీ టేబుల్ దగ్గర ఏమైనా వదిలిపెట్టావా?'

> తండ్రీ కొడుకూ తినడం పూర్తయ్యింది. నెమ్మదిగా తండ్రి చేతిని కడిగించాడు కొడుకు. మూతి తుడిచాడు. మీద పడిన మెతుకులను తీసేశాడు.

ఆ యువకుడు తన జేబుల్ని తడుముకొని, 'ఏమీ లేదే' అని జవాబిచ్చాడు.

'కాదు, నువ్వు అక్కడ మాకో పాఠాన్ని విడిచావు' అన్నాడు పెద్దాయన.

యువకుడు చిరునవ్వుతో తండ్రి సహా బయటికి వెళ్లిపోయాడు.

పాఠం చెప్పడానికి ప్రత్యేకంగా మనం ఏమీ చేయనక్కర్లేదు. మనం చూపించే చిన్న చిన్న ప్రేమల్లో, ఆప్యాయతల్లో కూడా ఇంకొకరికి పాఠం కాగలిగేది ఏదో ఉంటుంది.

200 పర్సెంట్

వర్కింగ్ హ్యూమన్

'యు కెన్ డు' అని ఆడవాళ్లను బయటికి పంపిస్తే సరిపోయిందా! 'ఐ కెన్ డు ఇట్' అని ఇంట్లో పూచికపుల్లను అటు తీసి ఇటైనా పెట్టాలి కదా ఈ మగవాళ్లు!

ఇరవై ఐదేళ్ల క్రితం ఓ రోజు.. గిమీ రామెటీకి ఒక ముఖ్యమైన బాధ్యతను అప్పగించాలని ఐబీఎం బోర్డు రూములో ఆకస్మిక నిర్ణయం జరిగింది! రామెటీ అప్పటికే ఐబీఎంలో అత్యున్నతస్థాయి ఉద్యోగి. ''ఇప్పటికిప్పుడు మీరు ఈ బాధ్యతను స్వీకరించడానికి సంసిద్ధంగా ఉన్నారా మిస్ రామెటీ?'' అని ఆమెను పిలిచి అడిగారు బోర్డు డైరెక్టర్‌లు. రామెటీ వెంటనే 'ఎస్' చెప్పలేదు. ''ఇంటికి వెళ్లాక ఆలోచించుకుని చెబుతాను'' అన్నారు.

ఈ సంగతి తెలిసి, రామెటీ భర్త నివ్వెరపోయాడు! ''అదే నీ ప్లేస్‌లో మగవాడెవరైనా ఉంటే అలా అనడు తెలుసా?'' అన్నాడు. మర్నాడు ఆఫీసుకు వెళ్లి ఆ కీలకమైన కొత్త బాధ్యతను స్వీకరించారు రామెటీ. ఐబీఎం కంపెనీ 'థింక్ ఫోరమ్' కార్యక్రమానికి సోమవారం యు.ఎస్.నుండి ముంబై వచ్చినప్పుడు.. 'అడ్వాన్సింగ్ ఉమెన్స్ లీడర్‌షిప్' అనే అంశంపై మాట్లాడుతూ, ఆనాటి తన సందిగ్ధావస్థను గుర్తుచేసుకున్నారు రామెటీ. ప్రస్తుతం ఆమె ఐబీఎం చైర్మన్, ప్రెసిడెంట్, సీఈవో. 2012లో రామెటీ సీఈవో పదవిలోకి వచ్చినప్పుడు, 'ఐబీఎం తొలి మహిళా సీఈవో'గా గుర్తింపు పొందారు. అయితే అది రామెటీకి ఇష్టం లేని గుర్తింపు. 'నేనొక సీఈవోని. అంతే తప్ప మేల్ సీఈవోనో, ఫిమేల్ సీఈవోనో కాదు' అని అనేవారు. అయితే కొద్దిరోజులకే తన అభిప్రాయాన్ని మార్చుకున్నారట రామెటీ. ''రోల్ మోడల్‌గా ఉండటం ముఖ్యం అని నేను గ్రహించాను'' అని తన తన ప్రసంగంలో చెప్పారు.



> అదే నీ ప్లేస్‌లో మగవాడెవరైనా ఉంటే అలా అనడు తెలుసా?" అని విస్తుపోయాడు నా భర్త!
>
> – గిమీ రామెటీ, ఐ.బి.ఎం. సీఈవో


రామెటీ భర్త, రామెటీకి ఇచ్చినట్లుగా.. ఇంట్లో మగవాళ్లు ఆడవాళ్లకు స్ఫూర్తిని, ప్రేరణను ఇవ్వగలరేమో కానీ.. ఇంటి పనుల్లో మనస్ఫూర్తిగా ఒక చెయ్యివేస్తారా అన్నది సందేహమే! 'యు కెన్ డు' అని ఆమెను బయటికి పంపిస్తే సరిపోయిందా? 'ఐ కెన్ డు ఇట్' అని ఇంట్లో పూచికపుల్లను అటు తీసి ఇటైనా పెట్టాలి కదా. అసలు ఆడవాళ్లు ఇంటిని, ఆఫీస్‌ని బ్యాలెన్స్ చేసుకోవడం ఎంత కష్టమో, 'థింక్ ఫోరమ్'కి వచ్చిన ఐ.సి.ఐ.సి.ఐ. బ్యాంక్ ఎండీ, సీఈవో చందా కొచ్చర్ చెప్తుంటే.. కిరీటాలు మోస్తూ, కిచెన్‌లో పాత్రలు సర్దడం అంత తేలిక కాదనిపిస్తుంది. రామెటీ, కొచ్చర్.. ఇంకా కొంతమంది మహిళా చైర్మన్‌లు, సీఈవోలు కూర్చొని ఉన్నప్పుడు పిచ్చాపాటీగా ఈ విషయాలు వచ్చాయి. ''మహిళ.. ఆఫీస్‌కి నూరు శాతం, ఇంటికి నూరుశాతం ఇవ్వాల్సి ఉంటుంది. ఈ రెండింటినీ బ్యాలెన్స్ చేసుకోవడం అంటే 200 శాతం ఇవ్వడం'' అంటారు కొచ్చర్.



> మహిళ.. ఆఫీస్‌కి నూరు శాతం, ఇంటికి నూరుశాతం ఇవ్వాల్సి ఉంటుంది. ఈ రెండింటినీ బ్యాలెన్స్ చేసుకోవడం అంటే 200 శాతం ఇవ్వడం"
>
> – చందా కొచ్చర్, ఐ.సి.ఐ.సి.ఐ. బ్యాంక్ సీఈవో

అయితే ఇక్కడ మనం ఒక విషయాన్ని యాడ్ చేసుకోవలసి ఉంటుంది. కంపెనీలు ఎన్ని సౌకర్యాలు ఇచ్చినా, ఇంట్లో కంపానియన్‌లు కూడా చక్కగా ఉంటేనే స్త్రీ తన శక్తి సామర్థ్యాలను నిరూపించుకోడానికి అవకాశం కలుగుతుంది. అంటే.. స్ఫూర్తిని ఇవ్వడం ఒక్కటే కాకుండా, చేయూతనూ ఇవ్వాలి. చేయూత అనగానే మగాళ్లు భీతిల్లనక్కర్లేదు. తిండికి కాస్త లేట్ అయితే, ముఖం మాడ్చుకోకుండా ఉంటే చాలు. లేదా, ఆఫీస్ నుంచి ఆమె రావడం కాస్త ఆలస్యం అయితే, ఆలోపు ఇన్ని బియ్యం ఉడకేసి, పిల్లలకి తినిపించి పడుకోబెట్టినా చాలు. పెద్దపెద్ద కంపెనీల్లో పనిచేసే భార్యాభర్తలకి బియ్యం ఉడకేయడం, ఉల్లిపాయలు తరిగిపెట్టడం వంటివి ఉంటాయా అనుకోకండి. ఐబీఎంలో చేస్తున్నా, ఐసీఐసీఐలో చేస్తున్నా ఇల్లు ఇల్లే.

లవ్ డాక్టర్ — నన్నడగొద్దు ప్లీజ్


ప్రియదర్శిని రామ్
లవ్ డాక్టర్

హాయ్ సార్..! మాది ఓ మధ్యతరగతి కుటుంబం. నేను ఒక అమ్మాయిని ఇష్టపడ్డాను. తనూ నన్ను ఇష్టపడింది. పెళ్లి చేసుకుందామనుకున్నాం. ఆ విషయం ఇంట్లో చెబితే మా వాళ్లు ఒప్పుకోవడం లేదు. వాళ్ల ఇంట్లో ఓకే అన్నారు. తను చాలా మంచిది. ఏ విషయంలోనైనా నిజాయితీగా, ముక్కుసూటిగా ఉండే మనిషి. తనంటే నాకు చాలా ఇష్టం. తను నాతో ఉంటే నేను చాలా ఆనందంగా ఉంటాను. అయితే వాళ్లు కాస్త పూర్ కావడంతో కట్నం ఎక్కువగా ఇవ్వలేరని మా వాళ్లు ఒప్పుకోవడంలేదు. నాకు మాత్రం ఆ అమ్మాయినే చేసుకోవాలనుంది. ఏం చెయ్యాలో అర్థం కావడంలేదు. ప్లీజ్ మంచి సలహా ఇవ్వండి.

- సాగర్

సంస్కారం ఉన్న వాడివిగా అనిపిస్తున్నావు. ప్రేమ ఇంపార్టెంట్ అంటున్నావు.

పెళ్లి చేసుకుంటానంటున్నావు.

కలసి జీవించడంలో ఆనందం ఉందంటున్నావు.

అమ్మాయి గుణం గొప్ప ఆస్తి అంటున్నావు.

'నిజమే సార్.. అంత మంచి అమ్మాయే కట్నం కదా సార్??'

కట్నమేంటి నీలూ.. అదొక భ్రమ..

అలా అయితే పైసలున్నోళ్లందరూ....

'చాలా సంతోషంగా సంసారాలు నడపాలి కదా సార్?'

డబ్బు సంసారంలో సఖ్యతను తేలేదు.

ఎంత పోసినా ప్రేమను తేలేదు.

సాగర్ అదృష్టవంతుడు..

'అవును సార్.. గొప్ప గుణమున్న అమ్మాయి..

ఎన్ని జన్మల రుణముంటే దొరకాలి?'

అబ్బో నీలూ... నువ్వు కూడా కవిత్వం..?!

'సావాస దోషం సార్...' అని నవ్వింది నీలాంబరి.

లవ్ డాక్టర్, సాక్షి ఫ్యామిలీ, సాక్షి టవర్స్, రోడ్ నంబరు 1, బంజారాహిల్స్, హైదరాబాద్-34. lovedoctorram@sakshi.com

కాయుకో సుడోకు

1				8	3		4	7
3			4	6	7	2		1
					2		3	
	4			9		1		
5		6				9		4
		7		4			6	
	2		7					
8		4	6	2	9			3
7	9		5	3				8

నిబంధనలు: ప్రతి వరుసలో 1 నుంచి 9 అంకెలు నింపండి (అడ్డంగా,నిలువుగా). ఒక వరుసలో ఒక అంకెను ఒకసారి మాత్రమే వాడాలి. ప్రతి 3X3 చదరం లోనూ 1 నుంచి 9 అంకెలు రావాలి.

నిన్నటి జవాబు

7	4	1	5	2	6	3	9	8
9	5	2	7	3	8	4	1	6
8	3	6	9	1	4	7	2	5
3	1	5	4	7	2	8	6	9
6	8	7	3	9	5	2	4	1
2	9	4	6	8	1	5	7	3
5	6	8	1	4	7	9	3	2
1	7	3	2	5	9	6	8	4
4	2	9	8	6	3	1	5	7

లవ్ హ్యూమర్

మగపురుగులా ప్రేమించండి!



అమ్మాయి పట్ల అనుచితంగా ప్రవర్తించిన దాఖలా బయటపడ్డప్పుడల్లా 'మగపురుగూ... మగపురుగూ' అంటూ మగాడు మాటపడడం మామూలే. అనేవాళ్లను అలాగే అననివ్వండి. మగాడి ప్రేమ నిజమే అయితే... నిజంగా వాడు స్వచ్ఛంగా మగపురుగులాగే ప్రేమించాలి. అచ్చంగా మగపురుగులాగే ప్రవర్తించాలి. అప్పుడు ప్రేమలో ప్రేమే తప్ప ప్రేమలో మోసా లుండవు.

ఏ పురుగుకైనా కనీసం ఆరు లేదా అంతకు మించి కాళ్లుంటాయి. తన జంట పక్షిని అపురూపంగా చూసుకునే పిట్టజాతికంతటికీ రెండే రెక్కలు ఉంటాయి. ఆ రెక్కలకు ముక్కును జత చేసి... ఆడపిట్టకోసం మగది గూడల్లుతుంది. కూడు తెస్తుంది. గుడ్డ కూడా తెచ్చేదేమో గానీ.. పిట్టకు ఆ్రలెడీ ఈకలున్నాయి. బేసిక్ నీడ్స్ కోసం మగపిట్ట ఉన్న రెండు రెక్కలనే ముక్కలు చేసుకుంటుంది. అలాంటప్పుడు 'మగపురుగు' అని పిలిపించుకునే మగాడు ఆరు నుంచి ఎనిమిది లేదా ఆపైన ఎగ్స్ట్రా కాళ్లతో ఎంత కాయ కష్టం చేయాలి? అలా అమ్మాయికి ఏమాత్రం కష్టం కలగకుండా చూసుకోవాలన్నది 'మగపురుగు' అనే మాట లోని అసలు ఉద్దేశం.



పురుగులోని ఇంకో లక్షణం... పైకి పొడుచుకొచ్చినట్టుగా కనిపించే కళ్లు. పురుగు జాతి వర్గానికి చెందిన తూనీగకైనా లేదా మరింకేదైనా కీటకానికైనా కళ్లు ముందుకు పొడుకొచ్చినట్టుగా ఉంటాయి. అనేక కళ్లు కలిసి ఒకే కన్నుగా ఏర్పడి 'కాంపౌండ్ ఐ' పేరిట నిశితంగా చూస్తాయవి. అంటే... మగపురుగు కూడా ఎంతో దూరదృష్టితో, నిశిత దృష్టితో అమ్మాయిని జాగ్రత్తగా 'చూసు'కోవాలి. అదే.. మగాడు మగపురుగుగా మారాలన్న మాటలోని అంతరార్థం.



చివరగా ఇది చివరి ఉదాహరణ. అన్నిటికీ మించిన ఉదాహరణ. ప్రేయింగ్ మ్యాంటిస్ జాతి పురుగుల్లో మగ, ఆడపురుగులు తగు సమయం రాగానే ప్రణయం జరుపుతాయి. ఆ సమయంలో ఆడ జీవి అక్కడితో ఆగకుండా మగపురుగును కొరుక్కుతినడం మొదలుపెడుతుంది. తన జాతిపేరే 'ప్రేయింగ్' మ్యాంటిస్! అందుకే అది మొదటి ముద్దను చేతులు జోడించి మరీ ప్రార్థిస్తూ తినడం మొదలుపెడుతుంది. మగది మరణిస్తే మరో తరం లేకుండానే మ్యాంటిస్ జాతే అంతరిస్తుందే!! అందుకే ఆ ఉత్పాతం జరగకుండా చూసేందుకు జనలర్‌గా మగాళ్లకు మోకాళ్లలోలాగే... మగ మ్యాంటిస్ పురుగుకు నడుములో మెదడును ఉంచింది ప్రకృతి. తినడం కాస్తా నడుము వరకు వచ్చే లోపు మగపురుగు పుట్టుకకు ప్రయోజనం, దాని జన్మకు సార్థకతా చేకూరతాయి. ఈ త్యాగానికి ఉన్న అతి బరువైన ఇంగ్లిష్ పేరే 'సెక్సువల్ కేనిబాలిజం'.

> *అమ్మాయికి కష్టం కలగకుండా చూసుకోవాలన్నది 'మగపురుగు' అనేమాటలోని అంతర్థామేమో!*

అవును... మగపురుగులా బతకండి. అమ్మాయిని నిష్కలశంగా, నిష్కపటంగా మగపురుగుల్లా ప్రేమించండి. ప్రతిమాటలోనూ పాజిటివ్ దృక్పథం చూపండి. అలా పాజిటివ్ పురుగులా బతకండి.

ఎందుకంటే... ఏ మగపురుగూ... యాసిడ్ పోయదు. ఆమాటకొస్తే... తాను అంతరిస్తూ... తర్వాతి తరం కోసం తన దేహాన్నే సారంగా ఇస్తుంది. పురుగులా బతికి పురుగులా చస్తుంది. సో... బీ ఏ మగపురుగు... మహా మంచి మగ పురుగు!!

- యాసీన్


కిరణ్, సంజయ్, మహేశ్‌బాబు, జాహ్నవి, మంజుల, అమైరా, సందీప్ కిషన్

ఆ మాట వినగానే షాక్ అయ్యా

- మహేశ్‌బాబు

''మంజుల డైరెక్షన్ చేస్తుందని ఊహించలేదు. హాలిడేస్ టైమ్‌లో తను ఏదో రాసుకుంటుంటే కవిత రాసుకుంటుందేమో అనుకున్నా. కానీ సినిమా కథ రాసుకుంటుందని అనుకోలేదు'' అని హీరో మహేశ్‌బాబు అన్నారు. సందీప్ కిషన్, అమైరా దస్తూర్, త్రిదా చౌదరి హీరో హీరోయిన్లుగా మంజుల దర్శకత్వంలో సంజయ్ స్వరూప్, పి.కిరణ్ నిర్మించిన 'మనసుకు నచ్చింది' సినిమా రేపు విడుదలవుతోంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రీ–రిలీజ్ వేడుకకి ముఖ్య అతిథిగా విచ్చేసిన మహేశ్‌బాబు మాట్లాడుతూ– ''మంజుల కథ ప్రిపేర్ చేసుకొని, సినిమా చేయబోతున్నానని చెప్పినప్పుడు నేను షాక్ అయ్యా. ఒకరకంగా గర్వంగా ఫీలయ్యాను. విజువల్స్ బాగా నచ్చాయి. మా కిరణ్‌గారి సపోర్ట్, గైడెన్స్ సినిమాకి చాలా ప్లస్ అయ్యింది. సినిమా తప్పకుండా హిట్ అవుతుందని ఆశిస్తున్నా. భవిష్యత్‌లో మా అక్కతో (మంజుల) సినిమా కూడా చేస్తానేమో?'' అన్నారు. ''మనసుకు నచ్చింది' కథ రాయడం మొదలుకొని, సినిమా పూర్తి చేయడం వరకూ ఒక నేచురల్ ప్రాసెస్‌లా జరిగింది. మా నాన్నగారు (కృష్ణ), తమ్ముడు మహేశ్ గర్వపడేలా ఈ సినిమా ఉంటుంది. ఒకానొక సందర్భంలో మహేశ్ కొడుకు గౌతమ్ వెళ్లి 'నాన్నా.. మంజుల ఆంటీ సినిమాలో ఎప్పుడు యాక్ట్ చేస్తావ్?' అని అడిగితే చాలా సింపుల్‌గా 'అదే నా ఆఖరి సినిమా అవుతుంది' అన్నాడట (నవ్వుతూ). కిరణ్‌గారి సహకారానికి రుణపడి ఉంటా'' అన్నారు మంజుల. ''మంజులగారి దర్శకత్వంలో హీరోగా చేయడం.. అది ఆమె ఫస్ట్ మూవీ కావడం నా లక్'' అన్నారు సందీప్ కిషన్.

లవ్ లాక్


ఉప్సీ-రామ్ లవ్ లాక్


ఉపాసన, రామ్‌చరణ్

ఫిబ్రవరి 14... ప్రేమికుల దినోత్సవం. ప్రేమికులంతా తాము ప్రేమించిన వారిపై ప్రేమను రకరకాల రూపాల్లో చూపిస్తుంటారు. కొందరు గిఫ్ట్స్ ఇచ్చి, కొందరు సర్‌ప్రైజ్‌లు ఇచ్చి, ఒక్కొక్కరు ఒక్కోలా. ఎవరు ఎలా ప్రేమను చూపించినా కూడా ఆ ప్రేమను చిరకాలం జ్ఞాపకంగా మార్చుకోవటానికే. రామ్‌చరణ్, ఆయన వైఫ్ ఉపాసన కూడా ఈ వేలంటైన్స్ డేను ఆస్ట్రియాలో ఆ దేశ స్టైల్లోనే జరుపుకున్నారు. 'రంగస్థలం' షూటింగ్ కంప్లీట్ చేసుకొని హాలిడేకు వెళ్లిన రామ్‌చరణ్ దంపతులు వాళ్ల ప్రేమను లాక్ చేసుకున్నారు. ప్రేమను లాక్ చేసుకోవటం ఏంటీ? అనుకుంటున్నారా... లవ్‌ను లాక్ చేసుకోవటమే ఆస్ట్రియాలోని 'సాల్జ్‌బర్గ్ లవ్ లాక్ బ్రిడ్జ్' ప్రత్యేకత. ఆ బ్రిడ్జ్ మీద ఇద్దరి ప్రేమికుల పేర్లను ఒక లాక్ (తాళం కప్ప) పై రాసి, దాన్ని ఆ బ్రిడ్జ్‌కి సైడ్ ఉన్న ఫెన్స్‌కు లాక్ చేసి, ఆ కీను ఆ నదిలో పారేస్తారట. అలా చేస్తే వారి ప్రేమ విడదీయలేని బంధంగా మారుతుందని నమ్ముతారట. ఉపాసన కూడా ఉప్సీ–రామ్ అంటూ ఓ లాక్‌పై రాసి వేలంటైన్స్ డేను సెలబ్రేట్ చేసుకున్నారు. ఫొటోలో ఉప్సీ–రామ్ అని రాసి ఉన్న తాళం కనిపిస్తోంది కదా. అదే ఈ జంట లవ్ లాక్.

కొత్త డైరెక్టర్ చేశాడా అని పెదనాన్న షాక్ అయ్యారు

- వరుణ్ తేజ్


రాశీ ఖన్నా, వరుణ్‌తేజ్, 'దిల్'రాజు, బీవీఎస్ఎన్ ప్రసాద్, వెంకీ, తమన్

''లవ్ స్టోరీకు కావల్సింది కెమిస్ట్రీ అని అప్పుడు ఆ 'తొలిప్రేమ', ఇప్పుడు ఈ 'తొలిప్రేమ' ప్రూవ్ చేశాయి. వరుణ్, రాశీ కెమిస్ట్రీ బాగా వర్కవుట్ అయింది '' అన్నారు నిర్మాత 'దిల్' రాజు. వరుణ్ తేజ్, రాశీ ఖన్నా జంటగా వెంకీ అట్లూరి దర్శకత్వంలో బీవీఎస్ఎన్ ప్రసాద్ నిర్మించిన 'తొలిప్రేమ' సినిమా సక్సెస్ మీట్‌లో 'దిల్' రాజు మాట్లాడుతూ – ''ఫిదా' స్టార్ట్ అయ్యే టైమ్‌లో వెంకీ నా దగ్గరకు వచ్చి 'సార్ నేనీ సినిమా బయటవాళ్లతో చేసుకుంటాను' అన్నాడు. 'సరే' అన్నాను. సినిమా అయిపోయాక బాపినీడు సినిమాను తీసుకొచ్చి మళ్లీ నా చేతుల్లో పెట్టాడు. వరుణ్ తేజ్ లుక్స్ బాగున్నాయి. 'ఫిదా, తొలిప్రేమ' బ్యాక్ టు బ్యాక్ హిట్స్ సాధించాడు. నెక్ట్స్ సినిమాతో హ్యాట్రిక్ కొట్టాలి. రాశీ బాగా చేసింది'' అన్నారు. వరుణ్ తేజ్ మాట్లాడుతూ – ''ఈ కథను నమ్మిన 'దిల్' రాజు గారికి థ్యాంక్స్. మీరు లేకపోతే సినిమా స్టార్ట్ అవ్వకపోయేది. నా మీద, వెంకీ మీద నమ్మకం ఉంచారు. వెంకీకి సినిమా మీద ఉన్న ప్రేమ, మేకింగ్‌లో ఉన్న కన్విక్షన్ సూపర్బ్. పెదనాన్న (చిరంజీవి) ఈ సినిమాను చూసి, డెబ్యూ డైరెక్టర్ ఈ సినిమా తీశాడా అని షాక్ అయ్యారు'' అన్నారు. ''ఈ సినిమాతో నాకు ఫీమేల్ ఫ్యాన్స్ పెరుగుతారు అనుకుంటున్నాను. నాకు ఇంత మంచి క్యారెక్టర్ రాసిన వెంకీకి థ్యాంక్స్'' అన్నారు రాశీ ఖన్నా. వెంకీ మాట్లాడుతూ – ''రాశీని అనుకున్నప్పుడు భయం ఉండేది కానీ చాలా బాగా చేసింది. ఈ కథను వరుణ్ బిలీవ్ చేయటం వల్లే ఈ సినిమా ప్రాణం పోసుకుంది. ఈ సినిమాకు రెండు పిల్లర్స్ జార్జ్, తమన్. లిరిక్స్ రాసిన శ్రీ మణిగారికి థ్యాంక్స్. ప్రసాద్‌గారిని సార్ అని పిలుస్తాను కానీ నాకు ఫ్రెండ్ లాంటి వారు. బాపినీడు మంచి ఫ్రెండ్'' అన్నారు. ''ఈ సినిమా సక్సెస్ క్రెడిట్ అంతా వరుణ్ తేజ్‌కు ఇస్తున్నాను. ఎందుకంటే ఈ సినిమాను నమ్మి చేశాడు. టెక్నీషియన్స్ అందరూ చాలా బాగా చేశారు'' అన్నారు బీవీఎస్ఎన్ ప్రసాద్. ''నేను ఫస్ట్ టైమ్ వర్క్ చేసిన హీరోస్ అందరితో బ్లాక్‌బాస్టర్స్ కొట్టాను 'బృందావనం, కిక్, దూకుడు'.. ఈ సినిమా స్టార్ట్ అప్పుడు ఇదే అనుకున్నాను. అలాగే సూపర్ హిట్ అయింది'' అన్నారు తమన్.

ప్రేమికుల దినోత్సవం సాక్ష్యంగా...

బెల్లంకొండ శ్రీనివాస్, పూజా హెగ్డే జంటగా రూపొందుతోన్న డిఫరెంట్ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'సాక్ష్యం'. శ్రీవాస్ దర్శకత్వంలో అభిషేక్ పిక్చర్స్ పతాకంపై అభిషేక్ నామా నిర్మిస్తున్నారు. ప్రేమికుల దినోత్సవాన్ని పురస్కరించుకొని హీరో హీరోయిన్ ఫస్ట్ లుక్ విడుదల చేశారు. ఈ సందర్భంగా అభిషేక్ నామా మాట్లాడుతూ– ''సాక్ష్యం'లో హీరో, హీరోయిన్ పాత్రలు చాలా వైవిధ్యంగా ఉంటాయి. శ్రీవాస్ వారి పాత్రలు రాసిన విధానం బాగుంది. ఆయన దర్శకత్వ శైలి పూర్తిగా మారిపోయింది. సినిమాలో కీలకమైన ఫైట్ సీక్వెన్స్‌ని పీటర్ హెయిన్ మాస్టర్ ప్రత్యేక శ్రద్ధ తీసుకొని తెరకెక్కిస్తున్నారు. ఆర్ఎఫ్‌సీలో జరుగుతున్న క్లైమాక్స్ షూటింగ్‌లో శ్రీనివాస్, పూజ పాల్గొనగా కాంబినేషన్ సీన్స్ తీస్తున్నాం. కీలక పాత్రధారులైన జయప్రకాశ్, పవిత్ర లోకేష్, 'వెన్నెల' కిషోర్‌ల కాంబినేషన్‌లో మరికొన్ని కీలక సన్నివేశాలు చిత్రీకరించనున్నాం'' అన్నారు. జగపతిబాబు, శరత్ కుమార్, మీనా, బ్రహ్మాజీ, రవికిషన్, అశుతోష్ రాణా, మధు గురుస్వామి, లావణ్య తదితరులు ముఖ్యపాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: ఆర్థర్ ఎ.విల్సన్, సంగీతం: హర్షవర్ధన్, నిర్మాణం: అభిషేక్ పిక్చర్స్.


పూజా హెగ్డే, సాయిశ్రీనివాస్

అన్ని అడ్డంకులను దాటిన

రచయిత


సంచిత పదుకొనే, విద్యాసాగర్ రాజు

''చిన్న సినిమాల విడుదలలో చాలా ఇబ్బందులున్నాయంటే ఏంటో అనుకున్నా. ఇప్పుడు అనుభవపూర్వకంగా తెలిసింది. 'రచయిత' సినిమా విడుదలకు నిర్మాత చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ సినిమాని రంజిత్ మూవీస్ డిస్ట్రిబ్యూషన్లో నైజాంలో రిలీజ్ చేస్తున్నాం. ఇదొక పక్కా తెలుగు సినిమా'' అన్నారు నిర్మాత దామోదర ప్రసాద్. విద్యాసాగర్ రాజు హీరోగా నటించి, దర్శకత్వం వహించిన చిత్రం 'రచయిత'. సంచిత పదుకొనే కథానాయిక. కల్యాణ్ ధూళిపాళ్ల నిర్మించిన ఈ సినిమా రేపు విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్రనిర్మాత ధూళిపాళ్ల మాట్లాడుతూ– ''సినిమా నిర్మించడం ఒక ఎత్తయితే.. రిలీజ్ చేయడం మరో ఎత్తని 'రచయిత' రిలీజ్ విషయంలో నాకు తెలిసింది. మా సినిమా అడ్డంకులను అధిగమించడానికి కృషి చేసిన దామోదర ప్రసాద్, రామదాసు, హీరో జగపతిబాబులకు ధన్యవాదాలు. సినిమా బాగా వచ్చింది. ప్రేక్షకులు ఆదరిస్తారని ఆశిస్తున్నా'' అన్నారు. ''ఎమోషన్ థ్రిల్లింగ్ కథాంశంతో రూపొందిన చిత్రమిది. ఒక అమ్మాయి మనసు లోతు ఎంత ఉంటుందో చూపించాం. చంద్రబోస్ మూడు పాటలకు అద్భుతమైన లిరిక్స్ అందించారు'' అన్నారు విద్యాసాగర్ రాజు. నిర్మాత ముత్యాల రామదాస్, పాటల రచయిత చంద్రబోస్, సంచిత పదుకొనే తదితరులు పాల్గొన్నారు.

స్పోర్ట్స్ కామెడీ


సంతోష్, రాజీవ్

గత ఏడాది చిన్న చిత్రంగా విడుదలై పెద్ద హిట్ సాధించిన మలయాళ చిత్రం 'గోదా'. టవీనొ థామస్ , వామికా గబ్బి, ప్రముఖ రచయిత రెంజీ పనికర్ నటించిన ఈ చిత్రానికి బసిల్ జోసఫ్ దర్శకత్వం వహించారు. 2017 మేలో విడుదలైన ఈ సినిమా మాలీవుడ్‌లో సూపర్ డూపర్ హిట్ అయింది. బాలీవుడ్‌లో సైతం ఈ సినిమాను రీమేక్ చేసేందుకు భారీ నిర్మాణ సంస్థలు సిద్ధమవుతున్నాయి. తెలుగులో కొంకా ప్రొడక్షన్స్ సంస్థ 'గోదా' డబ్బింగ్ మరియు రీమేక్ రైట్స్ సొంతం చేసుకొంది. తెలుగు హక్కుల కోసం ఎంతోమంది పోటీ పడగా నిర్మాత సంతోష్ కొంకా ఫ్యాన్సీ ఆఫర్‌తో సొంతం చేసుకున్నట్లు కొంకా ప్రొడక్షన్స్ సంస్థ ఎగ్జిక్యూటివ్ రాజీవ్ కె.రామ తెలిపారు. ఇంకా ఆయన మాట్లాడుతూ –''ఇది స్పోర్ట్స్ కామెడీ మూవీ. ప్రస్తుతం తెలుగు రీమేక్‌కు సంబంధించిన స్క్రిప్ట్ వర్క్ శరవేగంగా జరుగుతోంది. నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలను త్వరలోనే వెల్లడిస్తాం. మలయాళంలోలా తెలుగులోనూ హిట్ అవుతుందనే నమ్మకం ఉంది'' అన్నారు.




అమ్మో... ఎంత అమాయకంగా కనబడుతుంది!
తెల్లగా నిగనిగలాడుతూ... స్ఫటికంగా స్వచ్ఛంగా మెరుస్తూ!
కానీ... అమ్మో...
వైట్ పాయిజన్ అట.
సైలెంట్‌గా ప్రాణం మీదికి తెస్తుందట.
అందుకే... బీ కేర్‌ఫుల్ ఆఫ్ ష్‌ష్‌షు...గర్.
అండ్ చెక్ ద చక్కెర!!

చక్కెర... ఏ తినుబండారాన్నైనా తియ్యగా మార్చాలంటే చాలా తేలిగ్గా ఉపయోగించగల పదార్థం. చిన్న చిన్న స్ఫటికాలుగా చెంచాలో పట్టేలా ఉండటమే దీన్ని బాగా ఉపయోగంలోకి తెచ్చింది. అదే బెల్లం లేదా తేనె అనుకోండి. మొదటిది అచ్చులుగా ఉండి, కావాల్సిన పరిమాణంలో పడకపోవచ్చు. ఇక రెండోదైన తేనె విషయానికి వద్దాం. అదెంతో ఆరోగ్యకరమే అయినా చిక్కటి ద్రవం రూపంలో ఉండటంతో హ్యాండ్లింగ్ ఒకింత కష్టం. అందుకే చక్కెరకు అంత ప్రాచుర్యం. కానీ చక్కెర అంటే తెల్లటి విషం అంటున్నారు చాలామంది ఆహారనిపుణులు.

చెక్ కెర

పిల్లలెవరైనా సిగరెట్‌తో కనిపిస్తే తిడతాం. చెడ్డ అలవాటంటూ క్లాస్ తీసుకుంటాం. వాళ్లు మద్యం జోలికి వెళ్లారా... మన ప్రతిచర్య మరింత తీవ్రంగా ఉంటుంది. కానీ చేజేతులారా పిల్లలకు మనమే తీపి పదార్థాలూ, క్యాండీలు ఇస్తుంటాం. వాటిల్లో చాలావరకు చక్కెరతో తయారైనవే ఉంటాయి. చక్కెరతో తయారైన పదార్థాలు వాళ్లకు ఇవ్వడం అంటే చేజేతులారా సిగరెట్ లేదా మద్యం కంటే హానికరమైన పదార్థాలు వాళ్లకు సాక్షాత్తూ పెద్దలే అందించడం లాంటిది అంటున్నారు ప్రముఖ బయోకెమిస్ట్ రేమండ్ ఫ్రాన్సిస్. ఆయన రాసిన 'నెవర్ బి సిక్ అగైన్' (ఇంకెప్పుడూ జబ్బుపడకండి) అనే పుస్తకం చాలా ప్రఖ్యాతి పొందింది. చక్కెర గురించి ఆయన చెబుతున్న విషయాలివి...

''చక్కెర తెల్లగా, ఆకర్షణీయంగా కనిపించే ఒక తియ్యటి విషం. చాలారోజుల కిందట నేను జబ్బుపడ్డాను. స్వతహాగా బయోకెమిస్ట్‌ను కావడంతో ఆహారపదార్థాలు, అవి తినగానే మనలో జరిగే జీవరసాయన చర్యలపై నాకు అవగాహన ఉంది. దాంతో నా ఆహారం ఆరోగ్యకరంగా ఉండేలా జాగ్రత్త వహించాను. అంటే నా ఆహారంలో అన్ని పోషకాలు ఉండేలా చూసుకోవడం, ఎక్కువగా ఆకుకూరలు తీసుకోవడం వంటి నియమాలు పాటించాను. దాంతో కిందటి సారి జబ్బు పడి కోలుకున్న తర్వాత గత 26 ఏళ్లలో మళ్లీ నేను కనీసం ఎప్పుడూ చిన్న జ్వరానికి కూడా గురికాలేదు. కాకపోతే ఒక్కసారి మాత్రం నాకు జలుబు చేసింది. దానికి కారణం కూడా నాకు తెలుసు ఒక సారి నేను చక్కెరతో చేసిన పదార్థం తినడమే ఇందుకు కారణం'' అంటారాయన.



రేమండ్ ఫ్రాన్సిస్,
బయో కెమిస్ట్, 'నెవర్ బి సిక్ అగైన్' పుస్తక రచయిత

చక్కెర ఎందుకు, ఎంత ప్రమాదం...

మనం జీవితంలో ఎప్పుడూ జబ్బుపడకుండా ఉండాలంటే కేవలం చక్కెర తీసుకోకుండా ఉంటే చాలంటారు రేమండ్ ఫ్రాన్సిస్. ఆయన రాసిన 'నెవర్ బి సిక్ అగైన్', 'నెవర్ బి ఫ్యాట్ అగైన్', నెవర్ ఫియర్ క్యాన్సర్ అగైన్', 'నెవర్ ఫీల్ ఓల్డ్ అగైన్', 'ద గ్రేట్ అమెరికన్ హెల్త్ హోక్స్'... పుస్తకాలన్నీ జనాదరణ పొందాయి. ఆయన చెబుతున్న ప్రకారం కేవలం ఒక టీ స్పూన్ చక్కెర తీసుకుంటే చాలు.. రెండు గంటల్లో... అది మన దేహంలోని జీవ రసాయన చర్యల్లోని అసమతౌల్యత కలగజేస్తుంది. దాంతో మన వ్యాధి నిరోధక సామర్థ్యం 50 శాతం తగ్గుతుంది. ఈ లెక్కన ఏదైనా వ్యాధికారక క్రిములతో మనకు ఇన్ఫెక్షన్ వచ్చే అవకాశాలప్పుడు రెండు రెట్లు పెరుగుతాయి కదా. అలా మనం జబ్బు పడే అవకాశాలు ఎక్కువ అంటారు రేమండ్ ఫ్రాన్సిస్. ఇక ఆయన కోలా సాఫ్ట్‌డ్రింక్స్‌ను ఎంతగా నిరసిస్తారంటే... కేవలం ఒక టీ స్పూన్ చక్కెరతోనే ఇంత ప్రమాదం ఉందంటే... ఒక సాఫ్ట్‌డ్రింక్‌లో 10 – 12 టీస్పూన్ల చక్కెరకు తక్కువ ఉండదు. అలాంటిప్పుడు అదెంత హానికరమో ఆలోచించండి... అంటారు.

చక్కెర ఎందుకు హానికరమంటే...

కేవలం రేమండ్ ఫ్రాన్సిస్ చెప్పడం మాత్రమే కాదు... చక్కెర హానికరం అని చెప్పే పరిశోధనలు ఎన్నెన్నో ఉన్నాయి. అనేక అధ్యయనాలను బట్టి ఆరోగ్యకరమైన బెల్లం, తేనె వంటి స్వీటెనర్లతో పోలిస్తే చక్కెర ఎందుకు హానికరమో చెప్పడానికి ఒక దృష్టాంతమిది... చక్కెరను ప్రాసెస్ చేసే ప్రక్రియలో గంధకం (సల్ఫర్) ఒక ప్రధానమైన రసాయనం. అంటే మనం బాణాసంచాలోనూ, టపాకాయల్లోనూ ఉపయోగించే రసాయనాన్నే చక్కెర ప్రాసెసింగ్‌లో ఉపయోగిస్తున్నామన్న మాట. కేవలం గంధకం మాత్రమే కాకుండా... మానవులకు హానికరమైన మరో 23 రసాయనాలను చక్కెర ప్రాసెసింగ్‌లో వాడతారు.

చక్కెర తెచ్చే అనర్థాల్లో కొన్ని ప్రధానమైనవి...

- చక్కెరతో ఒంట్లో చెడు కొలెస్ట్రాల్, ట్రైగ్లిజరైడ్స్ పాళ్లు పెరుగుతాయి. తద్వారా అది గుండెజబ్బులకు తావిస్తుంది.
- చక్కెర వినియోగం పెరిగితే అది ఊబకాయాన్ని కలిగిస్తుంది. ఊబకాయంతో వచ్చే అనర్థాలు అన్నీ ఇన్నీ కావన్నది తెలిసిందే.
- ఊబకాయం పెరగడం వల్ల వచ్చే అనర్థాల్లో ముఖ్యమైనది అధికరక్తపోటు. అంటే పరోక్షంగా చక్కెరతో మనం హైబీపీని తెచ్చిపెట్టుకుంటున్నామన్నమాట.
- ఒక్కోసారి మరణానికి... లేదా మరణం తప్పినా జీవితాంతం వైకల్యంతో బాధపడేలా చేసే పక్షవాతానికి ప్రధాన కారణం చక్కెర.
- చక్కెర తినడం వల్ల డయాబెటిస్ రాకపోయినా... ఒకసారి డయాబెటిస్ వచ్చాక చక్కెర తినడం ఎంత ప్రాణాంతకమో అందరికీ తెలిసిన విషయమే.
- చాలామంది పచ్చళ్లు, వంటకాల్లో మితిమీరిన కారం లేదా మసాలాలు మాత్రమే కడుపులోని అల్సర్లకు కారణం అనుకుంటారు. కానీ చక్కెర కూడా కడుపులో అల్సర్స్ వచ్చేందుకు అంతే సమానంగా దోహదం చేస్తుంది.

నిపుణులు చెప్పే మాటలివి...

'సెయింట్ విత్ స్టెతస్కోప్' అంటూ ఆదరంగా పిలుచుకునే కేరళకు చెందిన ప్రముఖ ఆంకాలజిస్ట్ డాక్టర్ పి.వి. గంగాధరన్‌తో పాటు చాలామంది క్యాన్సర్ చికిత్సా నిపుణులు చక్కెర గురించి చెప్పే మాటలివి...

- మీరు చక్కెరకు దూరంగా ఉండగలిగితే చాలు... క్యాన్సర్ కణం దానంతట అదే నశిస్తుంది.
- ప్రతిరోజూ కాస్తంత గోరువెచ్చని నీళ్లలో ఒక నిమ్మకాయ పిండుకొని పరగడుపున తాగండి. అది కీమోథెరపీ కంటే 1000 రెట్లు ప్రభావవంతమైనది. ఇది మేరీల్యాండ్ కాలేజీ నిపుణుల అధ్యయన ఫలితాలు తేల్చిన వాస్తవం.

మరి చెక్కెర లేకపోతే జీవితంలో తియ్యదనం ఎలా?





సుజాతా స్టీఫెన్
చీఫ్ న్యూట్రిషనిస్ట్
యశోద హాస్పిటల్స్
మలక్‌పేట,
హైదరాబాద్

తియ్యదనానికి చక్కెర ఒక్కటే కేరాఫ్ అడ్రస్ కాదు. దానికి ప్రత్యామ్నాయాలు చాలా ఉన్నాయి. ఉదాహరణకు మంచి పరిశుభ్రమైన బెల్లం, తేనె వంటివి. వాటితో పాటు మరికొన్ని స్వీటెనర్లూ అందుబాటులో ఉన్నాయి. వాటిలో మనకు అనువైన దాన్ని ఎంచుకోవచ్చు. ఆ స్వాభావిక, ప్రాకృతిక తీపి పదార్థాలు ఇవి కొన్ని మాత్రమే...

ఉన్నాయిగా మనకు స్వాభావిక స్వీటెనర్లు...

స్టీవియా : ఈ తీపి పదార్థాన్ని స్టీవియా రెబౌడినా అనే మొక్క నుంచి సేకరిస్తారు. ఇది స్వాభావికమైన చక్కెరతో పోలిస్తే 290 రెట్లు ఎక్కువ తీపి ఉంటుంది. దీన్ని స్వాభావిక చక్కెర (సుక్రోజ్)తో కలిపి మనకు వాణిజ్య ప్రయోజనాలకోసం 'సీఎస్‌ఆర్ స్మార్ట్' పేరిట మార్కెట్‌లో లభ్యమయ్యేలా చూస్తున్నారు.

సార్బిటాల్ : దీన్నే గ్లూసిటాల్ అంటారు. ఇది కొన్ని రకాల పండ్లను పాకం పట్టినప్పుడు చక్కెర పాకంలా తయారైన పదార్థం నుంచి సేకరిస్తారు. స్వాభావిక చక్కెరతో పోలిస్తే దీనిలో తీపిదనం కాస్తంత తక్కువ.

స్వీటెనింగ్ ఆపిల్ ఎక్స్‌ట్రాక్ట్స్: ఇక కొన్ని ఆపిల్స్ నుంచి తీసే పదార్థాలు (ఆపిల్ ఎక్స్‌ట్రాక్ట్స్) నుంచి సేకరించిన పదార్థాలు స్వాభావికం కావడంతో ఇవి తియ్యదనాన్ని, రుచినీ, ఆరోగ్యాన్నీ ఒకేసారి ఇస్తాయి.

స్వాభావిక తీపి పదార్థాలతో ప్రయోజనాలు : ● స్టీవియా తీపి పదార్థం మొక్క నుంచి సేకరిస్తారు కాబట్టి అది హానికరం కాదు. ఆ తీపి వల్ల రక్తంలోని చక్కెర పాళ్లు పెరగవు. కాబట్టి డయాబెటిస్ రోగులకు స్టీవియా మంచిది.

అగేవ్ నెక్టర్ : ఇది మెక్సికోలో పెరిగే ఒక రకం మొక్క నుంచి సేకరించే పాకం. దీనిని తినడం వల్ల సాధారణ చక్కెర తీపి తిన్నప్పటికంటే తక్కువ తీపి శరీరంలో విడుదలవుతుంది. అందుకే రక్తంలో షుగర్ పాళ్లు పెరగవు. కాబట్టి డయాబెటిస్ రోగులు తినే తీపి పదార్థాలకు ఇది చక్కెర కంటే మంచి ప్రత్యామ్నాయం.

డేట్ షుగర్ : దీని ఉపయోగం ఇప్పుడిప్పుడే ప్రాచుర్యం పొందుతోంది. డేట్ షుగర్ అంటే మరేదో కాదు. ఎండబెట్టిన ఖర్జూరాలను పొడిలా చేసి, తీపిని ఇచ్చేందుకు దాన్ని పంచదారలా వాడుకోవచ్చు. అయితే ఇది వేడి పదార్థాలలో కరగదు. ఉదాహరణకు వేడి వేడి టీలో దీన్ని చక్కెరలా వేసుకోవడం సాధ్యం కాదు. అయితే బేకింగ్ ఉత్పాదనలకు స్వీటెనింగ్ అడిటివ్‌లా మాత్రం వాడుకోవచ్చు.

తేనె : తీపిని ఇచ్చేందుకు వాడే పదార్థంగా దీని ప్రాధాన్యం, ప్రాచుర్యం అందరికీ తెలిసిందే. ఇది కేవలం ఒక రుచిని ఇచ్చే ఆహారంగానే కాక... ఔషధ గుణాలు కలిగి, ఆరోగ్యాన్ని ఇచ్చేదిగా దీని ప్రాధాన్యం అంతా ఇంతా కాదు. పరిమిత మోతాదులో దీన్ని ఎంతకాలమైనా నిరభ్యంతరంగా వాడుకోవచ్చు.

అందుకే ఇకపై చక్కెరకు బదులు ఈ స్వాభావికమైన తీపి పదార్థాలు వాడుకోండి. లేదా చక్కెరే తప్పనిసరిగా వాడుకోవాలంటే దాని ఉపయోగాన్ని వీలైనంతగా పరిమితం చేసుకోండి.

పిల్లల్లో వచ్చే క్యాన్సర్లు



Dr. Ch. Mohana Vamsy
Chief Surgical Oncologist
Omega Hospitals, Hyderabad
Ph: 98480 11421, Kurnool 08518273001

పెద్దవారిలో వచ్చే అన్ని రకాల క్యాన్సర్లూ పిల్లల్లోనూ వచ్చే అవకాశం ఉంది. అయితే ప్రధానంగా వాళ్లలో రక్తసంబంధిత క్యాన్సర్లు (లుకేమియా), మెదడు కణుతులు (బ్రెయిన్ ట్యూమర్స్), లింఫోమా, సాఫ్ట్‌టిష్యూ సార్కోమా వంటివి ఎక్కువ.

పిల్లల్లో వచ్చే క్యాన్సర్‌లు సాధారణంగా ఎలాంటి లక్షణాలూ చూపకుండా అకస్మాత్తుగా జ్వరంతో బయటపడవచ్చు. కొంతలో కొంత ఉపశమనం ఏమిటంటే... పిల్లల క్యాన్సర్లు చాలా వరకు పూర్తిగా నయం చేయదగినవే.

మన దేశంలో ప్రతీ ఏడాదీ దాదాపు 45,000 మంది పిల్లలు క్యాన్సర్ బారిన పడుతున్నారు. వీళ్లలో 70 శాతం మందికి వ్యాధి పూర్తిగా నయమవుతుంది. అయితే 30 శాతం మందిలో వారి జీవితకాలంలో అది ఎప్పుడో ఒకప్పుడు తిరగబెట్టే ప్రమాదం ఉంటుంది. చిన్నప్పుడు 20 'గ్రే'ల కంటే ఎక్కువగా రేడియేషన్‌కు గురైనా క్యాన్సర్ వచ్చే ప్రమాదం పెరుగుతుంది. 'గ్రే'అంటే శరీరం గ్రహించిన రేడియేషన్ అని అర్థం. మామోగ్రామ్ వంటి పరీక్షలు మరీ చిన్నవయసులో చేయించుకోవడం కూడా అంత మంచిది కాదు. 30 ఏళ్లు పైబడ్డాక డాక్టర్ సలహా మేరకు చేయించుకుంటేనే మంచిది.



పన్నెండేళ్లు పైబడ్డాక అమ్మాయికి గానీ, అబ్బాయికి గానీ క్యాన్సర్ చికిత్స వల్ల పునరుత్పత్తి వ్యవస్థ మీద ప్రభావం పడుతుందనుకుంటే, ముందుగానే వారి నుంచి అండాలను, వీర్యకణాలను సేకరించి భద్రపరుస్తుంటారు.

పిల్లల్లో సాధారణంగా కనిపించే క్యాన్సర్ లుకేమియా. మనల్ని ఇన్ఫెక్షన్స్ నుంచి కాపాడే తెల్లరక్తకణాలు అపరిమితంగా పెరిగిపోవడమే లుకేమియా. ఇలా అధికంగా పెరిగిన తెల్లరక్తకణాలు ఎర్రరక్తకణాలను అడ్డుకుని రక్తాన్ని సరిగా సరఫరా కానివ్వవు. దీన్ని చాలావరకు నయం చేయగలం. ఈ చికిత్సలో కీమో, రేడియో థెరపీలు ఉంటాయి. బోన్‌మ్యారో ట్రాన్స్‌ప్లాంటేషన్, స్టెమ్‌సెల్ ట్రాన్స్‌ప్లాంటేషన్ ప్రక్రియలు ఈ క్యాన్సర్‌కు బాగా పనిచేస్తాయి. మొదటి బిడ్డకు రక్తసంబంధిత క్యాన్సర్ ఉంటే రెండో బిడ్డ విషయంలో కూడా జాగ్రత్త పడాలి.

పిల్లలు పాలిపోయినట్లుగా ఉండటం, ఆకలి తగ్గడం, బరువు తగ్గడం, నీరసం, అలసట ఎక్కువగా ఉండటం, త్వరగా చర్మం కమిలిపోవడం, మచ్చలుమచ్చలుగా ఉండటం, తీవ్రమైన రక్తస్రావం, ఒళ్లునొప్పులు వంటి లక్షణాలు కనిపిస్తే లుకేమియాను అనుమానించాల్సి ఉంటుంది.

రక్తపరీక్షలు, తుంటి లేదా ఎముకల నుంచి తీసిన మూలగ (బోన్‌మ్యారో)ను పరీక్షించడం ద్వారా దీన్ని కనుక్కోవచ్చు.

పెద్దవాళ్లలో కంటే పిల్లల్లో బ్రెయిన్ ట్యూమర్స్ ఎక్కువని చెప్పవచ్చు. పొద్దున్నే లేవగానే తీవ్రమైన తలనొప్పి, వికారం, వాంతులు, ప్రవర్తించే తీరుమారడం, ఆందోళన, ఫిట్స్, చూపు/మాట మందగించడం వంటి లక్షణాలతో మెదడు కణితిని అనుమానిస్తారు. అది క్యాన్సర్ కణితి అయినా, కాకపోయినా ప్రమాదకరమే. మెదడులో కణితి వచ్చిన ప్రదేశాన్ని బట్టి సర్జరీతో దాన్ని తొలగించడమా లేక ఇతర చికిత్స ప్రక్రియలు అనుసరించడం మంచిదా అనే అంశాన్ని పరిగణనలోకి తీసుకొని చికిత్సను నిర్ణయిస్తారు. ఒక్కోసారి మెదడు కణితిని రేడియో సర్జరీతో తొలగిస్తారు.

రోగనిరోధక వ్యవస్థలో ప్రధాన పాత్ర పోషించే లింఫ్‌నాళాలకు సంబంధించిన క్యాన్సర్‌లో హాడ్జ్‌కిన్స్, నాన్‌హాడ్జ్‌కిన్స్ అనే రకాలుంటాయి. మెడ, చంకల్లో, గజ్జల్లో లింఫ్‌నాళాలు వాయడం, జ్వరం, చలి, ఆకలి తగ్గడం, రాత్రిళ్లు చెమటలు, దగ్గు, ఊపిరితీసుకోవడం కష్టంగా ఉండటం వంటి లక్షణాలతో లింఫోమాలు బయటపడుతుంటాయి.

రెండేళ్ల కంటే తక్కువ వయసున్న పిల్లల్లో అడ్రినల్‌గ్రంథిలో, మెడ, ఛాతీ, పొట్ట, పెల్విస్‌లలో వచ్చే కణితులు (న్యూరో)బ్లాస్టోమాలు, ఎముకలు, టిష్యూలలో వచ్చే ఈవింగ్ సర్కోమా, మూత్రపిండాల్లో వచ్చే నెఫ్రోబ్లాస్టోమా వంటివి పిల్లల్లో ఎక్కువగా కనిపించే క్యాన్సర్లు. పిల్లల్లో పూర్తిగా నయం చేయగలిగిన ఈ క్యాన్సర్స్ పెద్దవాళ్లలో కనిపిస్తే మాత్రం అంతే తేలిగ్గా నయం కాకపోవచ్చు.

పుట్టుకతో వచ్చే లోపాలు, జన్యు కారణాలు పిల్లల్లో క్యాన్సర్‌కు దారితీయవచ్చు. కాబట్టి ముందు పుట్టిన బిడ్డకు క్యాన్సర్ ఉంటే రెండోబిడ్డ విషయంలో జాగ్రత్తగా ఉండటం, లక్షణాలు గుర్తించి సరైన చికిత్స అందించడం, పోషకాహార లోపాలు లేకుండా జాగ్రత్తగా చూసుకోవడం, చికిత్స తర్వాత కూడా డాక్టర్ సలహా మేరకు అవసరమైన పరీక్షలు చేయించుకోవడం తప్పనిసరి.

మళ్లీ చెప్పకుందాం! రీటోల్డ్ కథలు - 05

శోక సంచి





● డా. గీతాంజలి

లేబర్ రూమ్ అరుపుల్ని మగవాడు వినాలి.

అవి ఇంట్లో గదిలో అర్ధరాత్రి ఏకాంతంలో వినవచ్చే మూల్గులు కావు.

అరుపులు. కేకలు. గావుకేకలు. పేగులు తెగిపడే కేకలు. కాదు.. కాదు... గర్భసంచి చిరిగిపోయే కేకలు....

అవి వింటాడా మగవాడు? పడతాడా పోనీ. పడితే తెలుస్తుంది.

'అల్లా... ముఝే బచాలే అల్లా'... కేకలు పెడుతోంది.

ఒకటో కాన్పు కాదు. రెండో కాన్పు కాదు. మూడోది నాల్గోది కాదు. ఐదోది.

పెనిమిటికి మగబిడ్డ కావాలట. ఈసారీ ఆడపిల్ల పుడితే ఏం చేస్తాడో. ఏట్లో తోస్తాడో ఏమో.

'ఇంకో పెళ్లి చేసుకుంటాడు. ఇంకో గర్భసంచి మీద ప్రతాపం చూపుతాడు' అంటుంది నర్సు పిల్ల.

ఆ పిల్లకు ఓర్పు చాలా జాస్తి. ఆ పిల్ల సాయం వల్లే చాలా కాన్పులు ఆ ఆస్పత్రిలో జరుగుతుంటాయి. ఆ పిల్ల లేకపోతే డాక్టరు లేబర్ రూమ్‌లోకి వెళ్లదు.

ఇద్దరూ కలిసి చాలా కేసులే చూశారు.

'ఈ కేసు దుబాయ్‌ది డాక్టర్. తీసుకెళ్లి ఆరునెలలు పెట్టుకున్నాడు. ఇలా చేసి పంపాడు. కాన్పైనాక తిరిగి తీసుకెళ్తాడని ఈ అమాయకురాలి వెర్రి. వాడు ఖాజీకి ఈసరికి ఇంకో పిల్లకు గేలం వేయమని చెప్పేసి ఉంటాడు' అంటుంది నర్సుపిల్ల.

'ఈ పిల్లది మరీ అన్యాయం. సొంత బాబాయే'... అని ఇంకో టేబుల్ దగ్గర నిలబెడుతుంది.

'ఈమెను చూశారా మళ్లీ వచ్చింది. నలభై ఏళ్లు రాబోతున్నా వచ్చిందంటే ఏమనాలి. ఆపరేషన్ అంటే ఆయన వినడు... రాత్రి మీదిమీదికొస్తుంటే ఈమె కాదనలేదు' అంటుంది మరో టేబుల్ దగ్గర.

'క్యా ఖాలా... మళ్లీ వచ్చావా?'

ఆమె ఏడుస్తుంది.

'ఆయన వినడమ్మా... ఆపరేషన్ అంటే వినడు. నా గర్భసంచి చిరిగి నేను పనికి రాకుండా పోతే తప్ప ఇంతే. కంటూ ఉండాల్సిందే' అంటుంది.

పాతబస్తీ చుట్టుపక్కల ప్రసూతి ఆస్పత్రి అంటే కథలు జాస్తి. కన్నీరు జాస్తే.

'అల్లా... ఈసారైనా రహమ్ చూపు. మగపిల్లాణ్ణి ఇచ్చి నా కాపురాన్ని నిలబెట్టు. ఇంకా నన్ను సాధించకు ఊపర్‌వాలే' లేబర్ రూమ్‌లో నుంచి ఆవిడ పెద్ద పెద్దగా ఆర్తనాదాలు చేస్తూ ఉంది.

చూడాలి అల్లా ఏం చేయబోతున్నాడో.

ఈలోపల నర్సు పిల్ల పరిగెత్తుకుంటూ వచ్చింది.

'డాక్టర్... ఎమర్జెన్సీ'...

మాసిన బురఖాలేసుకున్న ముగ్గురు నలుగురు ఒకామెను మోసుకుంటూ వచ్చారు. ఆమె కాళ్లూ చేతులు కొట్టుకుంటూ ఉంది. వంకరగా తిరిగి పోతూ ఉంది. దవడలు గిట్ట కరుస్తూ ఉంది. పిల్లల్లాగుంది... ఇద్దరు చిన్నపిల్లలు... తల్లిని పట్టుకుని ఏడుస్తున్నారు.

'ఏమైంది?' డాక్టర్ అడిగింది.

'ఏమో డాక్టర్. అచానక్ ఇలా అయింది'

'ఏమైనా మింగిందా... చెప్పండి'

'ఏమో... మాకేం తెలుసు'

వెనుక మొగుడు వచ్చాడు. నలిగిన బట్టలేసుకుని... జుట్టు పెరిగిపోయి... వెర్రి ముఖంతో.

'కొట్టినావా?'

'నై నై... అల్లా కసమ్'

నాడీ పట్టుకు చూసింది. బాగానే ఉంది. బీపీ– నార్మల్. గదిలో నుంచి అందర్నీ వెళ్లగొట్టి తలుపులేసి నిలబడింది. అంతవరకూ వంకర్లు పోయిన ఆమె మామూలుగా అయ్యి ముఖం దిగులుగా పెట్టింది.

'ఏంటీ పని?'

'ఏం చేయను డాక్టర్.. మీరే కాపాడాలి. బస్తీలో ఉంటాము. మా ఆయన ఆటో వేస్తాడు. ఇప్పటికి నలుగురు పిల్లలు. ఆపరేషన్ వద్దంటాడు. అలాగని దూరం ఉంటాడా. ఉండడు. రాత్రయితే తాగొచ్చి పక్కన చేరుతాడు. ఇప్పటికే తినడానికి తిండి లేదు. నేను కూడా మెహనత్ చేస్తేనే ఒక పూటైనా ముద్ద నోట్లోకి పోతోంది. ఇంక నాకు కనే ఓపిక లేదు. ఇంకొక్క కడుపంటే ఉత్తపుణ్యానికే చచ్చిపోతాను. నా ప్రాణం బాగలేదని గుండె జబ్బు ఉందని ముట్టుకుంటే చచ్చిపోతానని నా మొగునికి చెప్పండి. ఈ పుణ్యం చేశారంటే మీ కాళ్లు కడిగి ఆ నీళ్లు తాగుతాను. లేకుంటే మా ఉసురు దేవుడే పోసుకుంటాడు'... వెక్కిళ్లు పెట్టింది.

డాక్టర్ తలుపు తెరిచి అని అందరూ చూసేలా రెండు మూడు ఇంజెక్షన్లు పొడిచింది. మొగుణ్ణి పిలిచి ఆమె చెప్పమన్నట్టే చెప్పింది.

అతడు ముఖం చిన్నగా పెట్టుకుని జేబులో నుంచి దస్తీ తీసి కళ్లు దాచుకున్నాడు.

'ఎందుకేడుస్తున్నావ్'

'ఇదంతా నా తాగుడు వల్లే డాక్టర్. ఇంతకు ముందు ఇలా లేకుండె. ఈ మధ్య గిరాకీ సరిగా లేదు. ఓలాలు ఊబర్లని సిటీ అంతా క్యాబులు తిరుగుతున్నాయ్. ఆటోలు నడవట్లేదు. నడిచినా నావంటి ఖటరా ఆటోలను ఎవరూ ఎక్కడం లేదు. రాత్రయితే హైబత్‌తో మందు తాగుతున్నాను. తాగాక దీని పక్కన చేరుతున్నాను. మా బతుకుల్లో సినిమాలు షికార్లు ఉండవుగా డాక్టర్. హోటళ్ల రెస్టారెంట్లు తెలియదు. ఈ ఊరు తప్ప ఏ ఊరు తిరిగేది లేదు. నెక్లెస్ రోడ్డుకు కూడా వెళ్లేది లేదు. కడుపుకు సరిగా తిండే లేదు. మాకున్న ఒకే ఒక దిల్ బెహలాయి మొగుడికి పెళ్లాం... పెళ్లానికి మొగుడు... ఇప్పుడు అది కూడా వద్దంటున్నారు.. సరే కానివ్వండి... ఇక మీదట ఆమెను తాకనులేండి'.. ఏడుస్తూనే ఉన్నాడు.

ఇది అతడి కథ . అది ఆమె కథ.

లేబర్ రూములో'మగబిడ్డ కావాలి పరవర్‌దిగార్' అని అరుస్తున్నదే ఆమె కథ అల్లాది.

అంతులేని ఈ కథ సాగుతూనే ఉంటుందా?

డా.గీతాంజలి రాసిన 'బచ్చేదాని' కథ ఇది.

అంటే 'గర్భసంచి' అని అర్థం.

గర్భసంచి మీద హక్కు ఎవరికి? అది కలిగిన స్త్రీకా? అందులో బీజం వేసే పురుషునికా? ఆమె జన్మించిన సమూహానికా? కులానికా? మతానికా? దేశానికా? ఆ హక్కు ఎవరికి? తన గర్భసంచికి తానే తాడు కట్టి మూత బిగించే హక్కు, తన గర్భాన్ని తానే నిరాకరించే హక్కు, ఆ గర్భంలో ఏది ఉద్భవిస్తే దానినే స్వీకరించి కాపాడుకునే హక్కు స్త్రీకి నిజంగా ఉన్నదా?

లేనంత వరకూ అది గర్భసంచి కాదు. శోక సంచి.

పునః కథనం: ఖదీర్

విజయవాడ
గురువారం
15-2-2018
సినిమా
సాక్షి ఫ్యామిలీ


● ఐశ్వర్యారాయ్

బాలీవుడ్ స్పైస్

అన్నీ తానై!

ప్రతిభకు కష్టం తోడైతే గెలుపు మార్గం కనిపిస్తుంది. ఆ గెలుపు మార్గంలో వెళ్తున్న ఓ యంగ్ టాలెంటెడ్ టీనేజ్ సింగర్‌ని కొందరు మాటలతో ఓడించాలని ట్రై చేశారు. ఫైనల్లీ ఆ అమ్మాయే గెలిచింది. కానీ ఈ గెలుపులో ఐశ్వర్యారాయ్ ఆ అమ్మాయికి అన్నీ తానై అండగా నిలబడి, అభయమిచ్చారు. హిందీ చిత్రం 'ఫ్యాన్నీఖాన్' కథ ఇలానే ఉండబోతుందని బీటౌన్ టాక్. ఐశ్వర్యారాయ్, అనిల్ కపూర్, రాజ్‌కుమార్ రావ్, దివ్య ముఖ్యతారలుగా నటిస్తోన్న చిత్రం 'ఫ్యాన్నీఖాన్'. ఈ సినిమాలో సింగర్ పాత్రలో ఐశ్వర్యారాయ్ బచ్చన్ కనిపించనున్నారు. ట్యాక్సీ డ్రైవర్‌గా అనిల్‌కపూర్ కనిపించనున్నారట. సినిమాలో అనిల్ కపూర్‌కి ఓ కూతురు ఉంటుంది. తను టాలెంటెడ్ సింగర్. సీనియర్ సింగర్ అయిన ఐశ్వర్య ఆ అమ్మాయికి హెల్ప్ చేస్తారట. అదెలా అనేది స్క్రీన్‌పై చూడాల్సిందే. ఈ సినిమాలో ఐశ్వర్య లుక్‌ను రిలీజ్ చేశారు. ఈ ఏడాది రంజాన్‌కు 'ఫ్యాన్నీఖాన్'ను రిలీజ్ చేయాలనుకుంటున్నారు. ఆల్రెడీ సల్మాన్ 'రేస్ 3'తో రంజాన్‌కు రెడీగా ఉన్నారు. మరి.. సల్మాన్ వర్సెస్ ఐశ్వర్యలో ఎవరు వెనక్కి తగ్గుతారన్న చర్చ బాలీవుడ్‌లో జరుగుతోంది.

బర్త్‌డే ప్లాన్ రెడీ

బర్త్‌డేకి కేక్ కట్ చేయడంతోపాటు థియేటర్‌లో బుల్లెట్స్‌ను పేల్చుతాననంటున్నారు బాలీవుడ్ హీరో సంజయ్ దత్. తిగ్మాన్షు ధూలియా దర్శకత్వంలో సంజయ్‌దత్, జిమ్మి షెర్గిల్, మహి గిల్, చిత్రాంగద సింగ్ ముఖ్య తారలుగా రూపొందుతున్న సినిమా 'సాహెబ్ బిబీ ఔర్ గ్యాంగ్‌స్టర్ 3'. 2011లో వచ్చిన 'సాహెబ్ బీబీ ఔర్ గ్యాంగ్‌స్టర్', 2013లో 'సాహెబ్ బీబీ ఔర్ గ్యాంగ్‌స్టర్ రిటర్న్స్'లను డైరెక్ట్ చేసిన ధూలియా దర్శకత్వంలో



● సంజయ్‌దత్

రూపొందుతున్న మూడోపార్ట్ ఇది. సినిమా షూటింగ్ ఆల్మోస్ట్ కంప్లీట్ అయ్యిందని బాలీవుడ్ సమాచారం. అయినా ఇప్పుడు రిలీజ్ చేయరట. మంచి డేట్ కోసం చూస్తున్నారని సమాచారం. ఆ డేట్ సంజయ్ దత్ బర్త్‌డే డేట్ అని భోగట్టా. జూలై 29న సంజూ బాబా బర్త్‌డే. అదే రోజున ఈ సినిమాని విడుదల చేయాలనుకుంటున్నారట.

దేవదాసులు


● షారుక్ ఖాన్, దిలీప్ కుమార్

ఒకే ఫ్రేమ్‌లో అలనాటి దేవదాస్ దిలీప్ కుమార్, ఈనాటి దేవదాస్‌ను షారుక్ ఖాన్‌ను చూస్తుంటే చాలా బావుంది కదా. దిలీప్ కుమార్, షారుక్ ఖాన్ ఎంత సన్నిహితంగా ఉంటారో తెలిసిన విషయమే. ఫ్యామిలీ ఫంక్షన్స్, ఫెస్టివల్స్‌ను ఈ ఇద్దరూ కుటుంబంతో కలిసి జరుపుకున్నారు. నైన్‌టీస్ సూపర్ స్టార్ దిలీప్ కుమార్ ఇటీవల డీహైడ్రేషన్ మరియు యూరినరీ ఇన్‌ఫెక్షన్ వంటి ఆరోగ్య సమస్యలతో బాధపడుతూ హాస్పిటల్లో జాయిన్ అయి, చికిత్స అనంతరం బయటకు వచ్చిన విషయం తెలిసిందే. హాస్పిటల్ నుంచి డిశ్చార్జ్ అయ్యారని తెలుసుకున్న షారుక్ వెంటనే దిలీప్ కుమార్‌ను ఆయన స్వగృహంలో కలిసి, టైమ్ స్పెండ్ చేశారు. ఆ సందర్భంలో దిగిన ఈ ఫొటోని దిలీప్‌కుమార్ తన ట్విట్టర్‌లో పంచుకున్నారు.


● షారుక్ ఖాన్

గుడి గంట మోగింది


మనసు ఏం కోరుకుంటే అది జరగాలనుకుంటాం. ప్రస్తుతం తాప్సీ ఒక్క కోరిక కోరుకున్నారు. అది పెళ్లి గురించి కాదు. సినిమా హిట్టవ్వాలని మనసులో అనుకున్నారు. ఆ కోరిక నెరవేర్చమని దేవుణ్ణి కోరారు. ఈ ఢిల్లీ బ్యూటీ ప్రస్తుతం 'మన్‌మర్జియా' అనే హిందీ చిత్రంలో నటిస్తున్నారు. అంటే.. మనసుకి ఇష్టమైనది అని అర్థం. ఈ సినిమా కోసమే తాప్సీ అమృత్‌సర్‌లోని గోల్డెన్ టెంపుల్‌కి వెళ్లారు. సినిమా స్టార్ట్ అవ్వడానికి ముందు గుడి గంట మోగించి, మంచి జరగాలని కోరుకున్నారు. అనురాగ్ కశ్యప్ దర్శకత్వంలో అభిషేక్ బచ్చన్, తాప్సీ, విక్కీ కుశాల్ ముఖ్య తారలుగా నటిస్తున్న సినిమా 'మన్‌మర్జియా'. ఈ సినిమా షూటింగ్‌ను ప్రేమికుల రోజున అమృత్‌సర్‌లో స్టార్ట్ చేశారు. లవ్ స్టోరీ బ్యాక్‌డ్రాప్‌లో తెరకెక్కుతున్న ఈ సినిమా షూటింగ్‌ను ఆల్మోస్ట్ టు మంత్స్ అమృత్‌సర్‌లో షూట్ చేయడానికి ప్లాన్ చేశారు. స్వామికార్యం స్వకార్యం అన్నట్లు.. అక్కడి గుడి సందర్శించి, తొలి సీన్‌కి క్లాప్ కొట్టడానికి ముందే గుడి గంట మోగించారు తాప్సీ.


● శ్రద్ధాకపూర్

లాయర్.. ఓ దొంగ... ఓ అమ్మాయి!

కామన్ పీపుల్ ఫేస్ చేస్తోన్న ఎలక్ట్రిసిటీ పవర్ ప్రాబ్లమ్స్‌ను బేస్ చేసుకుని 'టాయ్‌లెట్: ఏక్ ప్రేమ్‌కథ' ఫేమ్ శ్రీ నారాయణ్ సింగ్ దర్శకత్వంలో హిందీలో రూపొందుతున్న చిత్రం 'బట్టీ గుల్ మీటర్ ఛాలు'. షాహిద్ కపూర్, శ్రద్ధాకపూర్, యామీ గౌతమ్ ముఖ్య తారలుగా నటిస్తున్నారు. రీసెంట్‌గా ఈ సినిమా షూటింగ్ ఉత్తరాఖండ్‌లో స్టార్టైంది. ఉత్తరాఖండ్ సీయం త్రివేంద్ర సింగ్ రావత్ ముహూర్తపు సన్నివేశానికి క్లాప్ ఇచ్చారు. ఈ సినిమాలో లలితా నౌటియాల్ అలియాస్ నౌటీ క్యారెక్టర్‌లో శ్రద్ధా కపూర్ కనిపించనున్నారు. నౌటీ లుక్‌ను చిత్రబృందం విడుదల చేసింది. సినిమాలో యామీ గౌతమ్ లాయర్‌గా నటిస్తుండగా, పవర్‌ను దొంగలించే రోల్‌లో షాహిద్ కనిపించనున్నారని బాలీవుడ్ టాక్. ఇక్కడ ఇంకో ఇంట్రెస్టింగ్ మ్యాటర్ కూడా ఉందండి. అదేంటంటే.. సినిమాలో షాహిద్‌కపూర్ మాత్రమే కాదు.. శ్రద్ధాకపూర్‌ని ఇంకో హీరో కూడా ప్రేమిస్తారట. దాంతో ట్రయాంగిల్ లవ్‌స్టోరీ స్టార్ట్ అవుతుందని బాలీవుడ్ సమాచారం. జనరల్‌గా ఇక్కడున్న ఫొటోలో కనిపిస్తున్నట్లుగా శ్రద్ధా చాలా గ్లామరస్‌గా కనిపిస్తారు. కానీ ఈ సినిమాలో మాత్రం డీ–గ్లామరస్ పాత్రలో కనిపించనున్నారట. ఈ సినిమాను ఈ ఏడాది ఆగస్టులో రిలీజ్ చేయాలనుకుంటున్నారు.

పేరు కోసం పోరు


● అనుపమ్ ఖేర్


● అనిల్ కపూర్

''నా పేరును వాడుకుంటున్నావు.. రాయల్టీ కట్టు లేదా లీగల్ నోటీస్ కోసం సిద్ధంగా ఉండు'' అని నటుడు–దర్శకుడు అనుపమ్ ఖేర్‌పై హెచ్చరిక జారీ చేశారు అనిల్ కపూర్. విషయం ఏంటంటే.. ''బెల్లెవ్యూ'' అనే ఓ కెనెడా పాపులర్ టీవీ సిరీస్‌లో ముఖ్య పాత్ర పోషించనున్నారు అనుపమ్ ఖేర్. ఆ సిరీస్‌లో అనుపమ్ క్యారెక్టర్ పేరు డా. అనిల్ కపూర్. ఆ క్యారెక్టర్‌కు తన పేరును వాడుకుంటున్నారు అనే కారణంతో ట్విట్టర్‌లో ఈ కామెంట్స్ చేశారు అనిల్. దాంతో అనిల్, అనుపమ్ మధ్య గొడవ మొదలైందనే వార్తలు స్టార్ట్ అయ్యాయి. ఈ విషయం పై అనుపమ్ ఖేర్ స్పందిస్తూ – ''అనిల్‌కపూర్ సరదాగా జోక్ చేశాడు. ఈ విషయంపై అనవసరమైన చర్చ జరుగుతోంది. అయినా అనవసరమైన విషయాల్ని ఫోకస్ చేయడం మనకు అలవాటే కదా. అనిల్ అన్నాడని కాదు కానీ, అతని పేరుతో నేను ఆ క్యారెక్టర్‌ను చేస్తే కొంచెం అయోమయంగా ఉండొచ్చు. అందుకని నా పాత్ర పేరును మార్చమని ప్రొడక్షన్ టీమ్‌ను కోరాను. ప్రాజెక్ట్ విషయానికి వస్తే ఈ సిరీస్‌లో పార్ట్ అయినందుకు చాలా హ్యాపీగా ఉంది. ఇంటర్నేషనల్ టెలివిజన్‌లోనే 'బెల్లవ్యూ' మోస్ట్ అవెయిటెడ్ సిరీస్. నటుడిగా నా పరిధుల్ని పెంచుకుని, వరల్డ్ క్లాస్ టాలెంట్‌తో పని చేసే అవకాశం కల్పించనుంది ఈ సిరీస్'' అని పేర్కొన్నారు. డేవిడ్ స్కల్నర్ రాసిన ఈ టీవీ సిరీస్‌ను ఎరిక్ మాన్‌హైమర్ నిర్మిస్తున్నారు. ఒక హాస్పిటల్‌లో పన్నెండు మంది పేషంట్స్ లైఫ్ అండ్ డెత్ సిచ్యువేషన్స్‌ని ఇన్‌స్పిరేషన్‌గా తీసుకుని ఈ సిరీస్‌ను రూపొందిస్తున్నారు. ఈ సిరీస్ షూటింగ్‌లో అనుపమ్ ఖేర్ మార్చి నుంచి పాల్గొననున్నారు.


● దిశా పాట్నీ

డెసిషన్ మీట్?


● తాప్సీ

● అభిషేక్ బచ్చన్

బాలీవుడ్ యంగ్ లవ్ బర్డ్స్ అనగానే వినిపిస్తున్న పేర్లు టైగర్ ష్రాఫ్, దిశా పాట్నీ. వాళ్ల రిలేషన్‌షిప్ గురించి ప్రస్తావించిన ప్రతీసారి ఈ ఇద్దరూ 'మేము క్లోజ్ ఫ్రెండ్స్' అంటున్నారు తప్పితే తమ రిలేషన్ స్టేటస్‌ను రివీల్ చేయట్లేదు. కానీ.. కాఫీ షాపుల్లో, పార్టీల్లో, పబ్బుల్లో తరచూ కనిపిస్తూనే ఉందీ జంట. ఈ ప్రేమ జంట లవ్‌ను టైగర్ ష్రాఫ్ ఫ్యామిలీ కూడా ఓకే చేసినట్టు కనిపిస్తోంది. ఇటీవల జరిగిన జాకీ ష్రాఫ్ 61వ బర్త్‌డే డిన్నర్ వేడుకల్లో టైగర్ ఫ్యామిలీతో దిశా కూడా పాల్గొన్నారట. పార్టీ జరిగిన తర్వాత రెస్టారెంట్ నుంచి టైగర్ ఫ్యామిలీతో కబుర్లు చెబుతూ బయటకు వస్తూ జనాల దృష్టిలో పడ్డారు దిశా. టైగర్ ష్రాఫ్ మదర్, సిస్టర్‌తో దిశా మంచి క్వాలిటీ టైమ్ స్పెండ్ చేశారని సమాచారం. 'టైగర్– దిశా ప్రేమను టైగర్ ష్రాఫ్ ఫ్యామిలీ అంగీకరించలేదు' అంటూ ఆ మధ్య వచ్చిన రూమర్స్‌ను కొట్టి పారేస్తున్నట్టుగా ఉంది ఈ డిన్నర్ మీట్. తాజాగా వేలంటైన్స్ డే సందర్భంగా 'డిన్నర్ మీట్'ని ప్లాన్ చేసుకున్నారు ఈ యంగ్ పెయిర్. చాటుమాటుగా డిన్నర్ కానించేద్దామనుకుని ఉంటారు కానీ ఈసారీ నలుగురి దృష్టిలో పడ్డారు. దాంతో ఫ్యామిలీ అంగీకారం వచ్చినట్టే అని కొంతమంది బలంగా ఫిక్సయ్యారు. మరి అధికారికంగా ఈ జోడీ తమ ప్రేమను ఎప్పుడు ప్రకటిస్తారో? అని ఫ్యాన్స్ ఎదురు చూస్తున్నారు. ఈ డిన్నర్ మీట్‌నే డెసిషన్ మీట్‌లాగా తీసుకోవచ్చా? అంటే తెలియాల్సి ఉంది.

● టైగర్ ష్రాఫ్

పార్టీకి తయార్

కాలేజీ స్టూడెంట్‌గానే ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇచ్చారు సిద్ధార్థ్ మల్హోత్రా. అదేనండీ.. కరణ్ జోహార్ దర్శకత్వంలో వచ్చిన 'స్టూడెంట్ ఆఫ్ ది ఇయర్' సినిమా ద్వారా సిద్ధార్థ్ సిల్వర్ స్క్రీన్‌కి పరిచయం అయ్యారని చెబుతున్నాం. ఆల్మోస్ట్ ఐదేళ్ల తర్వాత ఇప్పుడు మళ్లీ స్టూడెంట్‌గా క్లాస్‌రూమ్‌కి వెళ్లేందుకు సిద్ధార్థ్ చర్చలు జరుపుతున్నాడని బీటౌన్ టాక్. అంతేకాదు సిద్ధార్థ్‌తో పాటు సినిమాలో ఉండబోయే గ్యాంగ్ మెంబర్స్ అడ్మిషన్స్ కోసం ఆల్రెడీ ఆడిషన్స్‌ను కూడా స్టార్ట్ చేశారట. మరి.. కాలేజీలో గ్యాంగ్‌ని మెయిన్‌టైన్ చేస్తారు కదా. కన్నడ సూపర్ హిట్ 'కిర్రిక్ పార్టీ'కి రీమేక్‌గా ఈ చిత్రాన్ని రూపొందించనున్నారు. ఈ సినిమాలో సిద్ధార్థ్‌తో పాటు నటించబోయే స్టూడెంట్స్ కోసం అడ్మిషన్స్.. అదేనండీ.. సెలెక్షన్స్ ఓపెన్ అన్నమాట. 'కిర్రిక్ పార్టీ' హిందీ రీమేక్ రైట్స్ దక్కించుకున్న అజయ్‌కపూర్ ఆల్రెడీ సిద్ధార్థ్‌తో మాట్లాడారని, స్క్రిప్ట్ వర్క్ కూడా కంప్లీట్ అయ్యిందని సమాచారం. ఈ సంగతి ఇలా ఉంచితే... ఈ 'కిర్రిక్ పార్టీ' తెలుగులో నిఖిల్ హీరోగా 'కిరాక్ పార్టీ'గా రీమేక్ అయింది. ఇందులో సిమ్రన్, సంయుక్తా హెగ్డే కీలక పాత్రలు చేశారు.


● సిద్ధార్థ్ మల్హోత్రా

ఆ'పరేషాన్'..!

- పరికరాలు లేక మధ్యలో నిలిచిపోయిన ఆపరేషన్
- హడావుడిగా ఆర్థోపెడిక్ ఓటీకి తరలించి శస్త్ర చికిత్స
- వారం కిందట ఆపరేషన్ మధ్యలో ఆరిపోయిన ఓటీ లైట్
- సెల్‌ఫోన్ లైట్ వెలుగులో శస్త్రచికిత్స పూర్తి చేసిన వైద్యులు
- జీజీహెచ్ ఎస్‌ఓటీలో తరచూ తలెత్తుతున్న సమస్యలు

సాక్షి, గుంటూరు/ గుంటూరు మెడికల్: గుంటూరు జిల్లా తాడేపల్లికి చెందిన ఎం.జోషిబాబుకు ఈ నెల 12న జరిగిన ఓ ప్రమాదంలో కుడిచేయి నుజ్జునుజ్జయింది. దీంతో కుటుంబసభ్యులు అతడిని గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. చేతి వేళ్లు పూర్తిగా దెబ్బతినడంతో బుధవారం సర్జికల్ ఆపరేషన్ థియేటర్ (ఎస్‌ఓటీ)లో శస్త్ర చికిత్స చేసేందుకు వైద్యులు సిద్ధమయ్యారు. అయితే ఆపరేషన్ మధ్యలో ఉండగా హ్యాండ్ డ్రిల్ మిషన్ పనిచేయలేదు. దీంతో వెంటనే అతడిని ఆర్థోపెడిక్ విభాగంలోని ఆపరేషన్ థియేటర్‌కు తరలించి శస్త్రచికిత్స చేయాల్సి వచ్చింది. సరిగ్గా గత బుధవారం కూడా ఇలాంటి సమస్యే తలెత్తింది. పల్నాడు ప్రాంతంలోని ఓ గ్రామానికి చెందిన వెంకమ్మకు రోడ్డు ప్రమాదంలో తలకు బలమైన గాయాలయ్యాయి. ఈ నెల 7న ఎస్‌ఓటీలో శస్త్రచికిత్స చేసేందుకు ఏర్పాట్లు చేశారు. ఆపరేషన్ మధ్యలో ఉన్న సమయంలో ఓటీ లైట్లు ఆరిపోయాయి. దీంతో వైద్యులు సెల్‌ఫోన్ లైట్ల మధ్య ఆపరేషన్ పూర్తి చేశారు. గుంటూరు ప్రభుత్వ సమగ్ర వైద్యశాలలోని ఎస్‌ఓటీలో తరచూ జరుగుతున్న ఇలాంటి ఘటనలు రోగులను, వారి కుటుంబ సభ్యులను కలవరపాటుకు గురిచేస్తున్నాయి.


ఫిబ్రవరి 7న సెల్‌ఫోన్ లైటు సహాయంతో ఆపరేషన్ చేస్తున్న వైద్యులు

ఆస్పత్రి అధికారుల నిర్లక్ష్యం

జీజీహెచ్‌లోని చిన్న పిల్లల శస్త్రచికిత్స వైద్య విభాగంలో వెంటిలేటర్‌పై ఉన్న ఓ పసికందును ఎలుకలు కొరికి చంపిన సంఘటన అప్పట్లో దేశవ్యాప్తంగా సంచలనం రేపిన విషయం తెలిసిందే. ఆ సమయంలో జీజీహెచ్‌ను ప్రక్షాళన చేస్తామంటూ ప్రభుత్వ పెద్దలు హడావుడి చేశారు. ఆ తర్వాత షరామామూలే. జీజీహెచ్‌లో జరిగే ఆపరేషన్ల వల్ల ఆరోగ్యశ్రీ ద్వారా రూ.కోట్ల ఆదాయం వస్తున్నా ఆపరేషన్ థియేటర్లలో వైద్య పరికరాలు, వసతుల కల్పనను మాత్రం ఆస్పత్రి అధికారులు పట్టించుకోవడం లేదు. ఒకవేళ నిధులు మంజూరు చేసినా కాంట్రాక్టర్లు నాణ్యత లేని వైద్య పరికరాలు సరఫరా చేస్తుండడంతో అవి ఆపరేషన్ల మధ్యలో మొరాయిస్తున్నాయి.

థియేటర్లు లేక నిలిచిన ఆపరేషన్లు

జీజీహెచ్‌లోని ఎస్‌ఓటీలలో ఇన్‌ఫెక్షన్లు ఎక్కువగా ఉన్నాయంటూ వైద్యులు ఆస్పత్రి అధికారులకు లిఖితపూర్వకంగా తెలియజేసి ఆపరేషన్లు నిలిపివేశారు. మూడు పర్యాయాలు ఆపరేషన్లు నిలిపివేయడంతో అధికారులు మరమ్మతుల కోసం రూ.20 లక్షలు మంజూరు చేశారు. మరమ్మతులు పూర్తయినా సరిపడా వైద్య పరికరాలు లేకపోవడంతో తాజాగా బుధవారం శస్త్రచికిత్స నిలిచిపోయింది. ఎస్‌ఓటీలో ముఖ్యమైన వైద్య పరికరాలు లేకపోవడంతో ఆపరేషన్లు చేయలేక అవస్థలు పడాల్సి వస్తోందంటూ వైద్య సిబ్బంది వాపోతున్నారు. న్యూరోసర్జరీ వైద్య విభాగంలో రోగుల సంఖ్య ఎక్కువగా ఉండడంతో వారికి తగ్గట్టుగా ఆపరేషన్ థియేటర్లు లేక పలుమార్లు ఆపరేషన్లు వాయిదా పడుతున్నాయి. ఆర్థోపెడిక్ వైద్య విభాగానికి ప్రత్యేకంగా మోకీళ్ల మార్పిడి ఆపరేషన్లు చేసేందుకు థియేటర్ కేటాయించకపోవడం వల్ల ఏడాది పాటు ఆపరేషన్లు నిలిచిపోయాయి. అత్యంత ఖరీదైన కిడ్నీ మార్పిడి ఆపరేషన్లకూ ప్రత్యేకంగా థియేటర్ కేటాయించకపోవడంతో ఆర్నెల్లుగా ఆపరేషన్లు నిలిపివేశారు. దీంతో రూ.లక్షలు ఖర్చు పెట్టి ఆపరేషన్ చేయించుకునే స్థోమత లేక ఎంతోమంది పేదలు జీజీహెచ్ చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.

వైద్య పరికరం పనిచేయక పోవడంతో బుధవారం ఆపరేషన్ నిలిపి వేసి చర్చించుకుంటున్న సిబ్బంది



ఇంకా నమ్ముతున్నాం..

కేంద్రంపై రాష్ట్ర మంత్రుల ఆశాభావం

చివరి నిమిషంలోనైనా ఏపీని ఆదుకుంటుందని వ్యాఖ్య

సాక్షి, అమరావతి: కేంద్ర ప్రభుత్వంపై ఇప్పటికీ తమకు నమ్మకం, విశ్వాసం ఉన్నాయని పలువురు రాష్ట్ర మంత్రులు ప్రకటించారు. చిట్టచివరి నిమిషంలోనైనా ఏపీ ప్రయోజనాలు కాపాడేలా ప్రకటన చేస్తారని ఆశిస్తున్నట్లు చెప్పారు. కేంద్ర ప్రభుత్వంపై తాము విశ్వాసం కోల్పోతే ఏం చేయాలో అదే చేస్తామని వ్యాఖ్యానించారు. మిత్రధర్మాన్ని కాపాడుతూనే తమ ఎంపీలు పార్లమెంట్ ఉభయసభల్లో నిరసన వ్యక్తం చేశారని చెప్పారు. బుధవారం వెలగపూడిలోని సచివాలయంలో సీఎం చంద్రబాబుతో భేటీ అనంతరం మంత్రులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, అచ్చెన్నాయుడు, నక్కా ఆనందబాబు విలేకరులతో మాట్లాడారు. టీడీపీకి కేంద్ర మంత్రి పదవులు ముఖ్యం కాదని, రాష్ట్ర ప్రయోజనాలే ముఖ్యమని మంత్రి అచ్చెన్నాయుడు చెప్పారు. చంద్రబాబుపై ఎలాంటి కేసులూ లేవని, కేంద్ర ప్రభుత్వానికి భయపడాల్సిన అవసరం తమకు లేదని మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రత్యేక హోదాతో సమానంగా ప్రత్యేక ప్యాకేజీ ద్వారా ఇస్తామని ప్రకటించటంతో రాష్ట్ర ప్రయోజనాల కోసం అంగీకరించామని చెప్పారు.

కేన్సర్ వేట

కాగితాన్ని రకరకాల ఆకారాల్లోకి మడిచేసే ఒరిగామి.. రక్తాన్ని గడ్డకట్టించేందుకు వాడే మందు.. అప్పగించిన పని తు.చ. తప్పకుండా చేసే రోబో..! ఈ మూడు అంశాల్లో ఏమైనా సారూప్యం ఉందా? మామూలుగా చూస్తే అస్సలు ఉండదుగానీ.. ప్రాణాంతకమైన కేన్సర్ పనిపట్టేందుకు శాస్త్రవేత్తలు ఈ మూడింటిని ఒక దగ్గరకు చేర్చారు! అన్నీ సవ్యంగా సాగితే ఇంకొన్నేళ్లలో.. డీఎన్ఏ రోబోలు మన రక్తంలో ఈదుకుంటూ వెళ్లి.. కేన్సర్ కణితులను మాయం చేసేస్తాయి!


– సాక్షి హైదరాబాద్



డీఎన్ఏ రోబోలతో..

కేన్సర్.. పేరు వినగానే చాలామంది ఇక చావు తప్పదన్న నిర్ధారణకు వచ్చేవారు. కానీ ఇప్పుడా పరిస్థితి లేదు. వ్యాధిబారిన పడినా.. ఏళ్లపాటు జీవించేందుకు అవకాశాలున్నాయి. అయితే ఆయుష్షు కొంతవరకూ పెంచగలమేమోగానీ.. పూర్తిస్థాయిలో చికిత్స అన్నది ఇప్పటికీ సాధ్యం కాదనే ఆధునిక శాస్త్ర పరిజ్ఞానం చెబుతోంది. ఆరిజోనా స్టేట్ యూనివర్సిటీ శాస్త్రవేత్తల ప్రయోగాలు పూర్తిస్థాయిలో విజయవంతమైతే ఈ పరిస్థితి పూర్తిగా మారిపోనుంది. శరీరంలో కేన్సర్ కణితులు ఎక్కడున్నా గుర్తించి మరీ వాటికి రక్తం సరఫరా చేసే నాడులను అడ్డుకోగల అద్భుత వ్యవస్థను వీరు రూపొందించారు.

కేన్సర్ కణితులు వేగంగా విభజితమవ్వాలంటే కణాలకు బోలెడంత శక్తి కావాలి. ఈ శక్తి కోసం కేన్సర్ కణాలు కొత్త కొత్త రక్తనాడులను సృష్టించుకుంటాయి. దీన్నే యాంజియోజెనిసిస్ అంటారు. ఇలా కొత్త రక్తనాళాలు పెరిగే వేగాన్ని తగ్గించగలిగితే కణితుల సైజును నియంత్రించడంతో పాటు వ్యాధి ఇతర శరీర భాగాలకు వ్యాపించకుండా అడ్డుకోవచ్చని శాస్త్రవేత్తలు చాలా కాలంగా అంచనా వేస్తున్నారు. అయితే ఈ పని ఎలా చేయాలన్న విషయంలో ఇప్పటివరకూ స్పష్టత లేకుండా పోయింది. ఈ నేపథ్యంలో ఆరిజోనా స్టేట్ యూనివర్సిటీలోని బయోడిజైన్ ఇన్‌స్టిట్యూట్‌కు చెందిన సెంటర్ ఫర్ మాలిక్యులర్ డిజైన్ అండ్ బయో మిమిటిక్స్ విభాగపు ప్రొఫెసర్ హోయాన్ వినూత్నమైన రీతిలో పరిశోధనలు నిర్వహించారు. దీని గురించి తెలుసుకోవాలంటే ముందుగా ఒరిగామి అనే జపనీస్ కళ గురించి తెలుసుకోవాల్సి ఉంటుంది. కాగితాన్ని మడత పెడుతూ రకరకాల ఆకృతులను సృష్టించడం ఒరిగామి ప్రత్యేకత. కాగితానికి బదులుగా మన కణాల్లోని డీఎన్ఏతో ఓ గొట్టం లాంటి ఆకారాన్ని తయారు చేశారు ప్రొఫెసర్ హోయాన్. ఈ గొట్టం లోపలిభాగంలో రక్తాన్ని గడ్డకట్టించేందుకు ఉపయోగించే థ్రోంబిన్ అనే మందును ఉంచారు. డీఎన్ఏ గొట్టంతో కలసి మందు రక్తనాళాల్లో కేన్సర్ కణాల పరిసరాల్లోకి చేరుతుంది. ఆ ప్రాంతాల్లో ఉండే ప్రత్యేకమైన ప్రొటీన్ మూలకాలకు స్పందించి డీఎన్ఏ గొట్టం విచ్చుకుంటే.. దాంట్లోని మందు పనిచేయడం మొదలు పెడుతుంది. ఇంకేముంది.. ఆ ప్రాంతంలోని రక్తనాళం పూడిపోవడం.. దాంతోపాటే కేన్సర్ కణితి నాశనమైపోవడం చకచకా జరిగిపోతాయి.



తెలివైన డిజైన్..

మామూలుగా రోబో అనగానే మనకు యంత్రుడు గుర్తుకొస్తాడు గానీ.. దీనిని డీఎన్ఏనే చాలా తెలివిగా డిజైన్ చేసి తయారు చేసిన రోబోగా చెప్పాలి. చికిత్సకు ఉపయోగించే మందు కణితి వద్దకు వెళ్లకుండానే రక్తంలో కలిసిపోకుండా ఉండేందుకు డీఎన్ఏ పోగులతో చేసిన గొట్టం లాంటి నిర్మాణాన్ని ఉపయోగించారు. పైగా మందుల జీవితకాలాన్ని దృష్టిలో ఉంచుకుని అది అవసరమైనప్పుడే కణితుల వద్ద విడుదలయ్యేలా ఈ డిజైన్ ఉపయోగపడింది. కేన్సర్ కణాలకే పరిమితమైన ప్రొటీన్‌ను గుర్తించి అతుక్కునేలా ఈ గొట్టం చివరల్లో ప్రత్యేకమైన మార్కర్లను ఏర్పాటు చేయడం వల్ల ఈ మందు ఆరోగ్యకరమైన కణాల వద్ద పనిచేసి దుష్ప్రభావాలు చూపే అవకాశాలను తగ్గించారన్నమాట.

ఏఏ కేన్సర్లకు వాడవచ్చు..


ఈ కొత్త నానో డీఎన్ఏ రోబో విధానాన్ని ఎలుకల్లోని రొమ్ము కేన్సర్‌పై పరీక్షించి చూశారు. ఊపిరితిత్తుల కేన్సర్‌తోపాటు గర్భాశయ కేన్సర్లు ఉన్న ఎలుకల్లోనూ ఈ విధానం మెరుగైన ప్రభావం చూపినట్లు నేచర్ బయోటెక్నాలజీ టుడేలో ప్రచురితమైన పరిశోధన వ్యాసం చెబుతోంది. మూడు రోజుల్లో ఈ నానో డీఎన్ఏ రోబోలు కేన్సర్ కణితుల చుట్టూ ఉన్న రక్తనాళాలను మూసేయడంలో విజయం సాధించాయని, రక్త కేన్సర్ల విషయంలో దీని ప్రభావం ఎక్కువగా ఉందని శాస్త్రవేత్తలు అంటున్నారు. రక్త కేన్సర్ల విషయంలో ఎనిమిది ఎలుకల్లో మూడింటిలో కణితులు పూర్తిగా తొలగిపోగా.. మిగిలిన వాటిలో సైజు గణనీయంగా తగ్గింది. అంతేకాకుండా వాటి జీవితకాలం కూడా రెట్టింపు అయినట్లు శాస్త్రవేత్తలు గుర్తించారు. కణితులు ఉన్న ప్రాంతానికి దూరంగా రక్తనాళాలపై ఎలాంటి చెడు ప్రభావం చూపకపోవడం ఈ విధానం ఇంకో ప్రత్యేకత. ఎలుకలతోపాటు తాము పందులపై కూడా ప్రయోగాలు జరిపి మంచి ఫలితాలు సాధించామని ప్రొఫెసర్ హోయాన్ అంటున్నారు. ఈ నానో డీఎన్ఏ రోబోలను కేన్సర్‌కే కాకుండా ఇతర వ్యాధులకు చికిత్స అందించేందుకూ ఉపయోగించవచ్చని.. అవి మోసుకెళ్లే మందును మారిస్తే చాలని తాము అంచనా వేస్తున్నట్లు యాన్ చెప్పారు.

గిరిజన సంక్షేమ డైరెక్టర్ తీరుపై ఉద్యోగుల్లో అసంతృప్తి

సాక్షి, అమరావతి: గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్ గందం చంద్రుడుపై కార్యాలయ ఉద్యోగుల్లో తీవ్ర అసంతృప్తి నెలకొంది. ఈయన వ్యవహార శైలి తమకు మింగుడు పడటం లేదని పలువురు అధికారులు వ్యాఖ్యానిస్తున్నారు. డైరెక్టర్‌ను కలవాలంటే గతంలో మాదిరి నేరుగా వెళ్లేందుకు వీల్లేకుండా పోయిందని అధికారులు వాపోతున్నారు. జాయింట్ డైరెక్టర్, డిప్యూటీ డైరెక్టర్ స్థాయి అధికారులు కూడా అపాయింట్‌మెంట్ కోసం వేచి చూడాలనే పరిస్థితి ఏమిటని ప్రశ్నిస్తున్నారు. గిరిజన సంక్షేమ శాఖ కార్యాలయం మూడు భవనాల్లో కొనసాగుతోంది. ఏలూరు రోడ్డులో ఒక భవనం, ప్రజాశక్తి నగర్‌లో మరో భవనం, లబ్బీపేటలో మరో భవనం ఉంది. అన్ని భవనాల్లో ఉన్న అధికారులు నిత్యం ఏదో ఒక సమయంలో డైరెక్టర్‌ను కలవాల్సి ఉంటుంది. అనంతపురం, శ్రీకాకుళం, విజయనగరం, కర్నూలు, వైఎస్సార్ జిల్లాల్లోని దూర ప్రాంతాల నుంచి వచ్చే గిరిజన అర్జీదారులు ఒక్కోసారి వచ్చిన రోజు అపాయింట్‌మెంట్ దొరక్క మరసటిరోజు, రెండో రోజూ ఉండి కలిసి వెళుతున్నారు. డైరెక్టర్ రెవెన్యూ డిపార్ట్‌మెంట్ నుంచి నేరుగా రావడం వల్ల ఈ ఇబ్బందులు వస్తున్నాయని, గతంలో ఐటీడీఏ పీవోగా పనిచేసిన చంద్రుడుకు గిరిజనులు పడే అవస్థలు ఏమిటో బాగా తెలిసినా ఇలా ఎందుకు వ్యవహరిస్తున్నారో అర్థం కావడం లేదని ఒక అధికారి వ్యాఖ్యానించారు.

చంద్రబాబు అంటే మోదీకి ఈర్ష్య, ద్వేషం

టీడీపీ ఎంపీ జేసీ దివాకర్‌రెడ్డి



సాక్షి, అమరావతి: గతంలో ముఖ్యమంత్రి చంద్రబాబు దేశ రాజకీయాల్లో చక్రం తిప్పి థర్డ్ ఫ్రంట్‌లో కీలకంగా ఉన్నారని, వాటి దృష్ట్యా చంద్రబాబు అంటే బీజేపీకి భయం ఉండవచ్చని టీడీపీ అనంతపురం ఎంపీ జేసీ దివాకర్‌రెడ్డి వ్యాఖ్యానించారు. చంద్రబాబు అంటే ప్రధాని మోదీకి ఈర్ష్య, ద్వేషం ఉన్నాయని చెప్పారు. బుధవారం వెలగపూడిలోని సచివాలయంలో జేసీ మీడియాతో మాట్లాడారు. ఏపీకి ఇచ్చిన అన్ని హామీలు అమలు చేస్తే చంద్రబాబు రాజకీయంగా ఎదుగుతారన్న భయం వారికి ఉందన్నారు. చంద్రబాబు ఉన్నత స్థాయికి వెళ్లాలని రిలయన్స్ అధినేత ముఖేష్ అంబానీ లాంటి వారే కోరుకుంటున్నారన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు జరిగిన అన్యాయంపై పార్లమెంట్‌లో టీడీపీ ఎంపీలంతా కాంగ్రెస్ పార్టీ మద్దతు కోరామని తెలిపారు. ప్యాకేజీ పేరుతో ఏపీకి కేంద్ర ప్రభుత్వం నిధులు ఇస్తుందన్న నమ్మకం తనకు లేదన్నారు. టీడీపీకి చెందిన కేంద్ర మంత్రులు రాజీనామాలు చేసినా ఎలాంటి ప్రయోజనం ఉండబోదని, వీళ్ల స్థానంలో బీజేపీ వాళ్లకు కేంద్ర మంత్రులుగా మోదీ అవకాశం కల్పిస్తారని తెలిపారు.

19న విజయవాడలో మాదిగల మహాసభ

నెహ్రూనగర్ (గుంటూరు): మాదిగల డిమాండ్ల సాధనకు ఈ నెల 19న విజయవాడ సింగ్‌నగర్ గ్రౌండ్స్‌లో మాదిగల మహాసభ నిర్వహించనున్నట్టు ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు జెన్ని రమణయ్య మాదిగ తెలిపారు. బుధవారం గుంటూరు నగరంపాలెంలోని ఓ హోటల్‌లో మహాసభ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రమణయ్య మాట్లాడుతూ.. చెప్పులు కుట్టుకునేవారికి, డప్పులు కొట్టేవారికి, కళాకారులైన మాదిగలకు రూ.2 వేల పింఛన్ ఇవ్వాలని, జీవో నంబర్ 25 అమలు, ఎస్సీ వర్గీకరణ తదితర సమస్యలపై ఈ మహాసభ నిర్వహించనున్నట్టు తెలిపారు. దీనికి సీఎం చంద్రబాబు, పలువురు రాష్ట్ర మంత్రులు హాజరవుతారని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు మేకల దాసు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పమిడిపాటి కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

బాబు డ్రామాలను ప్రజలు నమ్మరు

- వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి అంబటి రాంబాబు
- ప్రత్యేక హోదా కోసం వైఎస్ జగన్ కీలక నిర్ణయం ప్రశంసనీయం
- ఆరు కోట్ల ప్రజల కోసం చెయ్యి కలపమంటున్నాం



విజయవాడ సిటీ: ప్రత్యేక హోదా సాధన కోసం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎంపీలతో రాజీనామాలు చేయించేందుకు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తీసుకున్న నిర్ణయం ప్రశంసనీయమని పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి అంబటి రాంబాబు చెప్పారు. రాష్ట్ర ప్రజల ప్రయోజనాల కోసం పదవులకు రాజీనామాలు చేసే వైఎస్సార్ సీపీ ఎంపీలు వీరులని, బీజేపీ తిడుతున్నా.. రాష్ట్ర ప్రయోజనాల కంటే స్వప్రయోజనాలే ముఖ్యమని వేలాడుతున్న టీడీపీ నేతలు కక్కుర్తి నాయకులని దుయ్యబట్టారు. ఆయన బుధవారం విజయవాడలోని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ప్రతి ఒక్కరూ వైఎస్ జగన్ నిర్ణయాన్ని స్వాగతిస్తుండగా... టీడీపీ నేతలు మాత్రం హేళనగా మాట్లాడటం వారి చిత్తశుద్ధికి నిదర్శనమని విమర్శించారు. కొన ఊపిరితో ఉన్న ప్రత్యేక హోదా హక్కును సాధించే ఉద్దేశంతో రాజీనామాల నిర్ణయం తీసుకున్న జగన్ నిర్ణయాన్ని అందరూ ప్రశంసిస్తున్నారని చెప్పారు. రాజీనామాలు నమ్మరని చంద్రబాబు అనడం అవివేకమన్నారు. బీజేపీ చూరు పట్టుకుని వేలాడుతున్న మిమ్మల్ని ప్రజలు నమ్ముతారా? అని నిలదీశారు. డ్రామాలాడుతున్న చంద్రబాబును నమ్మవద్దని ప్రజలను కోరారు. ఇప్పటికైనా చంద్రబాబు బుద్ధి తెచ్చుకొని ప్రత్యేక హోదా కోసం పోరాటం చేయాలని సూచించారు.

డ్రామా మీదా.. మాదా?

రాష్ట్ర ప్రయోజనాల కోసం పదవులను తృణప్రాయంగా భావించి రాజీనామాలకు సిద్ధమైన వైఎస్సార్‌సీపీ ఎంపీలను విమర్శించడం ఏపీ ప్రజలను, ప్రత్యేక హోదానే కించపరినట్లేనని అంబటి చెప్పారు. పార్టీ మారి కూడా పదవులకు రాజీనామా చేయని వారున్న ఈ సమాజంలో ఇంకా ఏడాది సమయం ఉన్నా ఆ పదవులు వదిలిపెట్టేందుకు సిద్ధం కావడం డ్రామానా? లేక బీజేపీ నేతలు దూషిస్తున్నా చూరు పట్టుకొని ఇంకా కేంద్రంలో మంత్రులుగా కొనసాగుతున్న టీడీపీ నేతలది డ్రామానా అనే విషయం ఆత్మపరిశీలన చేసుకోవాలన్నారు. పార్లమెంట్‌లో ఒకరు గుండు గీయించుకుంటే, మరొకరు విచిత్ర వేషధారణ వేశారని, మరో ఎంపీ గల్లా జయదేవ్ ప్రధాని లేని సమయంలో గర్జించారని ఎద్దేవా చేశారు. ప్రత్యేకహోదా వల్ల నష్టమనీ, ప్యాకేజీనే అద్భుతమని ఆ రోజు చెప్పిన టీడీపీ నేతలు ఈ రోజు ప్లేట్ ఫిరాయించి డ్రామాలాడుతున్నారని దుయ్యబట్టారు. చంద్రబాబు ఇంకా డ్రామాలు ఆడుతున్నారని ధ్వజమెత్తారు. పార్లమెంట్ సమావేశాల ప్రారంభం నుంచి కలుగులో దాక్కున్న చంద్రబాబు... మీడియాకు మాత్రం లీకులు ఇస్తూ కాలంగడుపుతున్నారని దుయ్యబట్టారు.

పుణ్యస్నానాలకు వెళ్లి బీచ్‌లో ఇద్దరు మృతి




మృతి చెందిన వెంకట శివరాంప్రసాద్, రమణ (ఫైల్)

ఆరిలోవ (విశాఖ తూర్పు): విశాఖ తీరం జోడుగుళ్లపాలెం వద్ద శివరాత్రి స్నానాలు చేస్తూ ఇద్దరు మృతి చెందారు. నగరంలోని మూడోవార్డు ఇందిరాగాంధీనగర్‌కు చెందిన దువ్వి వెంకట శివరాంప్రసాద్ (48), కిర్లంపల్లి రమణ (45) కుటుంబాలతో సహా బుధవారం ఉదయం జోడుగుళ్లపాలెం బీచ్‌కు సముద్ర స్నానాలకు వెళ్లారు. పిల్లలు బంతితో ఆడుకుంటుండగా బంతి లోపలకు వెళ్లిపోవడంతో యశ్వంత్ అనే కుర్రాడు సముద్రం లోపలకువెళ్లి అలల్లో చిక్కుకొన్నాడు. అతని తండ్రి వెంకటశివరాంప్రసాద్ కుమారుడిని రక్షించడానికి వెళ్లాడు. ఆ సమయంలో పెద్ద అల రావడంతో తండ్రీకొడుకులు చిక్కుపోయారు. కుమారుడిని ఒడ్డుకు నెట్టేసి శివరాంప్రసాద్ లోపలకు కొట్టుకుపోయాడు. వీరితో పాటు స్నానం చేస్తున్న కిర్లంపల్లి రమణ కూడా అలలకు లోపలకు కొట్టుకుపోయాడు. లైఫ్ గార్డులు వచ్చి వారిద్దర్నీ ఒడ్డుకు తీసుకొచ్చారు. 108 వాహన సిబ్బంది ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో శివరాంప్రసాద్, చికిత్స పొందుతూ రమణ మరణించారు.

ఫ్రెషర్స్‌కు తగ్గిన ఓపెనింగ్స్!

- ఐటీలో ఏడాదిగా ఇదే ట్రెండ్
- మెట్రో నగరాల్లో ఐదో స్థానంలో హైదరాబాద్
- గ్రేటర్‌లో ఫ్రెషర్స్‌కు కొలువుల్లో వృద్ధి 4 శాతమే

సాక్షి, హైదరాబాద్: గత కొన్నేళ్లుగా ఐటీ.. బీపీవో.. కేపీవో రంగాలకు కొంగుబంగారంగా మారింది హైదరాబాద్ మహానగరం. అయితే ఇప్పుడు హైటెక్ సిటీలో పరిస్థితి మారిందట. ఏడాదిగా ఇంజనీరింగ్ పట్టభద్రులకు ఐటీ కొలువుల్లో ఓపెనింగ్స్ అంతంత మాత్రంగానే ఉన్నాయని తాజా సర్వేలో వెల్లడయ్యింది. ఇక ఐటీ కొలువుల్లో వృద్ధి పరంగా చూసినా గ్రేటర్ హైదరాబాద్ ఐదో స్థానానికే పరిమితమైంది. ఐటీ కొలువుల్లో వృద్ధి పరంగా ఫ్రెషర్స్‌కు 40 శాతం కొలువుల భూమ్‌తో కోల్‌కతా నంబర్‌వన్ స్థానంలో నిలిచినట్లు ప్రముఖ వెబ్‌సైట్ నౌక్రీ.కామ్ తాజా సర్వేలో వెల్లడయ్యింది. రెండో స్థానంలో నిలిచిన చెన్నైలో 15 శాతం.. మూడో స్థానం దక్కించుకున్న ఢిల్లీలో ఏడు శాతం.. నాలుగో స్థానంలో ఉన్న బెంగళూరులో ఐదు శాతం.. ఐదో స్థానంలో ఉన్న హైదరాబాద్‌లో 4 శాతం ఐటీ కొలువుల్లో వృద్ధి నమోదైనట్టు ఈ సర్వే పేర్కొంది. 2016 నుంచి 2017 డిసెంబర్ వరకూ వివిధ మెట్రో నగరాల్లో ఫ్రెషర్స్‌కు ఐటీ కొలువుల పెరుగుదలపై ఈ సర్వే చేసింది.

ఫ్రెషర్స్‌కు తగ్గుతున్న కొలువులు..

బహుళ జాతి, దేశీయ దిగ్గజ సంస్థలకు చెందిన సుమారు 1,200 సాఫ్ట్‌వేర్ కంపెనీల బ్రాంచీలు హైదరాబాద్ కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్నాయి. ఆయా కంపెనీల్లో సుమారు 6 లక్షల మంది ఉపాధి పొందుతున్నారు. ఆయా కంపెనీల విస్తరణ ప్రణాళికలు ఏటా ఆశించిన మేరకు అమలు కాకపోవడం.. కొత్త ప్రాజెక్టులు చేజిక్కకపోవడం.. అంతర్జాతీయంగా మార్కెట్ ఆశించిన స్థాయిలో లేకపోవడం తదితర కారణాలతో కొలువుల్లో మందగమనం నమోదైనట్లు ఐటీ రంగ నిపుణులు చెబుతున్నారు. ఏటా ఈ రంగంలో స్థూలంగా 2 శాతం వృద్ధి నమోదవుతున్నట్లు వెల్లడించారు. ఐటీ రంగంతో పోలిస్తే గ్రేటర్ పరిధిలో ఏడాదిగా ఆటోమొబైల్ రంగంలో 31 శాతం, బీమా రంగంలో 21 శాతం మేర ఉపాధి అవకాశాలు పెరిగినట్లు నౌక్రి.కామ్ సర్వేలో తేలింది. కేంద్ర ప్రభుత్వ సౌజన్యంతో నిర్మించ తలపెట్టిన ఐటీఐఆర్ ప్రాజెక్టు నాలుగేళ్లుగా సాకారం కాకపోవడం ఈ రంగం వృద్ధికి ప్రతిబంధకంగా మారిందని ఐటీ నిపుణులు చెబుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన ఐటీ, హార్డ్‌వేర్ పాలసీ, టీఎస్‌ఐపాస్‌తో ఐటీ రంగంతోపాటు పారిశ్రామిక రంగాలు ఇప్పుడిప్పుడే పురోగమిస్తున్నాయని, త్వరలో ఆయా రంగాల్లో వృద్ధి నమోదవుతుందని అంచనా వేస్తున్నారు.

అనుభవజ్ఞులకు ఏడాదిగా పెరుగుతున్న కొలువుల అవకాశాలిలా..

అనుభవం	అవకాశాల్లో వృద్ధి శాతం
3 ఏళ్లు	33
4-7 ఏళ్లు	26
8-12 ఏళ్లు	21
13-16 ఏళ్లు	19
16 ఏళ్లకుపైగా	24

గత కొన్నేళ్లుగా గ్రేటర్ నుంచి ఐటీ ఎగుమతుల్లో పెరుగుదల ఇలా..





అనుభవానికే పెద్దపీట..

మహానగరం పరిధిలో సుమారు వందకుపైగా ఇంజనీరింగ్ కళాశాలలు ఉన్నాయి. వీటి పరిధిలో పట్టభద్రులైన ఇంజనీర్ల(ఫ్రెషర్స్) కంటే మూడేళ్లపాటు ఐటీ రంగంలో అనుభవం గడించిన నిపుణులైన వారికే కొలువుల ఆఫర్స్ వెల్లువెత్తుతున్నాయని ఈ సర్వేలో తేలింది.

తరలివస్తున్న ప్రముఖ కంపెనీలు..



గతేడాది గ్రేటర్ పరిధిలో 45 బహుళ జాతి, ప్రముఖ సాఫ్ట్‌వేర్ కంపెనీలు కొలువయ్యాయి. సుమారు లక్ష మందికి ఉపాధి లభించింది. నూతన ఐటీ, హార్డ్‌వేర్, యానిమేషన్ పాలసీ, టీఎస్ఐపాస్ రాకతో ఆయా రంగాల్లోని విఖ్యాత కంపెనీలు నగరానికి తరలివస్తున్నాయి. జాతీయ సగటుతో పోలిస్తే ఐటీ ఎగుమతుల వృద్ధి నగరంలోనే అధికం.

– జయేశ్ రంజన్, తెలంగాణ ఐటీ శాఖ ముఖ్య కార్యదర్శి

మందగమనం తాత్కాలికమే..



ఫ్రెషర్స్‌కు ఓపెనింగ్స్ విషయంలో మందగమనం తాత్కాలికమే. గ్రేటర్‌లో నూతన కంపెనీల కార్యకలాపాలు ఇప్పుడిప్పుడే ప్రారంభమయ్యాయి. సమీప భవిష్యత్‌లో ఆయా కంపెనీల్లో ఫ్రెషర్స్‌కు బోలెడన్ని అవకాశాలు దక్కుతాయి. ఫ్రెషర్స్‌కు సాఫ్ట్ స్కిల్స్, వృత్తి నైపుణ్య శిక్షణ ఇచ్చే విషయంలో ఇంజనీరింగ్ కళాశాలలు అవసరమైన చర్యలు తీసుకుంటే ఐటీ రంగం పురోగమిస్తుంది.

– రమేశ్ లోకనాథన్, హైసియా మాజీ అధ్యక్షుడు

అశోక్‌బాబుకు కోర్టు ధిక్కార నోటీసు

స్వయంగా వచ్చి వివరణ ఇవ్వాలని హైకోర్టు ఆదేశం

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్‌లోని ఏపీ ఎన్జీవో సంఘం భవనంలో భాగ్యనగర్ తెలంగాణ ఎన్జీవో సంఘానికి భాగం ఇవ్వాలని గతంలో జారీచేసిన ఉత్తర్వుల్ని ఎందుకు అమలు చేయలేదో స్వయంగా కోర్టుకు వచ్చి వివరణ ఇవ్వాలని ఏపీ ఎన్జీవో సంఘం అధ్యక్షుడు అశోక్‌బాబును ఉమ్మడి హైకోర్టు ఆదేశించింది. కోర్టు ధిక్కార చర్యలు ఎందుకు తీసుకోరాదో చెప్పాలని ఆయనకు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణ సమయంలో స్వయంగా కోర్టుకు వచ్చి వివరణ ఇవ్వాలని ఉమ్మడి హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్, న్యాయమూర్తి జస్టిస్ జె.ఉమాదేవిలతో కూడిన ధర్మాసనం బుధవారం ఆదేశించింది. గదులు ఇవ్వాలంటూ గతంలో కోర్టు ఇచ్చిన ఉత్తర్వుల్ని అమలు చేయనందున అశోక్‌బాబుపై కోర్టు ధిక్కార చర్యలు తీసుకోవాలని కోరుతూ భాగ్యనగర్ తెలంగాణ ఎన్జీవో సంఘం అధ్యక్షుడు సత్యనారాయణగౌడ్ దాఖలు చేసిన వ్యాజ్యాన్ని ధర్మాసనం విచారణకు స్వీకరించింది. తదుపరి విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసింది.

తొలి దశలో 200 'అన్న క్యాంటీన్లు'

మంత్రి నారాయణ వెల్లడి

సాక్షి, అమరావతి: జూన్ 2న రాష్ట్రంలో 200 'అన్న క్యాంటీన్లు' ప్రారంభించనున్నట్లు మంత్రి పి.నారాయణ తెలిపారు. లక్షకు పైగా జనాభా ఉన్న 33 మున్సిపాలిటీల్లో ఈ క్యాంటీన్లు నెలకొల్పుతామన్నారు. బుధవారం సచివాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. తమిళనాడు, కర్ణాటకలోని క్యాంటీన్లను స్వయంగా పరిశీలించి, వాటిని ఎలా నిర్వహిస్తున్నారో తెలుసుకున్నట్లు చెప్పారు. బెంగళూరులో ఇందిరా క్యాంటీన్లకు సొంత భవనాలు నిర్మించారని, అదే తరహాలో రాష్ట్రంలోనూ తొలి విడత చేపట్టే 200 క్యాంటీన్లకు సొంత భవనాలు నిర్మించాలని నిర్ణయించినట్లు తెలిపారు. క్యాంటీన్లు ఏర్పాటు చేయాల్సిన ప్రదేశాలను ఇప్పటికే గుర్తించామన్నారు. కాగా, రాజధానిలో చేపట్టిన రోడ్ల నిర్మాణ పనుల్ని త్వరగా పూర్తి చేయాలని సీఆర్‌డీఏ సమావేశంలో సీఎం సూచించారని చెప్పారు. ఐఏఎస్, గెజిటెడ్, నాన్-గెజిటెడ్, ఉద్యోగుల క్వార్టర్ల పనులు ఈ ఏడాది చివరి కల్లా పూర్తి చేస్తామని తెలిపారు.

ఇళ్లు కట్టాం.. బిల్లులేవీ?

- అస్తవ్యస్తంగా ఎన్టీఆర్ గృహ నిర్మాణ పథకం
- బిల్లులు మంజూరు కాక లబ్ధిదారుల అవస్థలు
- అసంపూర్తిగా ఉన్న ఇళ్లలోనే గృహప్రవేశాలు జరిపించిన సర్కారు
- లక్ష్య సాధనలో గృహ నిర్మాణ శాఖ వెనుకడుగు

సాక్షి, అమరావతి

రాష్ట్రంలో ఎన్టీఆర్ గృహ నిర్మాణ పథకం అస్తవ్యస్తంగా మారింది. 2.39 లక్షల ఇళ్లు పూర్తి చేశామని గృహప్రవేశాల పేరిట ప్రభుత్వం ఇటీవల హడావుడి చేసినా వాస్తవ పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయి. బిల్లులు మంజూరు కాకపోవడంతో చాలా ఇళ్లు అసంపూర్తిగా ఉన్నాయి. సొంతింటి కల నెరవేరుతుందా లేదో తెలియక లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. ఎన్టీఆర్ గృహ నిర్మాణ పథకం కింద ప్రభుత్వం ఒక్కో ఇంటి నిర్మాణానికి యూనిట్ ధర రూ.1.50 లక్షలుగా నిర్ణయించింది. సొంతింటి కోసం ఎదురు చూస్తున్న పేదలకు ప్రభుత్వం ప్రకటించిన యూనిట్ ధర మొత్తం అంతా ఇళ్ల నిర్మాణం పూర్తయ్యేలోపు దశల వారీగా చెల్లించాల్సి ఉంటుంది. అయితే నిర్మాణాలు పూర్తయినా బిల్లులు మంజూరు చేయడం లేదు. దీంతో నిర్మాణాలు ఎక్కడికక్కడే ఆగిపోతున్నాయి. ఒక్కో లబ్ధిదారుడికి రూ.55 వేల మేరకు బిల్లులు పెండింగ్‌లో ఉంచుతున్నారు. 2019 జనవరిలోగా రాష్ట్రంలో 12.97 లక్షల ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్ణయించడంతో ఆ మేరకు గృహ నిర్మాణ శాఖ సిబ్బంది లబ్ధిదారులపై ఒత్తిడి పెంచుతున్నారు. బిల్లులు సరిగా ఇవ్వనిదే నిర్మాణాలు ఏ విధంగా వేగవంతం చేస్తామని ప్రశ్నిస్తున్న లబ్ధిదారులకు సిబ్బంది సరైన సమాధానం ఇవ్వకుండా దాటవేస్తున్నారు. ఒక్కో వర్క్ఇన్‌స్పెక్టర్ పరిధిలో ఉన్న గ్రామాల్లో వారు నెలకు 20 ఇళ్లు పూర్తి చేయాలని టార్గెట్ విధించారు. రాష్ట్రంలో 2.39 లక్షల ఇళ్లు పూర్తి చేశామని ఇటీవల పెద్ద ఎత్తున గృహ ప్రవేశాల పేరిట హడావుడి చేశారు. బిల్లులు అందక అసంపూర్తిగా ఉన్న ఇళ్లలోనూ గృహ ప్రవేశాలు చేసి ఇక తమ పనైపోయిందన్న రీతిలో వ్యవహరిస్తుండటంతో పేదలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.


బిల్లులు రాక మంతెన గ్రామంలో ఆగిన ఇళ్ల నిర్మాణం


నిర్మాణం పూర్తయినా బిల్లులు మంజూరు చేయకపోవడంతో తలుపులు వేయలేని స్థితిలో ఉన్న ఇళ్లు

గృహప్రవేశాలు జరిగాయని ప్రభుత్వం ప్రకటించిన ఇళ్ల వివరాలు

జిల్లా	ఇళ్ల సంఖ్య
శ్రీకాకుళం	23,688
విజయనగరం	14,111
విశాఖపట్నం	21,626
తూర్పు గోదావరి	30,939
పశ్చిమ గోదావరి	29,116
కృష్ణా	17,275
గుంటూరు	21,254
ప్రకాశం	14,677
నెల్లూరు	17,092
చిత్తూరు	15,096
వైఎస్సార్	11,036
అనంతపురం	17,184
కర్నూలు	16,850

బిల్లుల అందక అప్పులపాలయ్యాం



ప్రభుత్వం ప్రకటించిన విధంగా యూనిట్ ధర రూ. 1.50 లక్షలు వస్తుందనే ఆశతో అప్పు చేసి ఇళ్లు నిర్మించుకున్నాం. ఇంటికి సున్నం వేసి గృహ ప్రవేశం చేసినా పూర్తి బిల్లు ఇవ్వలేదు. ఇంకా రూ. 55 వేలు బిల్లు మంజూరు చేయకుండా పెండింగ్‌లో ఉంచారు. దీంతో ద్వారానికి, కిటికీలకు తలుపులు బిగించుకోలేక పోతున్నాం. ఇంటి నిర్మించుకున్నామనే తృప్తి ఉన్నా తలుపులు లేక అందులో నివాసం ఉండలేక పోతున్నాం. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పెండింగ్ బిల్లులు ఇస్తే మాలాంటి పేదోళ్లకు ఆర్థిక ఇబ్బందులు తప్పుతాయి.

–వడ్లమాటి మాణిక్యం, మంతెన, కంకిపాడు మండలం, కృష్ణా జిల్లా

బిల్లులు రాక మధ్యలోనే ఆపేశాం

పైకప్పు వరకు ఇంటి నిర్మాణం చేశాం. ప్రభుత్వం ఇప్పటివరకు రూ. 38 వేలు మాత్రమే బిల్లు ఇచ్చింది. మిగిలిన బిల్లు గురించి అడిగితే గృహ నిర్మాణ శాఖ సిబ్బంది ఎలాంటి సమాధానం ఇవ్వడంలేదు. దీంతో ప్రైవేటు వ్యక్తుల దగ్గర అప్పు తీసుకొని ఇల్లు పూర్తి చేద్దామన్నా వడ్డీ చెల్లించే స్థోమత లేక మధ్యలోనే ఇంటి నిర్మాణం ఆపేశాం. ప్రభుత్వం స్పందించి వెంటనే బిల్లులు మంజూరు చేసి ఆదుకోవాలి.

–తిరువీధుల కృపవరం, మంతెన, కంకిపాడు మండలం.

ఆరుగురు డిప్యూటీ కలెక్టర్లకు కన్ఫర్డ్ ఐఏఎస్ హోదా

సర్కారు ఉత్తర్వులు జారీ

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఆరుగురు డిప్యూటీ కలెక్టర్లకు కన్ఫర్డ్ ఐఏఎస్ హోదా లభించింది. కేంద్ర సిబ్బంది, శిక్షణ వ్యవహారాల శాఖ జారీ చేసిన ఉత్తర్వులకు అనుగుణంగా రాష్ట్రానికి చెందిన ఆరుగురు డిప్యూటీ కలెక్టర్లకు కన్ఫర్డ్ ఐఏఎస్‌గా పదోన్నతి కల్పించినట్లు రాష్ట్ర ప్రభుత్వం బుధవారం జీవో జారీ చేసింది. మద్దుకూరి వెంకటేశ్వర్లు, ఎం.వేణుగోపాల్‌రెడ్డి, కె.వెంకట రమణారెడ్డి, ఎన్.ప్రభాకర్‌రెడ్డి, పి.రంజిత్ బాషా, ఎస్.ఢిల్లీరావు రాష్ట్ర కేడర్ ఐఏఎస్‌కు ఎంపికైనట్లు సాధారణ పరిపాలన శాఖ కార్యదర్శి నాగులపల్లి శ్రీకాంత్ జీవోలో పేర్కొన్నారు.

విద్యుత్ కొనుగోలు భారం తగ్గించండి

- కొనుగోలు ఒప్పందాలు పునఃసమీక్షించాలి
- ఏపీఈఆర్‌సీ ప్రజాభిప్రాయ సేకరణలో నిపుణులు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో విద్యుత్ అవసరాలను డిస్కమ్‌లు ఎక్కువ చేసి చూపాయని, ఈ కారణంగా ప్రైవేట్ విద్యుత్ కొనుగోళ్లకు సిద్ధపడటం వల్ల డిస్కమ్‌లు నష్టపోతాయని పలువురు విద్యుత్ రంగ నిపుణులు అభిప్రాయ పడ్డారు. రాష్ట్ర విద్యుత్ పంపిణీ సంస్థలు (ఏపీ డిస్కమ్స్) 2018–19 సంవత్సరానికి సమర్పించిన వార్షిక ఆదాయ, అవసర నివేదికలు (ఏఆర్ఆర్)పై బుధవారం హైదరాబాద్‌లో ప్రజాభిప్రాయ సేకరణ జరిగింది. కమిషన్ చైర్మన్ జస్టిస్ భవానీ ప్రసాద్, సభ్యులు రఘు, రామ్మోహన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు విద్యుత్ రంగ నిపుణులు, ప్రజా సంఘాల నేతలు, పరిశ్రమల ప్రతినిధులు పాల్గొన్నారు. ఏపీ జెన్‌కో ప్లాంట్లలో పూర్తిస్థాయిలో విద్యుత్ ఉత్పత్తి జరిగితే, కేంద్ర ప్రభుత్వ విద్యుత్ వాటాను వినియోగిస్తే అనవసర కొనుగోళ్ళను నివారించవచ్చని సూచించారు. అన్ని రాష్ట్రాల్లోనూ సమృద్ధిగా విద్యుత్ లభ్యత ఉందని, ఈ కారణంగా విద్యుత్ చౌకగా లభిస్తోందని తెలిపారు. ఇతర రాష్ట్రాలతో పోలిస్తే ఏపీలోపరిశ్రమలకు డిమాండ్ చార్జీలు ఎక్కువగా వసూలు చేస్తున్నారని, దీనివల్ల పారిశ్రామిక రంగంలో విద్యుత్ వినియోగం తగ్గుతోందని వివరించారు. కొత్తగా వచ్చే పరిశ్రమలకు విద్యుత్ చార్జీల భారం ఇబ్బందిగా ఉందన్నారు. పవన, సౌర విద్యుత్ ధరలు పడిపోతున్న నేపథ్యంలో ఇప్పటికే డిస్కమ్‌లు చేసుకున్న విద్యుత్ కొనుగోలు ఒప్పందాలను పునః సమీక్షించాలని కోరారు.

చెప్పిన చోటుకి రావాలి..!

- మహిళలను కించపరుస్తున్న 'చంద్రన్న సంచార చికిత్స' యాజమాన్యం
- శ్రీకాకుళంలో ఓ మహిళా ల్యాబ్‌టెక్నీషియన్‌కు వేధింపులు
- పాడేరు, విజయవాడలో ఇద్దరు ఏఎన్ఎంలకూ చేదు అనుభవం
- ఫిర్యాదు చేసినా చర్యలు శూన్యం

సాక్షి, అమరావతి: 'చంద్రన్న సంచార చికిత్స' పథకంలో(104) పనిచేస్తున్న మహిళలపై వేధింపులు తీవ్ర స్థాయికి చేరుకున్నాయి. పలువురు మహిళలు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోవడంతో బాధను దిగమింగి ఉద్యోగం చెయ్యడమా, లేదంటే మానేయడమో చేస్తున్నారు. తాజాగా శ్రీకాకుళం జిల్లాలో పిరమిల్ స్వాస్థ్య యాజమాన్య సిబ్బంది తీవ్ర వేధింపులకు గురిచేసినట్టు ఓ మహిళా ల్యాబ్ టెక్నీషియన్ ఆరోపించింది. పిరమిల్ స్వాస్థ్య జిల్లా మేనేజర్ శంకరనారాయణ, ఆపరేషనల్ ఎగ్జిక్యూటివ్ లక్షణరావులపై జిల్లా కలెక్టర్‌కూ, వైద్య ఆరోగ్యశాఖ ముఖ్యకార్యదర్శి పూనం మాలకొండయ్యకూ ఫిర్యాదు చేశారు. మేము ఎక్కడ వాడుకుంటే అక్కడకు రావాలి అంటూ వ్యంగ్యంగా, కించపరిచే మాటలు మాట్లాడారని, మాట వినకపోతే రోజుకో ఊరికి వెళ్లాలని చెప్పి వేధించేవారని వాపోయింది. దీనిపై యూనియన్ కూడా స్పందించి ఫిర్యాదులు చేసినా చర్యలు తీసుకోలేదు. అలాగే పాడేరు డివిజన్‌లో పనిచేస్తున్న ఒక ఏఎన్ఎంను కూడా ఇలాగే వేధించడంతో ఆమె కూడా యాజమాన్యానికి ఫిర్యాదు చేసింది. దీనిపై ఎవరూ చర్యలు తీసుకోలేదు. విజయవాడలో ఒక మహిళకు ఏఎన్ఎం ఉద్యోగం ఇప్పిస్తామని కార్యాలయానికి పిలిపించి ఇష్టారాజ్యంగా వ్యవహరించడంతో ఆ మహిళ తీవ్ర మనోవేదనకు గురైంది. పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే పరువు పోతుందని, తనపేరు అందరికీ తెలిసిపోతుందనే ఉద్దేశంతో అదే సంస్థలో పనిచేసే ఒక ఉద్యోగితో చెప్పుకుని వాపోయింది. ఇలా 'చంద్రన్న సంచార చికిత్స'లో పనిచేస్తున్న మహిళా ఉద్యోగులపై ఆగడాలు మితిమీరిపోయాయి. ప్రత్యేకంగా మహిళా ఫిర్యాదులపై ఓ మహిళా అధికారిని ఏర్పాటు చేశామని చెబుతున్నా అది తూతూమంత్రంగా ఉంది.



మీడియాకు చెబితే ఉద్యోగం నుంచి తొలగిస్తాం..

సంస్థలో వేధింపులపై మీడియాకు సమాచారమిస్తే ఎలాంటి ఉత్తర్వులు లేకుండా తొలగించే హక్కు ఉందని యాజమాన్యం హెచ్చరిస్తోంది. ఇప్పటికే పలువురు ఉద్యోగులకు షోకాజ్ నోటీసులు జారీ చేసి మిగతా ఉద్యోగుల్లో భయభ్రాంతులు సృష్టించారు. మీడియాలో వచ్చిందంటే మీరే కారణం, మీరు కారణం కాదనుకుంటే వార్తలు రాసిన రిపోర్టరుపై సదరు పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేయండి అంటూ ఉద్యోగులకు చెప్పారంటే యాజమాన్యం ఏ స్థాయిలో వ్యవహరిస్తోందో అర్థమవుతుంది. గత 11 సంవత్సరాలుగా ఈ పథకం కింద పనిచేస్తున్నాం, గతంలో ఎప్పుడూ ఇలాంటి వేధింపుల ధోరణి లేదని, ప్రస్తుతం ఈ సంస్థ వేధింపులు భరించలేకున్నామని మహిళలు వాపోతున్నారు. చివరకు అధికారులకు ఫిర్యాదు చేసినా తమను బదిలీ చేస్తామంటూ బెదిరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రైళ్ల కోసం భారీ వంతెనలు!

- 20 కి.మీ. కన్నా పొడవుతో నిర్మాణం
- బై–పాస్ లైన్ల కోసం రైల్వే కసరత్తు
- దక్షిణ మధ్య రైల్వేలో రెండింటికి త్వరలో సర్వే

సాక్షి, హైదరాబాద్: అతి పొడవైన వంతెనలు నిర్మించేందుకు రైల్వే శాఖ ఏర్పాట్లు చేస్తోంది. దక్షిణ మధ్య రైల్వేలో ప్రయోగాత్మకంగా కొండపల్లి –ముస్తాబాద్, గుంతకల్–మల్లప్పగేట్ మధ్య రెండు ఫ్లై ఓవర్ల నిర్మాణానికి సర్వే చేయనుంది. ఇవి భారీ వ్యయంతో కూడుకున్న ప్రాజెక్టులు కావటంతో వాటి సాధ్యాసాధ్యాలపై సర్వే చేసి, ఆమోదయోగ్యంగా ఉంటే మిగతా చోట్ల ఆ విధానాన్ని అనుసరించాలని నిర్ణయించింది.

రెండు చోట్ల నిర్మాణం: దక్షిణ మధ్య రైల్వే పరిధిలోని విజయవాడ డివిజన్‌లో ముస్తాబాద్–కొండపల్లి మధ్య 25 కిలోమీటర్లు, గుంతకల్ డివిజన్ పరిధిలోని గుంతకల్ వెస్ట్–మల్లప్పగేట్ మధ్య 20 కి.మీ. మేర బై–పాస్ లైన్లు నిర్మించనున్నట్టు బడ్జెట్‌లో రైల్వే శాఖ ప్రతిపాదించింది. తాజాగా ఈ రెండింటిని ఆకాశ మార్గాలుగా నిర్మించేందుకు సర్వే చేయాలని ఆదేశించింది. ఆ ప్రకారం ప్రారంభం నుంచి చివరి వరకు వంతెన మీదుగానే లైన్ నిర్మిస్తారు. ఆయా స్టేషన్ల నుంచి ఐదు చొప్పున విడివిడి మార్గాలు ఉండటం, బై–పాస్ లైన్ నిర్మించడంలో ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉండటంతో వంతెన మార్గాన్ని రైల్వే ఎంచుకుంది. దీనివల్ల స్థలం సమస్యను అధిగమించటంతోపాటు లైన్ బ్లాకింగ్, సిగ్నలింగ్ సమస్యలు ఉండవు. కొండపల్లి–ముస్తాబాద్ మధ్య ఇప్పటికే తెనాలి, గుంటూరు, విజయవాడ, విశాఖ, గుడివాడ రైలు మార్గాలు వేర్వేరుగా ఉన్నాయి. వాటి మధ్య కొత్త మార్గం సాధ్యం కాదనే ఉద్దేశంతో ఆకాశ మార్గాన్ని ఎంచుకున్నారు. గుంతకల్ వెస్ట్–మల్లప్ప గేట్ మధ్య బళ్లారి, డోన్, అనంతపురం, గుత్తి, వాడీ మార్గాలు వేర్వేరుగా ఉన్నాయి. దీంతో ఇక్కడ కూడా ఫ్లై ఓవర్‌ను ప్రతిపాదించారు. ఒక్కోటి 20 కి.మీ. మించిన పొడవుతో ఉండే లైన్లు కావటంతో దేశంలోనే పొడవైన రైలు వంతెనల్లో ఇవి చోటు దక్కించుకోనున్నాయి.

షార్ట్ కట్ లైన్లు: సాధారణంగా రోడ్లకు ప్రత్యామ్నాయంగా దగ్గరి మార్గాలు ఉంటాయి. రైల్వే లైన్ల విషయంలో అలా కాదు. ఒకే రైలు మార్గం ఉంటుండటంతో దాని మీదుగానే ప్రయాణించి అక్కడి నుంచి అనుసంధానమయ్యే మరో మార్గంలోకి మళ్లి గమ్యం చేరుకోవాలి. దీనివల్ల దూరాభారం, సమయం పెరుగుతోంది. ఇలా కాకుండా బై–పాస్ రైల్వే లైన్లు నిర్మించాలని ఇటీవలి బడ్జెట్‌లో రైల్వే శాఖ ప్రతిపాదించింది. దీంతో సాధారణ రైలు మార్గం కాకుండా సమీపంలోని మరో గమ్యానికి దగ్గరి దారిగా ఈ లైన్లు నిర్మిస్తారు. ఇప్పుడు ఇలా మంజూరైన రెండు బై–పాస్ లైన్లను ఆకాశమార్గంగా రూపొందించాలని రైల్వే శాఖ భావిస్తోంది. హైదరాబాద్ శివార్లలో కూడా ఈ తరహా ప్రాజెక్టులపై రైల్వే బోర్డు దృష్టి పెట్టినట్లు చెబుతున్నారు.

హెల్త్‌కేర్ సేవలకు జీఎస్టీ లేదు!



న్యూఢిల్లీ: ఆస్పత్రుల్లోని రోగులకు వైద్యుల సూచనల మేరకు అందజేసే ఆహారంపై వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) లేదని ప్రభుత్వం తెలిపింది. అనారోగ్యం, గాయం, గర్భం, వంటి కారణాలతో ఆస్పత్రిలో చేరిన వారు చేయించుకునే పరీక్షలు, చికిత్స, వైద్యం వంటివి జీఎస్టీ చట్టం ప్రకారం హెల్త్‌కేర్ సేవల పరిధిలోకి వస్తాయని, వీటిపై పన్ను ఉండదని పేర్కొంది. దీంతోపాటు ఆస్పత్రులకు రోగులు చెల్లించే మొత్తం (వైద్యుల ఫీజు సహా)నకు కూడా జీఎస్టీ మినహాయింపు వర్తిస్తుందని తెలిపింది. అయితే, ఆస్పత్రిలో జాయిన్ కాని రోగులు, వారి సంబంధీకులు, సందర్శకులకు ఇచ్చే ఆహారంపై జీఎస్టీ ఉంటుందని కేంద్ర ఆర్థిక శాఖ స్పష్టం చేసింది.

సరిహద్దుల్లో 300 మంది ఉగ్రవాదులు

జమ్మూ: భారత్, పాక్ సరిహద్దుల్లోని నియంత్రణ రేఖ(ఎల్వోసీ) వద్ద పాకిస్తాన్ వైపు దాదాపు 300 మంది ఉగ్రవాదులు సిద్ధంగా ఉన్నారని సైన్యం తెలిపింది. భారత్‌లోకి ప్రవేశించేందుకు వీరికి పాక్ సైన్యం సహాయసహకారాలు అందిస్తోందని వెల్లడించింది. ఎల్వోసీ దక్షిణ భాగంలో 185 నుంచి 220 మంది ఉగ్రవాదులు, పీర్‌పంజాల్ వద్ద 190 నుంచి 225 మంది ఉగ్రవాదులు భారత దేశంలోకి చొరబడేందుకు అదను కోసం ఎదురు చూస్తున్నారని లెఫ్టినెంట్ జనరల్ దేవ్‌రాజ్ అన్బు తెలిపారు. బుధవారం ఆయన ఉధంపూర్ ఆర్మీ ప్రధాన కార్యాలయం వద్ద మీడియాతో మాట్లాడారు. జమ్మూకశ్మీర్‌లో ఉగ్రదాడులు జరిపేందుకు వీరికి పాక్ సైన్యం శిక్షణ ఇచ్చిందన్నారు. ఎల్వోసీ వద్ద విధులు నిర్వర్తించటం ఎంతో క్లిష్టమైనదీ, సవాళ్లతో కూడుకున్నదీ అని తెలిపారు. ఉగ్రదాడులకు ప్రతీకారం తీర్చుకోవటం అన్ని సందర్భాల్లోనూ సరైంది కాదని చెప్పారు.

జవాన్ ప్రాణ త్యాగానికి రూ. 5 లక్షలేనా?

చెక్కును తిరస్కరించిన అమరుడి కుటుంబం

ఆరా(బిహార్): జమ్మూలో మిలిటెంట్ల దాడిలో కన్నుమూసిన జవాన్ కుటుంబం బిహార్ ప్రభుత్వం ఇచ్చిన రూ.5 లక్షల పరిహార చెక్కును తిరస్కరించింది. ఆ మొత్తం జవాన్ గౌరవాన్ని తగ్గించేలా ఉందని, అలాంటి ఘటనల్లో అమరులైన వారికి రూ.11 లక్షలు ఇస్తారని పేర్కొంది. సోమవారం కరణ్‌నగర్ శిబిరంపై జరిగిన ఉగ్రదాడిలో మృతిచెందిన సీఆర్‌పీఎఫ్ కానిస్టేబుల్ ముజాహిద్ ఖాన్ మృతదేహం బుధవారం ఆయన స్వస్థలం భోజ్‌పూర్ జిల్లాలోని పైరోకు చేరింది. ఈ సందర్భంగా తాము అందించిన రూ.5 లక్షల చెక్కును స్వీకరించడానికి ముజాహిద్ కుటుంబం నిరాకరించిందని భోజ్‌పూర్ కలెక్టర్ సంజీవ్ కుమార్ చెప్పారు. అమరుడైన పారామిలిటరీ సిబ్బందికి ఆ ఎక్స్‌గ్రేషియా తక్కువని వారు భావించారని వెల్లడించారు. జవాన్ కుటుంబ సభ్యుల అభ్యంతరాలను రాష్ట్ర హోం శాఖకు తెలిపినట్లు పేర్కొన్నారు.

ఏకంగా ఎక్స్‌రే యంత్రంలోకే..!

దొంగతనం భయంతో చైనాలో ఓ మహిళ నిర్వాకం

షాంఘై: హ్యాండ్‌బ్యాగ్‌లో ఉన్న నగదును ఎవరైనా దొంగిలిస్తారేమోనని భయపడ్డ ఓ మహిళ ఆ బ్యాగ్‌తో పాటు ఏకంగా ఎక్స్‌రే యంత్రంలోకి దూరిపోయిన ఘటన చైనాలో చోటుచేసుకుంది. దీంతో సదరు మహిళ ఎక్స్‌రే యంత్రం లోపల ఇరుక్కుంటుందేమో అని భయపడ్డ అధికారులు.. ఆమె క్షేమంగా బయటికి రావడంతో ఊపిరి పీల్చుకున్నారు. దక్షిణ చైనాలో డొంగ్గున్ నగరంలోని ఓ రైల్వేస్టేషన్‌లో ఆదివారం ఈ సంఘటన చోటుచేసుకుంది. దీనికి సంబంధించిన వీడియోను ఇప్పటివరకూ ఇంటర్నెట్‌లో 30 లక్షల మంది వీక్షించారు. తొలుత రైల్వేస్టేషన్‌కు చేరుకున్న మహిళ తన వస్తువుల్ని ఎక్స్‌రే స్కానింగ్ యంత్రానికి ఉన్న కన్వేయర్ బెల్ట్‌పై ఉంచిందని అధికారులు తెలిపారు. అయితే హ్యాండ్‌బ్యాగ్‌ను కూడా స్కాన్ చేయాల్సిఉంటుందని చెప్పడంతో ఆపరేటర్లకు దొరకకుండా ఆమె బ్యాగుతో సహా ఎక్స్‌రే యంత్రంలోకి దూరిపోయిందని వెల్లడించారు. బ్యాగులోని నగదును ఎవరైనా దొంగిలిస్తారేమోనన్న భయంతోనే ఆమె ఈ ప్రమాదకర చర్యకు పాల్పడినట్లు స్థానిక మీడియా తెలిపింది. మరోవైపు ఆ మహిళ ప్రాణాల కంటే డబ్బుకే ప్రాధాన్యత ఇచ్చిందని పలువురు నెటిజన్లు మండిపడ్డారు. సాధారణంగా వస్తువుల స్కానింగ్‌కు వినియోగించే ఎక్స్‌రేలు మానవ ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతాయి. చైనాలో విమానాశ్రయాలతో పాటు సబ్‌వే స్టేషన్లు, బస్‌స్టాండ్లలో కూడా ప్రయాణికుల వస్తువుల్ని తనిఖీ చేసేందుకు ఎక్స్‌రే యంత్రాలను వినియోగిస్తున్నారు.

'లేక్‌సిటీ'కి నీటి కటకట

బెంగళూరుకు ముంచుకొస్తున్న ముప్పు

- ప్రపంచ జాబితాలో రెండో స్థానం
- మిగిలిన భారత నగరాలూ అప్రమత్తమవ్వాల్సిందే: నిపుణులు

బెంగళూరు: భారత 'సిలికాన్ వ్యాలీ' అయిన బెంగళూరు నగరాన్ని నీటి సంక్షోభం ముంచెత్తనుందా? మన దేశంలోనే మంచినీటి సమస్యను ఎదుర్కొబోయే తొలి నగరం బెంగళూరేనా? తాజాగా వెల్లడైన అధ్యయనాలు ఇదే హెచ్చరికలు జారీ చేస్తున్నాయి. దక్షిణాఫ్రికా రెండో ముఖ్యనగరమైన కేప్‌టౌన్‌లో త్వరలోనే నీళ్ల నిండుకోనున్నట్టు (భూగర్భజలాలు లేకపోవటం) ఇటీవలే ప్రచురితమైన ఓ కథనంపై ఆందోళన చెందుతుండగానే.. ప్రపంచవ్యాప్తంగా నీటిఎద్దడి ఎదుర్కోనున్న 11 నగరాల జాబితాను ఐక్యరాజ్యసమితి వెల్లడించింది. ఇందులో బ్రెజిల్ వాణిజ్య రాజధాని సావ్‌పాలో నగరం అగ్రస్థానంలో నిలిచింది. ఆశ్చర్యకరరీతిలో బెంగళూరు రెండోస్థానంలో నిలవగా, చైనా రాజధాని బీజింగ్ మూడోస్థానంలో, కైరో, జకార్తా, మాస్కో, ఇస్తాంబుల్ తదుపరి స్థానాల్లో ఉన్నాయి. మెక్సికో సిటీ, లండన్, టోక్యో కూడా ఈ జాబితాలో ఉన్నాయి. జనాభా వృద్ధితో పాటు నీటి వనరుల సంరక్షణలో మానవ నిర్లక్ష్యం, వాతావరణ మార్పుల కారణంగా 2030 కల్లా ప్రపంచవ్యాప్తంగా నీటి డిమాండ్ 40శాతం పెరగనుంది.



సమస్య ఏంటి?

బెంగళూరులో రోజురోజుకు పెరుగుతున్న జనాభాకు తగ్గట్టుగా మౌలిక సదుపాయాలు లేకపోవడం, కొరవడిన నగరాభివృద్ధి ప్రణాళికలను ప్రధాన సమస్యలుగా గుర్తించారు. మంచినీరు, మురుగునీటి వ్యవస్థలు సరిగా లేవు. ఫలితంగా భారీగా నీరు వృథా అవటం, ఉపయోగించలేనంత కలుషితంగా మారుతోంది. కొలను (చెరువు)ల నగరంగా పేరుపొందిన బెంగళూరులో ప్రస్తుతం ఒక్క చెరువులోని నీరు కూడా వినియోగించుకోలేని పరిస్థితిలో ఉండటం ఆందోళనకరమే. గతంలో నగర నీటి సరఫరాకు, భూగర్భజలాలు పెరిగేందుకు దోహదపడిన అనేక చెరువులు ఆక్రమణలకు గురయ్యాయి.

ప్రమాదాన్ని తప్పించుకోలేమా?

బెంగళూరుతో పాటు దేశంలోని అనేక ప్రాంతాలు ముఖ్యంగా వివిధ పట్టణాలు, నగరాలు మంచినీటి కొరత ఎదుర్కుంటున్నాయి. అయితే ఈ పరిస్థితిని అధిగమించేందుకు తీసుకుంటున్న చర్యలు మాత్రం ఆశాజనకంగా లేవు. మురుగు నీటిని శుద్ధి చేసే సాంకేతికతను పూర్తిస్థాయిలో అందిపుచ్చుకోవాలి. నదుల ప్రక్షాళనకు పటిష్టమైన చర్యలతోపాటు స్థానిక పరిశ్రమలు, నివాస సముదాయాల ద్వారా నదులు మురికికూపాలుగా మారకుండా జాగ్రత్తపడాలి. పర్యావరణం, సహజ వనరులకు నష్టం కలగని విధంగా నిర్మాణ, ఇతర రంగాల అభివృద్ధి జరిగేలా చూసుకోవాలి. ఈ దిశగా ఏ సమస్య ఎదురైనా.. వెంటనే దానికి పరిష్కారం కనుగొనటంలో తాత్సారం వహించకపోవటం చాలా కీలకం. వర్షపు నీరు వృథా కాకుండా చూడాలి. చెరువుల్లోకి వర్షపు నీరు చేరేందుకున్న అడ్డంకులు, ఆక్రమణలను తొలగించాలి. బెంగళూరుకు ఎదురుకానున్న నీటి సమస్య భారత్‌లోని ఇతర నగరాలకు హెచ్చరికగా కనువిప్పు కలిగించాలని నిపుణులు చెబుతున్నారు.

ఓబీసీలకు రూ. 200 కోట్లతో వెంచర్ క్యాపిటల్ ఫండ్

- డ్రగ్స్ బాధితుల పునరావాసానికి రూ. 200 కోట్లు
- కేంద్ర సామాజిక న్యాయ, సాధికారత శాఖ వెల్లడి

సాక్షి, న్యూఢిల్లీ: 2018–19 ఆర్థిక సంవత్సరం నుంచి ఓబీసీలకు రూ. 200 కోట్లతో వెంచర్ క్యాపిటల్ ఫండ్‌ను ఏర్పాటు చేయనున్నట్టు కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత శాఖ వెల్లడించింది. ఈ శాఖకు కేటాయించిన బడ్జెట్ ద్వారా చేపట్టనున్న పనుల వివరాలు తెలిపింది. గతంతో పోల్చితే ఈసారి కేటాయింపులు 12.10 శాతం పెరిగి రూ. 7,750 కోట్లకు చేరాయని పేర్కొంది. వివిధ పథకాలకు 11.57 శాతం కేటాయింపులు పెరగగా, ఓబీసీ సంక్షేమానికి 41.03 శాతం కేటాయింపులు పెరిగాయి. గతేడాది ఎస్సీలకు అమలుచేసిన తరహాలో ఓబీసీలకూ రూ. 200 కోట్లతో వెంచర్ క్యాపిటల్ ఫండ్ ఏర్పాటు చేయనుంది. ఇందులో రూ. 140 కోట్లను 2018–19లో సమకూర్చనుంది. మత్తుపదార్థాల బారిన పడ్డ వారి పునరావాసం కోసం తొలిసారిగా జాతీయ సర్వే ద్వారా వారిని గుర్తిస్తారు. ఇందుకోసం 185 జిల్లాల్లో, 1.5 లక్షల కుటుంబాలపై చేస్తున్న సర్వే ఏప్రిల్ నాటికి పూర్తవనుంది. వీరి పునరావాసానికి రూ. 200 కోట్లు కేటాయించనున్నారు. పైలట్ ప్రాజెక్టుగా తొలుత 15 జిల్లాల్లో దీన్ని అమలుచేస్తారు. డీ అడిక్షన్ కేంద్రాల పేర్లను చికిత్సా కేంద్రాలుగా మార్చి వాటిల్లో డ్రగ్స్ బాధితులకు చికిత్స అందిస్తారు. పెద్ద కారాగారాలు, జువైనల్ హోమ్స్, ప్రధాన ప్రభుత్వాసుపత్రుల వద్ద ఈ కేంద్రాలను ఏర్పాటుచేస్తారు.

ఆదాయ పరిమితి పెంపు..

ఓబీసీ ప్రీమెట్రిక్ స్కాలర్‌షిప్ పొందేందుకు ప్రస్తుతమున్న వార్షిక ఆదాయ పరిమితిని రూ. 44,500 నుంచి రూ. 2.5 లక్షలకు ప్రభుత్వం పెంచింది. ఎస్సీలకు వార్షికాదాయ పరిమితిని రూ. 2.5 లక్షలకు పెంచింది. డేస్కాలర్లకు స్టైఫండ్‌ను రూ. 225కు, హాస్టల్‌లో ఉండేవారికి రూ. 525కు పెంచింది. టాప్ క్లాస్ ఎడ్యుకేషన్ పథకం కింద ఎస్సీలకు వార్షికాదాయ పరిమితిని రూ. 6 లక్షలకు పెంచింది. స్టైపండ్‌ను స్థానిక విద్యార్థులకు రూ. 2,000కు, ఇతర ప్రాంతాల విద్యార్థులకు రూ. 5,000కు పెంచింది. ఓబీసీలకు ప్రీమెట్రిక్ స్కాలర్‌షిప్‌ను గణనీయంగా పెంచింది.

రూ.380 కోట్ల శశికళ బినామీల ఆస్తుల జప్తు

సాక్షి ప్రతినిధి, చెన్నై: అన్నాడీఎంకే బహిష్కృతనేత శశికళ బంధువులకు చెందిన రూ.380 కోట్ల విలువైన బినామీ ఆస్తులను ఆదాయపు పన్నుశాఖ జప్తు చేసింది. దివంగత తమిళనాడు సీఎం జయలలిత, శశికళ బంధువులు, మిత్రులకు సంబంధించిన ఇళ్లు, కార్యాలయాలపై గత ఏడాది ఐటీ శాఖ పెద్దస్థాయిలో సోదాలు నిర్వహించడం తెల్సిందే. జయ, శశికళ పేర్లతో అనేక బినామీ సంస్థలు ఉన్నట్లు ఈ సోదాల్లో తేలింది. వీటిలోని చాలా సంస్థలను చిరునామా.. చెన్నై టీనగర్‌లోని ఒకే అపార్టుమెంటు కావడం గమనార్హం. కాగా, బినామీ ఆస్తులను, బ్యాంకు ఖాతాలను ఐటీ అధికారులు గతంలో జప్తు చేసిన సంగతి ఆలస్యంగా వెలుగుచూసింది. గత జప్తుకు కొనసాగింపుగా చెన్నై ఎంఆర్‌సీ నగర్‌లోని ఆది ఎంటర్‌ప్రైజెస్‌కు సొంతమైన రూ.380 కోట్ల విలువైన 4.3 ఎకరాల ఫిర్‌హెవెన్ ఎస్టేట్‌ను ఇటీవల జప్తు చేసినట్లు అధికారులు చెబుతున్నారు. ఆస్తుల జప్తుతోపాటు బినామీల చిట్టాను ఐటీ శాఖ తయారుచేస్తోంది. అక్రమాస్తుల కేసులో నాలుగేళ్ల జైలుశిక్షలో ఏడాది కాలాన్ని శశికళ బుధవారంతో పూర్తి చేసుకున్నారు. జయలలిత తొలి వర్ధంతి రోజైన గతేడాది డిసెంబర్ 5న శశికళ చేపట్టిన మౌనవ్రతాన్ని మంగళవారం విరమించినట్లు సమాచారం.

'ఆదియోగి' సన్నిధిలో 3లక్షల మంది పూజలు

కోయంబత్తూరు(తమిళనాడు): కోయంబత్తూరు సమీపంలోని 112 అడుగుల ఎత్తైన 'ఆదియోగి' ప్రతిమ వద్ద శివరాత్రి సందర్భంగా మూడు లక్షల మంది పూజలు చేశారు. మంగళవారం సాయంత్రం 6 గంటలకు మొదలైన పూజా కార్యక్రమాలు బుధవారం ఉదయం ఆరు గంటల వరకు నిర్విరామంగా కొనసాగాయి. ఈ సందర్భంగా ఇషా ఫౌండేషన్ చైర్మన్ సద్గురు జగ్గీ వాసుదేవ్ ప్రవచనాలు, ధ్యానం భక్తులను తన్మయంలో ముంచాయి. ప్రఖ్యాత గాయకుడు సోనూ నిగమ్, రోల్డాన్ బృందం ఫ్యూజన్ బ్యాండ్, మోహిత్ చౌహాన్, దలేర్ మెహిందీ భక్తులను సంగీతంతో అలరించారు. కార్యక్రమంలో తమిళనాడు గవర్నర్ బన్వరీలాల్ పురోహిత్, డిప్యూటీ సీఎం పన్నీర్ సెల్వం, పుదుచ్చేరి సీఎం నారాయణస్వామి పాల్గొన్నారు.

ఇక సినిమాల్లో నటించను: కమల్



సాక్షి ప్రతినిధి, చెన్నై: ఇప్పటికే అంగీకరించిన, నిర్మాణ దశలో ఉన్న చిత్రాలు పూర్తికాగానే నటనకు స్వస్తి పలుకుతానని ప్రముఖ నటుడు కమల్ హాసన్ ప్రకటించారు. ఈనెల 21వ తేదీన రాజకీయ పార్టీ పేరు, పతాకాన్ని ప్రకటించి తమిళనాడువ్యాప్తంగా పర్యటిస్తానని ఆయన వెల్లడించారు. అమెరికాలోని హార్వర్డ్ విశ్వవిద్యాలయంలో ప్రసంగించేందుకు ఇటీవల వెళ్లిన ఆయన అక్కడ ఒక ఇంగ్లీష్ టీవీ ఛానల్‌కు ఇంటర్వ్యూ ఇచ్చారు. పార్టీ పెట్టిన తర్వాత క్రియాశీలక రాజకీయాలకు పూర్తి సమయం కేటాయిస్తానని ఆయన స్పష్టంచేశారు. విడుదలకు సిద్ధమైన విశ్వరూపం–2, సెట్స్‌పై ఉన్న శభాష్ నాయుడు సినిమాల చిత్రీకరణ పూర్తయిన తర్వాత సినిమాల్లో నటించే ఆలోచన లేదని ఆయన చెప్పారు. అయితే శంకర్ దర్శకత్వంలో కమల్ హీరోగా ఇండియన్–2 (తెలుగులో భారతీయుడు) చిత్రం ప్రకటన దశలో ఉంది. కాగా, కమల్ తన పర్యటన వివరాలను ఈనెల 18న వెల్లడించనున్నారు.

అభిమానులతో రజనీ పార్టీ ఇన్‌చార్జిల భేటీ..

ప్రముఖ నటుడు రజనీకాంత్ తన రాజకీయపార్టీ ఏర్పాటు సన్నాహాలను ముమ్మరం చేశారు. చెన్నై కోడంబాక్కంలోని రాఘవేంద్ర కల్యాణ మండపంలో పార్టీ కార్యాలయ భవన నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్నాయి. రజనీకాంత్ అభిమాన సంఘాల జాతీయ నిర్వాహకులు సుధాకర్, రాజీవ్ మహాలింగం సంయుక్తంగా బుధవారం నుంచి మూడు రోజులపాటు అభిమాన సంఘాల ముఖ్యనేతలతో సమావేశం కానున్నారు.

గురక బాబుకు కునుకు లేకుండా చేశారు!

ముంబై: పెద్ద శబ్దంతో గురకపెడుతూ తమ నిద్ర లేకుండా చేస్తున్నాడంటూ ఓ వ్యక్తిని తోటి ప్రయాణికులు జాగారం చేయించారు. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ ఘటన.. గత గురువారం జబల్పూర్ వద్ద ఎల్టీటీ–దర్భంగ పవన్ ఎక్స్‌ప్రెస్‌లో చోటుచేసుకుంది. నంబర్–3 ఏసీ కోచ్‌లో రామచంద్ర అనే ప్రయాణికుడు పెద్దగా గురకపెడుతూ నిద్రపోతున్నాడు. ఆ శబ్దంతో తోటి వారికి నిద్రాభంగమైంది. దీంతో వారంతా కలిసి ఆయనతో వాదులాటకు దిగారు. చివరికి రామచంద్ర మెలకువతో ఉండాలని అంగీకారానికి వచ్చారు. దీంతో తోటి వారంతా నిద్రపోతుండగా పాపం రామచంద్ర.. ఆరు గంటలపాటు కునికిపాట్లతో కూర్చోవాల్సి వచ్చింది.

మీ సలహాలు, సందేహాలు పంపాల్సిన చిరునామా


సాక్షి ఎడ్యుకేషన్ డెస్క్,
సాక్షి దినపత్రిక,
రోడ్ నంబర్-1, బంజారాహిల్స్,
హైదరాబాద్-34. ఈ-మెయిల్
sakshieducation@gmail.com

రైట్స్ లిమిటెడ్‌లో 30 పోస్టులు

భారతీయ రైల్వే పరిధిలోని మినీరత్న పబ్లిక్ సెక్టార్ ఎంటర్‌ప్రైజ్ అయిన రైట్స్ లిమిటెడ్... 30 ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. **పోస్టు:** ఇంజనీర్, **విభాగాల వారీ ఖాళీలు:** ఎలక్ట్రికల్-22; మెకానికల్-8. **వేతనం:** బేసిక్ పే-రూ.16,974. దీంతోపాటు ఇతర అలవెన్సులు ఇస్తారు. **అర్హతలు:** ఇంజనీరింగ్ డిగ్రీ (ఎలక్ట్రికల్/ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్/మెకానికల్) ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణత (ఎస్సీ/ఎస్టీ/ఓబీసీ/దివ్యాంగ-కనీసం 5 శాతం మార్కులు). అలాగే ప్రొడక్షన్/క్యూఏ/మెయింటెనెన్స్/సర్వీస్‌లో కనీసం రెండేళ్ల ఇండస్ట్రీ అనుభవం ఉండాలి. **వయసు:** 2018, ఫిబ్రవరి 1 నాటికి 32 ఏళ్లు మించకూడదు. రిజర్వేషన్లు వర్తిస్తాయి. **ఎంపిక:** అకడమిక్ అర్హతలు, అనుభవం, రాతపరీక్ష, ఇంటర్వ్యూ. **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్. **చివరి తేదీ:** ఫిబ్రవరి 22, 2018. **వెబ్‌సైట్:** ritesltd.com

ఐఐఎం-ఎఫ్‌పీఎం
మేనేజ్‌మెంట్‌లో డాక్టరేట్‌కు మార్గం

హయ్యర్ ఎడ్యుకేషన్



ఫెలో ప్రోగ్రామ్ ఇన్ మేనేజ్‌మెంట్(ఎఫ్‌పీఎం).. ఐఐఎంల ట్రేడ్ మార్క్ కోర్సులు. ఎఫ్‌పీఎం కోర్సులు పీహెచ్‌డీకి సమానమైనవి. మేనేజ్‌మెంట్ రంగంలో పలు విభాగాల్లో పరిశోధనలకు అవకాశం కల్పించే ప్రోగ్రామ్‌లు ఇవి. ఈ ప్రోగ్రామ్‌ల గురించి తెలిసిన వారి సంఖ్య కొంత తక్కువే అని చెప్పొచ్చు. కానీ.. వీటిలో అడుగుపడితే మాత్రం అద్భుత భవిష్యత్తు ఖాయం అంటున్నారు నిపుణులు. 2018-19 విద్యా సంవత్సరానికి ఫెలో ప్రోగ్రామ్ ఇన్ మేనేజ్‌మెంట్ (ఎఫ్‌పీఎం)కు త్వరలో ఇంటర్వ్యూ ప్రక్రియ ప్రారంభం కానున్న నేపథ్యంలో... ఐఐఎం-ఎఫ్‌పీఎంలో చేరేందుకు అర్హతలు, ఆర్థిక ప్రోత్సాహకాలు, కోర్సు తీరు, భవిష్యత్ అవకాశాల గురించి తెలుసుకుందాం...

క్యాట్ స్కోర్‌తోనే

ఐఐఎంలు నిర్వహించే ఫెలో ప్రోగ్రామ్‌కు క్యాట్ స్కోర్‌తోపాటు.. జీమ్యాట్, జీఆర్‌ఈ, యూజీసీ-జేఆర్‌ఎఫ్ వంటి పరీక్షల స్కోర్లను కూడా ప్రామాణికంగా పరిగణిస్తున్నాయి. క్వాంటిటేటివ్ మెథడ్స్, ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్ వంటి స్పెషలైజేషన్స్‌కు సంబంధించి ఫెలో ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి గేట్, జీఆర్‌ఈ స్కోర్లను కూడా కొన్ని ఐఐఎంలు పరిగణనలోకి తీసుకుంటున్నాయి. ఐఐఎం-బెంగళూరు, ఐఐఎం-ఇండోర్ వంటి క్యాంపస్‌లు సొంతంగా రాత పరీక్ష నిర్వహించి.. అందులో ఉత్తీర్ణులైన వారిని సైతం ఎఫ్‌పీఎం ప్రోగ్రామ్ ఎంపిక ప్రక్రియలో తదుపరి దశకు అనుమతిస్తున్నాయి.



బ్యాచిలర్ డిగ్రీతోనే

ఫెలో ప్రోగ్రామ్స్ అంటే.. అకడమిక్‌గా పీజీ ఉత్తీర్ణత తప్పనిసరి అని భావించడం సహజం. కాని 10+2+4 బ్యాచిలర్ డిగ్రీ స్థాయి విద్యార్థులు (లేదా) పీజీ కోర్సులు పూర్తిచేసిన అభ్యర్థులు (లేదా) ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ కోర్సులు చదివిన వారు(లేదా) సీఏ/ఐసీడబ్ల్యూఏ/సీఎస్ వంటి కోర్సులు పూర్తిచేసిన అభ్యర్థులకు సైతం ఐఐఎంలో ఫెలో ప్రోగ్రామ్‌లో చేరేందుకు అవకాశముంది. బ్యాచిలర్ డిగ్రీ విద్యార్థులకు కనీసం 60శాతం మార్కులు తప్పనిసరి. పీజీ విద్యార్థులకు బ్యాచిలర్ స్థాయిలో కనీసం 50 శాతం, మాస్టర్స్ స్థాయిలో 60 శాతం మార్కులు వచ్చి ఉండాలి. మొత్తంగా చూస్తే .. తుది జాబితా రూపకల్పనలో మాత్రం 60 శాతంపైగా మార్కులు పొందిన వారే ముందంజలో నిలుస్తున్నారు.

ఫెలో ప్రోగ్రామ్.. పీహెచ్‌డీ

ఇంతకాలం పీహెచ్‌డీకి తత్సమానంగా పేర్కొనే ఎఫ్‌పీఎం సర్టిఫికెట్‌ను ఇచ్చిన ఐఐఎంలు.. వచ్చే విద్యా సంవత్సరం నుంచి పీహెచ్‌డీ పట్టా అందించనున్నాయి. దీనికి సంబంధించి.. రూపొందించిన ఐఐఎం-బిల్లుకు ఇటీవల ఆమోదం లభించింది. ఐఐఎంలు అందించే ఫెలో ప్రోగ్రామ్ కాల వ్యవధి కనిష్టంగా నాలుగేళ్లు, గరిష్టంగా ఆరేళ్లు. ఈ వ్యవధిలో అభ్యర్థులు మొదటి రెండేళ్లు క్లాస్‌రూం విధానంలో ఉండే కోర్స్ వర్క్‌కు హాజరవ్వాల్సి ఉంటుంది. ఆ తర్వాత.. కోర్స్ వర్క్‌లో పొందిన నైపుణ్యాలను పరీక్షించేందుకు కాంప్రెహెన్సివ్ క్వాలిఫయింగ్ ఎగ్జామ్, కాంప్రహెన్సివ్ ఎగ్జామినేషన్‌ల పేరుతో ప్రత్యేక పరీక్షలు నిర్వహిస్తారు. వాటిని థీసిస్ అడ్వయిజరీ కమిటీలు లేదా ఎఫ్‌పీఎం రివ్యూ కమిటీలు సమీక్షిస్తాయి. ఈ సమీక్షల ఆధారంగా.. అభ్యర్థికున్న అవగాహన మేరకు తదుపరి దశ పీహెచ్‌డీ కోర్స్ వర్క్‌కు అనుమతి మంజూరు చేస్తారు.

ఆర్థిక ప్రోత్సాహకాలు

ఐఐఎం ఎఫ్‌పీఎం కోర్సుల్లో అడుగుపెడితే.. అడుగడుగునా ఆర్థిక చేయూత లభిస్తుంది. అకడమిక్‌గా ట్యూషన్ ఫీజు నుంచి మినహాయింపు, జీవన వ్యయం(వైద్య బీమా, లాడ్జింగ్, బోర్డింగ్) తోపాటు స్టయిపండ్ పేరుతో ఆర్థిక ప్రోత్సాహకాలు కూడా లభిస్తాయి. తొలి రెండేళ్లు దాదాపు రూ.31 వేల స్టయిఫండ్ లభిస్తుంది. తర్వాత థీసిస్ అడ్వయిజరీ కమిటీల ఆమోదం లభిస్తే ఆ స్టయిఫండ్ 35 వేలకు పెరుగుతుంది. ఏటా రూ.25 వేలకుకు పైగా కాంటింజెన్సీ గ్రాంట్, పర్సనల్ కంప్యూటర్-ఇతర అకడమిక్స్ అవసరమైన మెటీరియల్స్ కొనుగోలుకు రూ.50వేలకుపైగా అదనపు అలవెన్స్‌లు, ఏటా గరిష్టంగా రెండు అంతర్జాతీయ కాన్ఫరెన్స్‌లకు హాజరయ్యేందుకు రూ.రెండు లక్షల మేర ట్రావెల్ గ్రాంట్‌లు లభిస్తాయి. హాస్టల్ సదుపాయం లభించని విద్యార్థులకు హెచ్‌ఆర్‌ఏ అందిస్తారు. వివాహితులైన వారికి ప్రత్యేక హాస్టల్ సదుపాయాలు ఉంటాయి. లేదా హెచ్‌ఆర్‌ఏ మొత్తం బ్యాచిలర్స్‌తో పోల్చితే కాస్త ఎక్కువగా మంజూరవుతుంది. ఇలా.. అడుగడుగునా ఆర్థిక తోడ్పాటు ఐఐఎంల్లో ఎఫ్‌పీఎం అభ్యర్థులకు లభిస్తుంది.

క్లిష్టంగా ప్రవేశ ప్రక్రియ

ఇంతటి ప్రాధాన్యం సంతరించుకున్న ఎఫ్‌పీఎంలకు అభ్యర్థులను ఎంపిక చేసే ప్రక్రియ మాత్రం అత్యంత క్లిష్టంగా ఉంటోంది. ప్రస్తుతం ఒక్కో ఇన్‌స్టిట్యూట్‌లో 25 నుంచి 30సీట్లు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. అందుకే అప్లికేషన్ దశ నుంచే రివ్యూ కమిటీ క్షుణ్నంగా పరిశీలిస్తుంది. అకడమిక్ ట్రాక్ రికార్డ్, స్టాండర్డ్ టెస్ట్ స్కోర్స్ మాత్రమే కాకుండా.. రిఫరెన్స్ లెటర్స్ ఇచ్చిన వ్యక్తుల ప్రొఫైల్స్‌ను కూడా మలిదశ ఎంపిక ప్రక్రియకు నిర్దిష్టంగా పరిశీలిస్తుంది. ఇలా అప్లికేషన్ దశలో అన్ని అంచెల్లో విజయం సాధిస్తే తదుపరి దశలో ఇంటర్వ్యూ నిర్వహిస్తారు. అప్లికేషన్‌లో పేర్కొన్న స్పెషలైజేషన్‌లో అభ్యర్థికున్న వాస్తవ ఆసక్తిని పరిశీలించే విధంగా ఈ ఇంటర్వ్యూలు జరుగుతాయి. ఇందులోనూ విజయం సాధిస్తే ఐఐఎంల్లో పరిశోధనలకు మార్గం సుగమం అవుతుంది.

వెయిటేజీ విధానం



ఎఫ్‌పీఎంకు అభ్యర్థులను ఎంపిక చేసే క్రమంలో.. ఐఐఎంలు వెయిటేజీ విధానాన్ని అనుసరిస్తున్నాయి. అకడమిక్ ట్రాక్ రికార్డ్, స్టాండర్డ్ టెస్ట్ స్కోర్స్, వర్క్ ఎక్స్‌పీరియన్స్, రీసెర్చ్ ఆప్టిట్యూడ్ టెస్ట్, పర్సనల్ ఇంటర్వ్యూలకు నిర్దిష్టంగా వెయిటేజీలను పేర్కొంటూ.. వాటిని వంద మార్కుల స్కేల్‌పై నార్మలైజేషన్ విధానంలో గణిస్తున్నాయి. ఇలా గణించిన తర్వాత టాప్-25, 30లో నిలిచిన అభ్యర్థులకు ప్రవేశాలు ఖరారు చేస్తున్నాయి. ఐఐఎంలు ఇస్తున్న వెయిటేజీలు ఒక్కో క్యాంపస్‌కు ఒక్కో విధంగా ఉంటోంది. ఉదాహరణకు.. ఐఐఎం ఇండోర్ రీసెర్చ్ ఆప్టిట్యూడ్‌టెస్ట్‌కు 40 శాతం; పర్సనల్ ఇంటర్వ్యూకు 60 శాతం వెయిటేజీ ఇస్తోంది.

రీసెర్చ్‌తో ఉన్నత శిఖరాలు

మేనేజ్‌మెంట్‌లో రీసెర్చ్‌తో ఉన్నత శిఖరాలు అధిరోహించొచ్చు. ఎఫ్‌పీఎం పూర్తి చేసుకున్న అభ్యర్థులు వ్యక్తిగతంగా సంస్థలకు కన్సల్టెంట్స్‌గా వ్యవహరించే అవకాశం ఉంటుంది. ఇలాంటి ఒక్కో టాస్క్‌కు దాదాపు పది లక్షల వరకు ఆదాయం లభిస్తుంది. అదే విధంగా ప్రముఖ సంస్థల్లో టాప్ హోదాలు అందుకోవచ్చు. అంతర్జాతీయంగా విదేశీ యూనివర్సిటీలు సైతం ఐఐఎంలలో ఫెలో ప్రోగ్రామ్‌లను పూర్తి చేసుకున్న వారికి అసోసియేట్ ప్రొఫెసర్ హోదాలో అధ్యాపక వృత్తిలో అవకాశం కల్పిస్తున్నాయి.

- ప్రొఫెసర్.గణేశ్ ప్రభు, ఐఐఎం-ఇండోర్

రైలు బండి
కొలువుకొట్టండి

భద్రత వ్యవహారాల్లో, ప్రమాదాలను అరికట్టడంలో కీలకమైన 62,907 క్షేత్రస్థాయి గ్రూప్-డి పోస్టుల భర్తీకి.. రైల్వే మంత్రిత్వశాఖ పరిధిలోని రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డులు సెంట్రలైజ్డ్ ఉద్యోగ ప్రకటనను విడుదల చేశాయి. మొత్తం ఖాళీల్లో దక్షిణ మధ్య రైల్వే-సికింద్రాబాద్‌లో 6,523 పోస్టులు ఉండటం గమనార్హం. పోస్టులను బట్టీ పదోతరగతి/ఐటీఐ/నేషనల్ అప్రెంటిస్‌షిప్ సర్టిఫికెట్ ఉన్న అభ్యర్థులు ఈ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ రైల్వే పోస్టులకు ఎంపిక ప్రక్రియ, ప్రిపరేషన్ విధానం గురించి తెలుసుకుందాం...

ఎంపిక ప్రక్రియ ఇలా

మొదట కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ (సీబీటీ) నిర్వహించి.. ఇందులో ఉత్తీర్ణులైన అభ్యర్థులను శారీరక దారుఢ్య పరీక్షలు ఉంటాయి. సీబీటీలో వచ్చిన మార్కుల ఆధారంగానే ఉద్యోగాల భర్తీ జరుగుతుంది.

పరీక్ష విధానం

సీబీటీ(కంప్యూటర్ ఆధారిత పరీక్ష)లో 100 ప్రశ్నలు ఉంటాయి. 90 నిమిషాల సమయం ఇస్తారు. ప్రతి తప్పు సమాధానానికి 1/3వంతు రుణాత్మక మార్కులుంటాయి. జనరల్ కేటగిరీకి కనీసం 40 మార్కులు; ఓబీసీ, ఎస్సీ, ఎస్టీ కేటగిరీలకు చెందిన విద్యార్థులకు కనీసం 30 మార్కులు రావాలి.

సీబీటీలో నాలుగు సెక్షన్లు

- మ్యాథమెటిక్స్
- జనరల్ ఇంటెలిజెన్స్ అండ్ రీజనింగ్
- జనరల్ సైన్స్
- కరెంట్ అఫైర్స్ అండ్ జనరల్ అవేర్‌నెస్

ఎగ్జామ్ టిప్స్



మ్యాథమెటిక్స్

ఇందులో నంబర్ సిస్టమ్స్, బోడ్‌మస్ నిబంధనలను మొదట తెలుసుకోవాలి. నంబర్లపై ప్రశ్నలకు సులువుగా సమాధానాలు రాబట్టాలంటే.. కూడికలు, తీసివేతలు, భాగాహారాలు, గుణకారాలు, శాతాలు వంటి ప్రాథమిక అర్థమెటిక్ అంశాలను బాగా ప్రాక్టీస్ చేయాలి. దాంతోపాటు పదోతరగతి స్థాయిలోని డెసిమల్స్, ఫ్రాక్షన్స్ చాప్టర్లను అధ్యయనం చేయాలి. కసాగు, గసాభా, నిష్పత్తి-అనుపాతం, శాతాలు, మెన్సురేషన్, కాలం-పని, కాలం-దూరం, చక్రవడ్డీ, బారువడ్డీ, లాభనష్టాలు, ఆల్జీబ్రా, జామెట్రీ, త్రికోణమితి, సాంఖ్యకశాస్త్రానికి సంబంధించి ప్రాథమిక అంశాలు, వయసుకు సంబంధించిన ప్రశ్నలు, క్యాలెండర్, క్లాక్, పైప్స్ అండ్ సిస్టర్న్ చాప్టర్లను బాగా ప్రాక్టీస్ చేయాలి. పెన్‌తో ప్రాక్టీస్ చేసే కొద్దీ తర్వాత ప్రశ్న చూడగానే నోటితోనే సమాధానాలు గుర్తించే పట్టు వస్తుంది.

జనరల్ ఇంటెలిజెన్స్, రీజనింగ్

గ్రూప్-డి పోస్టులకు నిర్వహించే పరీక్షలో.. జనరల్ ఇంటెలిజెన్స్, రీజనింగ్ సెక్షన్ నుంచే ఎక్కువగా ప్రశ్నలు వచ్చే అవకాశముంది. ఇందులో అల్ఫాబెట్స్, నంబర్ సిరీస్, కోడింగ్-డీకోడింగ్, మ్యాథమెటికల్ ఆపరేషన్స్, రిలేషన్స్, ఆడ్‌మాన్ అవుట్, సింబల్స్, నొటేషన్స్, వెన్ చిత్రాలు, బ్లడ్‌రిలేషన్స్, సీటింగ్ అరేంజ్‌మెంట్, డైరెక్షన్స్, స్టేట్‌మెంట్-కన్‌క్లూజన్, స్టేట్‌మెంట్-అసంప్షన్, డెసిషన్ మేకింగ్, సిలాజిజం నుంచి ప్రశ్నలు వస్తాయి. డేటా సఫిషియన్సీ, డేటా ఇంటర్‌ప్రిటేషన్ నుంచి ప్రశ్నలు తప్పనిసరి. ఇచ్చిన డేటాను క్రోడీకరించి ప్రశ్నలకు సమాధానాలు గుర్తించాలి. ఈ సెక్షన్లు తెలిస్తే తక్కువ సమయంలో కచ్చితత్వంలో స్కోరు చేయవచ్చు.

జనరల్ సైన్స్

పదోతరగతి స్థాయి వరకు సైన్స్ సబ్జెక్టులైన ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ అంశాల నుంచి ప్రశ్నలు వస్తాయి. కాబట్టి 6 నుంచి పదో తరగతి వరకు పుస్తకాలు సేకరించుకొని ప్రిపరేషన్ చేయాలి. సొంతంగా నోట్స్ రాసుకోవడం మేలు. దీనివల్ల సులువుగా గుర్తుండిపోవడంతోపాటు పరీక్ష సమయంలో పునశ్చరణకు దోహదపడుతుంది. నిత్యజీవితంలో జరిగే సైన్స్ సంబంధిత అంశాలపై దృష్టి పెట్టడం ఉపకరిస్తుంది. పర్యావరణం టాపిక్ కూడా ముఖ్యం.

జనరల్ అవేర్‌నెస్, కరెంట్ అఫైర్స్

కరెంట్ అఫైర్స్‌తో జనరల్ అవేర్‌నెస్‌ను కలిపి చదువుకోవాలి. శాస్త్రసాంకేతిక రంగంలో చోటు చేసుకున్న సంఘటనలు, డిఫెన్స్ టెక్నాలజీ, మిలిటరీ ఎక్సర్‌సైజులు, తాజాగా క్రీడలు, వార్తల్లో వ్యక్తులు, బడ్జెట్ ముఖ్య అంశాలు, జాతీయ, అంతర్జాతీయంగా నియామకాలు, బుక్స్-ఆథర్స్, కమిటీలు, కేంద్ర ప్రభుత్వ పథకాలు, వాటి లక్ష్యాలను తెలుసుకోవాలి.


- **దరఖాస్తులు:** ఏదేని ఒక ఆర్‌ఆర్‌బీకి మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి. దక్షిణ మధ్య రైల్వేలో ఉద్యోగాలకు ఆన్‌లైన్‌లో http://rrbsecunderabad.nic.in/వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ:** 2018 మార్చి 12.

మేధోహక్కుల సూచీలో భారత్‌కు 44వ స్థానం

కాంపిటీటివ్ గైడెన్స్
కరెంట్ అఫైర్స్

జాతీయం

దేశంలో పెరిగిన అటవీ విస్తీర్ణం



భారత అటవీ నివేదిక- 2017ను కేంద్ర పర్యావరణ, అటవీ శాఖ మంత్రి హర్షవర్ధన్ ఫిబ్రవరి 12న విడుదల చేశారు. ఈ నివేదిక ప్రకారం 2015-17 మధ్యకాలంలో భారత అటవీ విస్తీర్ణం 0.21 శాతం మేర పెరిగింది. దేశం మొత్తం అటవీ విస్తీర్ణం 7,08,273 చ.కి.మీ.గా ఉంది. ఇది దేశ భౌగోళిక విస్తీర్ణంలో 21.53 శాతం వాటాను కలిగి ఉంది.

మేధోహక్కుల సూచీలో భారత్‌కు 44వ స్థానం

భారత్‌కు అంతర్జాతీయ మేధోహక్కుల(ఐపీ)సూచీ-2018లో 44వ స్థానం దక్కింది. ఈ సూచీని యూఎస్ చాంబర్ ఆఫ్ కామర్స్‌కి చెందిన గ్లోబల్ ఇన్నోవేషన్ పాలసీ సెంటర్(జీఐపీసీ) 50 దేశాలతో రూపొందించింది. 2017లో 45 దేశాలతో రూపొందించిన సూచీలో భారత్‌కు 43 స్థానం దక్కింది. కాగా, తాజా సూచీలో అమెరికా అగ్రస్థానంలో ఉండగా, బ్రిటన్, స్వీడన్ తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. వెనెజులా, అల్జీరియా, ఈజిప్ట్, పాకిస్థాన్, అర్జెంటీనా అట్టడుగున ఉన్నాయి. పేటెంట్లు, ట్రేడ్ మార్క్, కాపీరైట్, ట్రేడ్ సీక్రెట్ ప్రొటెక్షన్ తదితర అంశాల ఆధారంగా ర్యాంకులు కేటాయించారు.

ఆరోగ్య సూచీలో కేరళ ఫస్ట్

నీతి ఆయోగ్ ఫిబ్రవరి 9న విడుదల చేసిన ఆరోగ్య సూచీలో కేరళ తిరిగి అగ్రస్థానం నిలబెట్టుకుంది. కేరళ తర్వాతి స్థానాల్లో వరుసగా పంజాబ్, తమిళనాడు, గుజరాత్ ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ 8వ స్థానంలో, తెలంగాణ 11వ స్థానంలో నిలిచాయి. 'ఆరోగ్యవంతమైన, ప్రగతిశీల భారతం' పేరుతో రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల ర్యాంకుల నివేదికను నీతి ఆయోగ్, ప్రపంచ బ్యాంక్ సంయుక్తంగా రూపొందించాయి.

అంతర్జాతీయం


ప్రపంచ ప్రభుత్వాల శిఖరాగ్ర సదస్సు



దుబాయ్‌లో ఫిబ్రవరి 11న జరిగిన ప్రపంచ ప్రభుత్వాల(వరల్డ్ గవర్నమెంట్ సమ్మిట్) ఆరో శిఖరాగ్ర సదస్సుకు భారత ప్రధాని నరేంద్రమోదీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రసంగించిన ఆయన సాంకేతికత.. వికాసానికి సాధనంగా ఉండాలే కానీ, వినాశనానికి దారితీయకూడదన్నారు. 140 దేశాల నుంచి దాదాపు 4000 మంది ప్రతినిధులు హాజరైన సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరవడాన్ని తనతోపాటు 125 కోట్ల మంది భారతీయులకు దక్కిన గౌరవంగా భావిస్తున్నానన్నారు.

సైన్స్ అండ్ టెక్నాలజీ

ఫాల్కన్ హెవీ ప్రయోగం విజయవంతం



ప్రపంచంలోనే అత్యంత శక్తిమంతమైన ఫాల్కన్ హెవీ రాకెట్ తొలి ప్రయోగం విజయవంతమైంది. దీన్ని అమెరికాకు చెందిన అంతరిక్ష పరిశోధనా సంస్థ స్పేస్‌ఎక్స్ ఫ్లోరిడాలోని కేప్ కెనెవెరాల్‌లోని కెన్నెడీ అంతరిక్ష కేంద్రం నుంచి ఫిబ్రవరి 7న ప్రయోగించింది. ఈ ప్రయోగం ద్వారా స్పేస్‌ఎక్స్ సీఈవో ఎలన్ మస్క్‌కు చెందిన టెస్లా రోడ్‌స్టర్ కారును అంగారకుడి దగ్గరి కక్ష్యలో ప్రవేశపెట్టారు.
ఫాల్కన్ హెవీ ప్రత్యేకతలు: మూడు చిన్న ఫాల్కన్ 9 రాకెట్లను కలిపి దీన్ని రూపొందించారు. పునర్వినియోగం దీని ప్రత్యేకత. 230 అడుగుల ఎత్తు గల ఫాల్కన్ హెవీ రాకెట్ సుమారు 64 మెట్రిక్ టన్నుల బరువును అంతరిక్షంలో ప్రవేశపెట్టగలదు.

అగ్ని-1 క్షిపణి పరీక్ష విజయవంతం

అణ్వస్త్ర సామర్థ్యం కలిగిన స్వల్ప శ్రేణి బాలిస్టిక్ క్షిపణి అగ్ని-1ను భారత్ జనవరి 6న విజయవంతంగా పరీక్షించింది. ఒడిశా తీరంలోని అబ్దుల్ కలాం దీవి నుంచి ఈ పరీక్షను నిర్వహించారు. ఈ క్షిపణి 700 కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాలను ఛేదించగలదు. పోరాట సన్నద్ధతను పటిష్టపరిచే చర్యల్లో భాగంగా సైన్యంలోని వ్యూహాత్మక దళాల విభాగం అగ్ని-1ను పరీక్షించింది.

హక్ గగన విహారం విజయవంతం

హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్(హెచ్‌ఏఎల్) స్వదేశీ సాంకేతిక పరిజ్ఞానంతో అభివృద్ధి చేసిన రియల్ టైమ్ ఆపరేటింగ్ సిస్టమ్(ఆర్‌టీఓఎస్) పరీక్ష విజయవంతమైంది. బెంగళూరులో ఫిబ్రవరి 7న ఆర్‌టీఓఎస్‌ను బిగించిన హక్-ఐ విమానం విజయవంతంగా విహరించింది. దీన్ని ఖరగ్‌పూర్ ఐఐటీ సహకారంతో రూపొందించారు.

పృథ్వీ-2 క్షిపణి పరీక్ష విజయవంతం

భారత్ ఫిబ్రవరి 7న స్వదేశీ పరిజ్ఞానంతో అభివృద్ధి చేసిన పృథ్వీ-2 క్షిపణిని విజయవంతంగా పరీక్షించింది. ఒడిశాలోని చాందీపూర్ సమీకృత పరీక్షా వేదిక నుంచి పృథ్వీ-2ని పరీక్షించారు. దీనికి 350 కిలోమీటర్ల పరిధిలోని లక్ష్యాలను ఛేదించగలిగే; 500 నుంచి 1000 కిలోల బరువు గల అణు వార్‌హెడ్లను మోసుకెళ్లగలిగే సామర్థ్యం ఉంది.

ల్యాబ్‌లో మానవ అండాల అభివృద్ధి

బ్రిటన్‌లోని ఎడిన్‌బర్గ్ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు మానవ అండాలను ప్రయోగశాలలో విజయవంతంగా పెంచారు. ఇవి మానవ అండాల అభివృద్ధి తీరుతెన్నులను తెలుసుకునేందుకు ఉపయోగపడతాయని లండన్‌లో ఫిబ్రవరి 9న వెల్లడించారు. కాగా, ఎలుకల అండాలను దాదాపు 20 ఏళ్ల కిందటే శాస్త్రవేత్తలు ప్రయోగశాలలో అభివృద్ధి చేశారు. పరిశోధనల్లో భాగంగా 25-40 ఏళ్ల వయసు కలిగిన 10 మంది మహిళల నుంచి అండాశయ కణజాలాన్ని సేకరించారు.

వార్తల్లో వ్యక్తులు

ఇంద్రనూయి: పెప్సికో సీఈవో ఇంద్రనూయి అంతర్జాతీయ క్రికెట్ మండలి(ఐసీసీ) తొలి మహిళా స్వతంత్ర డైరెక్టర్‌గా ఫిబ్రవరి 9న నియమితులయ్యారు. దీంతో ఆమె జూన్ నుంచి బోర్డులో చేరనున్నారు. క్రికెట్‌ను ప్రపంచవ్యాప్తంగా విస్తరించాలనే ఉద్దేశంతో 2017 జూన్‌లో ఐసీసీ నియమావళిలో సంస్కరణలు తీసుకొచ్చారు. ఇందులో భాగంగా బోర్డులో తప్పనిసరిగా మహిళా స్వతంత్ర డైరెక్టర్ ఉండాలని సర్వసభ్య సమావేశం తీర్మానం చేసిన నేపథ్యంలో ఇంద్రనూయి ఎంపిక జరిగింది.

చంద్రశేఖర కంబార: కేంద్ర సాహిత్య అకాడమీ నూతన అధ్యక్షుడిగా కన్నడ విశ్వవిద్యాలయ పూర్వ ఉపకులపతి ఆచార్య చంద్రశేఖర కంబార ఫిబ్రవరి 12న ఎన్నికయ్యారు. జ్ఞానపీఠ పురస్కార గ్రహీతైన కంబార..కవిగా, నాటకరంగ కళాకారుడిగా విశేష గుర్తింపు పొందారు.

అబ్దుల్ హమీద్: బంగ్లాదేశ్ అధ్యక్షుడిగా అబ్దుల్ హమీద్ ఫిబ్రవరి 7న ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. దీంతో రెండోసారి బంగ్లాదేశ్ అధ్యక్షుడిగా ఎన్నికైన తొలి వ్యక్తిగా గుర్తింపు పొందారు

అస్మా జహంగీర్: పాకిస్తాన్‌కు చెందిన ప్రముఖ న్యాయవాది, మానవ హక్కుల ఉద్యమకారిణి అస్మా జహంగీర్ (66) ఫిబ్రవరి 11న లాహోర్‌లో మరణించారు. అస్మా.. పాక్ ఆర్మీ, ఐఎస్‌ఐ వ్యవహార శైలిని తీవ్రంగా విమర్శించేవారు. ఆమె సేవలకు గుర్తింపుగా 2014లో రైట్ లైవ్లీ హుడ్ అవార్డు, 2010లో ఫ్రీడమ్ అవార్డు దక్కాయి.

ఆర్థికం

కీలక వడ్డీ రేట్లు యథాతథం



రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఆర్‌బీఐ)గవర్నర్ ఉర్జిత్ పటేల్ నేతృత్వంలోని ఆరుగురు సభ్యుల పరపతి విధాన కమిటీ ఫిబ్రవరి 7న ఆరో ద్వైమాసిక పరపతి విధాన సమీక్షను ప్రకటించింది. ఇందులో కీలకమైన రెపో రేటును 6 శాతంగా; రివర్స్ రెపో రేటును 5.75 శాతంగా కొనసాగించింది.

ద్వైపాక్షికం

ప్రధాని పాలస్తీనా పర్యటన



భారత ప్రధాని నరేంద్రమోదీ ఫిబ్రవరి 10న పాలస్తీనాలో పర్యటించారు. ఆ దేశ పరిపాలనా రాజధాని రమల్లాలో పాలస్తీనా అధ్యక్షుడు మహ్మద్ అబ్బాస్‌తో ద్వైపాక్షిక చర్చలు జరిపారు. ఈ సందర్భంగా ఇరు దేశాల మధ్య రూ.325 కోట్ల విలువైన ఆరు ఒప్పందాలు కుదిరాయి. పర్యటనలో భాగంగా ప్రధాని నరేంద్రమోదీని ఆ దేశం అత్యున్నత పురస్కారం'గ్రాండ్ కాలర్ ఆఫ్ ది స్టేట్ ఆఫ్ పాలస్తీనా'తో సత్కరించింది.

జోర్డాన్ రాజుతో భేటీ అయిన మోదీ

పశ్చిమాసియా పర్యటనలో భాగంగా భారత ప్రధాని నరేంద్రమోదీ ఫిబ్రవరి 9న జోర్డాన్ రాజధాని అమ్మాన్‌లో ఆ దేశ రాజు అబ్దుల్లా-2తో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రెండు దేశాల సంబంధాలను బలోపేతం చేయాలని ఇరువురు నేతలు నిర్ణయించారు.

భారత్-యూఏఈ మధ్య 6 ఒప్పందాలు

భారత ప్రధాని నరేంద్రమోదీ యూఏఈ పర్యటనలో భాగంగా ఫిబ్రవరి 11న ఆ దేశ యువరాజు బిన్ జాయెద్‌తో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఇరు పక్షాల మధ్య పలు ఒప్పందాలు కుదిరాయి. ఇందులో భారత ఆయిల్ కంపెనీల కన్సార్టియానికి 10 శాతం రాయితీ కల్పించే కీలక ఒప్పందం ఉంది. ఈ ఒప్పందం 2018 నుంచి 2057 వరకు అమల్లో ఉంటుంది. పర్యటనలో భాగంగా ప్రధాని అబుదాబిలో స్వామి నారాయణ్ ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.

ఒమన్‌తో 8 ఒప్పందాలు

భారత ప్రధాని నరేంద్రమోదీ ఒమన్ పర్యటన ఫిబ్రవరి 12న ముగిసింది. పర్యటనలో భాగంగా సుల్తాన్ కాబూస్ బిన్ సయిద్‌తో ప్రధాని వివిధ అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా రెండు దేశాలు 8 ఒప్పందాలపై సంతకాలు చేశాయి.

క్రీడలు

స్క్వాష్ ఇండియా టైటిల్ నెగ్గిన సౌరవ్



భారత స్క్వాష్ క్రీడాకారుడు సౌరవ్ ఘోషల్ ఇండియన్ స్క్వాష్ ఓపెన్ టోర్నీ చాంపియన్‌గా నిలిచాడు. ముంబైలో ఫిబ్రవరి 11న జరిగిన ఫైనల్లో నికోలస్ ముల్లర్(ఫ్రాన్స్)పై విజయం సాధించాడు.



ఆకేపాటి శ్రీనివాసులు రెడ్డి
కరెంట్ అఫైర్స్ నిపుణులు
ఆర్‌సీ రెడ్డి స్టడీ సర్కిల్, హైదరాబాద్

సాక్షి బిజినెస్
గురువారం 15-2-2018
WWW.SAKSHIBUSINESS.COM

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్	నిఫ్టీ
145 ▼	39 ▼
34,156	10,501

మరిన్ని వార్తలు, స్టాక్ అప్‌డేట్స్ కోసం... www.sakshibusiness.com చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30కి)

నాస్‌డాక్	7,077	▲	64
డోజోన్స్	24,641	▲	1
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,214	▲	46
డాక్స్	12,339	▲	143
షాంఘై	3,199	▲	15
నికాయ్	21,154	▼	91

● అమెరికా ● బ్రిటన్ ● జర్మనీ ● చైనా ● జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

			● కొనుగోలు	● అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	64.90	65.03
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	90.70	90.88
€	యూరో	ఎస్‌బీఐ	80.64	80.80
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	60.91	61.03
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	51.43	51.54
SS	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	49.35	49.45
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	15.51	18.39
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	15.88	18.56
¥	చైనా యువాన్	థామస్‌కుక్	7.15	11.61

పంజాబ్ నేషనల్ బ్యాంక్‌లో భారీ కుంభకోణం!



రూ. 11,300 కోట్ల మోసపూరిత లావాదేవీలు

ముంబై బ్రాంచిలో గుర్తింపు ● పది మంది ఉద్యోగుల సస్పెన్షన్ ● సీబీఐకి ఫిర్యాదు

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ దిగ్గజం పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ)లో 'భారీ కుంభకోణం' వెలుగుచూసింది. 1.77 బిలియన్ డాలర్ల (సుమారు రూ. 11,346 కోట్లు) మేర ప్రభావం చూపే మోసపూరిత లావాదేవీలు జరిగినట్లు తేలింది. ముంబైలోని ఓ శాఖలో ఇవి జరిగాయని గుర్తించినట్లు పీఎన్‌బీ వెల్లడించింది. కొంత మంది ఖాతాదారులతో కుమ్మక్కైన కొందరు ఉద్యోగులు.. వారికి ప్రయోజనం చేకూర్చేలా మోసపూరిత, అనధికారిక లావాదేవీలు జరిపినట్లు తెలిపింది. ఈ లావాదేవీల ఆధారంగా.. సదరు కస్టమర్లకు విదేశాల్లో మరికొన్ని బ్యాంకులు రుణాలు ఇచ్చినట్లుగా తెలుస్తోందని వివరించింది. దీంతో, వీటి ప్రభావం మరిన్ని బ్యాంకులకు కూడా విస్తరించి ఉండవచ్చని పేర్కొంది. దీనిపై ఇప్పటికే దర్యాప్తు సంస్థలకు ఫిర్యాదు చేసినట్లు స్టాక్ ఎక్స్ఛేంజీలకు తెలియజేసింది. 'ముంబైలోని ఒక శాఖలో కొందరు ఖాతాదారులకు ప్రయోజనం చేకూర్చేలా కొంతమంది సిబ్బంది కుమ్మక్కై కొన్ని మోసపూరిత, అనధికారిక లావాదేవీలకు తెరతీసినట్లు గుర్తించడం జరిగింది' అని పీఎన్‌బీ వివరించింది. ఈ వ్యవహారంలో 10 మంది ఉద్యోగులను బ్యాంకు సస్పెండ్ చేసింది. ఈ ఉదంతం ఒక బ్యాంకుకు మాత్రమే పరిమితమైనదని, మిగతా బ్యాంకులపై ప్రభావమేమీ ఉండబోదని కేంద్ర ఆర్థిక వ్యవహారాల శాఖ కార్యదర్శి రాజీవ్ కుమార్ వ్యాఖ్యానించారు. దీనిపై కేంద్ర ఆర్థిక శాఖ క్రియాశీలకంగా వ్యవహరిస్తోందని.. సత్వర చర్యల కోసం సీబీఐకి, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్‌కి దీనిపై ఫిర్యాదు చేయాలని బ్యాంకుకు సూచించిందని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వ రంగ బ్యాంకులు భారీ మొండిబాకీల సమస్యతో సతమతమవుతుండగా.. మరోవైపు ఈ తరహా మోసాలు వాటికి మరింత ప్రతికూలంగా మారుతున్నాయి. సుమారు మూడేళ్ల క్రితం బ్యాంక్ ఆఫ్ బరోడాలో కూడా ఈ తరహాలో దాదాపు రూ. 6,000 కోట్ల కుంభకోణం చోటుచేసుకున్న సంగతి తెలిసిందే.

నీరవ్ మోదీపై సీబీఐకి ఫిర్యాదు..

ఈ కుంభకోణానికి సంబంధించి వజ్రాభరణాల డిజైనర్ నీరవ్ మోదీతో పాటు ఒక ఆభరణాల సంస్థపై సీబీఐకి పీఎన్‌బీ నుంచి రెండు ఫిర్యాదులు అందాయి. ఇప్పటికే రూ. 281 కోట్ల మేర మోసం చేశారన్న పీఎన్‌బీ ఫిర్యాదుతో నీరవ్ మోదీ, ఆయన భార్య అమీ, సోదరుడు నిషాల్, వ్యాపార భాగస్వామి మెహుల్ చీనుభాయ్ చోక్సీలపై సీబీఐ దర్యాప్తు చేస్తోంది. సుమారు రూ. 280.7 కోట్లకు మోసపూరితంగా ఎల్‌వోయూలు జారీ అయ్యాయంటూ పీఎన్‌బీ గత వారం సీబీఐకి ఫిర్యాదు చేసింది. ఇందులో డైమండ్స్ ఆర్ అజ్, సోలార్ ఎక్స్‌పోర్ట్స్, స్టెల్లార్ డైమండ్స్ కంపెనీలను పీఎన్‌బీ తన ఫిర్యాదులో ప్రస్తావించింది. విదేశీ సంస్థలకు చెల్లింపుల కోసం ఎల్‌వోయూలు కావాలంటూ జనవరి 16న ఈ సంస్థలు అభ్యర్థించాయని పేర్కొంది. పూర్తిగా నగదు మార్జిన్ ఉంటేనే ఎల్‌వోయూ జారీ చేస్తామని స్పష్టం చేయగా, దీన్ని వ్యతిరేకించిన సదరు సంస్థలు 2010 నుంచి ఈ తరహా వెసులుబాటు తాము పొందుతూనే ఉన్నామని చెప్పినట్లు పీఎన్‌బీ ఫిర్యాదులో తెలిపింది. దీంతో ఈ అంశంపై మరింత లోతుగా విచారణ జరుపుతున్నట్లు పేర్కొంది.

పీఎన్‌బీ తాజా ఫిర్యాదుతో నీరవ్ మోదీ మరో కేసును కూడా ఎదుర్కొనాల్సి రానుంది. మరోవైపు, ప్రస్తుత ఉదంతంతో.. నీరవ్ మోదీ సహా నాలుగు బడా జ్యుయలరీ సంస్థలపైనా దర్యాప్తు సంస్థలు దృష్టి సారించినట్లు ఓ ప్రభుత్వ రంగ బ్యాంకు సీనియర్ అధికారి ఒకరు పేర్కొన్నారు. గీతాంజలి, జిన్ని, నక్షత్ర ఇందులో ఉన్నట్లు తెలిపారు. ఈ సంస్థలు వివిధ బ్యాంకులతో నిర్వహిస్తున్న లావాదేవీలు, తీసుకున్న నిధులను ఏ విధంగా ఉపయోగిస్తున్నాయి తదితర అంశాలను సీబీఐ, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ పరిశీలిస్తున్నట్లు వివరించారు.

మిగతా బ్యాంకులను కూడా నివేదికలు కోరిన కేంద్రం..

పీఎన్‌బీ ఉదంతంపై ఆందోళన నెలకొన్న నేపథ్యంలో దీనితో ముడిపడి ఉన్న లావాదేవీలతో పాటు ఈ తరహా ఇతరత్రా వ్యవహారాలేమైనా ఉంటే సత్వరం తమకు నివేదిక పంపాలంటూ మిగతా బ్యాంకులకు కేంద్ర ఆర్థిక శాఖ సూచించింది. ఈ వారాంతంలోగా నివేదికలు పంపాలని పేర్కొంది. పీఎన్‌బీలో మోసపూరిత లావాదేవీల ప్రభావం మరిన్ని బ్యాంకులకు కూడా విస్తరించినందున కేంద్ర ఆర్థిక సేవల విభాగం ఈ మేరకు ఆదేశాలు ఇచ్చినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి.

పీఎన్‌బీ 10 శాతం పతనం

రూ.11,300 కోట్ల స్కామ్ నేపథ్యంలో బుధవారం పంజాబ్ నేషనల్ బ్యాంక్(పీఎన్‌బీ) భారీగా పతనమైంది. బీఎస్‌ఈలో 10 శాతం నష్టంతో రూ.146 వద్ద ముగిసింది. ఒక్క రోజులో బ్యాంక్ మార్కెట్ క్యాప్ రూ.3,844 కోట్లు హరించుకుపోయి రూ.35,365 కోట్లకు పడిపోయింది.

పీఎన్‌బీ స్కామ్‌కు తోడు మొండి బకాయిల నిబంధనలను ఆర్‌బీఐ కఠినతరం చేయడం కూడా ప్రతికూల ప్రభావం చూపడంతో బ్యాంక్ షేర్లు కుదేలయ్యాయి. ఎస్‌బీఐ 4 శాతం, బ్యాంక్ ఆఫ్ ఇండియా 8 శాతం, అలహాబాద్ బ్యాంక్ 7.7 శాతం, ఓరియంటల్ బ్యాంక్ ఆఫ్ కామర్స్ 7.4 శాతం, కెనరా బ్యాంక్ 5.8 శాతం, సిండికేట్ బ్యాంక్ 4.4 శాతం, ఐడీబీఐ బ్యాంక్ 4.2 శాతం, బ్యాంక్ ఆఫ్ బరోడా 1.7 శాతం చొప్పున పతనమయ్యాయి.

మోసం జరిగిందిలా..

పీఎన్‌బీ సిబ్బంది మోసపూరితంగా.. బిలియనీర్ నీరవ్ మోదీ, ఆయన సంబంధీకులకు లెటర్ ఆఫ్ అండర్‌టేకింగ్ (ఎల్‌వోయూ) జారీ చేసినట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. దీన్ని ఉపయోగించుకుని మోదీ తదితరులు విదేశాల్లోని పలు ప్రైవేట్, ప్రభుత్వ రంగ బ్యాంకుల నుంచి రుణాలు పొందినట్లు వివరించాయి. డిప్యూటీ జనరల్ మేనేజర్ స్థాయి ఉద్యోగి కూడా ఈ మొత్తం వ్యవహారంలో కుమ్మక్కైనట్లు, 2011 నుంచి ఇది జరుగుతోందని పేర్కొన్నాయి. పీఎన్‌బీ ప్రస్తావించకపోయినప్పటికీ.. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, అలహాబాద్ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్ మొదలైనవి ఎల్‌వోయూ ఆధారంగా రుణాలిచ్చినట్లు తెలుస్తోంది. ఈ స్కామ్‌కి సంబంధించి సస్పెండైన వారిలో డిప్యూటీ మేనేజర్ గోకుల్‌నాథ్ శెట్టి తదితరులు ఉన్నారు. 2010 మార్చి 31 నుంచి ఆయన ముంబైలోని పీఎన్‌బీ ఫారెక్స్ విభాగంలో పని చేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా, లావాదేవీలను పసిగట్టలేని విధంగా ఖాతాల్లో ఎంట్రీలు చేయకుండా.. మరో ఉద్యోగి మనోజ్ ఖారత్‌తో కలిసి ఆయన వివాదాస్పద ఎల్‌వోయూలు జారీ చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. తమ ఖాతాదారు థర్డ్ పార్టీకి చెల్లించాల్సిన మొత్తానికి హామీనిస్తూ బ్యాంకులు ఈ ఎల్‌వోయూలను జారీ చేస్తుంటాయి. వీటి ఆధారంగా విదేశాల్లోని బ్యాంకు శాఖలు రుణాలు ఇస్తుంటాయి.

75% తగ్గిన సన్ ఫార్మా లాభం

- మొత్తం ఆదాయం రూ. 6,653 కోట్లు
- కొనసాగిన అమెరికా 'జనరిక్' ఒత్తిడి



న్యూఢిల్లీ: సన్ ఫార్మా నికర లాభం ప్రస్తుత ఆర్థిక సంవత్సరం డిసెంబర్ క్వార్టర్లో 75 శాతం తగ్గింది. గత ఆర్థిక సంవత్సరం క్యూ3లో రూ.1,472 కోట్లుగా ఉన్న నికర లాభం(కన్సాలిడేటెడ్) ఈ క్యూ3లో రూ.365 కోట్లకు తగ్గిందని సన్ ఫార్మా తెలిపింది. మొత్తం ఆదాయం రూ.7,925 కోట్ల నుంచి రూ.6,653 కోట్లకు తగ్గిందని సన్ ఫార్మా ఎమ్‌డీ, దిలీప్ సంఘ్వి చెప్పారు. రూ.513 కోట్ల వాయిదా పడిన వన్‌టైమ్ పన్ను సర్దుబాటు కారణంగా ఈ క్యూ3లో నికర లాభం ఈ స్థాయిలో తగ్గిందని వివరించారు. నిర్వహణ లాభం 41 శాతం క్షీణించి రూ.1,453 కోట్లకు, మార్జిన్ 9 శాతం పతనమై 21.8 శాతానికి తగ్గాయని పేర్కొన్నారు.

భారత వ్యాపారం 6 శాతం వృద్ధి...

అమెరికా మార్కెట్లో అమ్మకాలు 35 శాతం తగ్గి 33 కోట్ల డాలర్లకు చేరాయని, ఇది మొత్తం అమ్మకాల్లో 32 శాతానికి సమానమని వివరించారు. అమెరికా మార్కెట్లో జనరిక్ ఔషధ ధరలపై ఒత్తిడి కొనసాగుతుండడమే అమ్మకాలు తగ్గడానికి కారణమని వివరించారు. అమెరికాలో జనరిక్ ఔషధాలకు సంబంధించి ధరల విషయంలో సమస్యాత్మక వాతావరణం నెలకొన్నదని వివరించారు. అయినప్పటికీ, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొదటి ఆరు నెలల కాలంతో పోల్చితే ఈ క్యూ3లో లాభదాయకత మెరుగుపడిందని పేర్కొన్నారు. భారత్‌లో బ్రాండెడ్ ఫార్ములేషన్స్ వ్యాపారం 6 శాతం వృద్ధితో రూ.2,085 కోట్లకు పెరిగిందని తెలిపారు. ఇతర వర్ధమాన దేశాల్లో అమ్మకాలు 10 శాతం వృద్ధితో 19 కోట్ల డాలర్లకు పెరిగాయని పేర్కొన్నారు.

ఆర్థిక ఫలితాల నేపథ్యంలో బీఎస్‌ఈలో సన్ ఫార్మా షేర్ 2.5 శాతం నష్టపోయి రూ.574 వద్ద ముగిసింది.

జెట్ ఎయిర్‌వేస్ లాభం 46 శాతం డౌన్

- రూ. 6,349 కోట్లకు మొత్తం ఆదాయం



న్యూఢిల్లీ: విమానయాన సంస్థ, జెట్ ఎయిర్‌వేస్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసిక కాలానికి రూ.165 కోట్ల నికర లాభం(స్టాండెలోన్) సాధించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే క్వార్టర్లో సాధించిన నికర లాభం (రూ.305 కోట్లు)తో పోల్చితే 46 శాతం క్షీణించిందని జెట్ ఎయిర్‌వేస్ తెలిపింది. అధిక వ్యయాల కారణంగా నికర లాభం తగ్గిందని తెలిపింది. మొత్తం ఆదాయం మాత్రం రూ.5,941 కోట్ల నుంచి రూ.6,349 కోట్లకు పెరిగిందని వివరించింది.

మొత్తం వ్యయాలు రూ.5,635 కోట్ల నుంచి రూ.6,184 కోట్లకు పెరిగాయని జెట్ ఎయిర్‌వేస్ తెలిపింది. కరెన్సీ ఒడిదుడుకుల కారణంగా గత క్యూ3లో రూ.190 కోట్ల నష్టాలు రాగా, ఈ క్యూ3లో రూ.142 కోట్ల లాభం వచ్చిందని పేర్కొంది. నిర్వహణ ఆదాయం రూ. 8 కోట్ల నుంచి రూ.128 కోట్లకు పెరిగిందని తెలిపింది.

ఆర్థిక ఫలితాల నేపథ్యంలో బీఎస్‌ఈలో జెట్ ఎయిర్‌వేస్ షేర్ 2.1 శాతం నష్టపోయి రూ. 803 వద్ద ముగిసింది.

కొత్త నిబంధనావళి ప్రభావం యాక్సిస్‌పై తక్కువే!


శిఖా శర్మ

ముంబై: మొండిబకాయిల (ఎన్‌పీఏ) పరిష్కార క్రమంలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) జారీచేసిన తాజా నిబంధనలు యాక్సిస్ బ్యాంక్‌పై తీవ్ర ప్రభావం ఏదీ చూపిందబోదని ఆ బ్యాంక్ చీఫ్ శిఖా శర్మ పేర్కొన్నారు. కొత్త అకౌంటింగ్ నిబంధనల ప్రకారం, మొండిబకాయిలకు సంబంధించి ఇప్పటికే బ్యాంక్ అధిక ప్రొవిజన్స్ కేటాయింపులు జరపడమే దీనికి కారణమని అన్నారు. ప్రొవిజనింగ్స్ కోసం తగిన నిధులు కేటాయిస్తున్నప్పటికీ, ఈ అంశం తమ బ్యాంక్ రుణ వృద్ధికి సైతం ప్రతికూలం కాబోదని యాక్సిస్ బ్యాంక్ చీఫ్ ఒక ఇంటర్వ్యూలో పేర్కొన్నారు.

అలహాబాద్ బ్యాంక్ నష్టాలు రూ.1,263 కోట్లు

మొండి బకాయిల భారం



కోల్‌కతా: ప్రభుత్వ రంగ అలహాబాద్ బ్యాంక్‌కు ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసిక కాలంలో రూ.1,264 కోట్ల నికర నష్టాలు వచ్చాయి. గత ఆర్థిక సంవత్సరం ఇదే క్వార్టర్లో రూ.75 కోట్ల నికర లాభం సాధించామని అలహాబాద్ బ్యాంక్ తెలిపింది. మొండి బకాయిలకు, నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్‌కు నివేదించిన ఖాతాలకు కేటాయింపులు పెరగడం, ట్రెజరీ కార్యకలాపాల్లో నష్టాలు రావడం తదితర కారణాల వల్ల ఈ క్యూ3లో ఈ స్థాయిలో నష్టాలు వచ్చాయని వివరించింది. మొండి బకాయిలకు కేటాయింపులు రూ.796 కోట్ల నుంచి రూ.2,044 కోట్లకు పెరిగాయని పేర్కొంది. స్థూల మొండి బకాయిలు 8.97 శాతం నుంచి 14.38 శాతానికి, నికర మొండి బకాయిలు 8.65 శాతం నుంచి 12.51 శాతానికి పెరిగాయని తెలిపింది. నిర్వహణ లాభం 7 శాతం పెరిగి రూ.922 కోట్లకు చేరిందని అలహాబాద్ బ్యాంక్ తెలిపింది.గత ఏడాది డిసెంబర్ చివరి నాటికి మొత్తం వ్యాపారం రూ.3.73 లక్షల కోట్లకు పెరిగిందని పేర్కొంది.

ఆర్థిక ఫలితాలు బాగా లేకపోవడంతో బీఎస్‌ఈలో ఈ షేర్ 8 శాతం నష్టంతో రూ.56 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో ఏడాది కనిష్ట స్థాయి, రూ.55.75ను తాకింది.

అంతర్జాతీయ ఐపీవోకి భారతి ఎయిర్‌టెల్



న్యూఢిల్లీ: టెలికం దిగ్గజం భారతి ఎయిర్‌టెల్ తమ ఆఫ్రికా విభాగాన్ని అంతర్జాతీయ స్టాక్ ఎక్స్ఛేంజీలో లిస్టింగ్ చేయాలని యోచిస్తోంది. నెదర్లాండ్స్ కేంద్రంగా ఆఫ్రికా కార్యకలాపాలను పర్యవేక్షించే భారతి ఎయిర్‌టెల్ ఇంటర్నేషనల్ (బెయిన్ బీవీ) ఇందుకు సంబంధించిన ప్రతిపాదనకు ఆమోదముద్ర వేసింది. అంతర్జాతీయంగా గుర్తింపు పొందిన స్టాక్ ఎక్స్ఛేంజీలో షేర్ల లిస్టింగ్‌కు సంబంధించి సాధ్యాసాధ్యాలను అధ్యయనం చేసేలా వివిధ బ్యాంకులు, మధ్యవర్తిత్వ సంస్థలతో సంస్థ యాజమాన్యం చర్చలు జరిపేందుకు ఇది ఉపయోగపడనుంది. ఆఫ్రికాలోని 14 దేశాల్లో భారతి ఎయిర్‌టెల్ టెలికం కార్యకలాపాలు సాగిస్తోంది. మొత్తం 14 దేశాల్లో 3జీ సర్వీసులు, ఎయిర్‌టెల్ మనీ సేవలు అందిస్తోంది.

దేనా బ్యాంక్ నష్టాలు రూ.380 కోట్లు

ప్రభుత్వం నుంచి రూ.3,045 కోట్ల పెట్టుబడులు



న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ దేనా బ్యాంక్‌కు ఈ ఆర్థిక సంవత్సరం అక్టోబర్–డిసెంబర్ క్వార్టర్లో రూ. 380 కోట్ల నికర నష్టాలు వచ్చాయి. గత ఆర్థిక సంవత్సరం ఇదే క్వార్టర్‌కు రూ.35 కోట్ల నికర లాభం సాధించామని పేర్కొంది. మొత్తం ఆదాయం రూ.2,996 కోట్ల నుంచి రూ.2,476 కోట్లకు తగ్గిందని తెలిపింది. స్థూల మొండి బకాయిలు 14.79 శాతం నుంచి 19.56 శాతానికి, నికర మొండి బకాయిలు 9.52 శాతం నుంచి 11.52 శాతానికి పెరిగాయని వివరించింది. ఫలితంగా మొండి బకాయిలకు కేటాయింపులు రెట్టింపయ్యాయని, రూ.427 కోట్ల నుంచి రూ.1,044 కోట్లకు పెరిగాయని పేర్కొంది. ప్రభుత్వానికి ప్రిఫరెన్షియల్ షేర్ల జారీ ద్వారా రూ.3,045 కోట్ల సమీకరణకు తమ డైరెక్టర్ల బోర్డ్ ఆమోదం తెలిపిందని దేనా బ్యాంక్ వెల్లడించింది.

ఆర్థిక ఫలితాలు అధ్వానంగా ఉండటంతో బీఎస్‌ఈలో దేనా బ్యాంక్ షేర్ 2.4 శాతం క్షీణించి రూ.22.35 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో ఏడాది కనిష్ట స్థాయి, రూ.21.90ను తాకింది.

షావోమి స్మార్ట్‌టీవీ..

- 'ఎంఐ ఎల్‌ఈడీ స్మార్ట్ టీవీ 4' ఆవిష్కరణ
- ధర రూ.39,999
- రెడ్‌మిలో నోట్ 5, నోట్ 5 ప్రో ఫోన్స్ విడుదల
- వీటి ప్రారంభ ధర రూ.9,999


కొత్త ఉత్పత్తులు ఆవిష్కరిస్తున్న షావోమి ఇండియా ప్రోడక్ట్ లీడ్ జై మణి, సంస్థ సహ వ్యవస్థాపకుడు వాంగ్ చువాన్, షావోమి ఇండియా ఎండీ జైన్, గ్లోబల్ వైస్ ప్రెసిడెంట్ సాహు (ఎడమ నుంచి కుడికి)



న్యూఢిల్లీ: చైనాకు చెందిన ప్రముఖ టెక్నాలజీ కంపెనీ 'షావోమి' తాజాగా భారత్‌లో టెలివిజన్ విభాగంలోకి ప్రవేశించింది. ప్రపంచంలోనే అతి పలుచనైన టీవీని 'ఎంఐ ఎల్‌ఈడీ స్మార్ట్ టీవీ 4' పేరుతో మార్కెట్లో ఆవిష్కరించింది. దీని ధర రూ.39,999. ఇది శాంసంగ్, సోనీ టీవీలకు గట్టిపోటీనిస్తుందని అంచనా. న్యూఢిల్లీలో బుధవారం జరిగిన ఒక కార్యక్రమంలో టీవీతోపాటు కంపెనీ రెండు స్మార్ట్‌ఫోన్లను కూడా మార్కెట్లోకి విడుదల చేసింది. రెడ్‌మి నోట్ 5, రెడ్‌మి నోట్ 5 ప్రో అనేవి ఇందులో ఉన్నాయి. ఈ ప్రొడక్టులన్నీ ఈ-కామర్స్ సంస్థ ఫ్లిప్‌కార్ట్, ఎంఐహోమ్స్ (ఆఫ్‌లైన్ రిటైల్ స్టోర్స్), ఎంఐ.కామ్‌లో ఫిబ్రవరి 22 నుంచి కస్టమర్లకు అందుబాటులో ఉండనున్నాయి.

టీవీ ఫీచర్లు ఇవే..

ఇందులో 4.9 ఎంఎం అల్ట్రా-థిన్ ఫ్రేమ్‌లెస్ డిజైన్, 55 అంగుళాల ఎల్‌ఈడీ డిస్‌ప్లే ప్యానెల్, 4కే రెజల్యూషన్ (3840–2160 పిక్సెల్స్), హెచ్‌డీఆర్ సపోర్ట్, 64 బిట్ 1.8 గిగాహెర్ట్జ్ క్వాడ్‌కోర్ ప్రాసెసర్, 2 జీబీ ర్యామ్, 8 జీబీ మెమరీ, మూడు హెచ్‌డీఎంఐ 2.0 పోర్ట్స్, రెండు యూఎస్‌బీ పోర్ట్స్, డ్యూయెల్ బాండ్ వై-ఫై, బ్లూటూత్ 4.0, డాల్బీ+ డీటీఎస్ సినిమా ఆడియో క్వాలిటీ, ప్యాచ్‌వాల్ ఓఎస్, మల్టీ లాంగ్వేజ్ సపోర్ట్ వంటి పలు ప్రత్యేకతలున్నాయని కంపెనీ పేర్కొంది. 5,00,000లకు పైగా గంటల కంటెంట్‌ను అందించేందుకు వీలుగా హంగామా, ఏఎల్‌టీ బాలాజీ, జీ5, సోనీ లైవ్ వంటి పలు సంస్థలతో భాగస్వామ్యం కుదుర్చుకున్నామని తెలిపింది.

చైనా వెలుపల భారత్‌లోనే విక్రయం

షావోమి కంపెనీ చైనా వెలుపల భారత్‌లోనే తొలిసారిగా టీవీలను విక్రయిస్తోంది. కంపెనీ ప్రస్తుతం భారత్‌లో స్మార్ట్‌ఫోన్స్, ఎయిర్ ప్యూరిఫయర్స్, మొబైల్ యాక్సరీస్‌లను విక్రయిస్తోన్న విషయం తెలిసిందే. 'ఇండియా మాకు చాలా ముఖ్యమైన మార్కెట్. అతి తక్కువ కాలంలోనే ఇక్కడి స్మార్ట్‌ఫోన్ మార్కెట్లో అధిక మార్కెట్ వాటాను కైవసం చేసుకున్నాం. స్మార్ట్‌ఫోన్స్ తర్వాత ఇప్పుడు టీవీలు మాకు అతిపెద్ద విభాగం. అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతోన్న టీవీ బ్రాండ్ మాది. టెలివిజన్ సెగ్మెంట్‌లో పోటీ కూడా ఎక్కువగా ఉంది' అని షావోమి ఇండియా ఎండీ మను జైన్ తెలిపారు. భారతీయ వినియోగదారులకు దృష్టిలో ఉంచుకొని టీవీల్లో కొన్ని ప్రత్యేకమైన ఫీచర్లను పొందుపరిచామని పేర్కొన్నారు. 'ప్రస్తుతం టీవీలను దిగుమతి చేసుకుంటున్నాం. విక్రయాల ఆధారంగా వీటిని దేశీయంగానే తయారు చేయాలా? వద్దా? అనే నిర్ణయం తీసుకుంటాం' అని తెలిపారు. భారత్‌లో దాదాపు 10 శాతం టెలివిజన్లు ఆన్‌లైన్‌లో విక్రయమౌతున్నాయని చెప్పారు. ఇందులో స్మార్ట్‌టీవీల వాటా చాలా తక్కువగా ఉందని తెలిపారు. 'రెండేళ్ల కిందటనే ఇండియా మార్కెట్‌లోకి టీవీలు తీసుకురావడానికి పనులు ప్రారంభించాం. హంగామాలో వాటా కొనుగోలు తర్వాత ఈ దిశగా వడివడిగా అడుగులు పడ్డాయి' అని పేర్కొన్నారు.

రెడ్‌మి ఫోన్స్ ప్రత్యేకతలు

నోట్ 5: ఈ స్మార్ట్‌ఫోన్స్‌లో 5.99 అంగుళాల ఫుల్ హెచ్‌డీ ప్లస్ 18:9 డిస్‌ప్లే, 4,000 ఎంఏహెచ్ బ్యాటరీ, స్నాప్‌డ్రాగన్ 625 ప్రాసెసర్, 5 ఎంపీ ఫ్రంట్ కెమెరా, 12 ఎంపీ రియర్ కెమెరా, సెల్ఫీ లైట్, ఫింగర్‌ప్రింట్ సెన్సార్ వంటి పలు ప్రత్యేకతలున్నాయని కంపెనీ తెలిపింది. ఇక రెడ్‌మి నోట్ 5 స్మార్ట్‌ఫోన్ 3 జీబీ ర్యామ్/32 జీబీ మెమరీ, 4 జీబీ ర్యామ్/64 జీబీ మెమరీ అనే రెండు వేరియంట్ల రూపంలో కస్టమర్లకు అందుబాటులో ఉండనుంది. వీటి ధరలు వరుసగా రూ.9,999గా, రూ.11,999గా ఉన్నాయి.

నోట్ 5 ప్రో: వీటిల్లో 5.99 అంగుళాల ఫుల్ హెచ్‌డీ ప్లస్ 18:9 డిస్‌ప్లే, సాఫ్ట్ సెల్ఫీలైట్‌తో కూడిన 20 ఎంపీ ఫ్రంట్ కెమెరా, స్నాప్‌డ్రాగన్ 636 ప్రాసెసర్ (క్వాల్‌కామ్ నుంచి వస్తున్న లేటెస్ట్ పవర్‌ఫుల్ ప్రాసెసర్), 4,000 ఎంఏహెచ్ బ్యాటరీ, 12 ఎంపీ+5 ఎంపీ డ్యూయెల్ రియర్ కెమెరా, ఫింగర్‌ప్రింట్ సెన్సార్ వంటి పలు ప్రత్యేకతలున్నాయని కంపెనీ తెలిపింది. ఈ స్మార్ట్‌ఫోన్స్ 4 జీబీ ర్యామ్/ 64 జీబీ మెమరీ, 6 జీబీ ర్యామ్/ 64 జీబీ మెమరీ అనే రెండు వేరియంట్ల రూపంలో అందుబాటులో ఉండనున్నాయి. వీటి ధరలు వరుసగా రూ.13,999గా, రూ.16,999గా ఉన్నాయి.

ఐడియా నిధుల సమీకరణ!

క్యూఐపీలో రూ.3,500 కోట్లకు ప్రణాళిక

న్యూఢిల్లీ: ఐడియా సెల్యులర్ కంపెనీ రూ.3,500 కోట్లు సమీకరించనున్నది. క్వాలిఫైడ్ ఇన్‌స్టిట్యూషనల్ ప్లేస్‌మెంట్(క్యూఐపీ) విధానంలో ఈక్విటీ షేర్ల జారీ ద్వారా ఈ పెట్టుబడులు సమీకరిస్తామని ఐడియా సెల్యులర్ తెలిపింది. ఈ నిధుల సమీకరణకు తమ కంపెనీ డైరెక్టర్ల బోర్డ్ తుది ఆమోదం తెలిపిందని పేర్కొంది. కంపెనీ ప్రమోటర్ ఆదిత్య బిర్లా గ్రూప్(ఏబీజీ)కు చెందిన సంస్థలకు షేర్ల కేటాయింపు ద్వారా ఇటీవలనే ఈ కంపెనీ రూ.3,250 కోట్లు సమీకరించింది. క్యూఐపీ ద్వారా రూ.3,500 కోట్లు, ఏబీజీ ద్వారా రూ.3,250 కోట్లు.. మొత్తం రూ.6,750 కోట్ల నిధుల కారణంగా ఐడియా నికర రుణ భారం తగ్గుతుంది. గత ఏడాది డిసెంబర్ చివరి నాటికి ఐడియా నికర రుణ భారం రూ.55,782 కోట్లుగా ఉంది. కాగా వొడాఫోన్ కంపెనీ ఐడియాలో విలీనమవుతున్న విషయం తెలిసిందే.



నిత్యావసరాల ధరలు (హోల్‌సేల్/క్వింటాల్‌కు)

పత్తి (వరంగల్, వ్యాపారస్తులు)	మిర్చి (వరంగల్, తేజ)	పసుపు (నిజామాబాద్, కొమ్ము)	ఉల్లి (కర్నూలు)	చక్కెర (చెన్నై)	బియ్యం (కరీంనగర్)	కందిపప్పు (చెన్నై)	సుబాబులు (కృష్ణా)	ఆయిల్ పామ్ (పశ్చిమ గోదావరి)
--	--	--	--	రూ.3,600	3,800 (హెచ్ఎంటీ)	రూ.7,200	రూ.4,400 (టన్నుకు)	--
--	--	--	--					

వ్యాపార విశ్వాస సూచీ 9 శాతం అప్

ఎన్‌సీఏఈఆర్ సర్వే

న్యూఢిల్లీ: వ్యాపార విశ్వాస సూచీ త్రైమాసికం పరంగా చూస్తే 2017 డిసెంబర్ క్వార్టర్‌లో 9.1 శాతం పెరిగింది. మొత్తంగా చూస్తే సెంటిమెంట్ జోరుగానే ఉంది. నేషనల్ కౌన్సిల్ ఆఫ్ అప్లైడ్ ఎకనమిక్ రీసెర్చ్ (ఎన్‌సీఏఈఆర్) తాజా సర్వేలో ఈ విషయం వెల్లడయ్యింది. జీఎస్‌టీ అమలు నేపథ్యంలో ఎన్‌సీఏఈఆర్ బిజినెస్ కాన్ఫిడెన్స్ ఇండెక్స్ (ఎన్–బీసీఐ) సెప్టెంబర్ క్వార్టర్‌లో 12.9 శాతం క్షీణించిన విషయం తెలిసిందే. ఉత్పత్తి, దేశీ విక్రయాలు, ఎగుమతులు, ముడిపదార్థాల దిగుమతులు, స్థూల లాభాలు వంటి వాటికి సంబంధించిన సెంటిమెంట్ 2017 జూలై–సెప్టెంబర్‌తో పోలిస్తే 2017 అక్టోబర్–డిసెంబర్‌లో జోరుగా ఉందని సర్వే పేర్కొంది. సెంటిమెంట్ మెరుగుదల వల్ల అన్ని రంగాల్లో వృద్ధి ధోరణులు కనిపిస్తున్నాయని తెలిపింది. కార్మిక ఉపాధి, వేతనాల్లో చెప్పుకోదగ్గ వృద్ధి నమోదయ్యిందని పేర్కొంది. ఇక భవిష్యత్ ఉపాధి, వేతనాలకు సంబంధించిన అంచనాలు సానుకూలంగానే ఉన్నాయని తెలిపింది.

బ్యాంక్ షేర్లు బేజారు..

చివర్లో అమ్మకాలు ● 145 పాయింట్ల నష్టంతో 34,156కు సెన్సెక్స్ ● 39 పాయింట్ల పతనంతో 10,501కు నిఫ్టీ

ఆద్యంతం ఒడిదుడుకులమయంగా సాగిన బుధవారం నాటి ట్రేడింగ్‌లో స్టాక్ మార్కెట్ నష్టాల్లో ముగిసింది. లాభ నష్టాల మధ్య కదలాడిన స్టాక్ సూచీలు చివరకు నష్టాల్లో ముగిశాయి. చివరి గంటలో వెల్లువెత్తిన అమ్మకాల కారణంగా అప్పటివరకూ హెచ్చుతగ్గులకు లోనైన స్టాక్ సూచీలు క్షీణించాయి. సెన్సెక్స్145 పాయింట్లు నష్టపోయి 34,156 పాయింట్ల వద్ద, నిఫ్టీ 39 పాయింట్ల పతనంతో 10,501 పాయింట్ల వద్ద ముగిశాయి. మొండి బకాయిల విషయమై ఆర్‌బీఐ కఠినతరమైన కొత్త నిబంధనలను తీసుకురావడం సెంటిమెంట్‌ను దెబ్బతీసింది. మరోవైపు పంజాబ్ నేషనల్ బ్యాంక్‌లో రూ.11,300 కోట్ల మేర అవకతవకల లావాదేవీలు జరిగాయన్న వార్తలు ప్రతికూల ప్రభావం చూపించాయి. బ్యాంక్ షేర్లు 10 శాతం వరకూ నష్టపోయాయి.

లాభాల్లోంచి.. నష్టాల్లోకి...

ఐఐపీ, ద్రవ్యోల్బణ గణాంకాలు ఆశావహంగా ఉన్న నేపథ్యంలో సెన్సెక్స్ లాభాల్లోనే ఆరంభమైంది. కొనుగోళ్లు జోరుగా ఉండటంతో సెన్సెక్స్ 173 పాయింట్ల లాభంతో 34,473 పాయింట్ల గరిష్ట స్థాయికి చేరింది. యూరప్ మార్కెట్లు లాభాల్లో ఆరంభం కావడం కలిసివచ్చింది. అయితే లాభాల స్వీకరణ చోటు చేసుకోవడంతో చివరి గంటలో అమ్మకాలు వెల్లువెత్తాయి. దీంతో సెన్సెక్స్ 272 పాయింట్ల నష్టంతో 34,029 పాయింట్ల కనిష్ట స్థాయికి పడిపోయింది. మొత్తం మీద 445 పాయింట్ల రేంజ్‌లో కదలాడింది. ఇక నిఫ్టీ ఒక దశలో 51 పాయింట్లు లాభపడగా, మరో దశలో 83 పాయింట్లు నష్టపోయింది.

మొండి బకాయిల గుర్తింపు, వీటిని పరిష్కారానికి సంబంధించిన నిబంధనలను ఆర్‌బీఐ కఠినతరం చేసింది. దీంట్లో భాగంగా ఆరు రకాల రుణ పునర్వ్యవస్థీకరణ విధానాలను రద్దు చేసింది. ఈ తాజా నిబంధనల కారణంగా మొండి బకాయిలు మరింతగా పెరిగి, కేటాయింపులు అధికమవుతాయని, ఫలితంగా బ్యాంక్‌ల లాభదాయకత దెబ్బతింటుందని నిపుణులంటున్నారు. మరోవైపు ముంబై బ్రాంచ్‌లో రూ.11,300 కోట్ల మేర అవకతవకల లావాదేవీలు జరిగాయన్న వార్తలతో పీఎన్‌బీ 10 శాతం పతనమైంది.

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	4,615
ఎన్ఎస్ఈ (ఈక్విటీ)	34,739
ఎన్ఎస్ఈ (డెరివేటివ్స్)	7,10,779
ఎఫ్ఐఐ	-729
డీఐఐ	-152

టాటా పవర్ లాభం రూ.612 కోట్లు

ఆదాయం 6 శాతం అప్

న్యూఢిల్లీ: టాటా పవర్ కంపెనీ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసిక కాలంలో రూ.612 కోట్ల నికర లాభం సాధించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలానికి సాధించిన నికర లాభం, రూ.619 కోట్లతో పోల్చితే 1 శాతం తగ్గిందని టాటా పవర్ తెలిపింది. ఆదాయం 6 శాతం వృద్ధితో రూ.7,096 కోట్లకు పెరిగిందని కంపెనీ సీఈఓ, ఎమ్‌డీ అనిల్ సార్దానా పేర్కొన్నారు. పునరుత్పాదన విద్యుదుత్పత్తి విభాగం లాభం రూ.14 కోట్ల నుంచి రూ.72 కోట్లకు పెరిగిందని వివరించారు. అన్ని అనుబంధ విభాగాలతో కలుపుకొని ఈ క్యూ3లో మొత్తం 12,402 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేశామని తెలిపారు. అంతేకాకుండా తమ మొత్తం విద్యుదుత్పత్తికి 227 మెగావాట్ల సౌర విద్యుత్తు, 5.4 మెగావాట్ల థర్మల్ విద్యుదుత్పత్తి జత అయ్యాయని వివరించారు. పునరుత్పాదన విద్యుదుత్పత్తి వ్యాపారంపై ప్రధానంగా దృష్టి పెడుతున్నామని పేర్కొన్నారు. ఆర్థిక ఫలితాల నేపథ్యంలో బీఎస్ఈలో టాటా పవర్ షేర్ 0.2 శాతం లాభపడి రూ.87 వద్ద ముగిసింది.

జీఎంఆర్ నష్టం రూ. 566 కోట్లు

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: మౌలిక రంగ దిగ్గజం జీఎంఆర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో రూ. 566 కోట్ల నికర నష్టం (కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన) ప్రకటించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే వ్యవధిలో కంపెనీ రూ. 643 కోట్ల లాభం నమోదు చేసింది. ఇక తాజా క్యూ3లో ఆదాయం కూడా రూ. 2,587 కోట్ల నుంచి రూ. 2,296 కోట్లకు క్షీణించింది. అటు మొత్తం వ్యయాలు రూ. 2,624 కోట్ల నుంచి రూ. 2,488 కోట్లకు తగ్గాయి. బుధవారం బీఎస్ఈలో జీఎంఆర్ షేరు 1.75 శాతం నష్టంతో రూ. 19.70 వద్ద ముగిసింది.

ముగిసిన ఆటో ఎక్స్‌పో

ఆరు లక్షల మందికి పైగా సందర్శకులు

గ్రేటర్ నోయిడా: ఆరు రోజులపాటు అట్టహాసంగా సాగిన 14వ ఆటో ఎక్స్‌పో బుధవారం ముగిసింది. ఇందులో 22 కొత్త వాహనాలు, 81 ఉత్పత్తులను ఆవిష్కరించారు. 18 కాన్సెప్ట్ వాహనాలను ప్రదర్శించారు. 6 లక్షల పైగా సందర్శకులు ఆటో ఎక్స్‌పోను సందర్శించారు. ఆటోమోటివ్ పరికరాల తయారీ సంస్థల సమాఖ్య ఏసీఎంఏ, భారతీయ పరిశ్రమల సమాఖ్య సీఐఐ, భారతీయ ఆటోమొబైల్ తయారీ సంస్థల సమాఖ్య సియామ్ దీన్ని సంయుక్తంగా నిర్వహించాయి. ఈసారి ఎలక్ట్రిక్ వాహనాలు, హైబ్రిడ్స్, పర్యావరణ అనుకూల టెక్నాలజీకి పెద్ద పీట వేశాయి. మారుతీ సుజుకీ, టాటా మోటార్స్, మహీంద్రా అండ్ మహీంద్రాతో పాటు మెర్సిడెస్ బెంజ్, బీఎండబ్ల్యూ తదితర లగ్జరీ కార్ల సంస్థలు తమ భవిష్యత్ మోడల్స్‌ను ప్రదర్శించాయి. అయితే, ఫోక్స్‌వ్యాగన్ గ్రూప్, నిస్సాన్, ఫోర్డ్ వంటి విదేశీ సంస్థలతో పాటు దేశీ దిగ్గజం బజాజ్ ఆటో, రాయల్ ఎన్‌ఫీల్డ్ దీనికి దూరంగా ఉన్నాయి. గత ఎక్స్‌పోలకు భిన్నంగా ఈసారి అదనంగా మరో రోజు పొడిగించడంపై అటు సందర్శకులు, ఇటు తయారీ సంస్థల నుంచి మంచి స్పందన వచ్చినట్లు సియామ్ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ సుగతో సేన్ తెలిపారు.

ఎన్ఎమ్‌డీసీ లాభం 49% వృద్ధి

హైదరాబాద్: ఎన్ఎమ్‌డీసీ ఈ క్యూ3లో రూ.887 కోట్ల నికర లాభం సాధించింది. గత ఆర్థిక సంవత్సరపు నికర లాభంతో పోలిస్తే ఇది 49% అధికం. స్థూల లాభం రూ.1,377 కోట్లకు పెరిగిందని కంపెనీ సీఎమ్‌డీ ఎన్.బైజేంద్ర కుమార్ పేర్కొన్నారు. టర్నోవర్ 1% తగ్గి రూ.2,469 కోట్లకు చేరిందని తెలిపారు.

స్టాక్ మార్కెట్‌లో 'లోకల్' హవా

- విదేశీ ఇన్వెస్టర్లను మించుతున్న దేశీ పెట్టుబడులు
- స్టాక్ మార్కెట్లో డీఐఐల జోరు
- మార్నింగ్‌స్టార్ నివేదిక వెల్లడి

న్యూఢిల్లీ: స్టాక్ మార్కెట్లో దేశీ ఇన్వెస్టర్లు జోరుగా పెట్టుబడులు పెడుతున్నారు. గత ఏడాది విదేశీ ఇన్వెస్టర్ల కంటే రెట్టింపునకు పైగా దేశీ ఇన్వెస్టర్లు పెట్టుబడులు పెట్టడం విశేషం. 2017లో విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు(ఎఫ్‌పీఐలు) రూ. 51,000 కోట్లు ఇన్వెస్ట్ చేయగా, దేశీయ సంస్థాగత ఇన్వెస్టర్లు(డీఐఐ)లు రూ.90,700 కోట్ల మేర పెట్టుబడులు పెట్టారు. గత ఏడాది ఒక్క మార్చిలోనే దేశీ ఇన్వెస్టర్లు నికర అమ్మకాలు జరిపారని, మిగిలిన అన్ని నెలల్లోనూ కొనుగోళ్లు కొనసాగించారని మార్నింగ్‌స్టార్ అనే సంస్థ వెల్లడించింది.

పడిపోయినప్పుడల్లా కొనుగోళ్లు...

మార్కెట్లకు అవసరమైన నిలకడను గతంలో విదేశీ ఇన్వెస్టర్ల పెట్టుబడులు ఇచ్చేవని మార్నింగ్‌స్టార్ సీనియర్ విశ్లేషకులు.. హిమాంశు శ్రీవాత్సవ చెప్పారు. ఇప్పుడు పెరుగుతున్న దేశీ ఇన్వెస్టర్ల పెట్టుబడులు..మార్కెట్‌కు కావలసిన నిలకడను అందించే విదేశీ నిధుల అవసరాన్ని తగ్గిస్తున్నాయని వివరించారు. మార్కెట్ పడిపోయిన ప్రతిసారీ పెట్టుబడులు పెట్టడానికి ఒక మంచి అవకాశమని మ్యూచువల్ ఫండ్ మేనేజర్లే కాకుండా, ఇన్వెస్టర్లు కూడా భావిస్తున్నారని, ఇది మంచి పరిణామమని పేర్కొన్నారు. భారత స్టాక్ మార్కెట్ పరిపక్వత చెందింది అనడానికి ఇదే తొలి నిదర్శనమని వివరించారు. విదేశీ ఇన్వెస్టర్ల పెట్టుబడుల సరళి అంచనాలకు అందనిదని పేర్కొన్నారు. భారత్ కాకుండా ఇతర మార్కెట్లలో కూడా ఇన్వెస్ట్ చేయడానికి వారికి అవకాశాలు ఉంటాయని, అందుకే వారి పెట్టుబడుల్లో హెచ్చుతగ్గులు, ఒడిదుడుకులు తీవ్రంగా ఉంటాయని వివరించారు. దేశీయ ఇన్వెస్టర్లకు భారత మార్కెట్ మినహా వేరే ఇన్వెస్ట్‌మెంట్ అవకాశాలు లేవని పేర్కొన్నారు.

అపోలో హాస్పిటల్స్ లాభం రూ. 67 కోట్లు

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో అపోలో హాస్పిటల్స్ నికర లాభం (స్టాండెలోన్ ప్రాతిపదికన) సుమారు 7 శాతం క్షీణించి రూ. 67 కోట్లకు పరిమితమైంది. వ్యయాలు పెరగడమే ఇందుకు కారణం. గత ఆర్థిక సంవత్సరం క్యూ3లో సంస్థ నికర లాభం రూ. 73 కోట్లు. మరోవైపు తాజాగా ఆదాయం రూ. 1,681 కోట్ల నుంచి రూ. 1,896 కోట్లకు పెరిగింది. విభాగాలవారీగా చూస్తే హెల్త్‌కేర్ సర్వీసుల విభాగం ఆదాయం రూ. 892 కోట్ల నుంచి రూ. 1,008 కోట్లకు, ఫార్మసీ విభాగం రూ. 789 కోట్ల నుంచి రూ. 888 కోట్లకు పెరిగినట్లు అపోలో హాస్పిటల్స్ పేర్కొంది. మొత్తం వ్యయాలు రూ. 1,600 కోట్ల నుంచి రూ. 1,806 కోట్లకు పెరిగినట్లు వివరించింది.

బులియన్ రూ.లలో

ముంబై			
బంగారం (99.9, 10గ్రా)	30,360		
బంగారం (99.5, 10గ్రా)	30,210		
వెండి (కిలో)	38,185		
చెన్నై			
బంగారం (24 క్యారెట్లు)	– –		
బంగారం (22 క్యారెట్లు)	28,890	▼	20
వెండి (కిలో)	--		
హైదరాబాద్			
బంగారం (24 క్యారెట్లు)	30,330	▼	30
బంగారం (22 క్యారెట్లు)	28,890	▼	20
వెండి (కిలో)	41,300	▼	200
ప్రొద్దుటూరు			
బంగారం (24 క్యారెట్లు)	31,150	▲	100
బంగారం (22 క్యారెట్లు)	28,850	▲	170
వెండి (కిలో)	39,500	▲	300
విశాఖపట్నం			
బంగారం(24 క్యారెట్లు)	31,140	▼	340
బంగారం (22 క్యారెట్లు)	28,960	▲	360
వెండి (కిలో)	39,900	▼	1100
విజయవాడ			
బంగారం (24 క్యారెట్లు)	31,300	▼	200
బంగారం (22 క్యారెట్లు)	28,900		0
వెండి(కిలో)	39,200	▲	100
ఏపీ బులియన్ అసోసియేషన్			
బంగారం (24 క్యారెట్లు)	31,240	▼	20
బంగారం (22 క్యారెట్లు)	28,890	▼	20
వెండి (కిలో)	39,300	▼	200

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

ముడిచమురు... (బ్యారెల్)

నైమెక్స్ లైట్ స్వీట్	59.37 (రాత్రి 11.00కు)	$59.19 (మంగళవారం ముగింపు)
బ్రెంట్	63.02 (రాత్రి 11.00కు)	$62.72 (మంగళవారం ముగింపు)

కోడిగుడ్లు (హోల్‌సేల్ -నెక్/100కు రూ.లలో) 15-2-2018

విశాఖ	400–00
చిత్తూరు	393–00
వరంగల్	388–00
ముంబై	430–00
చెన్నై	400–00
విజయవాడ	392–00
గోదావరి	392–00
నమక్కల్	380–00
14–2–2018 ఫామ్ ధర...	
హైదరాబాద్	386–00
రిటైల్ (ఒక గుడ్డుకు)	4.45
బెంగళూరు	395–00
ఢిల్లీ	435–00
కోల్‌కతా	427–00

ఎన్ఎస్ఈ నగదు విభాగంలో ట్రేడైన షేర్లు

కంపెనీ పేరు	ముగింపు ధర	క్రితం ముగింపు
ADANI PO	413	403.35
AMBUJA C	254.15	256.9
ASIAN PA	1139.15	1144.4
AXIS BAN	543.9	564.2
BAJAJ AU	3109.75	3154.1
BAJAJ FI	1669.95	1643.8
BHARTI A	434.8	424.4
BOSCH LI	19515.1	19545.85
BHARAT P	460.1	467.55
CIPLA LT	616.15	621.65
COAL IND	306.95	300.65
EICHER M	28027.6	27901.4
GAIL (IN	466.9	465
HCL TECH	937.8	939.15
HDFC LTD	1814	1805.45
HDFC BAN	1883.15	1876.65
HERO MOT	3596.05	3611.9
HINDALCO	243.25	243.25
HIND.petrol	382.65	391.45
HIND.unilever	1349.4	1344.45
INDIABUL	1348.2	1314.85
ICICI BA	318.95	326.25
INDUSIND	1694.45	1687.8
BHARTI I	327.4	338.25
INFOSYS	1097.75	1102.8
INDIAN O	377.35	379.05
ITC LTD	266.5	269.85
KOTAK MA	1042.45	1042.95
LARSEN &	1361.2	1350.5
LUPIN LI	827.6	840.45
MAHINDRA	746.95	746
MARUTI S	9001.6	9117.85
NTPC LTD	162.95	164.9
OIL AND	185.75	191
POWER GR	195.45	198.5
RELIANCE	933.65	915.5
STATE BA	276.2	288.75
SUN PHAR	574.8	589.15
TATA MOT	376.85	371.8
TATA STE	708	713.1
TATA CON	2911.8	2967.3
TECH MAH	611.5	590.35
ULTRATEC	4175.5	4200.3
UPL LIMI	721.9	726.5
VEDANTA	315.75	315.55
WIPRO LT	293.45	288.95
YES BANK	320.35	335.4
ZEE ENTE	576.6	584.5

నిఫ్టీ నెక్స్ట్ ఫిఫ్టీ

కంపెనీ పేరు	ముగింపు ధర	క్రితం ముగింపు
ABB INDI	1572.1	1610.65
ACC LIMI	1629.7	1651.55
ASHOK LE	137.4	133.3
BAJAJ FI	5189	5235.45
BANK OF	165.8	168.65
BHARAT E	160.6	157.75
BHEL	97.85	97.5
BRITANNI	4764.15	4772.5
CADILA H	419.6	423.65
COLGATE	1096.35	1093.9
CONTAINE	1325.1	1325.3
CUMMINS	840.45	845
DABUR IN	340.75	344.75
DLF LIMI	230.95	233.75
AVENUE S	1201.4	1187.2
EMAMI LI	1079.85	1080.85
GLAXOSMI	2459.05	2449.05
GLENMARK	530.45	535.35
GODREJ C	1027.5	1029.5
GLAXOSMI	6432.1	5971.1
HAVELLS	514.4	516.05
HIND.zinc	309.1	307.65
ICICI PR	409.85	416
IDEA CEL	84.8	84.5
INTERGLO	1274.95	1250.85
JSW STEE	309.55	310.75
LIC HOUS	525.05	521.5
MARICO L	315.6	310.05
UNITED S	3214.7	3268.2
MOTHERSO	357.25	364.45
MRF LTD	72329.2	71640.9
NHPC LTD	28.65	29.5
NMDC LTD	133.65	137.4
ORACLE F	4014.35	4052.7
OIL INDI	359.25	360.75
PIRAMAL	2733.3	2687.3
PETRONET	252.05	248.7
POWER FI	111.25	111.25
P&G HYGI	9296.15	9344.1
PIDILITE	894.85	894.5
PUNJAB N	145.85	161.65
RURAL EL	154.75	154.05
STEEL AU	93.55	95.35
SHREE CE	16813.15	16953.35
SIEMENS	1275.5	1255.5
SHRIRAM	1348.25	1325.9
SUN TV N	998.4	985.1
TATA POW	87.1	86.75
TITAN CO	813.7	809.05
TORRENT	1429.25	1430.8

బీఎస్ఈలో ఏపీ,టీఎస్ స్టాక్స్

కంపెనీ పేరు	ముగింపు ధర	క్రితం ముగింపు
AditSpin	8.4	8.4
Alphageo	840.5	843.3
Alu Flouride	116.5	116.95
Amar Raja Bat	839.35	844.95
And Bank	46.85	48.75
And Cemen	11.76	11.88
And Paper	345.25	353.3
And Petro	61.2	62.45
Anjani Portl	204.1	216.55
Aries Agro Ltd	227	225.2
Aurobindo Ph	601.85	607.85
Avantel Soft	596	607.9
Avanti Feeds	2411.6	2506.25

A B C D / E F G H / I J K L / M N O P / R S T U / V W X Z

20 MICRO	55.1	54.35
3M INDIA	20689.1	21706.7
5PAISA C	309.6	294.9
63 MOONS	102.5	105.4
8K MILES	819.2	801
A AND M	67.9	66.55
AARTI DR	656.35	624.75
AARTI IN	1183.1	1132.65
AARVEE D	54.45	50
AARVI EN	96.7	92.9
BANSWARA	120.4	120.05
BASF IND	2177.3	2226.05
BATA IND	717.95	714.5
BAYER CR	3887.05	3887
BEARDSEL	59.55	63.5
BEML LIM	1321	1347.85
BERGER P	247.6	249.45
BETA DRU	167.2	166
BF INVES	348.9	357.85
BF UTILI	489.45	495.2
BGR ENER	125.65	125.3
BHAGERIA	302.7	308.4
BHANSALI	180.25	182.9
DHUNSERI	156.55	157.2
DHUNSERI	380.4	400.4
DHUNSERI	425.85	440.9
DIC INDI	533.05	528.3
DILIP BU	986.25	975.75
DISH TV	73.45	74.65
DISHMAN	343.75	345.15
DIXON TE	3356.25	3436.4
DOLLAR I	444.25	430.05
DOLPHIN	98.75	100.7
DONEAR I	66.8	64.9
DR. LAL	902.75	908.9
DYNAMATI	1771.35	1775.35
GUJ NAR	493.75	488.55
GUJ STAT	136.35	137.85
GUJ. APO	222.35	229.55
GUJARAT	148.8	145.7
GUJARAT	151.6	145.75
GUJARAT	203.05	199.6
GUJARAT	260.1	256.3
GUJARAT	772.15	759.75
GUJARAT	817.4	787.55
GUJARAT	858.2	850.65
GULF OIL	1052.5	1039.65
GULSHAN	81.1	84.7
HARITA S	951.05	955.4
JASH ENG	175.3	179.15
JAY BHAR	497.7	499.55
JAYANT A	384.05	391.9
JAYSHREE	106.65	109.8
JBF INDU	178.85	179.5
JBM AUTO	486.35	490.9
JET AIRW	803.25	823.4
JET KNIT	117	109
JHS SVEN	67.95	67.3
JIND POL	68.7	69.6
JINDAL D	171	174.25
JINDAL P	68.75	69.9
JINDAL P	370.85	355
MANAKSIA	62.75	63.2
MANAPPUR	107.85	105.9
MANG.CHE	73.35	71.55
MANGALAM	174.25	167.55
MANGALAM	385.65	382.8
MANPASAN	415.3	420.5
MANUGRAP	51.75	52.35
MARATHON	513.55	518.1
MAS FINA	619.2	610.1
MASTEK L	507.05	483.7
MATRIMON	879.3	893.8
MAWANA S	67	65.05
MAX FINA	518.05	524.45
PG ELECT	333.45	329.25
PHILIPS	1214.2	1156.4
PI INDUS	839.55	840.45
PIONEER	189.6	191.9
PLASTIBL	210.55	209.75
PNB HOUS	1253.5	1245.55
PNC INFR	177.9	174.15
PODDAR H	1149.6	1143.25
PODDAR P	294.5	297.8
POKARNA	215.95	215.95
POLY MED	252.3	256.45
POLYPLEX	502.05	497.05
PONNIE S	171.5	176.4
POWER ME	860.35	824.2
SHALIM P	186.85	187.05
SHANKARA	1782.2	1779.8
SHANTHI	155.25	157.05
SHARDA C	393.4	394.15
SHARDA M	2451.4	2453.9
SHEELA F	1591.6	1611.9
SHEMAROO	513.1	508.35
SHILPA M	480.95	508.75
SHIPPING	82.35	85.45
SHIRPUR	161.05	164.1
SHIVA TE	570.5	608.85
SHIVAM A	86.95	83.4
SHOPPERS	537.3	532.25
SHRADHA	61.1	61.5
THE MAND	144.3	141.4
THE NEW	728.1	737.5
THE PHOE	604.85	599.9
THE RAMC	736.85	739.9
THE RUBY	351.1	352.3
THE STAT	166.85	159.25
THE TINP	243.95	248.15
THEJO EN	585	585
THEMIS M	606.9	585
THERMAX	1197.8	1181.05
THIRUMAL	2147.45	2170.7
THOMAS C	242.35	243.5
THYROCAR	655.85	656.85
TI FINAN	666.9	673
[illegible]	[illegible]	[illegible]

మాజీ ఎమ్మెల్యే ఎంవీ కృష్ణారావు కన్నుమూత


ఎంవీ కృష్ణారావు (ఫైల్)

ఇచ్ఛాపురం రూరల్: శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే ఎంవీ కృష్ణారావు(82) అనారోగ్యంతో బాధపడుతూ బుధవారం హైదరాబాద్‌లో కన్నుమూశారు. కృష్ణా జిల్లా చిన్నతాళ్లపల్లి ప్రాంతానికి చెందిన కృష్ణారావు వ్యాపారరీత్యా ఇచ్ఛాపురం వచ్చి స్థిరపడ్డారు. టీడీపీ వ్యవస్థాపక అధ్యక్షుడు స్వర్గీయ ఎన్టీ రామారావు పిలుపు మేరకు 1982 మార్చి 29న రాజకీయాల్లోకి వచ్చిన ఆయన 1983, 1987, 1989, 1999 ఎన్నికల్లో టీడీపీ తరఫున ఇచ్ఛాపురం నియోజకవర్గం నుంచి శాసనసభకు ఎన్నికయ్యారు. 2004లో వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో కాంగ్రెస్‌పార్టీలో చేరారు. అనంతరం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇచ్ఛాపురం నియోజకవర్గం సమన్వయకర్తగా కొద్దిరోజులు పనిచేశారు. ఆరోగ్యం సహకరించకపోవడంతో ప్రస్తుతం రాజకీయాలకు దూరంగా ఉన్నారు. ఈ క్రమంలోనే బుధవారం ఉదయం 11 గంటల సమయంలో హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని ఎమ్మెల్యే క్వార్టర్స్‌లోని తన స్వగృహంలో కన్నుమూశారు. గురువారం మధ్యాహ్నం ఫిల్మ్‌నగర్ మహాప్రస్థానంలో అంత్యక్రియలు నిర్వహిస్తున్నట్లు సన్నిహితులు తెలిపారు.

మాస దీక్షా సూర్యారాధనలో జస్టిస్ శివశంకర్


ప్రత్యేక పూజలు చేస్తున్న జస్టిస్ శివశంకర్

అమలాపురం రూరల్: తూర్పు గోదావరి జిల్లా అమలాపురం మండలం ఇందుపల్లిలోని మాస దీక్షా సూర్యారాధన కార్యక్రమంలో భాగంగా హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శివశంకర్ అష్టయామ ప్రత్యేక పూజలు చేశారు. మూడు గంటలపాటు ఆయన శివునికి ప్రత్యేక అభిషేకాలు, రుద్ర హోమాలు నిర్వహించారు. గత 28 రోజులుగా జరుగుతున్న ఈ కార్యక్రమ వివరాలను యాగకర్త గొర్తి గోపాలకృష్ణ జస్టిస్ శివశంకర్‌కు వివరించారు.

వివాదాలు పరిష్కారమయ్యేనా?

నేడు కృష్ణా, గోదావరి జల వివాదాలపై ఢిల్లీలో భేటీ

సాక్షి, అమరావతి: కృష్ణా, గోదావరి నదీ జలాల వినియోగంలో రెండు రాష్ట్రాల మధ్య వివాదాలను పరిష్కరించడంలో బోర్డులు చేతులెత్తేయడంతో కేంద్రం రంగంలోకి దిగింది. ఇరు రాష్ట్రాల జలవనరుల శాఖ కార్యదర్శులు, ఈఎన్సీలతో కేంద్ర జలవనరుల శాఖ కార్యదర్శి యూపీ సింగ్ నేడు ఢిల్లీలో సమావేశం కానున్నారు. కృష్ణా, గోదావరి జలాల వినియోగంలో రెండు రాష్ట్రాల మధ్య విభేదాలు తలెత్తకుండా వేర్వేరుగా నదీ యాజమాన్య బోర్డులను కేంద్రం ఏర్పాటు చేసింది. కానీ.. బోర్డుల పరిధిని ఖరారు చేయడంలో, కార్యనిర్వాహక నియమావళిని ఏర్పాటుచేసి అధికారాలు కల్పించడంలో విఫలమైంది. అధికారాలు లేకపోవడంతో తాము జారీ చేస్తున్న ఉత్తర్వులను ఖాతరు చేయడం లేదని ఇరు బోర్డులు కేంద్రానికి లేఖలు రాశాయి. గోదావరి నదీ జలాల వినియోగంలో పెద్దగా సమస్యలు లేకపోయినా.. కృష్ణా జలాల వినియోగంలో రెండు రాష్ట్రాల మధ్య విభేదాలు వస్తున్నాయి.

కృష్ణా, గోదావరి జలాలపై ఆంధ్రప్రదేశ్ ప్రతిపాదనలు..

కృష్ణా బోర్డు, గోదావరి బోర్డుల పరిధిని ఖరారు చేసి కార్యనిర్వాహక నియమావళిని రూపొందించాలి. ఉమ్మడి ప్రాజెక్టులను బోర్డు పరిధిలోకి తేవాలి. తెలంగాణ.. కృష్ణా నదిపై చేపట్టిన పాలమూరు–రంగారెడ్డి, డిండి, భక్త రామదాస ఎత్తిపోతల, మిషన్ భగీరథ, తుంగభద్ర నదిపై తుమ్మిళ్ల ఎత్తిపోతల పథకాలు కొత్తవే. అనుమతి లేకుండా చేపట్టిన ఈ ప్రాజెక్టులపై చర్యలు తీసుకోవాలి. కృష్ణా నదీ పరివాహక ప్రాంతంలో చిన్న నీటివనరుల విభాగంలో తెలంగాణ 89 టీఎంసీల కంటే ఎక్కువ వాడుకుంటోంది. ఆ రాష్ట్రానికి కేటాయించిన 299 టీఎంసీల్లో కోత వేయాలి.

మార్కుల జాబితా లీకైనా ఆందోళనొద్దు

- ఏపీపీఎస్సీ చైర్మన్ ప్రొఫెసర్ ఉదయ్‌భాస్కర్ స్పష్టీకరణ
- రాత పరీక్షలు, ఇంటర్వ్యూల మార్కులకు సంబంధం లేదు
- 2011 గ్రూప్–1 మెయిన్స్ మార్కుల జాబితాల లీకుపై విచారణ
- దోషులపై చట్టప్రకారం కఠిన చర్యలు



సాక్షి, అమరావతి

ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(ఏపీపీఎస్సీ) నిర్వహించే రాత పరీక్షలకు, ఇంటర్వ్యూల్లో వేసే మార్కులకు సంబంధం లేదని కమిషన్ చైర్మన్ ప్రొఫెసర్ పి.ఉదయభాస్కర్ స్పష్టం చేశారు. ఆయన బుధవారం విజయవాడలో మీడియాతో మాట్లాడారు. 2011 గ్రూప్–1 మెయిన్స్ మార్కుల జాబితాల లీక్‌తో అక్రమాలు జరిగాయనడం అవాస్తవమన్నారు. సోషల్ మీడియాలో ప్రచారంలో ఉన్న ఆయా జాబితాలను ప్రాథమికంగా పరిశీలించగా, లీకేజీ నిజమేనని తేలుతోందన్నారు. అయితే, మార్కుల జాబితాలు బయటకు వచ్చినంత మాత్రాన అవకతవకలు జరిగాయని భావించవద్దని చెప్పారు. ఈ వ్యవహారంపై అంతర్గతంగా విచారణ చేపట్టడంతోపాటు పోలీసులకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. దోషులపై చట్టప్రకారం కఠిన చర్యలుంటాయన్నారు. బయటకు వచ్చినట్లు చెబుతున్న మార్కుల జాబితాలను, కమిషన్ వద్ద ఉండిన జాబితాలను గురువారం పరిశీలించి తగిన చర్యలు చేపడతామన్నారు. మార్కుల జాబితాలను రహస్యంగా ఉంచాలనే నిబంధనలు ఏమీ లేవని, గతం నుంచి సంప్రదాయంగా నడుస్తోంది కనుక దాన్నే కొనసాగిస్తున్నామని తెలిపారు. బయటకు వస్తే ఇంటర్వ్యూలపై దాని ప్రభావం పడుతుందన్న ఉద్దేశంతోనే గోప్యం పాటిస్తున్నామన్నారు. ఈ మార్కుల జాబితాల ఆధారంగా బయటి వ్యక్తులు ఎవరైనా అభ్యర్థులతో బేరసారాలు సాగిస్తున్నట్లు తేలితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇప్పటివరకు ఏపీపీఎస్సీ 4,500 పోస్టుల భర్తీకి 36 నోటిఫికేషన్లు జారీచేసి, 30కి పైగా పూర్తి చేసిందని, అన్నీ పారదర్శకంగా నిర్వహించామన్నారు.

ఖాళీలపై సమాచారం రాలేదు

యూపీఎస్సీతోపాటు ప్రభుత్వ ఉత్తర్వులు, ఏపీపీఎస్సీ నిబంధనల ప్రకారమే ఇంటర్వ్యూలకు 50 మార్కులు నిర్దేశించామని ప్రొఫెసర్ ఉదయభాస్కర్ వివరించారు. రాత పరీక్షల్లోనే కాకుండా ఇంటర్వ్యూల్లోనూ అభ్యర్థుల నైపుణ్యాలను క్షుణ్నంగా పరిశీలించి ఎంపిక చేస్తున్నట్లు తెలిపారు. డిగ్రీ కాలేజీ లెక్చరర్ల నియామకాల్లో ఎలాంటి అవకతవకలు జరగలేదన్నారు. ఇంటర్వ్యూ బోర్డులో నిర్ణీత ప్రమాణాల ప్రకారమే సభ్యులుండేలా చూస్తున్నామని అన్నారు. చైర్మన్‌తోపాటు ఏపీపీఎస్సీ నుంచి ఒక సభ్యుడు, ప్రభుత్వం సూచించిన అధికారుల జాబితా నుంచి ఒకరు, మరో సబ్జెక్టు నిపుణుడిని వేర్వేరు రీతుల్లో ఎంపిక చేసి బోర్డును ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఖాళీలపై ప్రభుత్వం నుంచి ఇంకా సమాచారం రాలేదని, వచ్చిన వెంటనే నోటిఫికేషన్లు జారీ చేస్తామని వెల్లడించారు. 1999 గ్రూప్–2 నియామకాలకు సంబంధించి ఎంపికల జాబితాను ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లోని యూనిట్ కార్యాలయాలకు పంపించామని చెప్పారు.

చిత్తశుద్ధి ఉంటే రాజీనామాలు చేయించండి

సీఎం చంద్రబాబుకు ముద్రగడ లేఖ



కిర్లంపూడి (జగ్గంపేట): ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి కట్టుబడి ఉంటే ఓటుకు నోటు కేసులో అరెస్టుకు భయపడకుండా కేంద్రంలో భాగస్వామిగా ఉన్న మంత్రులు, ఎంపీలచే రాజీనామా చేయించి హోదా ఉద్యమానికి నడుం బిగించాలని కాపు ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభం బుధవారం సీఎం చంద్రబాబుకు లేఖ రాశారు. హోదా సాధన కోసం మాజాతి యావత్తూ రోడ్డెక్కడానికి వెనుకాడరని ఆ లేఖలో ప్రస్తావించారు. మీ పరపతి కాపాడుకోవడం కోసం నటుడు పవన్ కల్యాణ్‌ను తెరమీదకు తెచ్చి ఆయన జీవితాన్ని బలి చేయడం న్యాయమా అని ప్రశ్నించారు. 'తిరుపతిలో ప్రధాని మోదీ పాల్గొన్న సభలో ప్రత్యేక హోదా ఐదేళ్లు కాదు, పదిహేను సంవత్సరాలు కావాలన్న మీరే అనంతరం హోదా సంజీవని కాదన్నారు. తుచ్ఛ రాజకీయాలు చేసి చరిత్రలో చెడ్డ పాలకుడిగా మిగిలిపోవద్దని లేఖలో హితవు పలికారు.

ప్రత్యేక భోజనం.. ఫొటోల కోసం నిద్ర!

- దళిత తేజంలో టీడీపీ నేతల తీరు
- మంగళగిరిలో వెలుగులోకి..



దళితతేజంలో భోజనం చేస్తున్న నియోజకవర్గ నాయకులు (ఇన్‌సెట్‌లో) దాబా నుంచి తెప్పించుకున్న పార్శిళ్లు

తాడేపల్లిరూరల్(మంగళగిరి): తెలుగు దేశం పార్టీ ఆర్భాటంగా ప్రకటించిన 'దళిత తేజం'లో అందరూ కలసి సాధారణ భోజనాలు చేస్తున్న చోట ఆ పార్టీ నేతలు దాబాల నుంచి ప్రత్యేక పార్శిళ్లు తెప్పించుకుని తింటున్నారు. అలాగే దళితవాడల్లో నిద్ర చేయాల్సి ఉండగా ఫొటోలు తీసుకుని టీడీపీ కార్యాలయానికి పంపించి ఆ తంతు ముగిస్తున్నారు. దీనిపై అన్ని వర్గాల నుంచి విమర్శలు వస్తున్నాయి. దళితతేజం కార్యక్రమంలో వివక్షలు, అసమానతలు తరచూ వెలుగులోకి వస్తున్నాయి. తాజాగా రాష్ట్ర రాజధాని ప్రాంతంలోని మంగళగిరి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి గంజి చిరంజీవి దళితుల పట్ల అసమానతలు చూపడం చర్చనీయాంశంగా మారింది. ఇటీవల గంజి చిరంజీవి మూడు మండలాలు, 2 మున్సిపాలిటీల్లో పలుచోట్ల దళితతేజం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా దళితులతో సమావేశం నిర్వహించి, వారితో సహపంక్తి భోజనాలు చేసి, గ్రామ కచేరీల్లో నిద్రపోవాల్సి ఉంది. అయితే అధికార పార్టీ నేత చిరంజీవి దళితుల వద్ద భోజనం చేసే సమయంలో బయట దాబా నుంచి తీసుకొచ్చిన ఆహార పదార్థాలను తింటున్నారు. ఆయన వెంట ఉన్న మండల ఇన్‌చార్జిలు, పట్టణ ఇన్‌చార్జిలు కూడా అదే బాట పడుతున్నారు. స్థానిక యువకులందరూ సహపంక్తిగా కూర్చుని అందరికీ తయారు చేసిన భోజనాలు చేస్తుండగా, వారి మధ్యలోనే కూర్చున్న నియోజకవర్గ నేత, ఇతర నేతలు మాత్రం ప్రత్యేకంగా తెప్పించుకున్న పార్శిల్ భోజనాలు తింటుండటంతో స్థానిక దళిత యువకులు నిలదీసినట్లు తెలిసింది. ఈ విషయం సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా ప్రచారం కావడంతో టీడీపీ నాయకులు వెంటనే దళిత యువకులను బుజ్జగించినట్లు సమాచారం. ఇక దళితవాడల్లో టీడీపీ నాయకులు నిద్రపోవడం అనేది ఎక్కడా జరగట్లేదు. పేరుకు కమిటీ హాళ్లలో పడుకొని ఫొటోలు తీసుకుని టీడీపీ కార్యాలయానికి పంపించి మధ్యలోనే విరమిస్తున్నారు.

ఓట్ల తొలగింపులో టీడీపీ ఎమ్మెల్యే ప్రమేయం!

- శ్రీకాకుళం కలెక్టర్‌కు వైఎస్సార్ సీపీ నేతల ఫిర్యాదు
- సమగ్ర విచారణ జరపాలని ధర్మాన, తమ్మినేని డిమాండ్


కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు సీతారాం, ధర్మాన సోదరులు తదితరులు

సాక్షి ప్రతినిధి శ్రీకాకుళం: అధికార పార్టీ నేతల ప్రమేయంతో శ్రీకాకుళం జిల్లాలో ఓటర్ల జాబితా నుంచి లక్ష మందికి పైగా తొలగించిన ఘటనకు సంబంధించి వైఎస్సార్ సీపీ నేతలు బుధవారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. శ్రీకాకుళం నగరంలో లక్ష ఓటర్లు ఉండగా 28 వేల మంది పేర్లను జాబితాల నుంచి తప్పించారని కలెక్టర్ కె.ధనుంజయరెడ్డి దృష్టికి తెచ్చారు. జాబితా నుంచి మూడో వంతు ఓటర్ల గల్లంతు వ్యవహారంలో శ్రీకాకుళం టీడీపీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి ప్రమేయం ఉందని వైఎస్సార్ సీపీ రీజనల్ కోఆర్డినేటర్ ధర్మాన ప్రసాదరావు ఆధారాలు సమర్పించారు. జిల్లావ్యాప్తంగా లక్షకు పైగా ఓట్లను తొలగించారని చెప్పారు. స్థిరనివాసం ఉన్నవారివే కాకుండా రెండు మూడుసార్లు కౌన్సిలర్లుగా పనిచేసినవారి పేర్లను కూడా తొలగించారన్నారు. కుటుంబ సభ్యులతో సహా వైఎస్సార్‌సీపీ స్థానిక నేతల ఓటు హక్కును తొలగించారని కలెక్టరు దృష్టికి తెచ్చారు. వారికి తిరిగి ఓటుహక్కు కల్పించాలని డిమాండ్ చేశారు. ఓట్ల తొలగింపు వెనుక అధికార పార్టీ నాయకుల కుట్ర ఉందని వైఎస్సార్ సీపీ శ్రీకాకుళం పార్లమెంట్ జిల్లా అధ్యక్షుడు తమ్మినేని సీతారాం ఆరోపించారు. దీనిపై సమగ్ర దర్యాప్తునకు ఆదేశించాలని డిమాండ్ చేశారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యుడు ధర్మాన కృష్ణదాస్, పార్టీ టెక్కలి, పలాస నియోజకవర్గాల సమన్వయకర్తలు పేరాడ తిలక్, డాక్టర్ సీదిరి అప్పలరాజు, శ్రీకాకుళం మున్సిపాలిటీ మాజీ చైర్‌పర్సన్ ఎంవీ పద్మావతి తదితరులున్నారు.

భక్తజనవాహిని మధ్య శ్రీశైలేశుడి రథోత్సవం


అశేష భక్తజనం మధ్య సాగుతున్న శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జున స్వామి వార్ల రథోత్సవం


శ్రీకాళహస్తి రథోత్సవంలో ఊరేగుతున్న స్వామి,అమ్మవార్లు

శ్రీశైలం/శ్రీకాళహస్తి

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం సాయంత్రం శ్రీభ్రమరాంబ మల్లికార్జున స్వామివార్ల రథోత్సవం కనులపండువగా జరిగింది. ఈ ఉత్సవంలో లక్ష మందికి పైగా భక్తులు పాల్గొన్నట్లు అంచనా. పాతాళ గంగ స్నానం, ఉపవాస దీక్షతో శివస్వాములు ఇరుముడులను సమర్పించారు. కాగా, శ్రీశైలమహాక్షేత్రంలో ఈ నెల 6న ప్రారంభమైన బ్రహ్మోత్సవ యాగాలకు గురువారం పూర్ణాహుతితో ముగింపు పలుకుతారు. శుక్రవారం రాత్రి పుష్పోత్సవ, శయనోత్సవ, ఏకాంత సేవలతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని ఈవో భరత్‌గుప్త తెలిపారు.

శ్రీకాళహస్తిలో వైభవంగా రథోత్సవం

శ్రీకాళహస్తిలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో మాఘ బహుళ అమావాస్యను పురస్కరించుకుని బుధవారం ఆదిదేవుడైన బోళాశంకరుడు రథంపై పురవీధుల్లో విహరించారు. అమ్మవారు స్వామివారి వెనుకగా మరో రథంలో ఊరేగారు. 70 వేల మందికిపైగా భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారని అధికారులు అంటున్నారు. బుధవారం రాత్రి పట్టణంలోని నారదపుష్కరిణిలో తెప్పోత్సవం వేడుకగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో భ్రమరాంబతో పాటు వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు. గురువారం స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవం నిర్వహించనున్నారు.

హిందూయేతర ఉద్యోగులను తొలగిస్తారా?

- ఏళ్ల తరబడి సేవలందిస్తున్న వారిని ఇప్పుడు తొలగిస్తారా?
- పిటిషనర్ల తొలగింపుపై వచ్చే వారం వరకు ఎటువంటి ఉత్తర్వులొద్దు
- టీటీడీ ఈవోకు హైకోర్టు ఆదేశం

సాక్షి, హైదరాబాద్: హిందూయేతరుల పేరుతో తిరుమల, తిరుపతి దేవస్థానాలతోపాటు, ఆ దేవస్థానాల ఆర్థిక సాయంతో నడిచే దేవాలయాలు, ఆసుపత్రులు, ఇతర సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగులను తొలగించేందుకు వీలుగా షోకాజ్ నోటీసులు జారీ చేయడంపై హైకోర్టు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ఏళ్ల తరబడి పనిచేస్తున్న హిందూయేతరులు ఇప్పుడు మీకు గుర్తుకు వచ్చారా? ఇన్నేళ్లు సేవలు అందించిన వారిని ఇప్పుడు ఏదో ఓ కారణంతో ఉద్యోగాల నుంచి తీసేసి వారి కడుపు కొట్టడం ఎంతవరకు భావ్యమంటూ టీటీడీ ఈవోను ప్రశ్నించింది. ప్రస్తుత పరిస్థితుల్లో ఉద్యోగాల నుంచి వారిని తీసేస్తే, తిరిగి వారికి ఉద్యోగాలెలా దొరుకుతాయని ప్రశ్నించింది. ఉద్యోగ భర్తీ నోటిఫికేషన్‌లో హిందూయేతరులకు ఉద్యోగం లేదన్న విషయాన్ని పేర్కొనని అప్పటి టీటీడీ ఈవో, ఇతర ఉద్యోగులపై ముందు చర్యలు తీసుకుని, ఆ తరువాత పిటిషనర్ల గురించి ఆలోచన చేయాలని ఘాటుగా వ్యాఖ్యానించింది. పిటిషనర్ల తొలగింపు విషయంలో వచ్చేవారం వరకు ఎటువంటి ఉత్తర్వులు జారీ చేయడానికి వీల్లేదని టీటీడీ ఈవోను ఆదేశించింది. ఈ వ్యవహారానికి సంబంధించి పూర్తి వివరాలను తమ ముందుంచాలని టీటీడీ ఈవోను ఆదేశిస్తూ విచారణను వచ్చే ఈ నెల 19కి వాయిదా వేసింది. ఈ మేరకు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి (ఏసీజే) జస్టిస్ రమేశ్ రంగనాథన్, న్యాయమూర్తి జస్టిస్ కొంగర విజయలక్ష్మిలతో కూడిన ధర్మాసనం ఉత్తర్వులు జారీ చేసింది. టీటీడీ పరిధిలో హిందూయేతరులను ఏ పోస్టుల్లోనూ నియమించడానికి వీల్లేదంటున్న టీటీడీ ఉద్యోగుల సర్వీసు నిబంధనల్లో రూల్ 9(6)ను రాజ్యాంగ విరుద్ధంగా ప్రకటించడంతో పాటు, తమకు జారీ చేసిన షోకాజ్ నోటీసులను రద్దు చేయాలని కోరుతూ టీటీడీ పరిధిలో వివిధ పోస్టుల్లో పనిచేస్తున్న 36 మంది క్రిస్టియన్, ముస్లిం ఉద్యోగులు ఈ పిటిషన్‌ను దాఖలు చేయడం తెలిసిందే.

వారేం దాచిపెట్టలేదుగా?

పిటిషనర్ల తరఫు న్యాయవాది జె.సుధీర్ వాదనలు వినిపిస్తూ... పిటిషనర్లు 1998 నుంచి 2004 మధ్య కాలంలో వివిధ పోస్టుల్లో నియమితులయ్యారని తెలిపారు. కేవలం బయటి శక్తుల ఒత్తిడి వల్ల టీటీడీ ఇప్పుడు హిందూయేతర ఉద్యోగుల అంశాన్ని తెరపైకి తీసుకొచ్చిందన్నారు. ఈ వ్యవహారంపై పూర్తి వివరాలు సమర్పించేందుకు గడువు కావాలని టీటీడీ తరఫు న్యాయవాది బాలాజీ వదేరా కోరారు. ఇందుకు ధర్మాసనం అంగీకరిస్తూ... టీటీడీ చర్యలను తప్పుపట్టింది. పిటిషనర్లు వాస్తవాలను దాచిపెట్టి ఉద్యోగంలో చేరలేదని గుర్తు చేసింది. హిందూయేతరులకు సంబంధించిన రూల్‌పై పూర్తి స్థాయిలో విచారణ జరుపుతామంది.

జగన్ ఆదేశిస్తే పదవికి రాజీనామా

సాలూరు ఎమ్మెల్యే పీడిక రాజన్నదొర


మాట్లాడుతున్న రాజన్నదొర తదితరులు

సాలూరు: రాష్ట్ర విభజన నాటి నుంచి ప్రత్యేక హోదా కోసం వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అలుపెరుగని పోరాటం చేస్తుంటే, టీడీపీ నేతలు సహకరించకపోగా ఇప్పుడు విమర్శలకు దిగడం వారి బాధ్యతారాహిత్యాన్ని తెలియజేస్తోందని విజయనగరం జిల్లా సాలూరు ఎమ్మెల్యే పీడిక రాజన్నదొర అన్నారు. సాలూరులో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రత్యేక హోదా కోసం గల్లీ నుంచి ఢిల్లీ వరకు పోరాడింది జగన్ అనే విషయం అందరికీ తెలిసిందేనన్నారు. ఆయన దీక్షలను కూడా అడ్డుకున్నది టీడీపీ ప్రభుత్వం కాదా అని ప్రశ్నించారు. విభజనతో తీవ్రంగా నష్టపోయిన రాష్ట్ర ప్రజల కోసం, రాష్ట్ర అభివృద్ధి కోసం పదవులను త్యాగం చేసేందుకు తాము సిద్ధమేనని ఆనాడే జగన్ ప్రకటించారన్నారు. ప్రత్యేక హోదా సాధనకోసం జగన్ ఆదేశిస్తే తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసేందుకు సిద్ధమేనని రాజన్నదొర ప్రకటించారు. దొంగనాటకాలాడుతున్న టీడీపీ నేతలకు చిత్తశుద్ధి వుంటే పదవులకు రాజీనామా చేయగలరా అని సవాల్ చేశారు. సమావేశంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు సూరిబాబు, పాచిపెంట మండల అధ్యక్షుడు ముత్యాలునాయుడు తదితరులు పాల్గొన్నారు.

కడపలో కానిస్టేబుల్ ఆత్మహత్య


ఆత్మహత్యకు పాల్పడ్డ బాలరంగయ్య

కడప అర్బన్: వైఎస్సార్ జిల్లా రైల్వేకోడూరు పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పని చేస్తున్న ఎ బాలరంగయ్య (42) మంగళవారం రాత్రి కడపలోని తన సోదరుడు శ్రీనివాసులు ఇంటిలో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుని తల్లి రంగమ్మ, కుటుంబసభ్యులు, పోలీసు వర్గాల కథనం మేరకుబాలరంగయ్యకు వివాహం కాకపోవడంతో ఈ విషయమై తీవ్ర మనస్తాపానికి గురయ్యేవాడు. అంతేగాక వృత్తిపరంగా ప్రమోషన్ లేకపోవడం, కొందరు అధికారుల వేధింపులతో ఇబ్బందులు పడేవాడని సమాచారం. రెండు రోజుల క్రితం తీవ్ర మనస్తాపానికి గురైన బాలరంగయ్య మన్నూరు పోలీస్‌స్టేషన్‌లో బాత్‌రూంలోకి వెళ్లి రాయికి తల బాదుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. తీవ్రంగా గాయపడిన అతనికి చికిత్స చేయించిన పోలీసులు సోదరుడు శ్రీనివాసులును కడప నుంచి పిలిపించారు. ఆయన బాలరంగయ్యను తిరుపతికి తీసుకెళ్లి చికిత్స చేయించాడు. ఈనెల 13 సాయంత్రం తనతో పాటు కడపకు తీసుకొచ్చాడు. రాత్రి భోజనం అనంతరం బెడ్‌రూంలోకి వెళ్లిన బాలరంగయ్య అరగంట తరువాత చూసేసరికి ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

2,500 ఎకరాలిస్తే కాగిత పరిశ్రమ

- తీర ప్రాంతంలో భూమి కోరిన ఆసియా పల్ప్ అండ్ పేపర్
- సీఎం చంద్రబాబుతో సంస్థ ప్రతినిధులు సమావేశం


సచివాలయంలో పల్ప్, పేపర్ కంపెనీ అధికారులతో సమీక్షిస్తున్న సీఎం చంద్రబాబు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని తీరప్రాంతంలో 2,500 ఎకరాల భూమిని కేటాయిస్తే కాగిత పరిశ్రమ నెలకొల్పుతామని ఆసియా పల్ప్ అండ్ పేపర్ (ఏపీపీ) ప్రతిపాదించింది. ఏపీపీ ప్రతినిధులు బుధవారం సచివాలయంలో సీఎం చంద్రబాబుతో సమావేశమయ్యారు. పెద్దఎత్తున ముడి పదార్థాల దిగుమతి, చైనా మార్కెట్ తదితర అంశాలను దృష్టిలో పెట్టుకుని తూర్పు తీరంలో ఉన్న ఆంధ్రప్రదేశ్‌లో కాగిత పరిశ్రమ ఏర్పాటు చేయాలని భావిస్తున్నట్లు చెప్పారు. నౌకా తీరానికి సమీపంలో 2,500 ఎకరాల భూమి కేటాయించాలని కోరారు. రెండున్నరేళ్లలో ఉత్పత్తి ప్రారంభించి రోజుకు సరాసరి 4 వేల మెట్రిక్ టన్నుల ఉత్పత్తి సామర్థ్యంతో పరిశ్రమ నెలకొల్పుతామన్నారు. ఇందులో నాలుగో వంతు దేశీయ విపణికే కేటాయిస్తామని చెప్పారు. కాకినాడ, మచిలీపట్నం, కృష్ణపట్నం పోర్టు పరిసర ప్రాంతాలను పరిశీలించాలని ముఖ్యమంత్రి వారికి సూచించారు.

ఏడాది యథాతథంగా సిమెంట్ సరఫరా

ప్రభుత్వం చేపడుతున్న వివిధ నిర్మాణ పనుల కోసం ప్రస్తుతం అందిస్తున్న ధరలకే మరో ఏడాది పాటు సిమెంట్ సరఫరా చేయాలని సీఎం చంద్రబాబు కోరారు. బుధవారం సచివాలయంలో వివిధ సిమెంట్ కంపెనీల ప్రతినిధులతో ఆయన సమావేశమయ్యారు. ప్రస్తుత ధరలకే సిమెంటు సరఫరా చేసేందుకు వారు అంగీకరించారు. పోలవరం ప్రాజెక్టుకు సరఫరా చేసే సిమెంట్ ధర కొంత తగ్గించాలని సీఎం కోరారు. మరోవైపు ఈనెల 22న జరిగే ఫ్రేమ్‌వర్క్ అమర్చే పనులను ప్రారంభించాల్సిందిగా ప్రముఖ కార్ల తయారీ సంస్థ కియా మోటార్స్ ఎండీ కూఖ్యున్ షిమ్ ముఖ్యమంత్రిని ఆహ్వానించారు.

రాజధాని పనులు డ్రోన్లతో పర్యవేక్షిస్తా: సీఎం

రాజధాని నిర్మాణ పనులను డ్రోన్లతో పర్యవేక్షిస్తానని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చెప్పారు. ఏపీ డ్రోన్ కార్పొరేషన్ సహకారంతో డ్రోన్లతో తీసిన చిత్రాలను 15 రోజులకోసారి తనకు చూపాలని ఆదేశించారు. సీఆర్‌డీఏ, ఏడీసీ అధికారులతో సీఎం సమావేశమై రాజధాని వ్యవహారాలను సమీక్షించారు. గృహ నిర్మాణం, రహదారులు, ఇతర మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు సకాలంలో పూర్తి కావాలని ఆదేశించారు.

నగదు కొరత నివారణకు 5 వేల కోట్లు పంపాలి

నగదు కొరతను నివారించేందుకు ఆంధ్రప్రదేశ్‌కు వెంటనే రూ.5 వేల కోట్ల కరెన్సీ పంపాలని కోరుతూ సీఎం చంద్రబాబు కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీకి లేఖ రాశారు. ఆర్బీఐ గవర్నర్, ప్రాంతీయ గవర్నర్లకు కూడా సీఎం లేఖలు రాశారు. ప్రస్తుతం ఏపీలో నగదుకు కొరత ఏర్పడిందని, ఏటీఎంలలో డబ్బులు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ధాన్యం విక్రయించినా డబ్బులు తీసుకోలేక రైతులు అవస్థ పడుతున్నారన్నారు.



దక్షిణాఫ్రికా పేసర్ రబడకు జరిమానా

భారత్‌తో జరిగిన ఐదో వన్డేలో అనుచిత ప్రవర్తనకుగాను దక్షిణాఫ్రికా పేసర్ కగిసో రబడకు మ్యాచ్ ఫీజులో 15 శాతం కోత పడింది. దీంతో పాటు ఒక డీ మెరిట్ పాయింట్ కూడా లభించింది. మంగళవారం జరిగిన మ్యాచ్‌లో భారత ఓపెనర్ శిఖర్ ధావన్ ఔటైన అనంతరం రబడ దురుసుగా ప్రవర్తించాడు. దీంతో 'నియమావళిలోని 2.1.7 నిబంధన ప్రకారం రబడ తప్పు చేసినట్లు నిర్ధారణ కావడంతో అతని మ్యాచ్ ఫీజులో 15 శాతం కోత విధించడంతో పాటు ఒక డీ మెరిట్ పాయింట్ కేటాయించాం' అని ఐసీసీ ప్రకటించింది.

చేయి చేయి కలిపి...

సమష్టి ఆటతో 'సఫారీ'ని జయించిన టీమిండియా

- బ్యాటింగ్‌లో కోహ్లి, ధావన్ నిలకడ
- కుల్దీప్, చహల్ మణికట్టు మాయాజాలం
- కీలక తరుణంలో రోహిత్, పాండ్యా రాణింపు

గత ఆరు పర్యటనలలో ఐదే విజయాలు.
నాలుగు ద్వైపాక్షిక సిరీస్‌లలో గెలిచింది కేవలం నాలుగింటిలోనే...
రెండు ముక్కోణపు వన్డే టోర్నీల్లోని 8 మ్యాచ్‌ల్లో ఒక్క గెలుపుతో సరి...
కానీ ఈసారి ఒక్క సిరీస్‌లోనే నాలుగు విజయాలు!
అన్నీ అద్వితీయమైనవే. సంపూర్ణ ఆధిపత్యంతో సాధించినవే!
చివరి ఆరు మ్యాచ్‌ల్లో (టెస్టు సహా) ఒక్కటే ఓటమి!
అది కూడా వాతావరణ పరిస్థితుల ప్రభావంతో!



కోహ్లి

కుల్దీప్



చహల్



ధావన్

సఫారీ గడ్డపై వన్డేల్లో టీమిండియా జోరును వర్ణించేందుకు ఇంతకుమించిన గణాంకాలు ఇంకేమీ ఉండవు. అంతకుముందు రెండు టెస్టులు ఓడి, మూడో టెస్టులో పోరాడి గెలిచినా... వన్డేలకు వచ్చేసరికి మన జట్టుపై పెద్దగా ఆశల్లేవు. పరిమిత ఓవర్ల క్రికెట్‌లో స్వదేశంలో దక్షిణాఫ్రికాను ఓడించడం అంత తేలికేం కాదనేది అభిమానుల అంచనా. సిరీస్ గెలవడం కాదు కాని, భారీ తేడాతో ఓడిపోకుంటే చాలని భావించారు. కానీ అంతా తారుమారైంది. భారత్ దూసుకెళ్తుంటే... ప్రొటీస్ 'ఒక్క గెలుపు' కోసమే కిందామీద పడింది. తొలుత బౌలింగ్‌కు దిగితే ప్రత్యర్థిని కట్టడి చేసి... లక్ష్యాన్ని అవలీలగా ఛేదించడం, అదే బ్యాటింగ్ చేస్తే భారీ స్కోరు సాధించి, ఆనక ప్రత్యర్థిని చుట్టేయడం... ఇలా కోహ్లి సేన జైత్రయాత్ర ఓ పద్ధతిగా సాగిపోతోంది. చూసేందుకు జట్టుగా 11 మంది కనిపిస్తున్నా.. ఈ విజయాల్లో నలుగురు ఆటగాళ్లే నాలుగు మూల స్తంభాలుగా నిలిచారు. వారే ఓపెనర్ శిఖర్ ధావన్, కెప్టెన్ విరాట్ కోహ్లి, మణికట్టు స్పిన్నర్లు చహల్, కుల్దీప్.

బ్యాట్‌తో వారు...

34, 93, 140, 158... ఇవీ తొలి నాలుగు వన్డేల్లో రెండో వికెట్‌కు ధావన్, కోహ్లి భాగస్వామ్యాలు. సాధికారికంగా ఆడుతూ మ్యాచ్ మ్యాచ్‌కు ఈ జంట పాతుకుపోగా వారు జత చేస్తున్న పరుగులు అలాగే పెరుగుతూ వెళ్లాయి. మరో ఓపెనర్, వైస్ కెప్టెన్ రోహిత్ శర్మ త్వరగా అవుటవుతుండటంతో తమపై పడిన భారాన్ని వీరిద్దరూ సమర్థంగా మోశారు. అయిదు మ్యాచ్‌ల్లో జట్టు మొత్తం పరుగుల్లో వీరివే 58 శాతం కావడమే దీనికి నిదర్శనం. కోహ్లి నిలకడ ఎప్పుడూ ఉండేదే. అయితే... ఈ సిరీస్‌లో ధావన్ ఆట కెప్టెన్‌కు దీటుగా సాగుతోంది. చక్కటి ఆత్మవిశ్వాసంతో షాట్లు కొడుతూ మొదటి మ్యాచ్ నుంచి మంచి టచ్‌లో కనిపిస్తున్న అతడు 76.25 సగటుతో ఇప్పటివరకు 305 పరుగులు చేశాడు. నాలుగో వన్డేలో అతడి శతకమైతే పాత ధావన్‌ను గుర్తుచేసింది. వైఫల్యమన్నదే లేకుండా సాగుతోన్న విరాట్ కోహ్లి 143 సగటుతో 429 పరుగులు చేశాడు. జట్టు మొత్తం పరుగుల్లో ఇతడివి 34 శాతం ఉండటం విశేషం.

బంతితో వీరు...

వర్షం కారణంగా ఓవర్లు కుదించిన నాలుగో వన్డేలో తడబడటాన్ని మినహాయిస్తే చహల్ (14 వికెట్లు), కుల్దీప్ (16 వికెట్లు) ప్రదర్శన అత్యున్నత స్థాయిలో సాగుతోంది. బుమ్రా... తొలి వికెట్ తీసి బ్రేక్ ఇస్తుండగా మిగతావారి సంగతిని స్పిన్నర్లు చూసుకుంటున్నారు. గత మ్యాచ్ చేదు అనుభవాన్ని చెరిపేస్తూ పోర్ట్ ఎలిజబెత్‌లో చహల్ మళ్లీ గాడిన పడ్డాడు. గంటకు 85 కి.మీ. వేగం దాటని స్లో స్పిన్‌తో ఈ ద్వయం తమ ఓవర్ల కోటాను పూర్తి చేస్తుండటంతో ప్రొటీస్‌కు అదనపు పరుగుల లబ్ధి కూడా దక్కడం లేదు. ప్రత్యర్థికి కొరకరాని కొయ్యలుగా మారిన వీరు అయిదు వన్డేల్లో 30 వికెట్లు నేలకూల్చారు. అసలే గాయాలతో కీలక బ్యాట్స్‌మెన్ దూరమైన సఫారీలకు ఈ ఇద్దరిని ఎదుర్కోవడం తలకుమించిన భారమే అవుతోంది. ఈ సిరీస్‌లో మన జట్టు బౌలింగ్‌లో మరో సానుకూలాంశం అదనపు పరుగుల కట్టడి. తొలి వన్డేలో 17 ఎక్స్‌ట్రాలు ఇచ్చిన బౌలర్లు తర్వాతి మ్యాచ్‌ల్లో 1, 4, 11, 8 పరుగులు మాత్రమే ఇచ్చి క్రమశిక్షణ చాటుకున్నారు.

విలువ చాటిన రోహిత్... ఉనికి నిలబెట్టుకున్న పాండ్యా

దక్షిణాఫ్రికా పర్యటనలో ఆటతో కాకుండా తుది జట్టులో చోటు, వైఫల్యాలతో ఎక్కువగా విమర్శలపాలయ్యాడు రోహిత్‌శర్మ. వైస్ కెప్టెన్ పూర్తిగా నిరాశపరిచాడు. వన్డేల్లో ఇక్కడ కనీసం అర్ధ సెంచరీ కూడా సాధించని అతడు... అయిదో వన్డేలో ఏకంగా శతకం బాది సిరీస్ విజయాన్ని అందించాడు. తడబడుతూనే అయినా కఠిన పరీక్షలాంటి సమయంలో చేసిన ఈ సెంచరీ రోహిత్‌లో ఆత్మవిశ్వాసం పెంపొందించి ఉంటుందనడంలో సందేహం లేదు. ఇక పోర్ట్ ఎలిజబెత్‌లో కీలక దశలో డుమిని, డివిలియర్స్ వంటి ప్రమాదకర ఆటగాళ్లను త్వరగా అవుట్ చేసి బంతితో, బ్యాట్‌తో తన సత్తాపై రేకెత్తుతున్న అనుమానాలను పేస్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా పటాపంచలు చేశాడు. అంతేగాక... విజయానికి అడ్డుగోడలా మారిన ఆమ్లాను రనౌట్ చేసి ఆటనే మలుపుతిప్పాడు.

రోహిత్, పాండ్యా

మిగతా వారి సహాయ పాత్ర

ధోని, రహానే, అయ్యర్, భువనేశ్వర్... జట్టు గెలుపులో పూర్తిస్థాయిలో భాగస్వాములు కానిది వీరే. రెండు, మూడు అవకాశాలే వచ్చినా సద్వినియోగం చేసుకోలేకపోయారు. అయ్యర్‌ను కొత్తవాడని వదిలేసినా... ధోని, రహానే ఒక్క మంచి ఇన్నింగ్స్‌కే పరిమితమయ్యారు. మోస్తరుగా ఆడుతున్న భువీ పరుగులను కట్టడి చేయాల్సిన అవసరం ఉంది. వీరు కూడా రాణిస్తే ఆరో వన్డేలోనూ భారత్ జయభేరి మోగించడం ఖాయం. తద్వారా విదేశాల్లో 5–1 తేడాతో వన్డే సిరీస్ గెల్చుకున్న జట్టుగానూ చరిత్రకెక్కుతుంది.

అక్కడ సర్దుకుంటే...

ఇంగ్లండ్ ఆతిథ్యం ఇవ్వనున్న 2019 ప్రపంచకప్‌నకు ఏడాదిన్నర సమయం కూడా లేదు. కోహ్లి అంచనా ప్రకారం దాదాపు ఇదే జట్టు ప్రపంచకప్ బరిలో దిగుతుంది. పేస్, స్పిన్ విభాగంలో ఎవరెవరు ఉంటారో తేలిపోయింది. బ్యాటింగ్‌లో మిడిలార్డర్‌పైనే ఆందోళనంతా. అందుకని మనీశ్ పాండే, రహానే, జాదవ్, అయ్యర్‌లలో 4, 5 స్థానాలకు సమర్థులెవరో ఇప్పుడే తేల్చుకోవాలి. వారికి మరిన్ని అవకాశాలిచ్చి కుదురుకునేలా చూడాలి. దీంతో జట్టు దుర్భేద్యంగా మారుతుంది.

– సాక్షి క్రీడావిభాగం

37 సారథిగా మొదటి 48 వన్డేల్లో కోహ్లి సాధించిన విజయాలు. క్లైవ్ లాయిడ్, హాన్సీ క్రానే, రికీ పాంటింగ్‌ల రికార్డును కోహ్లి సమం చేశాడు.

శ్రీమతికి... ప్రేమికుల రోజు కానుక

ఐదో వన్డేలో సెంచరీపై రోహిత్



పోర్ట్ ఎలిజబెత్: భారత ఓపెనర్ రోహిత్ శర్మ ఐదో వన్డేలో సాధించిన సెంచరీని తన శ్రీమతి రితిక సజ్దేకు ప్రేమికుల రోజు కానుకగా ఇస్తున్నట్లు చెప్పాడు. అతని శతకంతో మరో మ్యాచ్ మిగిలుండగానే భారత్ 4–1తో సిరీస్‌ను కైవసం చేసుకున్న సంగతి తెలిసిందే. దీనిపై రోహిత్ మాట్లాడుతూ 'విదేశీ గడ్డపై వన్డేల్లో మాకు ఇదే అతిపెద్ద సిరీస్ విజయం. ఈ ద్వైపాక్షిక సిరీస్‌లో మేం అద్భుతంగా ఆడాం. ఇంతకుముందు ఆస్ట్రేలియాలో (2007–08) కామన్వెల్త్ బ్యాంక్ సిరీస్ గెలిచాం. అది కూడా క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొనే సాధించాం. ఈ రెండు విజయాల్ని పోల్చలేం. అయితే ఈ వన్డే సిరీస్ గెలుపు మాకు చాలా ముఖ్యమైంది. తొలి వన్డే నుంచే మా ఆధిపత్యాన్ని మొదలుపెట్టాం. ఇప్పుడు విజయంతో సంతోషంగా ఉన్నాం. 25 ఏళ్ల తర్వాత సఫారీ గడ్డపై సిరీస్ గెలవడంలో కుర్రాళ్ల పాత్ర ఎంతో ఉంది. అందరూ కఠిన సవాళ్లకు సిద్ధమయ్యారు. సమష్టిగా చెమటోడ్చి ఫలితం సాధించారు' అని అన్నాడు. టెస్టు సిరీస్ ఓడినప్పటికీ ఏకపక్షంగా ముగియలేదని... ఆతిథ్య జట్టును దీటుగా ఎదుర్కొన్నామని చెప్పాడు.

మా లక్ష్యం 5-1

చరిత్ర సృష్టించిన ఈ విజయం మా జట్టు సమష్టి ప్రదర్శన. దక్షిణాఫ్రికా సిరీస్ కోల్పోయే ఒత్తిడిలో ఉందని గ్రహించాం. సిరీస్‌లో 4–1తో నిలవడం గొప్పగా అనిపిస్తోంది. కానీ మేం 5–1తో ముగించాలని అనుకుంటున్నాం. ఇంకా ఎక్కడ లోపాలున్నాయో చర్చించుకుంటాం. వచ్చే మ్యాచ్‌లో కొందరికి అవకాశం ఇద్దామని ఆలోచిస్తున్నాం. అయినా అంతిమ లక్ష్యం విజయమే. మూడో టెస్టు నుంచి మాకు మంచి సమయం నడుస్తోంది.

-భారత కెప్టెన్ కోహ్లి

ముంబై-చెన్నై పోరుతో ఐపీఎల్ షురూ

- ఏప్రిల్ 7 నుంచి మే 27 వరకు లీగ్
- 9న రాజస్తాన్‌తో సన్‌రైజర్స్ తొలి మ్యాచ్



ముంబై: డిఫెండింగ్ చాంపియన్ ముంబై ఇండియన్స్, చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్‌కే)ల మధ్య జరిగే తొలి పోరుతో ఈ సీజన్ ఐపీఎల్‌కు తెరలేవనుంది. ఏప్రిల్ 7న వాంఖెడే స్టేడియంలో ఈ మ్యాచ్ జరుగుతుంది. రెండేళ్ల నిషేధం తర్వాత బరిలోకి దిగుతున్న సీఎస్‌కే సీజన్ తొలి మ్యాచ్‌తోనే పోరాటానికి సిద్ధమవుతోంది. సీఎస్‌కేలాగే మళ్లీ వచ్చిన రాజస్తాన్ రాయల్స్ తమ తొలి పోరులో సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో తలపడుతుంది. ఉప్పల్ రాజీవ్‌గాంధీ స్టేడియంలో ఏప్రిల్ 9న ఈ మ్యాచ్ జరుగుతుంది. అనంతరం హైదరాబాద్‌లో 12న ముంబై ఇండియన్స్‌తో, 22న చెన్నైతో, 26న కింగ్స్ ఎలెవన్ పంజాబ్‌తో, మే 5న ఢిల్లీ డేర్‌డెవిల్స్‌తో, 7న రాయల్ చాలెంజర్స్ బెంగళూరుతో, 19న కోల్‌కతా నైట్‌రైడర్స్‌తో సన్‌రైజర్స్ మ్యాచ్‌లు జరుగుతాయి. పంజాబ్ మాత్రం తమ హోమ్ మ్యాచ్‌ల్లో మూడింటిని ఇండోర్‌లో, మిగతా నాలుగు మ్యాచ్‌ల్ని మొహాలీలో ఆడనుంది. 22న తొలి క్వాలిఫయర్ మ్యాచ్‌తో పాటు 27న టైటిల్ పోరు కూడా వాంఖెడేలోనే జరుగుతాయి. అయితే మ్యాచ్‌ల టైమింగ్‌లో ఏ మార్పూ లేదు. గతంలో మాదిరిగానే ఒక మ్యాచ్ ఉంటే రాత్రి 8 గంటలకు, రెండు మ్యాచ్‌లుంటే మొదటి మ్యాచ్ సాయంత్రం 4 గంటలకు మొదలవుతాయి.

కిమ్ జాంగ్ చిందులు!

వేసింది ఆయన కాదు డూప్



ప్యాంగ్‌చాంగ్: కిమ్ జాంగ్ అంటే తెలియని వారు తక్కువే. ఉత్తర కొరియా నియంత మరి ఆయనేంటి? ఈ చిందులేంటని ఆశ్చర్యపోకండి. కాస్త ఈ వివరాల్లోకి వెళ్లండి... నిత్యనూతన క్షిపణి పరీక్షలతో ఎప్పుడు వార్తల్లో నిలిచే ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్. అగ్రరాజ్యం అమెరికాకు కొరకరాని కొయ్య. తాజాగా దక్షిణ కొరియాలో జరుగుతున్న వింటర్ ఒలింపిక్స్‌లో అచ్చు కిమ్ జాంగ్‌ను పోలిన వ్యక్తి కనువిందు చేశారు. తమ కొరియా చీర్ లీడర్ల బృందం ముందు డ్యాన్స్ చేశారు. నలుపు సూటు, బూటులో నల్లని కళ్లజోడు ధరించి సాక్షాత్తు కిమ్‌నే తలపించిన ఆయన ఉన్నపళంగా ఉమ్మడి కొరియా, జపాన్ జట్ల మధ్య ఐస్ హాకీ మ్యాచ్ జరుగుతుండగా వచ్చి చిందులేసి ఆశ్చర్యపరిచారు. వెంటనే అక్కడే ఉన్న భద్రతా సిబ్బంది ఆయన్ని అదుపులోకి తీసుకుంది. ఆయన పేరు హోవర్డ్. నిజానికి కిమ్‌లా ఉన్న హోవర్డ్, ట్రంప్‌ను అచ్చుగుద్దినట్లు ఉండే డెనిస్ అలన్ ఇద్దరు కలిసి స్టేడియంలోని ప్రేక్షకుల్ని ఆశ్చర్యపరచాలనుకున్నట్లు కిమ్ డూపు... హోవర్డ్ తెలిపారు. పోలీసులు తనను అరెస్టు చేయలేదని కేవలం బయటికి లాక్కెళ్లినట్లు చెప్పారు. అయితే ఈ తతంగం జరుగుతుండగా వీఐపీ గ్యాలరీలో కిమ్ సొంత చెల్లి కిమ్ యో జాంగ్, అమెరికా ఉపాధ్యక్షుడు మైక్ పెన్స్ ఉన్నారు.

వారం పేరు తప్పేసి... అచ్చేశారు

కామన్వెల్త్ ప్రారంభోత్సవ టికెట్లలో అచ్చుతప్పులు



సిడ్నీ: ఈ ఏడాది కామన్వెల్త్ గేమ్స్‌కు ఆతిథ్యమిచ్చేందుకు ఆస్ట్రేలియాలోని గోల్డ్ కోస్ట్ నగరం ముస్తాబైంది. అయితే ప్రారంభోత్సవ టికెట్లను అచ్చుతప్పులతో ముద్రించి నిర్వాహకులు అభాసుపాలయ్యారు. ఈ ప్రతిష్టాత్మక ఈవెంట్ మొదలవుతున్న రోజు బుధవారమైతే గురువారం అని ముద్రించడం విమర్శలపాలైంది. ఏప్రిల్ 4న నిర్వహించ తలపెట్టిన ప్రారంభ వేడుకల్ని గురువారం అని 14 వేల టికెట్లలో ముద్రించారు. నిజానికి ఏప్రిల్ 4 బుధవారం. తప్పుదొర్లిన మాట నిజమేనని అంగీకరించిన నిర్వాహకులు తిరిగి సరిదిద్దుకొని ముద్రించే ఆలోచనేదీ లేదని స్పష్టం చేశారు. 'అంతా సవ్యంగానే సాగుతున్న దశలో తప్పుగా టికెట్లు అచ్చువేయడం నిరాశపరిచింది. ప్రింటింగ్ సంస్థ ఇలాంటి తప్పు చేసి ఉండాల్సింది కాదు. ఒకటికి రెండుసార్లు సరిచూసుకోవాల్సింది. అయితే ఇప్పటికే ఏప్రిల్ 4వ తేదీ ప్రారంభోత్సవమని పాకిపోయింది. మళ్లీ బుధవారమని ముద్రించాల్సిన అవసరం లేదు. ఈ టికెట్లే చెల్లుబాటవుతాయి ' అని గేమ్స్ చీఫ్ పీటర్స్ మీడియాతో అన్నారు.

ఫైనల్లో శ్యామ్



జకార్తా: ఆసియా క్రీడల టెస్ట్ ఈవెంట్ బాక్సింగ్ టోర్నమెంట్‌లో భారత్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న ఆంధ్రప్రదేశ్ బాక్సర్ కాకర శ్యామ్ కుమార్ ఫైనల్‌కు చేరాడు. ఇండోనేసియా రాజధాని జకార్తాలో బుధవారం జరిగిన పురుషుల 49 కేజీల విభాగం సెమీ ఫైనల్లో మొహమ్మద్ ఫాద్ రెడ్జూన్ (మలేసియా) నుంచి వాకోవర్ లభించడంతో శ్యామ్ కుమార్ ఫైనల్ చేరాడు. తుది పోరులో అతను ఇండోనేసియాకు చెందిన మారియో బ్లాసాస్‌తో తలపడనున్నాడు. ఈ టోర్నీలో భారత్ నుంచి శ్యామ్‌తో పాటు శశి చోప్రా, పవిత్ర, కౌశిక్, షేక్ సల్మాన్ అన్వర్, ఆశిష్ ఫైనల్‌కు అర్హత సాధించారు. రీతు, మొహమ్మద్ ఇతాశ్ ఖాన్, పవన్ కుమార్, ఆశిష్ కుమార్‌లు సెమీస్‌లో ఓడి కాంస్యాలతో సరిపెట్టుకున్నారు.

భారత్ టాప్ ర్యాంక్ సుస్థిరం

దుబాయ్: దక్షిణాఫ్రికాతో జరుగుతోన్న వన్డే సిరీస్‌ను 4–1తో సొంతం చేసుకున్న భారత్ అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ ప్రకటించిన వన్డే తాజా ర్యాంకింగ్స్‌లో అగ్ర స్థానాన్ని పటిష్టం చేసుకుంది. మంగళవారం జరిగిన ఐదో వన్డేలో విజయం సాధించిన భారత్ 122 ర్యాంకింగ్ పాయింట్లతో తొలి స్థానంలో ఉంది. ఈ సిరీస్‌కు ముందు 119 పాయింట్లతో రెండో ర్యాంకులో ఉన్న టీమిండియా నాలుగు వన్డేల్లో విజయాలు సాధించి అగ్రస్థానానికి చేరుకుంది. సిరీస్‌లోని చివరి వన్డేలో కోహ్లి సేన ఓటమి పాలైనా 121 పాయింట్లతో అగ్రస్థానంలోనే కొనసాగుతుంది. మరోవైపు జింబాబ్వేతో జరుగుతున్న వన్డే సిరీస్‌లో జోరుమీదున్న అఫ్గానిస్తాన్ తొలిసారి టాప్–10లో చోటు దక్కించుకుంది.

ఆసియా క్రీడల విజేతలకు 'టోక్యో' బెర్త్

న్యూఢిల్లీ: ఆసియా క్రీడల్లో టెన్నిస్ విభాగంలో పురుషుల, మహిళల సింగిల్స్ విజేతలకు 2020 టోక్యో ఒలింపిక్స్‌లో నేరుగా ప్రవేశం కల్పిస్తామని అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య (ఐటీఎఫ్) ప్రకటించింది. ఈ ఏడాది ఆగస్టు 18 నుంచి సెప్టెంబరు 2 వరకు జరిగే ఆసియా క్రీడలకు జకార్తా నగరం ఆతిథ్యం ఇస్తుంది. మిగిలిన ఖండాల్లో నుంచి కూడా ఇదే రీతిన క్రీడాకారులను ఎంపిక చేస్తామని ఐటీఎఫ్ పేర్కొంది.

అటు ఆంధ్ర... ఇటు హైదరాబాద్

'టాప్' లేపిన రెండు జట్లు • విజయ్ హజారే టోర్నీలో క్వార్టర్స్‌కు
ఈ నెల 21 నుంచి న్యూఢిల్లీలో నాకౌట్ మ్యాచ్‌లు



ఆంధ్ర జట్టు



హైదరాబాద్ జట్టు

సాక్షి, హైదరాబాద్: మరోసారి సమష్టి ఆటతీరుతో అదరగొట్టిన ఆంధ్ర, హైదరాబాద్ జట్లు విజయ్ హజారే ట్రోఫీ దేశవాళీ వన్డే టోర్నమెంట్‌లో క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లాయి. గ్రూప్ 'సి'లో ఆంధ్ర జట్టు ఆడిన ఆరు లీగ్ మ్యాచ్‌ల్లోనూ గెలుపొంది 24 పాయింట్లతో 'టాపర్'గా నిలువడం విశేషం. గ్రూప్ 'డి'లో హైదరాబాద్ ఐదు విజయాలు సాధించి 20 పాయింట్లతో అగ్రస్థానాన్ని సంపాదించింది.

భరత్, విహారి సెంచరీలు

చెన్నైలో ముంబై జట్టుతో జరిగిన చివరిదైన ఆరో రౌండ్ లీగ్ మ్యాచ్‌లో ఆంధ్ర 29 పరుగులతో గెలిచింది. తొలుత బ్యాటింగ్‌కు దిగిన ఆంధ్ర నిర్ణీత 50 ఓవర్లలో 5 వికెట్లకు 344 పరుగుల భారీ స్కోరు చేసింది. ఓపెనర్ కోన శ్రీకర్ భరత్ (126 బంతుల్లో 106; 10 ఫోర్లు)... కెప్టెన్ గాదె హనుమ విహారి (118 బంతుల్లో 169; 16 ఫోర్లు, 7 సిక్స్‌లు) సెంచరీలతో ముంబై బౌలర్ల భరతం పట్టారు. ఈ టోర్నీలో భరత్‌కిది వరుసగా రెండో సెంచరీ కావడం విశేషం. భరత్, విహారి రెండో వికెట్‌కు 254 పరుగులు జోడించారు. వీరిద్దరు అవుటయ్యాక చివర్లో రికీ భుయ్ (31 బంతుల్లో 53; 4 ఫోర్లు, 2 సిక్స్‌లు) బౌండరీలతో చెలరేగి అర్ధ సెంచరీ సాధించాడు. అనంతరం 345 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ముంబై 50 ఓవర్లలో 9 వికెట్లకు 315 పరుగులు చేసి ఓడిపోయింది. సిద్దేశ్ లాడ్ (98 బంతుల్లో 118; 6 ఫోర్లు, 4 సిక్స్‌లు) సెంచరీ చేసినా ఫలితం లేకపోయింది. ఆంధ్ర బౌలర్లలో కార్తీక్ రామన్ (3/55), ఆశిష్ (2/51) రాణించారు.

మెరిసిన సందీప్, సిరాజ్

ఛత్తీస్‌గఢ్‌తో జరిగిన గ్రూప్ 'డి' చివరి లీగ్ మ్యాచ్‌లో హైదరాబాద్ 84 పరుగులతో భారీ విజయం నమోదు చేసింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న హైదరాబాద్ 50 ఓవర్లలో 8 వికెట్లకు 280 పరుగులు చేసింది. 60 పరుగులకు 3 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడిన హైదరాబాద్‌ను బావనాక సందీప్ (95 బంతుల్లో 79; 4 ఫోర్లు, ఒక సిక్స్), కెప్టెన్ అంబటి రాయుడు (65 బంతుల్లో 46; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) నాలుగో వికెట్‌కు 92 పరుగులు జోడించి ఆదుకున్నారు. రాయుడు అవుటయ్యాక టి.రవితేజ (35 బంతుల్లో 45; 4 ఫోర్లు, ఒక సిక్స్)తో కలిసి సందీప్ ఐదో వికెట్‌కు 64 పరుగులు జతచేశాడు. చివర్లో ఆకాశ్ భండారి (13 బంతుల్లో 25; 3 ఫోర్లు, ఒక సిక్స్) దూకుడుగా ఆడాడు. 281 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ఛత్తీస్‌గఢ్‌ను హైదరాబాద్ పేసర్ మొహమ్మద్ సిరాజ్ (5/37) హడలెత్తించాడు. సిరాజ్ ధాటికి ఛత్తీస్‌గఢ్ 44.3 ఓవర్లలో 196 పరుగులకు ఆలౌటైంది. మెహదీ హసన్ రెండు వికెట్లు తీయగా... రవికిరణ్, ఆకాశ్ భండారి, సందీప్‌లకు ఒక్కో వికెట్ లభించింది.

గ్రూప్ 'ఎ' నుంచి బరోడా, కర్ణాటక; గ్రూప్ 'బి' నుంచి ఢిల్లీ, మహారాష్ట్ర; గ్రూప్ 'సి' నుంచి ముంబై; గ్రూప్ 'డి' నుంచి సౌరాష్ట్ర క్వార్టర్ ఫైనల్‌కు చేరిన మిగతా జట్లు. నాకౌట్ దశ మ్యాచ్‌లు ఈనెల 21 నుంచి 27 వరకు న్యూఢిల్లీ వేదికగా జరుగుతాయి. 21న రెండు క్వార్టర్ ఫైనల్స్... 22న మరో రెండు క్వార్టర్స్ ఫైనల్స్ నిర్వహిస్తారు. 24న, తొలి సెమీఫైనల్, 25న రెండో సెమీఫైనల్... 27న ఫైనల్ జరుగుతుంది.

Published and Printed by K.Ramachandra Murthy, Editorial Director, on behalf of Jagati Publications Limited, Published at Phase – 2, Plot No. 06, 100 Feet Road, Auto Nagar, Vijayawada, Krishna District – 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Phase – 2, Plot No. 06, 100 Feet Road, Auto Nagar, Vijayawada, Krishna District – 520 007 (AP), and D. No. 5- 625, Vadlamudi Road, Atmakur Village, Mangalagiri Mandal, Guntur Dist-522 503. Editor: V. Murali, Phone No : 0863-2512581 Fax No: 0863-2512584, RNI Regn No. APTEL/2008/23794.

Everyday NewsPapers

https://play.google.com/store/apps/details?id=com.newseveryday